

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 263

శనివారం 14-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుకేశ్ 'విజయోత్సవం'

ప్రపంచ చెస్ చాంపియన్ హోదాలో శుక్రవారం భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ జిజిజీగా గడిపాడు. జగజ్జేత గుకేశ్‌కు ట్రోఫీతో పాటు బంగారు పతకాన్ని, ప్రైజ్‌మనీని ఫిడే అధ్యక్షుడు వొర్కొవిచ్ అందజేశారు. అంతకుముందు పెద్ద సంఖ్యలో చెస్ అభిమానులకు గుకేశ్ ఆటోగ్రాఫ్‌లు ఇచ్చాడు. 19లో



ట్రంప్ వచ్చాక మనోళ్లు ఇంటికే..

అమెరికాలో 18 వేల మంది భారతీయులు సహా 10.50 లక్షల మంది అక్రమ వలసదార్లను ట్రంప్ వెనక్కి పంపే అవకాశం ఉంది.

- వివరాలు 6లో



రైతు బిడ్డను.. కార్మికుడి బిడ్డను

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మధ్య ఎగువ సభలో మాటల యుద్ధం కొనసాగింది. సభ వాయిదాపడింది.

- వివరాలు 6లో



ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

ఉక్రెయిన్ సైనిక మౌలిక వసతులను ధ్వంసం చేయడమే లక్ష్యంగా రష్యా శుక్రవారం క్షిపణులతో దాడికి తెగబడింది.

- వివరాలు 6లో



జీనా ఇసీకా నామ్ హై

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిగాంచిన బాలీవుడ్ దిగ్గజ నటుడు రాజ్‌కపూర్ శతజయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

- వివరాలు 17లో

అల్లు అర్జున్ అరెస్టు

హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చినా రాత్రంతా చంచల్‌గూడ జైల్లోనే..

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసు.. అరెస్టు నుంచి అర్ధరాత్రి దాకా ఉత్కంఠ

శుక్రవారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు

బెడ్రూమ్ వరకు వెళ్లి అదుపులోకి తీసుకున్న తీరు

చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో గంటన్నరపాటు విచారణ

గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు.. నాంపల్లి కోర్టుకు తరలింపు

14 రోజుల రిమాండ్.. చంచల్‌గూడ జైలుకు తరలింపు

మధ్యంతర బెయిల్ ఇచ్చిన హైకోర్టు

తీర్పు కాపీ అందకపోవడంతో రాత్రి జైల్లోనే.. మంజీరా బ్యారక్‌కు తరలింపు.. రిమాండ్ ఖైదీ నంబర్ 7697 కేటాయింపు

నేటి ఉదయం విడుదల కానున్న అల్లు అర్జున్



గాంధీ ఆస్పత్రి వెలుపల అభిమానులకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్

సాక్షి, హైదరాబాద్: పుష్ప–2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో చిక్కడపల్లి పోలీసులు ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. అక్కడి నుంచి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు, గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు, నాంపల్లి హైకోర్టులో వాదనలు, రిమాండ్ విధింపు, చంచల్‌గూడ జైలుకు తరలింపు అంతా నాటకీయ పరిణామాల మధ్య జరిగిపోయాయి. అదే సమయంలో హైకోర్టులో క్వాష్ పిటిషన్, బెయిల్ పిటిషన్లపై వాదనలు, సాయంత్రమే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినా.. రాత్రి వరకు కాపీ అందకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అదే సమయంలో అల్లు అర్జున్‌ను తరలించిన ప్రతిచోటా భారీగా పోటెత్తిన అభిమానులు, ప్రముఖుల రాకతో దాదాపు 12 గంటల పాటు హైడ్రామా కొనసాగింది. చివరికి అల్లు అర్జున్ శుక్రవారం రాత్రి జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఆయనను శనివారం ఉదయం విడుదల చేయనున్నట్టు జైలు సూపరింటెండెంట్ ప్రకటించారు.

బెడ్రూమ్ వరకు వెళ్లి అరెస్టు..

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి చిక్కడపల్లి ఠాణాలో నమోదైన కేసులో పోలీసులు

మిగతా 2వ పేజీలో ▶

పాలకుల అభద్రతా భావానికి నిదర్శనం

అరెస్టుపై కేటీఆర్ వ్యాఖ్య 2లో

ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారు: కిషన్‌రెడ్డి

అల్లు అర్జున్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నా

ఏపీ మాజీ సీఎం వైఎస్. జగన్

అల్లు అర్జున్ వస్తున్నట్లు పోలీసులకు ముందే సమాచారం

16లో

ఫార్ములా-ఈ కేసులో

కేటీఆర్‌కు త్వరలో నోటీసులు!

రంగం సిద్ధం చేస్తున్న ఏసీబీ



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేస్ కోసం విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.46 కోట్లు బదలాయించారన్న కేసు దర్యాప్తులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకోసం గవర్నర్ నుంచి అనుమతి లభించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌పై కేసు నమోదుకు ప్రభుత్వం అనుమతివ్వడం తెలిసిందే. హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ–రేస్ కోసం విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ నుంచి బోర్డు అనుమతి లేకుండానే రూ.46 కోట్లను విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో పురపాలక శాఖ ఈ అంశంలో ఏసీబీ దర్యాప్తు చేయించాలని ప్రభుత్వానికి లేఖ రాయడం, దానిని ఏసీబీకి అప్పగించడం తెలిసిందే. నాడు కేటీఆర్ ఆదేశాల మేరకే తాను ఆ నిధులు చెల్లించానని అప్పుడు హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న అర్వింద్‌కుమార్ ప్రభుత్వానికి ఇదివరకే స్పష్టం చేశారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేయాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి కావడంతో గత నెలలో ప్రభుత్వం అనుమతి కోరింది. దీనిపై న్యాయ సలహా తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.. కేసు నమోదుచేసి విచారణ జరిపేందుకు అనుమతిచ్చినట్లు తెలిసింది.

సినీ నటులు సైనికులా?

ఇండియా–పాకిస్తాన్ సరిహద్దులో యుద్ధం చేసి వచ్చారా?

అల్లు అర్జున్ అరెస్టుపై సీఎం రేవంత్ వ్యాఖ్య

సినిమా తీశారు.. డబ్బులు సంపాదించుకున్నారు

ఒక వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తే ఎందుకింత చర్చ?

మృతురాలి కుటుంబం గురించి ఎవరూ మాట్లాడరెందుకు?

అల్లు అర్జున్ అరెస్టు విషయంలో నా ప్రమేయం ఏమీలేదు

ఆయన మామ చిరంజీవి, పిల్లనిచ్చిన మామ కూడా కాంగ్రెస్‌వాళ్లే

- నేనే స్టార్‌ను.. నాకే ఫ్యాన్స్ ఉంటారు.. నేనెవరికీ ఫ్యాన్ కాదు
- బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలకు చూపిస్తే వారే ఓడిస్తారు
- వైబ్రంట్ గుజరాత్‌కు పోటీగా తెలంగాణ రైజింగ్ నినాదం



సాక్షి, న్యూఢిల్లీ: సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో వస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. సినీ నటులు ఏమైనా ఇండియా–పాకిస్తాన్ సరిహద్దులో యుద్ధం చేసి మన దేశాన్ని గెలిపించి వచ్చారా? అని అల్లు అర్జున్‌ను ఉద్దేశించి పరోక్షంగా ప్రశ్నించారు. సినిమా తీశారు.. డబ్బులు సంపాదించుకున్నారు.. హాయిగా ఇంటికి వెళ్లిపోయారు అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తే ఇంత పెద్ద ఎత్తున

మిగతా 16వ పేజీలో ▶

పెండింగ్ గ్రాంటు రూ. 1,800 కోట్లు ఇవ్వండి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం వినతి
- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి రైల్వే మంత్రికి విజ్ఞప్తి

5లో

రాజ్యాంగ వజ్రోత్సవాలపై లోక్‌సభలో చర్చ

రాజ్యాంగం కన్నా.. అధికారమే మీకు మిన్న



కాంగ్రెస్ పార్టీపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ధ్వజం

6లో

సంవిధాన్.. సంఘ్ కా విధాన్ కాదు



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా ధ్వజం

గోల్డ్ బాండ్లకు చెక్..!



రుణాలను తగ్గించుకునే యోచనలో కేంద్రం

- ద్రవ్యలోటు కట్టడి ప్రణాళికలకు దన్ను
- బంగారం ధరల పెరుగుదల ఎఫెక్ట్
- 2015లో తొలిసారి గోల్డ్ బాండ్ల జారీ

19లో

మధ్యంతర ఉత్తర్వులివ్వలేం



జర్నలిస్టుపై సినీ నటుడు మంచు మోహన్‌బాబు దాడి చేసిన కేసులో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మోహన్‌బాబు వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది.

- వివరాలు 2లో▶

మళ్లీ గజగజ!

- రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా తగ్గిపోయిన ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి.. ఉదయం పూట పొగమంచు కమ్మేసే చాన్స్

20లో


అరెస్టుకు ముందు భార్య స్నేహారెడ్డికి ధైర్యం చెబుతున్న అల్లు అర్జున్


చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద అల్లు అర్జున్. చిత్రంలో దిల్ రాజు



నాంపల్లి కోర్టు నుంచి బయటకు వస్తున్న అల్లు అర్జున్


అల్లు అర్జున్‌ను వాహనంలో చంచల్‌గూడ జైల్లోకి తరలిస్తున్న పోలీసులు

అల్లు అర్జున్ అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేశారు. శుక్రవారం అల్లు అర్జున్‌ను అరెస్టు చేయాలని నిర్ణయించారు. ఉదయం 11 గంటల సమయంలో జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో అల్లు అర్జున్ షార్ట్స్, టీ–షర్ట్ ధరించి స్విమ్మింగ్ పూల్ వద్ద ఉన్నారు. ఆయన వద్దకు వెళ్లిన పోలీసులు సంధ్య థియేటర్ కేసులో అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. 'సరే మీ పని మీరు చేసుకోండి. బట్టలు మార్చుకుని రెండు నిమిషాల్లో వస్తా' అని అల్లు అర్జున్ కోరారు. ఆయన బెడ్రూమ్‌కు వెళ్లగా.. పోలీసులు కూడా ఆయన వెంటే వెళ్లారు.

అల్లు అరవింద్‌కు ధైర్యం చెప్పిన అర్జున్

పోలీసులు అల్లు అర్జున్‌ను ఆయన ఇంటి మొదటి అంతస్తులో ఉన్న బెడ్రూమ్ నుంచి కింద ఉన్న హాల్‌లోకి తీసుకువచ్చారు. ఆ సమయంలో తండ్రి అల్లు అరవింద్ కాసింత ఆందోళన చెందారు. అరవింద్‌ను అర్జున్ హత్తుకుని 'అరెస్టు చేస్తున్నారు.. చెయ్యనీ.. నువ్వేమీ కంగారు పడకు' అంటూ ధైర్యం చెప్పారు. తర్వాత అర్జున్‌ను తీసుకుని పోలీసులు బయటికి వచ్చారు. పోలీసు వాహనం ఎక్కే సమయంలో అల్లు అర్జున్ పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ''బట్టలు మార్చుకోవడానికి వెళ్లి వస్తానని, ఒకరిని పంపాలని కోరితే ఇంత మంది బెడ్రూమ్ వరకు వచ్చారు. నన్ను అరెస్టు చేయడంలో తప్పులేదు. కానీ రెండు నిమిషాలు టైమ్ ఇవ్వాలని కోరితే బెడ్రూమ్ వరకు వచ్చారు. ఇది సరి కాదు..'' అని పేర్కొన్నారు. తర్వాత తన భార్యకు వీడ్కోలు చెప్పారు. అర్జున్‌తోపాటు అరవింద్ కూడా పోలీసు వాహనం ఎక్కబోయారు. కానీ అర్జున్ ఆయనను వారించారు. పోలీసులు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి ఠాణాకు తీసుకెళ్లారు.

ఠాణాలో గంటన్నర పాటు విచారణ..

పోలీసులు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి ఠాణాలో దాదాపు గంటన్నర పాటు విచారించారు. ఠాణా వద్దకు అల్లు శిరీష్, అల్లు అరవింద్, అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు శుక్రవారం ఉదయమే అదుపులోకి తీసుకున్న సంధ్య థియేటర్ పర్సనల్ మేనేజర్ జేబీ సంతోష్‌కుమార్‌ల అరెస్టు ప్రక్రియను పూర్తి చేసి, రిమాండ్ రిపోర్టులు తయారు చేశారు. ఇద్దరినీ వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నేరుగా సూపరింటెండెంట్ రాజకుమారి చాంబర్‌కు తీసుకెళ్లి.. అప్పటికే సిద్ధంగా ఉంచి పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని నాంపల్లి కోర్టుకు తరలించారు. గాంధీ ఆస్పత్రికి వచ్చిన అల్లు అరవింద్ వైద్య పరీక్షల సమయంలో కుమారుడి వెంటే ఉన్నారు. మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. గాంధీ ఆస్పత్రి చుట్టుపక్కల ప్రాంతాలు సైతం అభిమానులతో నిండిపోయాయి. ఆస్పత్రి సిబ్బంది అభ్యర్థన మేరకు వారితో అల్లు అర్జున్ ఫొటోలు దిగారు. మరోవైపు సినీ నటుడు చిరంజీవి, ఆయన భార్య సురేఖ, నాగబాబు, పలువురు సినీ ప్రముఖులు అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్షణక్షణం హైడ్రామా.. ఉత్కంఠ మధ్య..

- ఉదయం 11.45: అల్లు అర్జున్ ఇంట్లోకి పోలీసులు
- మధ్యాహ్నం 12: అరెస్టు చేస్తున్నట్టు అల్లు అర్జున్‌కు చెప్పిన పోలీసులు
- 12.20: జూబ్లీహిల్స్ నివాసం నుంచి చిక్కడపల్లికి తరలింపు
- 12.40: చిక్కడపల్లి ఠాణా వద్దకు వచ్చిన దిల్ రాజు, ఇతర ప్రముఖులు
- 1.00: చిక్కడపల్లి ఠాణాకు అల్లు అర్జున్‌తో చేరుకున్న పోలీసులు
- 1.10: పోలీసుస్టేషన్ వద్దకు అల్లు శిరీష్, అరవింద్
- 1.15: రిమాండ్ రిపోర్టు సిద్ధం చేసిన దర్యాప్తు అధికారి
- 2.00: వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి అల్లు అర్జున్ తరలింపు
- 2.19: అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు ప్రారంభించిన వైద్యులు
- 2.30: అల్లు అర్జున్ ఇంటికి వెళ్లిన చిరంజీవి, ఆయన భార్య సురేఖ
- 2.45: అల్లు అర్జున్‌కు గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు పూర్తి
- 3.10: నాంపల్లి కోర్టుకు చేరుకున్న అల్లు అర్జున్.. లాయర్ల వాదనలు
- 5.00: అల్లు అర్జున్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధింపు
- 5.28: చంచల్‌గూడ జైలుకు అల్లు అర్జున్ తరలింపు
- 5.40: అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చిన హైకోర్టు
- 7.15: బెయిల్ పేపర్లతో చంచల్‌గూడ జైలుకు చేరుకున్న లాయర్లు
- 7.30: ఆ పత్రాలు సక్రమంగా లేకపోవడం, ఆర్డర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాకపోవడంతో జైల్లోనే బన్ని
- 10.00: జైలు రిసెప్షన్ నుంచి మంజీరా బ్యారక్‌కు అల్లు అర్జున్

14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు

అల్లు అర్జున్, సంతోష్‌లను చిక్కడపల్లి పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. దాదాపు గంటన్నరకుపైగా ఇరుపక్షాల న్యాయవాదుల వాదోపవాదాలు జరిగాయి. చివరికి అల్లు అర్జున్, సంతోష్‌లకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసులు ఇరువురినీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు అదే సమయంలో హైకోర్టులో క్వాష్ పిటిషన్, బెయిల్ పిటిషన్లపై వాదనలు జరిగాయి. దీంతో అల్లు అర్జున్ నాలుగు గంటలకుపైగా జైలు రిసెప్షన్‌లోనే వేచిచూశారు. చివరికి హైకోర్టు అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదల అవుతారని భావించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు.

రిమాండ్ ఖైదీ నంబర్ 7697తో..

అల్లు అర్జున్‌కు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినా.. దానికి సంబంధించిన ఫార్మాలిటీస్ పూర్తి కాకపోవడంతో ఆయన శుక్రవారం రాత్రి రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైల్లో ఉండాల్సి వచ్చింది. అల్లు అర్జున్ న్యాయవాదులు సర్టిఫైడ్ కాపీలను తీసుకువచ్చి జైలు అధికారులకు ఇచ్చినా.. ఒరిజినల్ పత్రాలు, పూర్తికాపీ కావాలంటూ జైలు అధికారులు అంగీకరించలేదు. రాత్రి 10 గంటల వరకు అల్లు అర్జున్‌ను జైలు రిసెప్షన్‌లోనే ఉంచిన సిబ్బంది.. ఆపై మంజీరా బ్యారక్‌లోని క్లాస్–1 రూమ్‌కు తరలించారు. రిమాండ్ ఖైదీగా నంబర్ 7697ను కేటాయించారు. అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ రాత్రి 10.30 గంటల వరకు చంచల్‌గూడ జైలు వద్దే ఉన్నారు. బెయిల్ కాపీ అందితే తన కుమారుడిని వెంట తీసుకువెళ్లాలని భావించారు. కానీ బాధగా వెనుదిరిగారు. ప్రైవేట్ క్యాబ్ బుక్ చేసుకుని తన ఇంటికి వెళ్లిపోయారు. ఇక తమ అభిమాన హీరోకు బెయిల్ వచ్చినా విడుదల చేయకపోవడంపై అర్జున్ అభిమానులు జైలు వద్ద నిరసన తెలిపారు.

అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్

సాక్షి, హైదరాబాద్: పుష్ప–2 ప్రీమియర్ షో ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన ఘటనలో నిందితుడు, ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ (ఏ11)కు హైకోర్టు 4 వారాలు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. హత్య చేయాలన్న ఉద్దేశం, పదునైన ఆయుధాలతో దాడి చేయడానికి సంబంధించిన సెక్షన్లు ఇక్కడ వర్తించవని స్పష్టం చేసింది. పోలీసులు అనుమతి ఇచ్చిన తర్వాతే హీరో సినిమా చూసేందుకు వచ్చారని, ఆయన్ను రావొద్దని పోలీసులు చెప్పారనడానికి ఎలాంటి ఆధారం లేదని పేర్కొంది. అల్లు అర్జున్ నిర్లక్ష్యం కారణంగా మరణం చోటుచేసుకున్నా.. గరిష్టంగా ఐదేళ్లు శిక్ష పడే నేరంలో బెయిల్‌కు ఆయన అర్హుడని పేర్కొంది. పలు తీర్పులను ప్రస్తావిస్తూ.. 4 వారాలు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలర్‌కు రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని స్పష్టం చేసింది. సాక్షులను ప్రభావితం చేయవద్దని, దర్యాప్తు అధికారులకు అందుబాటులో ఉండాలని అల్లు అర్జున్‌కు సూచించింది. తదుపరి విచారణ జనవరి 21కి వాయిదా వేసింది.

భద్రత కల్పించని పోలీసులదే బాధ్యత: అల్లు అర్జున్ తరఫు న్యాయవాది

పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడంతో ఆయన తరఫు న్యాయవాదులు హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పిటిషన్ వేశాం. అది ఇంకా ధర్మాసనం ముందుకు రాకముందే అరెస్టు చేశారు. క్వాష్ పిటిషన్ ద్వారా మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఇచ్చాయి. తొక్కిసలాట జరిగి ఒకరు ప్రాణాలు కోల్పోయిన కేసులో నటుడు షారుక్‌ఖాన్‌కు గుజరాత్ హైకోర్టు ఊరటనిచ్చింది. అర్నబ్ గోస్వామి కేసులో బాంబే హైకోర్టు బెయిల్ ఇవ్వకపోతే సుప్రీం కోర్టు దానిని సవరించింది. కిందికోర్టు రిమాండ్ విధించినా.. దాన్ని నిరాకరించే అధికారం హైకోర్టుకు ఉంటుంది (బండి సంజయ్ కేసును ప్రస్తావించారు). రాజమండ్రిలో గోదావరి పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రావడంతో జరిగిన తొక్కిసలాటలో 29 మంది మృతిచెందారు. అందుకు ఆయన్ను బాధ్యున్ని చేయలేదు కదా. పుష్ప ప్రీమియర్ షో ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. హీరో, హీరోయిన్ వస్తారంటూ పోలీసులకు థియేటర్ యాజమాన్యం సమాచారం ఇచ్చింది. అల్లు అర్జున్ మొదటి అంతస్తులో ఉండగా, గ్రౌండ్ ఫ్లోర్‌లో తొక్కిసలాట చోటు చేసుకుంది. దానికి ఆయన బాధ్యుడెలా అవుతారు? ఇది ఉద్దేశపూర్వంగా లేదా కావాలని చేసింది కాదు. దురదృష్టవశాత్తు మహిళ మృతి చెందింది. 118 (1) బీఎన్ఎస్‌తో పాటు సెక్షన్ 105 ఈ కేసులో వర్తించదు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆ స్థాయిలో భద్రత కల్పించని పోలీసులే దీనికి బాధ్యత వహించాలి. తొక్కిసలాటను ఆపే ప్రయత్నం వారు చేయలేదు. పిటిషనర్ బెయిల్‌కు అర్హుడు. విడుదలకు ఆదేశాలు ఇవ్వాలి..' అని కోరారు.

లంచ్‌మోషన్ అనుమతించవద్దు: పీపీ

ప్రభుత్వం తరఫున పీపీ వాదనలు వినిపిస్తూ.. 'క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదు. బెయిల్ కోసం మరో పిటిషన్ వేసుకోవాలి. కోరగానే లంచ్‌మోషన్ ఇవ్వడం తప్పుడు సంకేతం ఇస్తుంది. లంచ్ మోషన్ మధ్యాహ్నం వేయడాన్ని అనుమతించకూడదు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదు. కనీసం పిటిషన్ చదువుకునే సమయం అయినా ఇవ్వకుండా వాదనలు వినిపించాలంటే ఎలా? విచారణ సోమవారానికి వాయిదా వేయాలి. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు చెప్పారు. ఆయన్ను ఇప్పటికే రిమాండ్‌కు తరలించాం..'అని తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వులు

- ఈ దేశ పౌరుడిగా ఎక్కడికైనా వెళ్లే హక్కు ఆయనకు ఉంటుంది
- పోలీసులు అనుమతి ఇచ్చిన తర్వాతే హీరో సినిమా చూసేందుకు వచ్చారు
- పోలీసులు పెట్టిన సెక్షన్లు ఇక్కడ వర్తించవన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ జనవరి 21కి వాయిదా


> “ రాజకీయ నాయకుల ర్యాలీలు, ప్రదర్శనల్లో సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు గతంలో అనేకం. అలాంటి కేసుల్లో నేతలకే ఊరట లభిస్తున్నప్పుడు అల్లు అర్జున్ అరెస్టు సరికాదు. ఈ దేశ పౌరుడిగా ఎక్కడికైనా వెళ్లే హక్కు ఆయనకు ఉంటుంది.
>
> – హైకోర్టు న్యాయమూర్తి

హీరో అయినంత మాత్రాన స్వేచ్ఛను కోల్పోవాలా?

'లంచ్ మోషన్ విచారణకు అనుమతి ఇవ్వొద్దని తొలుత భావించా. సామాన్యులైతే ఇద్దామనుకున్నా. అయితే సినీ హీరో అయినంత మాత్రాన స్వేచ్ఛను కోల్పోవాలా? అనే సందేహం వచ్చింది. అతని హోదా కారణంగా స్వేచ్ఛను కోల్పోవడం సరికాదని అనిపించింది. అర్నబ్ గోస్వామి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఇదే హైకోర్టు పలువురికి బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్‌కు పంపిన తర్వాత బీజేపీ నేత బండి సంజయ్‌కి, అలాగే 489ఏ వ్యవహారంలో ఒక సామాన్యునికి ఊరట దక్కింది..'అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ ఇస్తూ ఆదేశాలిచ్చారు. ఇదే అంశంపై సంధ్యా థియేటర్ యాజమాన్యం, తదితరులు దాఖలు చేసిన మరో పిటిషన్‌లో అరెస్టయిన మరో ఇద్దరిని (ఏ–1, ఏ–2) కూడా విడుదల చేయాలంటూ ఉత్తర్వులిచ్చారు. ఇతర పిటిషనర్లపై అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు.

ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వలేం

జర్నలిస్టుపై మోహన్‌బాబు దాడి కేసులో హైకోర్టు.. విచారణ 19వ తేదీకి వాయిదా



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుపై సినీ నటుడు మంచు మోహన్‌బాబు దాడి చేసిన కేసులో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఆ కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే గురువారానికి (19వ తేదీ)వాయిదా వేసింది. తన కుటుంబ వివాదం నేపథ్యంలో జల్‌పల్లిలోని ఇంటి ఆవరణలో మీడియా ప్రతినిధిపై మోహన్‌బాబు దాడి చేశారంటూ పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారమే కేసు నమోదైనప్పటికీ న్యాయ సలహాలు తీసుకున్న పోలీసులు, గురువారం బీఎన్ఎస్ 109 (హత్యాయత్నం) సెక్షన్ జోడించారు. కాగా ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జర్నలిస్టులమంటూ చాలామంది ఇంట్లోకి తోసుకొచ్చారని, ఈ క్రమంలో అనుకోకుండా దాడి జరిగింది తప్ప కావాలని చేసింది కాదని చెప్పారు. ఏపీపీ జితేందర్‌రావు వాదనలు వినిపిస్తూ..మోహన్‌బాబు కుమారుడు మనోజ్ ఆహ్వానం మేరకే వారు వచ్చారని చెప్పారు. చానల్ లోగోతో కొట్టడంతో జర్నలిస్ట్ తీవ్రంగా గాయపడ్డారని.. ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి కేసులో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించారు.

ఎవరిది వైఫల్యం.. ఎవరికి శిక్ష?

సామాజిక వేదికల్లో అల్లు అర్జున్‌కు సంఘీభావం..

అధికారులకు నాలుగు ప్రశ్నలు..



1. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల్లాంటి కార్యక్రమాల్లో తోపులాట జరిగి భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్ట్ చేస్తారా?
2. ఎన్నికల ప్రచారాల తొక్కిసలాటలో ఎవరైనా చనిపోతే నేతలను అరెస్ట్ చేస్తారా?
3. సినిమా ప్రీ రిలీజ్ వేడుకల్లో ఎవరైనా చనిపోతే హీరో, హీరోయిన్లని అరెస్ట్ చేస్తారా?
4. భద్రతా ఏర్పాట్లను పోలీసులు, నిర్వాహకులు తప్ప సినిమా హీరోలు, ప్రజా నాయకులు ఎలా కంట్రోల్ చెయ్యగలరు?

– ఎక్స్‌లో దర్శకుడు రాంగోపాల్ వర్మ

అల్లు అర్జున్ హార్డ్‌వర్క్‌తో ఎదిగిన స్టార్



పబ్లిక్ ర్యాలీల్లో, పలు ఘటనల్లో తొక్కిసలాటలు జరిగి ఎందరో అమాయకులు చనిపోయారు. వారి జాబితా కోసం వెతుకుతున్నా. ఈ మధ్యకాలంలో ఓ యంగ్ యాక్టర్ తొక్కిసలాటలో అసౌకర్యానికి గురై, కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయారు. అల్లు అర్జున్ హార్డ్‌వర్క్‌తో ఎదిగిన స్టార్.. వారసత్వంతో కాదు.

– పూనమ్ కౌర్, నటి

నమ్మలేకపోతున్నాను



ఇప్పుడు నేను చూస్తున్న పరిణామాలను నమ్మలేకపోతున్నాను (అల్లు అర్జున్ అరెస్టుని ఉద్దేశించి). జరిగిన ఘటన చాలా బాధాకరం.. దురదష్టకరం. అయితే అందుకు ఒక వ్యక్తిని నిందించడం మాత్రం చాలా బాధగా ఉంది. ఈ ప్రస్తుత పరిస్థితి చాలా బాధాకరం..

– రష్మిక మందన్నా, నటి

ఒక్కరినే బాధ్యుడిని చేయడం సరికాదు



ప్రభుత్వ అధికారులు, మీడియా వారు సినిమా పరిశ్రమకు సంబంధించిన వాళ్లపై చూపించే ఉత్సాహం సాధారణ ప్రజల విషయంలోనూ చూపించాలని కోరుకుంటున్నాను. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించటం సరికాదు.

– నాని, సినీ నటుడు

ఒక్కరినే నిందించటం సరికాదు



జరిగిన ఘటన హృదయ విదారకం. ఇలా జరిగి ఉండాల్సింది కాదు. ఒక నటుడు భద్రతాపరమైన చర్యలకు పూర్తి బాధ్యత వహించలేడు. ఈ ఘటనకు ఒక వ్యక్తినే బాధ్యుణ్ణి చేసి, నిందించడం సరికాదు.

– వరుణ్ ధావన్, సినీ నటుడు

అందరూ బాధ్యులే



నేను అల్లు అర్జున్‌కు గొప్ప మద్దతుదారును. జరిగిన ఘటన దురదృష్టకరం. మనం హైప్రొఫైల్ వ్యక్తులం. ఇలాంటి పరిణామాలకు బాధ్యులుగా మారకూడదు. ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవి. ఇలాంటి ఘటనలకు అందరూ బాధ్యత వహించాలి.

– కంగనా రనౌత్, సినీనటి, ఎంపీ

ఇదం జగత్



..వ్యవసాయం చేయకూడదాసారు!

అల్లు అర్జున్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నా: వైఎస్ జగన్



సాక్షి,అమరావతి: ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ అరెస్ట్‌పై మాజీ సీఎం వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో స్పందించారు. 'హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం వల్ల ఆ కుటుంబానికి జరిగిన నష్టం ఎవ్వరూ తీర్చలేనిది. అదే సమయంలో దీనిపై అల్లు అర్జున్ తన విచారాన్ని వ్యక్తం చేసి, ఆ కుటుంబానికి అండగా ఉంటానంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించారు' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'అయితే, ఈ ఘటనకు నేరుగా అతడిని బాధ్యుడ్ని చేయడం ఎంతవరకు సమంజసం? తొక్కిసలాట ఘటనలో తన ప్రమేయం లేకపోయినా అర్జున్‌పై క్రిమినల్ కేసులు బనాయించి, అరెస్ట్ చేయడం సమ్మతం కాదు. అల్లు అర్జున్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కాంగ్రెస్‌ది పబ్లిసిటీ స్టంట్

అరెస్టుపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ స్టంట్ చేస్తోందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆరోపించారు. అల్లు అర్జున్ అరెస్టుతో కాంగ్రెస్‌కు క్రియేటివ్ ఇండస్ట్రీపై గౌరవం లేదనేది స్పష్టమవుతోందంటూ ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వచ్చిన సందర్భంలో అక్కడి అధికారులు చేసిన ఏర్పాట్లు పేలవంగా ఉన్నాయనడానికి ఈ ఘటన నిదర్శనం. ఇప్పుడా నిందను తిప్పికొట్టేందుకు ఇలాంటి పబ్లిసిటీ స్టంట్‌లకు దిగుతోంది'అంటూ తెలంగాణ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఇందుకు కారకులైన అధికారులను శిక్షించాలని వైష్ణవ్ డిమాండ్ చేశారు.

ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'అల్లు అర్జున్ అరెస్టు ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. కార్యక్రమ నిర్వాహకులు సంబంధిత అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చినా.. అరెస్టు చేయడం ఉద్దేశపూర్వకమేనని అర్థమవుతోంది. అక్కడ భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులది. అది చేయకుండా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సరికాదు. రాష్ట్రంలో సినీ నటులను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారనేది మరోసారి నిరూపితమైంది. ఈ అరెస్టును, పాలకుల అధికార దుర్వినియోగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రభుత్వ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకే

కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: అల్లు అర్జున్‌కు కనీస సమయం ఇవ్వకుండా బెడ్రూంలోకి వెళ్లి అరెస్ట్ చేయడం సిగ్గుచేటని.. ప్రభుత్వ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టులు పెట్టారు. ''సినిమా ఓపెనింగ్ రోజున అగ్రహీరోలు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతానికి రావడం మామూలే. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం ఎందుకు ముందస్తు భద్రత ఏర్పాట్లు చేయలేదు. మీ నిర్లక్ష్యానికి అమాయక మహిళ బలైతే ఇతరులపై తప్పును నెట్టి శిక్షించాలనుకోవడం దుర్మార్గం. తప్పుడు పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నవారు స్వేచ్ఛగా తిరుగుతుంటే.. నటుడిని అరెస్ట్ చేసి వార్తల్లో నిలిచారు. కాంగ్రెస్ నాటకాన్ని యావత్ దేశం చూస్తోంది'' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

పాలకుల అభద్రతా భావానికి నిదర్శనం

అల్లు అర్జున్ అరెస్టుపై మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్య

హైడ్రా మరణాలకు కారకుడైన సీఎంపై కేసులు పెట్టాలని డిమాండ్




సాక్షి, హైదరాబాద్: సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టు పాలకుల అభద్రతాభావానికి అద్దం పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అతిగా వ్యవహరించిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా థియేటర్ వద్ద తొక్కిసలాటలో మరణించిన బాధితుల పట్ల తమకు పూర్తి సానుభూతి ఉందని కేటీఆర్ తెలిపారు. కానీ ఈ ఘటన వెనుక అసలు తప్పు ఎవరిదో చెప్పాలని నిలదీశారు. తొక్కిసలాట ఘటనతో నేరుగా సంబంధం లేని అల్లు అర్జున్‌ను సాధారణ నేరస్తుడిలా పరిగణించడం సరికాదని పేర్కొన్నారు. హైడ్రా పేరిట భయభ్రాంతులకు గురిచేసి పేదల మరణానికి కారణమైన సీఎం రేవంత్‌పైనా కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఈ ఘటనకు ప్రభుత్వమే కారణం: హరీశ్‌రావు

సినిమా చూసేందుకు వెళ్లి తొక్కిసలాటలో మహిళ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని... ఆ ఘటనకు రాష్ట్ర పాలకులు, కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ సొంత గ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి లేఖ రాసిపెట్టినా రేవంత్ బ్రదర్స్‌ను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

కేసు ఉపసంహరించుకుంటా



మా పిల్లలు సినిమా చూస్తా అంటే తీసుకువెళ్లాను. అల్లు అర్జున్ వస్తారని మాకు తెలియదు. జరిగిన తొక్కిసలాటలో ఆయన తప్పు లేదు. ఆయన్ను ఇవాళ అరెస్టు చేస్తున్నట్టు పోలీసులు కూడా చెప్పలేదు. సోషల్ మీడియాలో చూసే ఆ విషయం తెలుసుకున్నా. నేను నా కేసు ఉపసంహరించుకోవడానికి సిద్ధంగా ఉన్నా.

– శుక్రవారం మీడియాతో ఫిర్యాదుదారుడు భాస్కర్

కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను తొలగించం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ
- ప్రస్తుత ఏఎన్‌ఎం నోటిఫికేషన్‌కు మరో 323 పోస్టులు
- 29న ఏఎన్‌ఎం రాత పరీక్ష యథావిధిగా జరుగుతుందని వెల్లడి



హైదరాబాద్: రెగ్యులర్ ఉద్యోగులను నియమించినప్పటికీ, కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను ఉద్యోగాల నుంచి తీసేయబోమని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని ఏఎన్‌ఎంలు కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అయితే ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని మంత్రి తెలిపారు. ఏఎన్‌ఎం రెగ్యులర్ పోస్టుల భర్తీకి ఈ నెల 29న నిర్వహించనున్న పరీక్ష యథావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షకు హాజరయ్యే కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు 30 మార్కులు వెయిటేజీ ఇస్తున్నామని గుర్తుచేశారు. పోస్టుల సంఖ్యను పెంచాలని ఏఎన్‌ఎంలు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం నోటిఫికేషన్‌లో ఇచ్చిన 1,931 పోస్టులకు అదనంగా మరో 323 పోస్టులను కలిపి, ఇదే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. రెగ్యులర్ ఉద్యోగం రానివారిని, చివరి వరకూ కాంట్రాక్ట్ ఉద్యోగంలో కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఏఎన్‌ఎంలు కోరగా, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: టీఈఏ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) ప్రభుత్వాన్ని కోరింది. సంఘం అధ్యక్షురాలు జి.నిర్మల నేతృత్వంలో శుక్రవారం అసోసియేషన్ అత్యవసర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 40 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని కోరింది. 317 జీవో వల్ల నష్టపోయిన బాధితులకు పరస్పర బదిలీలు చేయాలంది. పెండింగ్ డీఏలు, బిల్లులు మంజూరు చేయాలని, నగదు రహిత హెల్త్ కార్డులివ్వాలని డిమాండ్ చేసింది. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏజే సుగంధిని, చైర్మన్ చిలగాని సంపత్‌కుమార్ స్వామి, సంఘ నేతలు రవీందర్‌రెడ్డి, వాస సత్యనారాయణ, కొంకటి మల్లేశ్, వెంకటయ్య, గౌతమ్ తత్వనంద, శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు. జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డిని అసోసియేషన్ రాష్ట్ర క్రీడా కార్యదర్శిగా నియమించినట్టు నిర్మల తెలిపారు.

అనుభవానికే ఆహ్వానం


సాక్షి, హైదరాబాద్:

ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరంలో ఉండగానే క్యాంపస్ నియామకాల్లో ఐటీ ఉద్యోగం సంపాదించాలనేది దాదాపు అందరు విద్యార్థుల కోరిక. కానీ 2025లో క్యాంపస్ నియామకాలు అరకొరగానే ఉంటాయని స్కిల్ ఇండియా రిపోర్ట్–2025 అంచనా వేసింది. ఫ్రెషర్స్‌ను ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు ఐటీ కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొంది. సంస్థలు గతంలో కొత్త ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను ఎంపిక చేసుకుని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదని పరిశ్రమ వర్గాలను ఉటంకిస్తూ ఈ రిపోర్ట్‌స్పష్టం చేసింది. కృత్రిమ మేధ సాంకేతికత వినియోగంవైపు కంపెనీలు మొగ్గుచూపటమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. ప్రస్తుతం ఐటీ పరిశ్రమలో అనుభవం ఉన్నవాళ్లకే ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయి. 2025లో 33 శాతం కంపెనీలు ఏఐ టెక్నాలజీపై పట్టున్న నిపుణులనే ఉద్యోగాల్లోకి తీసుకొంటాయని అంచనా వేశారు. ఐటీ రంగంలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి మంచి అవకాశాలుంటాయని నివేదికలో పేర్కొన్నారు.

స్కిల్ ఇండియా నివేదిక ప్రకారం 2025లో ఉపాధి అవకాశాలు ఇలా..

కొత్త ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు	1–5 ఏళ్ల అనుభవం ఉన్నవారు
14 %	47 %
6–10 ఏళ్ల అనుభవం ఉన్నవారు	**10 ఏళ్ల పైబడి అనుభవం ఉన్నవారు**
26 %	13 %

ఫ్రెషర్స్‌కు 2016 నుంచి పెరుగుతున్న వార్షిక వేతనాలు (సగటున)



క్యాంపస్ నియామకాలకు కష్టకాలమే / **ఫ్రెషర్స్‌లో తగ్గిన నైపుణ్యాలు.. చాట్ జీపీటీ మీదే ఆధారం** / **జాతీయ పరిశ్రమల అంచనా.. స్కిల్ ఇండియా నివేదిక వెల్లడి**

ఫ్రెషర్స్‌లో నైపుణ్యం కొరత

కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులను ఏ ప్రశ్న వేసినా.. చాట్ జీపీటీలో సెర్చ్ చేస్తున్నారని ప్రధాన కంపెనీలు పేర్కొంటున్నాయి. స్వతహాగా ఆలోచించే శక్తి వారిలో కన్పించడం లేదని అంటున్నాయి. భారత పరిశ్రమల సమాఖ్య, పలు యూనివర్సిటీలు, ప్రముఖ ఐటీ కంపెనీలు కలిసి నూతన ఇంజనీరింగ్ పట్టభద్రుల నైపుణ్యాలను పరీక్షించాయి. 86 శాతం విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం అవసరాలకు తగ్గట్టుగా లేదని గుర్తించాయి. 2025లో ఫ్రెష్ గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు 14 శాతానికి మించి ఉండకపోవచ్చని అంచనా వేశాయి. ఇంజనీరింగ్ సిలబస్‌లో ప్రస్తుత తరానికి పనికివచ్చే అంశాలు ఉండటం లేదని నిపుణులు గుర్తించారు. వీరికన్నా ఏఐ టెక్నాలజీ పది రెట్లు ఎక్కువ ఉపయోగపడుతుందని పలు సంస్థలు అంటున్నాయి. అయితే, ఐటీ సంస్థల్లో ఫ్రెషర్స్‌కు అవకాశం వస్తే మాత్రం.. వారికి వేతనాలు భారీగానే ఉండొచ్చని నివేదిక వెల్లడించింది.

మెరుగు పెట్టేందుకు మండలి కృషి

ప్రాంగణ నియామకాలు తగ్గిపోయే పరిస్థితి, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నైపుణ్య కొరతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. వారి స్కిల్స్‌ను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ముందుగా ఆ వర్సిటీ నుంచే ఈ ప్రయోగం మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నారు. ఏఐ టెక్నాలజీతో కూడిన ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉండటంతో ఇందుకు సంబంధించిన కొత్త కోర్సులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

వర్సిటీల్లో నియామకాలకు కమిటీ

- అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి నేతృత్వం
- సభ్యులుగా ఓయూ, ఎంజీయూ వైస్ చాన్స్‌లర్లు
- బోధనా సిబ్బంది నియామకంపై సిఫారసులు చేయనున్న కమిటీ
- సీఏఎస్, ప్రమోషన్లు తదితర అంశాలపైనా అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పరిధిలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో బోధన సిబ్బంది నియామకాలు చేపట్టేందుకు అనుసరించాల్సిన విధివిధానాలు సిఫారసు చేసేందుకు ఉన్నత విద్యామండలి నేతృత్వంలో కమిటీ ఏర్పాటయ్యింది. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సభ్యులుగా ఉంటారు. మరో ఇద్దరు సభ్యులను ఈ కమిటీ నిర్ణయిస్తుంది. నియామకాలకు సంబంధించిన సూచనలతో పాటు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్), ప్రమోషన్లకు సంబంధించిన అంశాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను సైతం ఈ కమిటీ పరిశీలించి అవసరమైన సూచనలు చేస్తుంది. ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విశ్వవిద్యాలయాల వీసీల సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.



వీసీల సమావేశంలో మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ తదితరులు

అన్నీ పరిశీలించాకే..

యూనివర్సిటీల్లో దాదాపు 3 వేల బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా గతంలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా అన్ని వర్సిటీల్లో నియామకాలు చేపట్టేందుకు వీలుగా కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే దీని స్థానంలో కాలేజ్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాలన్నీ కమిటీ అధ్యయనం చేసిన తర్వాత నియామకాలు చేపట్టాల్సి ఉంటుందని ఉన్నత విద్యా మండలికి విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. వీసీల సమావేశం వివరాలను మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి మీడియాకు వివరించారు.

ర్యాంకింగ్‌లపైనా కమిటీ!

యూనివర్సిటీల స్థితిగతులు, నాణ్యత ప్రమాణాలు, అనుబంధ గుర్తింపు విధానాలపై వీసీల సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. తమ వర్సిటీల పరిధిలో సమస్యలను వీసీలు సమావేశంలో లేవనెత్తారు. జాతీయస్థాయిలో ర్యాంకులు పడిపోవడానికి కారణాలు, వీటిని ఏ విధంగా మెరుగుపర్చాలనే అంశంపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. వర్సిటీలు ప్రధానంగా ఎదుర్కొంటున్న నిధుల కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని విద్యాశాఖ కార్యదర్శి సూచించారు. పరిశ్రమల నుంచి సామాజిక బాధ్యత కార్యక్రమం కింద, పార్లమెంట్ సభ్యుల ప్రాంతీయ అభివృద్ధి నిధుల ద్వారా లబ్ధి పొందే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు.

సిలబస్ మార్పుపై కసరత్తు పూర్తి

కొన్ని నెలలుగా ఉన్నత విద్యా మండలి చేపట్టిన పలు కార్యక్రమాలను వీసీలకు బాలకిష్టారెడ్డి వివరించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే దిశగా సిలబస్‌లో గణనీయ మార్పు తెస్తున్నామని, ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తయిందని తెలిపారు. మార్కెట్ డిమాండ్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ ఉండబోతుందని వివరించారు.

న్యూస్ లెటర్ విడుదల

మండలి నేతృత్వంలో రూపొందిస్తున్న న్యూస్ లెటర్‌ను విద్యాశాఖ కార్యదర్శి శ్రీధర్ ఈ సందర్భంగా విడుదల చేశారు. మండలి నేతృత్వంలో రాష్ట్ర ఉన్నత విద్యా సంస్థల్లో పురోగతిని ఇందులో వివరించారు. సమావేశంలో ఘంటా చక్రపాణితో పాటు పలు వర్సిటీల వీసీలు పాల్గొన్నారు.

తెలంగాణలో 357 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లు

కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీలో ప్రస్తుతం 750 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు పనిచేస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ (ప్రధాన మంత్రి) సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాణా తెలిపారు. రెండు రాష్ట్రాలకు 893 మందిని కేటాయించగా.. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నది మాత్రం 750 మంది అధికారులని లోక్‌సభ వేదికగా వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 357 మంది అధికారులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వీరిలో ఐఏఎస్ అధికారులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ 15, పదోన్నతి పోస్టులు 23. ఐపీఎస్ అధికారులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ 1, పదోన్నతి పోస్టులు 8. ఐఎఫ్ఎస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు 16, పదోన్నతి పోస్టులు 8 అని పేర్కొన్నారు.

తెలంగాణలో	కేటాయింపులు	అందుబాటులో ఉన్నది
ఐఏఎస్	208	170
ఐపీఎస్	139	130
ఐఎఫ్ఎస్	81	57

> దేహికి దేహమునందు బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం వరుసగా ఎట్లు కలుగునో, అట్లే శరీరమును వదలిపోవడం అనే మరణం కూడా కలుగుచున్నది.
>
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 14 డిసెంబర్ 2024

జాతికి గర్వకారణం

పది, పన్నెండేళ్ళుగా కంటున్న కలను నెరవేరిన తరుణం ఇది. చిన్నప్పుడు ఆడడం మొదలుపెడుతూనే మనసులో నాటిన లక్ష్యాన్ని సాధించిన చేరుకున్న దిగ్విజయ క్షణాలివి. అత్యంత పిన్నవయస్కుడైన ప్రపంచ చదరంగ ఛాంపియన్‌గా నిలవడంతో పద్దెనిమిదేళ్ళ దొమ్మరాజు గుకేశ్‌కు చిరకాలపు స్వప్నం సాకారమైంది. చరిత్రలో నిన్నటి వరకు గుకేశ్ కేవలం పిన్నవయస్కుడైన మూడో గ్రాండ్ మాస్టర్. కానీ, సింగపూర్‌లో జరుగుతున్న ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో గురువారం సాయంకాలపు విజయంతో ఈ టీనేజ్ కుర్రాడు చదరంగ చరిత్రలో కొత్త అధ్యాయం రచించాడు. సుదీర్ఘ కాలం తరువాత మనవాడు ఒకడు ఇలా భారత ఘనవారసత్వ సంప్రదాయ ప్రాచీనక్రీడ చదరంగంలో జగజ్జేతగా నిలిచి, జాతికి గర్వకారణమయ్యాడు. చైనాకు చెందిన ప్రస్తుత ఛాంపియన్ డింగ్ లిరెన్‌పై చిరస్మరణీయ విజయంతో, అంచనాల్ని అధిగమించి, కాస్పరోవ్, మ్యాగ్నస్ కార్ల్‌సెన్ సరసన తన పేరు లిఖించాడు. గతంలో కాస్పరోవ్ పేరిట ఉన్న అత్యంత పిన్నవయస్కుడైన ప్రపంచ ఛాంపియన్ రికార్డును బద్దలుకొట్టాడు. ఇది ప్రతి భారతీయుడి హృదయం ఉప్పొంగే క్షణం. మన చదరంగ క్రీడాలోకంలోనే కాదు... క్రీడాకారులందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తించే సందర్భం.

నిజానికి, ఈ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొన్నిసార్లు గుకేశ్ తడబడకపోలేదు. మొత్తం 14 గేమ్‌ల ఈ ఛాంపియన్‌షిప్‌లో గుకేశ్ ప్రస్థానం అతని పట్టుదల, వ్యూహచతురతకు నిదర్శనం. మొదట్లో తడబడి, ఓపెనింగ్ రౌండ్‌లో ఓటమి పాలయ్యాడు. కానీ, కుంగిపోకుండా రెట్టించిన ఉత్సాహంతో విజృంభించాడు. విమర్శలను విజయసోపానాలుగా మలుచుకున్నాడు. పట్టువదలని విక్రమార్కుడిలా ఆటలో పైచేయి సాధించాడు. మొదటి నుంచి గుకేశ్ బృందం వేసుకున్న వ్యూహం ఒకటే. గుకేశ్ తన లాగా తాను ఆడాలి. అంతే! పక్కా ప్రణాళికతో ఈ యువ ఆటగాడు, అతని క్రీడాశిక్షకుడు, మిగతా బృందం పడ్డ శ్రమ ఫలించింది. కొన్నిసార్లు ఆట ఆరంభపుటెత్తులను ఆఖరి నిమిషంలో నిర్ణయిస్తే, మరికొన్నిసార్లు వాటి మీద వారాల తరబడి కసరత్తు చేస్తూ వచ్చారు. ఆ సాధన ఉపకరించింది. డింగ్‌తో ప్రతి గేమ్‌లోనూ తన ఓపెనింగ్స్ ద్వారా ప్రత్యర్థిని గుకేశ్ ఆశ్చర్యపరిచాడు. 14 గేమ్‌ల మ్యాచ్‌లో 13 గేమ్‌లు ముగిసినా, చెరి రెండు విజయాలతో టై నెలకొంది. ఆ పరిస్థితుల్లో గురువారం నాటి 14వ గేమ్ ఒక దశలో డ్రా దిశగా వెళుతున్నట్టు అనిపించినా, ప్రస్తుత ఛాంపియన్ డింగ్ లిరెన్ అనూహ్యంగా దిద్దుకోలేని తప్పు చేశాడు. అందివచ్చిన అవకాశాన్ని ఒడిసిపట్టుకొని, గుకేశ్ తన ప్రత్యర్థి ఆట కట్టించాడు. 2.5 మిలియన్ డాలర్ల బహుమతి నిధిలో సింహభాగాన్ని సంపాదించాడు. గతంలో ప్రపంచ ఛాంపియన్‌షిప్ సాధించిన విశ్వనాథన్ ఆనందన్ తర్వాత మళ్ళీ ఆ ఘనత సాధించిన రెండో భారతీయుడు అయ్యాడు.

ఎప్పుడూ గంభీరంగా కనిపించే ఈ చెన్నై చిన్నోడు ఈ విజయంతో ఒక్కసారిగా భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టిన క్షణాలు, బయటకు వస్తూనే తండ్రిని గాఢంగా హత్తుకొని మాటల కందని భావాలను మనసుతో పంచుకున్న దృశ్యాలు ఇప్పుడిప్పుడే ఎవరికీ మరపునకు రావు. గుకేశ్ ఇప్పుడు చదరంగ ప్రపంచానికి సరికొత్త రారాజు. లెక్కల్లో చూస్తే, ప్రపంచ చదరంగానికి 18వ చక్రవర్తి. చదరంగంలో గుకేశ్ ప్రస్థానం ఇప్పుడొక పూర్తి ఆవృత్తం పూర్తి చేసుకుందనుకోవచ్చు. 2013లో 7 ఏళ్ళ గుకేశ్ చెన్నైలో ప్రేక్షకుల మధ్య కూర్చొని, విశ్వనాథన్ ఆనంద్‌కూ, మ్యాగ్నస్ కార్ల్‌సెన్‌కూ మధ్య జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ చూశాడు. ఆ మ్యాచ్‌లో గెలిచిన కార్ల్‌సెన్ అప్పటి నుంచి గత ఏడాది వరకు ప్రపంచ ఛాంపియన్‌గా పట్టు కొనసాగించారు. నిరుడు డింగ్ ఆ పట్టం గెలిచారు. చిన్ననాటి నుంచి అలా సౌండ్‌ప్రూఫ్ గ్లాస్ బూత్‌లో కూర్చొని, ఆటలో గెలవాలని కలలు గన్న గుకేశ్ ఎట్టకేలకు ఆ స్వప్నాన్ని నిజం చేసుకున్నాడు. అయితే, ఇంత త్వరగా తన ఆకాంక్ష నెరవేరుతుందని అతనూ ఊహించలేదు. కార్ల్‌సెన్ నంబర్ 1 ర్యాంకులో ఉన్న నేపథ్యంలో ఇప్పటికీ తాను ప్రపంచ అత్యుత్తమ ఆటగాణ్ణి కాదని వినయం ప్రదర్శిస్తున్నాడు. ఏదో ఒక రోజున కార్ల్‌సెన్‌లా చెస్ ప్రపంచాన్ని ఏలాలని తమిళనాట పెరిగిన ఈ తెలుగు మూలాల టీనేజ్ కుర్రాడు ఆశిస్తున్నాడు.

గతంలో 22 ఏళ్ళ వయసుకే గ్యారీ కాస్పరోవ్ ప్రపంచ ఛాంపియన్ టైటిల్ సాధించారు. అప్పట్లో ఆయన అనటోలీ కార్పోవ్‌ను ఓడించి, ఆ టైటిల్ సాధించి, అతి పిన్నవయస్కుడిగా రికార్డు సృష్టించారు. కేవలం పన్నెండేళ్ళ ఏడు నెలల వయసుకే గ్రాండ్ మాస్టరైన గుకేశ్ ఇప్పుడు 18వ ఏట ఆ ఘనత సాధించడం ఎలా చూసినా విశేషమే. గుకేశ్ బాటలోనే మన దేశ కీర్తిపతాకాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళగల సత్తా ఉన్న ప్రతిభావంతులైన చెస్ క్రీడాకారులు ఇంకా చాలామంది ఉన్నారు. ఇటీవల బుడాపెస్ట్‌లో జరిగిన ఒలింపియాడ్‌లో ఓపెన్ గోల్డ్, ఉమెన్స్ గోల్డ్... రెంటినీ భారత చదరంగ జట్లు విజయవంతంగా గెలిచాయి. ప్రస్తుతం దాదాపు 85 మందికి పైగా గ్రాండ్ మాస్టర్లు భారత్‌లో ఉన్నారనేది ఆశ్చర్యపరిచే గణాంకం. పైగా, వారిలో చాలామంది ఇప్పటికీ డ్రైవింగ్ లైసెన్స్ కూడా రానంతటి పిన్న వయస్కులు. అంటే ఈ విశ్వక్రీడలో భారత్‌కు ఎంతటి బంగారు భవిష్యత్తు ఉందో అర్థం చేసుకోవచ్చు. రాగల రోజుల్లో ప్రజ్ఞానంద లాంటి పలువురు ప్రపంచ ఛాంపియన్లుగా ఎదగగల సత్తా పుష్కలంగా ఉన్నవారు. అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన విశ్వనాథన్ ఆనంద్ శిష్యరికంలో ఈ స్థాయికి ఎదిగిన గుకేశ్ ఇప్పుడు అలాంటి ఎందరికో సరికొత్త ప్రేరణ. సుదీర్ఘ క్రీడా జీవితం ముందున్న ఈ టీనేజర్ భవిష్యత్ ప్రయాణంలో ఈ కొత్త ప్రపంచ కిరీటం ఓ మైలురాయి మాత్రమే. రానున్న రోజుల్లో ఇలాంటివి అనేకం కైవసం చేసుకొని, మరింత మంది గుకేశ్‌ల రూపకల్పనకు ఈ కుర్రాడు స్ఫూర్తి కిరణంగా భాసించడం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.చతుర్దశి సా.4.20 వరకు తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** రోహిణి తె.4.18 వరకు (తెల్లవారితే ఆదివారం) తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.8.43 నుండి 9.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.24 నుండి 7.53 వరకు, **అమృతఘడియలు:** రా.1.17 నుండి 2.46 వరకు.

సూర్యోదయం: 6.25
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

సరికొత్త సంకటంలోకి సిరియా

విశ్లేషణ



టంకశాల అశోక్

ఒక సమస్య నుంచి బయటపడిన సిరియాను బయటి శక్తుల రూపంలో మరో సమస్య వెన్నాడటం అప్పుడే మొదలైపోయింది. అటువంటి శక్తులలో అన్నింటికన్న ప్రధానమైనది ఇజ్రాయెల్. సిరియా అధ్యక్షుడు అసద్ పతనం ఈనెల 8వ తేదీన జరిగింది. కాగా సిరియాకు పొరుగునే ఉన్న ఇజ్రాయెల్ సైన్యం, అంతకన్న ఒకరోజు ముందే సరిహద్దులు దాటి చొచ్చుకు వచ్చింది. అలా ప్రత్యక్ష దురాక్రమణ మొదలు కాగా, ఇప్పటికి దేశమంతటా కొన్ని వందల వైమానిక దాడులు జరిపింది. ఈ చర్యలను ఐక్యరాజ్యసమితితో సహా వివిధ దేశాలు ఖండించినా ఇజ్రాయెల్ ఆపటం లేదు. గోలన్ హైట్స్ ప్రాంతం తమదేననీ, దానిని వదలుకునే ప్రసక్తే లేదనీ నెతన్యాహూ గతంలోనే ప్రకటించారు. అంటే, దాన్ని వారిక ఖాళీ చేయబోరు!

సిరియా, ఇజ్రాయెల్ సరిహద్దులలో గోలన్ హైట్స్ పేరిట పర్వత శ్రేణులున్నాయి. పాలస్తీనా సమస్యను పురస్కరించుకుని అరబ్ దేశాలకూ, ఇజ్రాయెల్‌కూ 1967లో జరిగిన యుద్ధంలో, సిరియాకు చెందిన గోలన్ హైట్స్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది. ఆ ప్రాంతాన్ని తమ దేశంలో పూర్తిగా విలీనం చేసుకుంటున్నట్లు 1981లో ప్రకటించింది. ఆ చర్య అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం గనుక గుర్తించబోమని ఐక్యరాజ్యసమితితో పాటు అమెరికా సైతం ప్రకటించింది. కానీ ఇజ్రాయెల్ లెక్క చేయలేదు. గోలన్ హైట్స్ మొత్తం విస్తీర్ణం సుమారు 18 వేల చ.కి.మీ. కాగా, అందులో 12 వేల చ.కి.మీ.ను ఆక్రమించిన ఇజ్రాయెల్‌కు, సిరియాకు మధ్య నిర్యుద్ధ భూమి ఏర్పడింది. ఆ ప్రాంతం ఐక్యరాజ్యసమితి దళాల పర్యవేక్షణలోకి వెళ్లింది. ఇపుడు అసద్ పతన సమయంలో, ఇజ్రాయెల్ సైన్యం అకస్మాత్తుగా ఆ నిర్యుద్ధ ప్రాంతంలోకి చొచ్చుకుపోయి ఆక్రమించింది.

తాత్కాలిక చర్య అనుకోగలమా?

ఇజ్రాయెల్ చర్యను ఐక్యరాజ్యసమితితో పాటు సౌదీ అరేబియా, టర్కీ, ఇరాక్, ఖతార్ తదితర దేశాలు ఖండించాయి. ఇజ్రాయెల్ సేనలు వెనుకకు పోవాలన్నాయిగానీ, అందుకు ప్రధాని నెతన్యాహూ ససేమిరా అన్నారు. ఇక్కడ చెప్పుకోవలసిన ఒక విషయమేమంటే, గోలన్ ఆక్రమణను మొదట వ్యతిరేకించిన అమెరికా, తర్వాత ట్రంప్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో 2017లో ఆమోదించింది. ఇపుడు తిరిగి ట్రంప్ రానున్నందున అమెరికా వైఖరి ఏమి కాగలదో ఊహించవచ్చు. నెతన్యాహూ ధైర్యానికి అది కూడా కారణమై ఉండాలి. అమెరికా మాట అట్లుంచితే, అసలు గోలన్ ప్రాంతం యావత్తూ తమకు చెందినదేననీ, కనుక దానిని వదలుకునే ప్రసక్తే లేదనీ నెతన్యాహూ గతంలోనే ప్రకటించారు. అక్కడి జనాభాలో గల సిరియన్లను వేధించటం, అక్కడినుంచి తరలిపోయేట్లు చేయటం, వేలాదిమంది యూదుల కోసం సెటిల్మెంట్లు సృష్టించటం ఒక విధానంగా అనుసరిస్తున్నారు. ఆ విధంగా అక్కడి సిరియన్లు మైనారిటీగా మారారు. ఇప్పుడు తాజాగా నిర్యుద్ధ లేదా నిస్సైనిక మండలంలోకి వెళ్లి, సమితి సైన్యాన్ని కాదంటూ ఆక్రమించిన దరిమిలా, ఇది తాత్కాలిక చర్య మాత్రమేననీ, ఆ ప్రాంతంలో సిరియన్ తీవ్రవాదులు పుంజుకోకుండా ముందు జాగ్రత్త కోసమనీ నెతన్యాహూ వివరించే యత్నం చేస్తున్నారు.

కానీ, ఆయన వివరణను నమ్మేందుకు సమితిగానీ, మరొకరుగానీ సిద్ధంగా లేరు. యథాతథంగా ఇజ్రాయెల్ చర్య సిరియా సార్వభౌమత్వానికి, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. నిస్సైనిక ప్రాంతం సమితి సేనల అధీనంలో ఉన్నందున ఆ ప్రాంత నిర్వహణను సమితికే వదలి వేయాలి తప్ప ఇజ్రాయెల్ జోక్యం తాత్కాలికం పేరిటనైనా సరే ఆమోదనీయం కాదు. అందుకు సమితి ముందస్తు అనుమతి కూడా



సిరియా మీద ఇజ్రాయెల్ దాడి

లేదు. ఈ విధంగా తాత్కాలిక ఆక్రమణ లేదా పర్యవేక్షణ పేరిట పాలస్తీనాలోని వెస్ట్ బ్యాంక్‌లోని ప్రాంతాలను కూడా ఇజ్రాయెల్ ఆక్రమించి, ఇప్పటికి అరవై సంవత్సరాలు గడిచినా ఖాళీ చేయటం లేదు. ఇటీవల ఒక కొత్త వాదాన్ని ముందుకు తెచ్చింది. దాని ప్రకారం, అసలు వెస్ట్ బ్యాంక్ అనేది ఇజ్రాయెల్‌లో ఒక భాగమే తప్ప దానికి పాలస్తీనాతో సంబంధం లేదు. అందువల్ల తమ సెటిల్మెంట్లు చట్ట విరుద్ధం కాదు. క్రమంగా ఆ ప్రాంతాన్నంతా ఇజ్రాయెల్‌లో విలీనం చేస్తాం. ఇక్కడ కాకతాళీయమైన ఒక విశేషమేమంటే ఆ విధానాలను, అక్కడి జెరూసలేంకు ఇజ్రాయెల్ రాజధానిని టెల్ అవీవ్ నుంచి బదిలీ చేయటాన్ని ట్రంప్ తన మొదటి పాలనా కాలంలో ఆమోదించారు. ఈ పరిణామాలను ప్రస్తుతం గోలన్ ప్రాంతంలో జరుగుతున్న దానితో పోల్చితే ఏమనిపిస్తుంది? నిస్సైనిక మండలంలోకి ఇజ్రాయెలీ సేనల ప్రవేశం తాత్కాలికమని నమ్మగలమా? పైగా, ఆ పర్వత శ్రేణులన్నీ తమవేనని నెతన్యాహూ గతంలోనే స్పష్టంగా ప్రకటించిన స్థితిలో?

గోలన్ హైట్స్ ఇజ్రాయెల్‌కేనా?

విషయం ఇంతటితో ముగియటం లేదు. తమ ఆక్రమణకు బయట ఇంకా సిరియా అధీనంలోనే గల ప్రాంతాన్ని, ఆ పరిసరాలను కూడా 'స్టెరైల్ జోన్' (నిర్జీవ మండలం)గా మార్చివేయగలమన్న నెతన్యాహూ అందుకోసం తమ సైన్యానికి ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆ మాటకు ఆయన చెబుతున్న అర్థం ఇక అక్కడ సిరియన్ తీవ్రవాదుల కార్యకలాపాలకు గానీ, స్థావరాలకుగానీ శాశ్వతంగా ఎటువంటి అవకాశాలు లేకుండా చేయటం. వినేందుకు ఇది సహేతుకంగా తోచవచ్చు. కానీ, పైన చెప్పుకొన్న వివరాలలోకి వెళ్లినపుడు ఇజ్రాయెల్ అసలు ఉద్దేశాలు ఏమిటనేది అర్థమవుతుంది. సూటిగా చెప్పాలంటే, గోలన్ ప్రాంతాన్ని వారిక ఖాళీ చేయబోరు. తమ అధీనంలో లేని భాగాన్ని కూడా ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆక్రమణలోకి తెచ్చుకుంటారు.

ఇదంతా నిరాటంకంగా సాగేందుకు ఇజ్రాయెల్ సేనలు 8వ తేదీ నుంచే ఆరంభించి మరొక పని చేస్తున్నాయి. అది, సిరియా వ్యాప్తంగా నిరంతరం వందలాది వైమానిక దాడులు. అవన్నీ సిరియా ఆయుధాగారాలపై, ఉత్పత్తి కేంద్రాలపై, వైమానిక, నౌకా స్థావరాలపై జరుగుతున్నాయి. యుద్ధ విమానాలను, రాకెట్లను, నౌకలను ఇప్పటికే దాదాపు ధ్వంసం చేశారు. వాటిలో అసద్ కాలం నాటి రసాయనిక ఆయుధాలు కూడా ఉన్నట్లు ఇజ్రాయెల్ చెప్తున్నది. ఇవన్నీ సిరియాలో కొత్తగా అధికారంలోకి వచ్చిన తీవ్రవాదుల చేతికి రాకూడదన్నది తమ లక్ష్యమైనట్లు వాదిస్తున్నది. వాస్తవానికి ఇంతటి స్థాయిలో కాకున్నా ఐసిస్ కేంద్రాలని చెప్పే ఈశాన్య ప్రాంతానికి పరిమితమై అమెరికా కూడా దాడులు సాగిస్తున్నది. సమస్య ఏమంటే, అటు గోలన్ ఆక్రమణలు గానీ, ఇటు ఈ దాడులు గానీ సిరియా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, సమితిలో ఎటువంటి ప్రమేయం లేకుండా ఏకపక్షంగా జరుగుతున్నవి.

కొత్త ప్రభుత్వపు అడుగులు

సిరియా ప్రజలు అయిదు దశాబ్దాల నియంతృత్వం నుంచి, అంతకు మించిన కాలపు వెనుకబాటుతనం నుంచి ఒక కొత్త దశలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ దిశగా ఒక నియంతను కూలదోయటం ద్వారా ఒక అడుగు వేసి 24 గంటలైనా గడవక ముందే, బయటి శక్తులు తమ ప్రయోజనాల కోసం ఈ విధమైన చర్యలకు పాల్పడితే, ఆ ప్రజలు ఏమి కావాలి? సదరు ఆయుధాలన్నీ సిరియా దేశపు రక్షణ సంపద. అక్కడ కొత్తగా అధికారానికి వచ్చేది ఎవరన్నది ఇంకా తెలియదు. దేశంలో వేర్వేరు గ్రూపులు ఉండటం, వాటిలో ఒకటి రెండింటికి ఇస్లామిస్ట్ తీవ్రవాద నేపథ్యం ఉండటం నిజమే. కానీ ఆ సంబంధాలను వారు బహిరంగంగా తెంచివేసుకుని సుమారు ఎనిమిది సంవత్సరాలవుతున్నది. ఇపుడు డమాస్కస్‌లో అధికారానికి వచ్చిన తర్వాత, ప్రధాన గ్రూపు నాయకుడైన మహమ్మద్ జొలానీ, తాము దేశంలోని అన్ని జాతులు, వర్గాల ప్రజలను ఐక్యం చేసి అందరి బాగు కోసం పాలించగలమని ప్రకటించారు. మార్కెట్ ఎకానమీలోకి ప్రవేశించగలమన్నారు. మహిళలపై ఎటువంటి ఆంక్షలు ఉండవన్నారు. అసద్‌కు పూర్తి మద్దతునిచ్చిన రష్యా, ఇరాన్‌లతోనూ సత్సంబంధాలకు సుముఖత చూపుతున్నారు. అసద్ హయాంలోని మంత్రి వర్గాన్ని తాత్కాలిక ప్రాతిపదికపై కొనసాగిస్తూ, దేశంలో పరిస్థితులు కుదుట పడేట్లు చూస్తున్నారు.

ఉద్యమాల దశలో ఎవరికి ఏ నేపథ్యం ఉన్నా, వారి పరివర్తనలు ఏ విధంగా ఉన్నాయనేది ముఖ్యం. ఆ విజ్ఞత లేని బయటి శక్తులు కేవలం తమ ప్రయోజనాల కోసం ఏవో సాకులు చెప్తూ ఈ విధంగా వ్యవహరించటం ఆమోదించదగిన విషయం కాబోదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆకృతే అందం



ఆకర్షణీయంగా ఉండటం అంటే, సుమారు 85 శాతం మంచి ఆకృతిలో ఉండటమే!

– డాన్ గో, ఫిట్‌నెస్ కోచ్

మంచి మాట



ప్రియాంకా గాంధీ వామపక్ష ఆర్థిక భావనలతో ఏకీభవించడం నాకు కష్టమే. కానీ ఆమె లేవనెత్తిన రాజకీయ హక్కులు, న్యాయం, మనిషి గౌరవం లాంటివాటితో అంగీకరించకుండానూ ఉండలేను. లోక్‌సభలో చాలా చక్కటి తొలి ఉపన్యాసం.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఎందుకున్నారు?



లద్దాఖ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు ఇంకా సరిహద్దులో 1,20,000 మంది చైనా సైనికులు ఉన్న కారణంగా, భారతీయ సైనికులకు ఇది ఐదవ కఠినమైన హిమాలయ శీతకాలం. అక్టోబర్ 21 నాడు ఇండియా, చైనా చేసుకున్న ఒప్పందం తాలూకు వివరాల్లో చాలా కొన్ని మాత్రమే బయట పెట్టారు.

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

ఆరోగ్య సోర్సులు



ఆరోగ్యం అనేది కేవలం ఔషధాలకు సంబంధించినది కాదు. అది తరచుగా మనశ్శాంతి, హృదయ శాంతి, ఆత్మ శాంతి నుంచి వస్తుంది. నవ్వు, ప్రేమల్లో దొరుకుతుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

వాటి వల్లే...



క్రైస్తవ మిషనరీ పాఠశాలలు స్థాపించి ఉండకపోతే, భారత దేశంలో జనరేషన్ ఎక్స్, సహస్రాబ్ది పిల్లలకు అక్షరాస్యత రేటు, విద్య చాలా తక్కువగా ఉండేవి. ఆరోగ్య సంరక్షణ విషయంలో కూడా ఇలాంటిదే చెప్పొచ్చు.

– దేవి, న్యాయవాది

సరైన సందేశం



ఇండియా 12 బిలియన్ డాలర్ల చారిత్రక చమురు ఒప్పందాన్ని రష్యాతో చేసుకుంది. తన ప్రజల ప్రయోజనాల కోసం ఇండియా నిర్ణయాలు తీసుకుంటుందన్న గట్టి సందేశం దీనిద్వారా వెళ్తుంది. అమెరికా, పాశ్చాత్య దేశాల పోరాటాలు మన పోరాటాలు కావని అవి అర్థం చేసుకోవాలి.

– ఒమర్ ఘాజీ, రచయిత

నిజమైన శక్తులు



పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాల్లో బోధించడానికి ఇండియాకు ఏ పాత్రా లేదు అని నేనంటే సంఘీయులు తీవ్ర నిరుత్సాహం చెందుతారు. కానీ ఇది సత్యం. మోదీ ప్రభుత్వం చూపుతున్నట్టుగా ఇండియా గొప్ప శక్తి గలదేమీ కాదు. అది కేవలం స్థానిక ప్లేయర్. అమెరికా, చైనా, రష్యా లాంటివాటికే ప్రపంచంలో ఎక్కడైనా సంఘటనలను ప్రభావితం చేసే శక్తి ఉంది.

– ప్రవీణ్ సహానీ, ఆర్మీ మాజీ అధికారి

ఇన్ బాక్స్

నేలల ఆరోగ్యం కోసం...

నేలను కాపాడుకుంటూ, నేల జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకుంటూ సాగితేనే భవిష్యత్. ప్రపంచ వ్యాప్తంగా నేలలు పలు రకాలుగా ఛిద్రం అవుతున్నాయి. అభివృద్ధి పేరుతో మానవుని కార్యకలాపాలే ఇందుకు కారణం. సమస్య రోజు రోజుకు అధికమౌతూ ఉంది. ఇప్పటికే నేలల స్వాభావిక స్వరూపంలో పెను మార్పులు వచ్చాయి. సాగుకు పనికి



రాకుండా పోతున్నాయి. ఈ క్రమంలో పంటల సాగుకే పరిమితమైన రైతులు వారి స్థాయిలో వారు నేల జీవ వైవిధ్యాన్ని పరిపూర్ణ దృష్టితో చూడాలి. వాటిని కాపాడుకుంటూ సాగు చేయాలి. ఎందుకంటే మన నేలలు వ్యవసాయం కోసం మాత్రమే కాదు. భూమిపై జీవం మనుగడ కోసం కూడా ఎంతో అవసరం. రంగుల వస్త్రం లాంటి మన వ్యవసాయ భూములలో, సుస్థిర వ్యవసాయం, పర్యావరణ సమగ్రత, ఆహార భద్రత వంటి అంశాలకు సంబంధించి అనేక రహస్యాలు ఇమిడి వున్నాయి. అందుకే వాటిని పరిరక్షించుకోవాలి.

భూసార క్షీణత, భూసార పరిరక్షణ, వాతావరణ మార్పులు, ఆహార భద్రత వంటి అంశాలపై విస్తృత సమాచారాన్ని తెలుసు కోవాలి. ఈ ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి, వారసత్వంగా వస్తున్న జ్ఞానాన్నీ అనుసంధానం చేసుకుంటూ ఉండాలి. వ్యవసాయంలో మన నేలల ఆరోగ్యానికి చాలా ప్రాముఖ్యం ఉంది. సేంద్రీయ విధానాలు, భూమిని కప్పి ఉంచే పంటల సాగు విధానాలు వంటి ఆచరణాత్మక పద్ధతులు; మట్టి పరిరక్షణ , కార్బన్ సీక్వెస్ట్రేషన్‌లో అధునాతన విధానాలు, వ్యవసాయం, పర్యావరణ స్థిరత్వం మధ్య సామరస్య సమతౌల్యాన్ని ఎలా సాధించాలో తెలుసుకోవాలి కూడా.

ఇటువంటి సమాచారంతో నిండిన పుస్తకమే 'మన నేలలే మన భవిత'. ఇది ఫ్రెడ్ మేగ్డాఫ్, హెరాల్డ్ వ్యాన్ ఎస్‌లు రాసిన 'హౌ టు బిల్డ్ సాయిల్స్ ఫర్ బెటర్ క్రాప్స్' అనే పుస్తకానికి ప్రముఖ వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త డా॥ కిలారు పూర్ణచంద్రరావు చేసిన సంక్షిప్త స్వేచ్ఛానువాదం. ఈ పుస్తకం వ్యవసాయ, పర్యావరణ రంగాల్లో ఉన్న అందరూ తప్పనిసరిగా చదవాల్సిన అవసరం ఉంది.

– వలేటి గోపీ చంద్ | 94412 76770

(రేపు హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్ ఫ్యాప్సీ భవన్‌లో 'మన నేలలే మన భవిత' పుస్తక ఆవిష్కరణ)

చైతన్య దీప్తికై అవిశ్రాంత పోరుగానం

సందర్భం



గాజోజు నాగభూషణం

తెలంగాణ ప్రజా జీవితంలో పాట విడదీయరాని సాంస్కృతిక చిహ్నం. ప్రత్యామ్నాయ రాజకీయ విశ్వాసాల పునాదుల మీద నిర్మాణమైన వామపక్ష ఉద్యమాల పరివ్యాప్తి కోసం పాట వ్యవస్థీకృత రూపాన్ని సంతరించుకొని, వివిధ సాంస్కృతిక వేదికలు ఏర్పడ్డాయి. అందులో 'అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య' బలమైనది. 1974లో ఒక చారిత్రక సందర్భంలో ఏర్పడి, ఎన్నో కల్లోల కాలాలను దాటి నేటికీ కొనసాగుతున్న అవిశ్రాంత పోరుగానం–అరుణోదయకు 50 ఏళ్లు. 'అరుణోదయ 50 వసంతాల సభలు' పేరుతో మహాసభలు జరుపుకొంటున్న వేళ ఆ సంస్థకు విప్లవాభివందనాలు.

చలపతిరావు, రాం సత్తయ్య, లలిత, అనురాధ, గీతా రామస్వామి, కాశీపతి, కానూరి, రామారావు, నాగన్న, గూడ అంజన్న తదితరులు దీనికి ప్రాణ ప్రతిష్ఠ చేయగా... నేటికీ దీని అస్తిత్వానికి ప్రాణవాయువు అందిస్తూ, జీవితం మొత్తాన్నీ దీనికే అంకితం చేస్తున్న సాంస్కృతిక యోధ విమలక్క. అరుణోదయ తన 50 ఏళ్ల ప్రస్థానంలో ఎమర్జెన్సీ తదనంతర కాలంలో బలోపేతమైన సిరిసిల్ల – జగిత్యాల రైతాంగ పోరాటాలతో మమేక మైంది. బీడీ కార్మికుల పోరాటాలకు మద్దతుగా నిలిచింది. కారంచేడు దళితుల ఊచకోతలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. 1/70 చట్టం రద్దుకు ఆదివాసీ స్వయంపాలనోద్యమంలోనూ; మండల్ ఉద్యమం, డంకెల్ వ్యతిరేక ఉద్యమాల్లో సాంస్కృతిక సేనానిగా సైనిక కవాతు చేసింది. తదనంతరం తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ సమరశీల పాత్రను పోషించింది. 'ధూమ్ ధామ్'ను ఉద్యమ రూపంగా ప్రజల్లోకి తీసుకుపోయింది. 'బయ్యారం ఉక్కు – ఆదివాసీల హక్కు' అని నినదించింది. ముచ్చర్ల బయో కెమికల్ హబ్, రాచకొండ విధ్వంసానికి వ్యతిరేకంగా ఉద్యమించింది. 'కవ్వాల్ టైగర్ జోన్'ను వ్యతిరేకించింది. 'బహుజన బతుకమ్మ' నిర్వహణలో ఒక్కో ఏడూ ఒక్కో సామాజిక సమస్యను వేదికగా చేసుకొని ప్రజలను చైతన్య పరిచింది. ఈ విధంగా అరుణోదయ గొంతు విప్పని ప్రజా సమస్య లేనేలేదని చెప్పవచ్చు.



ఈ సందర్భంగా నా స్వగతాన్ని, అరుణోదయతో నాకు గల అనుబంధాన్ని చెప్పుకోవడం అనుచితం కాదేమో. ఉద్యమ పాటే నన్ను జగిత్యాల రైతాంగ పోరాటాలకు దగ్గర చేసింది. జగిత్యాల చుట్టూ ఉన్న గ్రామాల్లో మిత్రులతో కలిసి సాంస్కృతిక బృందంగా చేసిన కళా ప్రదర్శనలు, పాడిన పాటలు నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పాయి. అనేక ఉద్యమాల్లో భాగస్వామిని చేశాయి.


అరుణోదయ తన లక్ష్యాలను పునర్నిర్వ చించుకో వలసిన సందర్భం ఇది. కుల దురహంకార హత్యలు, సహజవనరుల విధ్వంసం, జెండర్ వివక్ష, డ్రగ్స్‌లోనే కాదు... రాజకీయ బానిసత్వంలోనూ మునిగిపోతున్న యువత, హక్కుల ఉల్లంఘన, ఆదివాసీల పట్ల కొనసాగుతున్న హింస లాంటి దేశ అంతర్గత కల్లోలాలు ఒక వైపు; ప్రపంచవ్యాప్తంగా కమ్ముకుంటున్న యుద్ధ మేఘాల తీవ్రత మరో వైపు ఉంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణం కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం, వివక్షారహిత సమాజ నిర్మాణం కోసం, పాటను పదునెక్కించి ప్రజల్లోకి తీసుకుపోయే బౌద్ధిక చలన శక్తిగా అరుణోదయ పునరంకితం కావలసి ఉంది. ఇందుకోసం భావ సారూప్యం కలిగిన సంస్థలతో కలిసి నడుస్తూ, ఒక విశాలమైన ప్రజా సాంస్కృతికోద్యమ నిర్మాణంలో ప్రధాన భూమికను పోషించాలి.

వ్యాసకర్త తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు

(అరుణోదయ 50 వసంతాల సభలు నేడు హైదరాబాద్, ఆర్టీసీ కల్యాణ మండపంలో, రేపు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో)

తపోబలం

పూర్వం కన్యాకుబ్జంలో గాధి కుమారుడైన విశ్వామిత్రుడు రాజ్యపాలనం చేస్తున్న రోజులలో, ఒకనాడు వేటకోసం అడవికి వెళ్ళి, అడవిలో తిరిగి తిరిగి అలసిపోయి, దగ్గరలో కనిపించిన వశిష్ఠుడి ఆశ్రమం చేరుకున్నాడు. విశ్వామిత్రుడికే కాక అతడి వెంట వచ్చిన సైన్యానికి కూడా తృప్తినిచ్చేలా ఫలపానీయాదులను సమృద్ధిగా ఇచ్చి ఆదరించాడు వశిష్ఠుడు. ఆ ఆశ్రమంలోనే ఒక పక్కగా కట్టివేయబడి ఉన్న 'నందిని' అనే ధేనువు నుండి ఈ సమస్తమైన సౌకర్యాలను వశిష్ఠుడు సమకూర్చడాన్ని చూసిన విశ్వామిత్రుడు, దాని మీద మోజుపడి, 'లక్ష గోవులను బదులుగా ఇస్తాను. ఆ ధేనువును నాకు ఇవ్వు' అని అడిగాడు. 'రాజువైన నీకు ఈ ధేనువుతో ఏమి పని? నేను ఈ ధేనువును పితృదేవతాది జనములను తృప్తులను చేయడానికి



జ్యోతిర్మయం

నిర్వహించే కార్యక్రమాలలో నియోగిస్తుంటాను. ఈ ధేనువును జాగ్రత్తగా చూసుకోవడమే నా పని' అని సర్ది చెప్పాడు వశిష్ఠుడు. అయినా మళ్ళీ అడిగాడు విశ్వామిత్రుడు. 'మరొకరికి ఇవ్వడానికి వీలుకానిది ఈ ధేనువు' అని తిరస్కరించాడు వశిష్ఠుడు. ఈ మాటలకు అహం దెబ్బతినగా, బలవంతంగానైనా తీసుకు వెడతానన్నాడు విశ్వామిత్రుడు. వశిష్ఠుడు మరి మాటాడక చూస్తూ ఊరుకున్నాడు. దీంతో ఆ ధేనువును స్వాధీనం చేసుకుని తీసుకురమ్మని సైన్యాన్ని ఆజ్ఞాపించాడు విశ్వామిత్రుడు. విశ్వామిత్రుని సైన్యానికి మూడింతల సైన్యం ఆ ధేనువు నుండి ఉద్భవించి విశ్వామిత్రుడి సైన్యాన్ని తరిమి కొట్టింది. ఆశ్చర్యపోయాడు విశ్వామిత్రుడు. భరించలేని అవమానాన్ని అనుభవించాడు మనసులో. ఆలోచించగా క్షాత్రబలం కంటె తపోబలం గొప్పదని అప్పుడు అర్థమైంది ఆయనకు.

చం. పొలుపగు రాజ్యసంపదుపభోగములెల్ల దృణంబుగా మదిం
దలచి విరక్తుడై విడిచి, దారుణ శైలవనాంతరంబులన్
వెలయ దపంబు సేసి, గుణవిశ్రుతుడై పడసెన్ మహాతపో
బలమున సర్వసంపదలు బ్రహ్మఋషిత్వము దివ్యశక్తియున్.

వశిష్ఠుడి ఆశ్రమంలో చోటు చేసుకున్న ఆ సంఘటనతో కనువిప్పు కలిగినవాడైన విశ్వామిత్రుడు, రాజ్యభోగాలను వదిలి ఘోరాటవులలో గొప్ప తపస్సు చేసి వశిష్ఠుడితో సమానమైన తపోబలాన్ని, బ్రహ్మర్షిత్వాన్ని పొందాడు అని చెప్పాడు నన్నయభట్టు ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, సప్తమాశ్వాసంలోని పై పద్యంలో.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

రచయిత కంచ ఐలయ్యపై కేసుల కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: రచయిత, ప్రొఫెసర్ కంచ ఐలయ్యపై దాఖలైన పలు కేసులను కొట్టివేస్తూ హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు' అనే పుస్తకంపై ఏర్పడిన వివాదం కారణంగా రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐలయ్యపై పలు కేసులు నమోదయ్యాయి. ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బ తీసేలా పుస్తకం రాశారని మల్కాజిగిరికి చెందిన శ్రీకాంత్‌గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అలాగే కోరుట్ల, కరీంనగర్‌లోనూ పలువురు కేసు పెట్టారు. ఈ కేసులను సవాల్ చేస్తూ ఐలయ్య హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి తీర్పు వెలువరించారు. ఉన్నత న్యాయస్థానం తీర్పుపై ప్రొఫెసర్ ఐలయ్య హర్షం వ్యక్తంచేశారు.

మంత్రి జూపల్లిని మార్చాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల డిమాండ్

కవాడిగూడ (హైదరాబాద్): ఎక్సైజ్ శాఖమంత్రిగా ఉన్న అగ్రకులానికి చెందిన జూపల్లి కృష్ణారావును మార్చి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎక్సైజ్ శాఖ మంత్రి బాధ్యతలు అప్పగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దోమల గూడలోని బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు కేటాయించాల్సిన ఎక్సైజ్ శాఖను అగ్రకుల సామాజిక వర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావుకు కేటాయించడం దారుణమన్నారు. జూపల్లిని వెంటనే తొలగించాలనే డిమాండ్‌తో విస్తతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముది రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'నామినేటెడ్'లో బీసీలకు 50% కేటాయించాలి



సాక్షి, హైదరాబాద్: మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట వేయాలని, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం వాటా ఉండేలా ప్రస్తుతం జరిగే అసెంబ్లీలో చట్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను జాజుల నేతృత్వంలోని బృందం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించింది.

నీ వెంటే వస్తున్నా బిడ్డా..!

- కుమారుడి మృతి తట్టుకోలేక తనువు చాలించిన తల్లి



వెంకటమ్మ



శ్రీశైలం

కుల్కచర్ల: కొడుకు మరణాన్ని తట్టుకోలేక.. ఓ తల్లి గుండె ఆగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చూస్తుండగానే.. కుమారుడి శవం పక్కనే తుదిశ్వాస విడిచింది. ఈ విషాద సంఘటన వికారాబాద్ జిల్లా కుల్కచర్ల పీఎస్ పరిధిలోని చౌడాపూర్ మండలం లింగంపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మ్యాకల శ్రీశైలం (34) గత నెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదే ఊరికి చెందిన బాల్‌రాజ్, లక్ష్మణ్, రాములు కలిసి భూ తగాదాలతో తనను వేధిస్తున్నారని అంతకు ముందే సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. శ్రీశైలం మృతిని జీర్ణించుకోలేని తల్లి వెంకటమ్మ (52) కొడుకు శవం వద్ద రోదస్తూ కింద పడిపోయింది. అక్కడున్నవారు చూస్తుండగానే ప్రాణాలు విడిచింది. దీంతో తల్లీ కొడుకుల అంత్యక్రియలను ఒకేసారి నిర్వహించారు. శ్రీశైలం ఆత్మహత్యకు కారణమైన బాల్‌రాజ్, లక్ష్మణ్, రామును అదుపులోకి తీసుకున్న పోలీసులు శుక్రవారం వారిని రిమాండ్‌కు తరలించారు.

ఎంజీఎం వంటగదిలో ఎలుకలు



ఎంజీఎం: వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు భోజనం అందించే వంటగదిలో ఎలుకలు, పందికొక్కులు దర్శనమిస్తున్నాయి. అసలే రోగాలతో బాధపడే వ్యక్తులకు శుచి, శుభ్రతతో భోజనం అందించాల్సి ఉంది. కానీ అదే వంటగదిలోనే ఇలా ఎలుకలు, పందికొక్కులు ఉండటంతో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భోజనం తయారు చేసే సమయంలో కళ్ల ముందే అవి తిరుగుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వంటగదిని శుభ్రంగా ఉంచేలా సంబంధిత కాంట్రాక్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



అమ్మాలంటే అవస్థే

ఆరుగాలం శ్రమించే రైతుకు విత్తు వేసిన దగ్గర్నుంచి పంట చేతికొచ్చి అమ్ముకునే వరకు అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రం బేలలో ఒకే ఒక్క జిన్నింగ్ మిల్లు ఉంది. ఇక్కడ పత్తిని అమ్మడం రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. మిల్లులో స్థల సమస్యతో రోజూ 50 పత్తి బండ్ల లోడ్‌ను మాత్రమే కొనుగోలు చేస్తున్నామని జిన్నింగ్ యజమాని చెబుతున్నాడు. ఫలితంగా కిలోమీటర్ల మేర పత్తి బండ్లు నిలిచిపోతున్నాయి. రెండు రోజులుగా రైతులు అలాగే పడిగాపులు కాస్తూ నానా అవస్థలు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పెండింగ్ గ్రాంటు | రూ.1,800 కోట్లు ఇవ్వండి

- వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సహాయం విడుదల చేయండి
- ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లు ఏపీ నుంచి ఇప్పించండి
- కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి





కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్ • కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తొమ్మిది జిల్లాలకు ఏటా రూ.450 కోట్ల చొప్పున గ్రాంటు విడుదల చేయాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విషయం ఆయన గుర్తుచేశారు. 2019–20, 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించిన గ్రాంటును ఇప్పటివరకు విడుదల చేయలేదని, నాలుగేళ్లకు కలిపి రూ.1,800 కోట్లు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పార్లమెంటులోని ఆర్థికమంత్రి చాంబర్‌లో నిర్మలా సీతారామన్‌తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్ర పునర్విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్‌భవన్, లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జ్యుడిషియల్ అకాడమీ సహా ఇతర ఉమ్మడి సంస్థలను తెలంగాణ ప్రభుత్వమే నిర్వహించిందని రేవంత్ తెలిపారు. ఆయా సంస్థల విభజన పూర్తయ్యే వరకు ఇందుకోసం అయిన రూ.703.43 కోట్లను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని.. అందులో రూ.408.49 కోట్లను తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ తన వాటాగా చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఆ మొత్తం చెల్లింపునకు తొలుత ఏపీ అంగీకరించినా, కేంద్ర హోం శాఖ సైతం ఏపీకి లేఖలు రాసినా.. ఇప్పటివరకు ఏపీ ఆ మొత్తాన్ని చెల్లించలేదని, వడ్డీతో సహా ఆ మొత్తం తెలంగాణకు ఏపీ చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

రూ.2,547.07 కోట్ల రికవరీని పునఃసమీక్షించండి

విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుంచి రూ.2,547.07 కోట్ల రికవరీకి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని ముఖ్యమంత్రి చెప్పారు. దీనిపై తమ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలిపినా పట్టించుకోలేదని, దీన్ని మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2014–15లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన నిధులన్నింటినీ కేవలం ఆంధ్రప్రదేశ్‌కే, కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. అయితే పునర్విభజన చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన ఆ మొత్తంలో ఏపీ నుంచి తెలంగాణకు రూ.495.20 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని రాష్ట్రానికి రావల్సిన నిధులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఈ భేటీలో పాల్గొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీ యావత్ తెలంగాణ స్వప్నం

పునర్విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం.. కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని, అయితే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కూడా కోరుతూ తాను లేఖ రాశానని తెలిపారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనేది కాజీపేట వాసుల కల మాత్రమే కాదని.. యావత్ తెలంగాణ స్వప్నమని వివరించారు.

మిగతా వినతులు ఇలా..

- వికారాబాద్–కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలి. ఈ మార్గంతో వికారాబాద్ జంక్షన్ నుంచి కృష్ణా స్టేషన్ల మధ్య 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.
- కల్వకుర్తి–మాచర్ల మధ్య నూతన రైలు మార్గం మంజూరు చేయాలి. ఇది నిర్మిస్తే సిమెంట్ పరిశ్రమలతో పాటు అటవీ ఉత్పత్తుల విక్రయానికి ప్రయోజనం చేకూరుతుంది. దీనివల్ల సికింద్రాబాద్, గుంటూరు, డోన్ సెక్షన్లు అనుసంధానమై శ్రీశైలం వెళ్లే భక్తుల ప్రయాణం సులభతరం అవుతుంది.
- డోర్నకల్–మిర్యాలగూడ (పాపటపల్లి–జాన్ పహాడ్), డోర్నకల్–గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలి. ఇక్కడ విలువైన భూముల సేకరణ రైల్వే శాఖకు భారంగా మారనున్న దృష్ట్యా, ఆ ప్రతిపాదిత మార్గాలను మార్చి డోర్నకల్ నుంచి వెన్నారం–మన్నెగూడెం–అబ్బాయిపాలెం–మరిపెడ మీదుగా మోతె వరకు వెళ్లేలా మార్చాలి. దీనిద్వారా గతంలోని మార్గాలతో పోలిస్తే 19 కి.మీ. దూరం కూడా తగ్గుతుంది.

కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: కోతుల బెడద నివారణకు సంబంధిత అన్ని శాఖలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. కోతుల సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం కనుగొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని పీసీసీఎఫ్ డోబ్రియాల్‌ను మంత్రి ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (జపాట్) 13వ గవర్నింగ్ బాడీ సమావేశంలో... యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్‌బుక్‌ను అధికారులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూ పార్కుల్లో పనిచేసే సిబ్బందికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించాలని చెప్పారు. నెహ్రూ జూ పార్కులో ఖాళీల భర్తీ అంశాన్ని అధికారులు ప్రస్తావించగా, మంత్రి అందుకు ఆమోదం తెలిపారు.

580 మోడల్ ఇందిరమ్మ గృహాల నిర్మాణం

- లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు నిర్ణయం: మంత్రి పొంగులేటి



మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి/తిరుమలాయపాలెం: రాష్ట్రంలో 580 చోట్ల మోడల్ ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మోడల్ గృహ నిర్మాణానికి మంత్రి శుక్రవారం భూమిపూజ చేసి మాట్లాడారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల గృహాలను నిర్మించాలనేది తమ లక్ష్యమని చెప్పారు. ఇందుకోసం రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని, ఇదే ధరలో ఇల్లు నిర్మించేలా లబ్ధిదారులు, మేస్త్రీలకు అవగాహన కల్పించేందుకు మండలానికి ఒక మోడల్ గృహం నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ పాల్గొన్నారు.

ధాన్యం తరుగుపై ఆగ్రహం, మిల్లు సీజ్‌కు ఆదేశాలు

మంత్రి పొంగులేటి తిరుమలాయపాలెం మండలంలోనూ పర్యటించారు. జల్లెపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ముదిగొండలోని రైస్ మిల్లుకు తరలిస్తుండగా.. అక్కడ క్వింటాకు మూడు కేజీల తరుగు తీస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో మిల్లును సీజ్ చేసి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు.

మతిస్థిమితం లేని బాలికపై లైంగిక దాడి

- నిందితుడిపై బాలిక బంధువుల దాడి...ఆస్పత్రిలో చేరాక మృతి



రత్నావత్ రెడ్యా

రెంజల్(బోధన్): మతి స్థిమితం లేని ఏడేళ్ల బాలికపై ఒకరు లైంగిక దాడి చేయగా, ఆగ్రహించిన బాలిక బంధువులు నిందితుడిపై దాడి చేయగా మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాలోని కిరాణా కొట్టుకు గురువారం రాత్రి మతి స్థితిమితం లేని బాలిక నాయనమ్మతో కలిసి వెళ్లింది. సరుకులు తీసుకొని నాయనమ్మ ఇంటికి రాగా, బాలిక అక్కడే నిలబడింది. 15 నిమిషాలైనా ఇంటికి రాకపోవడంతో బాలికను తీసుకురావడానికి తల్లి కొట్టు వద్దకు వెళ్లింది. అప్పటికే దుకాణ యజమాని రత్నావత్ రెడ్యా బాలికను అత్యాచారం చేసినట్టు అనుమానించిన తల్లి... కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో బాలిక తల్లి దండ్రులతోపాటు బంధువులు వెళ్లి రెడ్యాను చితకబాదారు. తీవ్రంగా గాయపడిన రెడ్యాను నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మరోవైపు మృతుడి బంధువులు బాలిక బంధువుల ఇళ్లపై దాడులకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారు?

- వర్సిటీ వజ్రోత్సవాల్లో కోదండరెడ్డిని నిలదీసిన రైతులు



రైతు మాట్లాడుతుండగా మైకును లాక్కుంటున్న అధికారి

హనుమకొండ: రైతు రుణమాఫీపై రైతులు నిరసన వ్యక్తం చేయడంతో విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో గందరగోళం చోటుచేసుకుంది. శుక్రవారం వరంగల్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాలలో తెలంగాణ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలు జరిగాయి. తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎస్.కోదండరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి వజ్రోత్సవాలను ప్రారంభించారు. ఆయన రుణ మాఫీ అంశంపై మాట్లాడుతుండగా రైతుల నుంచి ఒక్కసారిగా నిరసన వ్యక్తమైంది. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు చేయలేదని, ప్రభుత్వం, సీఎం, మంత్రులు చెబుతున్నది ఒకటి, చేస్తున్నది మరొకటి అని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును విమర్శిస్తుండగా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇది సందర్భం కాదని వారించారు.

తిరిగి జైలుకు హీర్యానాయక్

- నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తర్వాత తరలించిన పోలీసులు
- మరో ఇద్దరు రైతులకు కూడా అనారోగ్యం.. జైలులోనే చికిత్స



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ హైదరాబాద్: ఛాతీలో నొప్పితో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన 'లగచర్ల' రైతు హీర్యానాయక్‌ను తిరిగి సంగారెడ్డి సెంట్రల్ జైలుకు తరలించారు. హీర్యానాయక్‌కు జైలులో ఛాతీ నొప్పి రావడంతో పోలీసులు ఆయనకు బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. సంగారెడ్డి ఆస్పత్రిలో పరీక్షలు చేసిన వైద్యులు.. మెరుగైన చికిత్స కోసం ఆయనను గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయితే పోలీసులు ఆయనను నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పలు వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించారు. శుక్రవారం ఆయనను నిమ్స్ నుంచి తిరిగి సంగారెడ్డి సెంట్రల్ జైలుకు తరలించారు.

సెలవుపై సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్

రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన ఘటనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. హీర్యానాయక్ కుటుంబం, గిరిజన సంఘాలతోపాటు ప్రతిపక్ష పార్టీలు పోలీసుల తీరును తప్పుబట్టాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి విచారణకు ఆదేశించగా.. సంగారెడ్డి జైలు సిబ్బంది తప్పిదంతోనే బేడీల ఘటన జరిగినట్టు తేల్చారు. దీనితో జైలర్ సంజీవరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయగా.. జైలు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్‌ను సెలవుపై వెళ్లిపోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు తెలిసింది. ఆయనపై శాఖాపరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి. 'లగచర్ల' కేసులో అరెస్టయి జైలులో ఉన్న రైతులలో మరో ఇద్దరు రాఘవేందర్, బసప్ప కూడా అనారోగ్యం బారినపడినట్టు తెలిసింది. వారికి జైలులోనే చికిత్స అందిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు..: తీవ్ర అనారోగ్యంతో ఉన్న లంబాడా రైతును సంకెళ్లు వేసి తరలించిన రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్యపార్కు వద్ద సేవాలాల్ సేన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. లగచర్ల ఘటనలో అరెస్టు చేసిన గిరిజన రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి జైలు ఘటనపై జైళ్లశాఖ ఐజీ విచారణ

సాక్షి, హైదరాబాద్: రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన ఘటనపై జైళ్లశాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన దర్యాప్తు ముమ్మరం చేశారు. జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా ఆదేశాల మేరకు.. ఆ శాఖ అడ్మిన్ ఐజీ రాజేశ్ శుక్రవారం సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వెళ్లి విచారణ చేశారు. హీర్యానాయక్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో చోటు చేసుకున్న పరిణామాలు, 'లగచర్ల' కేసులో ఏ–2గా ఉన్న సురేశ్ కొందరితో ఫోన్లు మాట్లాడటం తదితర అంశాలపై ఐజీ ఆరా తీశారు. ఈ వ్యవహారంలో ఎవరైనా కిందిస్థాయి ఉద్యోగుల ప్రమేయం ఉందా అన్న దిశగా వివరాలు సేకరించారు.

వాయుకాలుష్యంతో రక్తం గడ్డకట్టే ముప్పు

న్యూఢిల్లీ: వాయు కాలుష్యం మానవుల ప్రాణాలకు అత్యంత హానికరమని మరోసారి రుజువైంది. దీర్ఘకాలంపాటు వాయుకాలుష్యం బారిన పడితే నరాల్లో రక్తం గడ్డకట్టే అవకాశాలు ఏకంగా 39 శాతం నుంచి 100 శాతందాకా పెరుగుతాయని అమెరికా అధ్యయనంలో వెల్లడైంది. దాదాపు 17 సంవత్సరాలపాటు అమెరికాలో 6,650 మంది యుక్తవ యస్కులపై చేసిన పరిశోధనలో ఈ విషయం తేలింది. ''వాయు కాలుష్యం కారణంగా కణజాలం, కండరాల కింద ఉండే ప్రధాన నరాల్లో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగొచ్చు. చికిత్స చేయకుండా అలాగే వదిలేస్తే రక్తప్రవాహానికి తీవ్ర అవరోధాలు ఏర్పడి ప్రసరణ ఆగిపోవచ్చు. అప్పుడు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి'' అని పరిశోధకులు చెప్పారు. నరాల్లో రక్తం గడ్డ కట్టే పరిస్థితిని వేనస్ థ్రోంబోఎంబోలిజం' అని పిలుస్తారు. ఈ సమస్య కారణంగా ఆస్పత్రిపాలైన రోగుల డేటాను మిన్నెసోటా విశ్వవిద్యాలయ పరిశోధకుల బృందం పరిశీలించింది. ఆయా రోగుల ఇళ్లలో వాయుకాలుష్యం తాలూకు శాంపిళ్లనూ తీసుకున్నారు. న్యూయార్క్, షికాగో, లాస్ ఏంజెలిస్ సహా ఆరు మెట్రోపాలిటన్ నగరాల్లో, ఆ నగరాల సమీపాల్లో నివసించే యుక్తవయసు రోగులపై ఈ పరిశోధన చేశారు. సూక్ష్మధూళి కణాలు(పీఎం 2.5) , నైట్రోజన్ ఆక్సైడ్‌ల బారిన పడి వాయు కాలుష్యాన్ని ఎదుర్కొంటున్న వారిలో 3.7 శాతం(248 మంది) జనాభాలో రక్తం గడ్డ కట్టే అవకాశాలు 39 శాతం నుంచి 100 శాతం వరకు ఉన్నాయి. సూక్ష్మధూళి కణాల గాఢత ఎంత ఎక్కువ ఉన్న గాలిని పీల్చితే అంత ఎక్కువగా రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరుగుతాయి. అత్యధిక స్థాయిలో నైట్రోజన్ ఆక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్‌ల బారిన పడితే ఈ రిస్క్ ఏకంగా 120–174 శాతానికి పెరుగుతుంది. వాయు కాలుష్యం ఎక్కువైతే శరీరంలో ఆ మేరకు వాపు పెరిగి రక్తం గడ్డకడుతుంది. చివరకు ఆ వ్యక్తులు హృదయ, శ్వాస సంబంధ వ్యాధుల బారిన పడతారు'' అని పరిశోధకులు చెప్పారు.



తిమింగలం సుదూర ప్రయాణం

13,000 కిలోమీటర్లు వలస వెళ్లిన భారీ జలచరం ● వాతావరణ మార్పులే కారణమంటున్న శాస్త్రవేత్తలు



వాతావరణ మార్పుల పెను ప్రభావాలు జలచరాలపై పడతాయని చెప్పే ప్రబల నిదర్శనమొకటి తాజాగా వెలుగుచూసింది. మహాసముద్రాల ఉపరితజలాల ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా చేపలు, తిమింగలం వంటి జలచరాల ఆహార లభ్యతలో మార్పులు సంభవిస్తున్నాయి. జత కట్టడానికి తోడు కోసం అలుపెరుగని అన్వేషణ కొనసాగిస్తున్నాయని తేలింది. చిన్న తిమింగలాల పెంపకానికి అనువైన వాతావరణం, పిల్లల్ని కనడానికి అనువైన సముద్రజలాల ఆవరణ కోసం ఈ భారీ జలచరం ఏకంగా 13,000 కిలోమీటర్లు ప్రయాణించిందని పరిశోధకుల పరిశోధనలో వెల్లడైంది. సరైన ఆవాసం, ఆహారం, తోడు కోసం దక్షిణ అమెరికా ఖండం నుంచి ఆఫ్రికా ఖండం దాకా వలస యాత్ర మొదలెట్టిన తిమింగలం.. ప్రయాణంలో భాగంగా ఏకంగా రెండు మహాసముద్రాలను దాటి మూడో మహాసముద్ర జలాల్లో తచ్చాడుతోంది. తిమింగలం తిప్పల కథ క్లుప్తంగా..

9 సంవత్సరాల్లో..

కొలంబియా దేశం సమీపంలో పసిఫిక్ మహాసముద్ర జలాల్లోని 'గల్ఫ్ ఆఫ్ ట్రిబుగా'లో తొలిసారిగా 2013 జూలై పదో తేదీన ఒక బృందం ఈ మెగాప్టేరా నోవాఏంగ్లీ రకం హంప్‌బ్యాక్ మగ తిమింగలాన్ని చూశారు. దీని ఫొటోలను తీసి తిమింగలం వివరాలను పొందుపరిచే happywhale. com వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. నాలుగేళ్ల తర్వాత దీనిని బహియే సోలానో ప్రాంతంలో కలియతిరగడం చూశారు. మళ్లీ ఐదేళ్ల తర్వాత అంటే 2022 ఆగస్ట్ 22న ఏకంగా 13,046 కిలోమీటర్ల దూరంలోని ఆఫ్రికా ఖండంలోని హిందూ మహాసముద్ర ప్రాంతం ఝాంజిబార్ చానల్ వద్ద చూశారు. దీనికి సంబంధించిన వేలాది ఫొటోలను కృత్రిమ మేధతో సరిపోల్చి 2013లో దక్షిణ అమెరికాలో కనిపించిన తిమింగలం ఇదేనని తేల్చారు. మొదటిసారి చూసిన ప్రాంతానికి, 2022లో కనిపించిన ప్రాంతానికి మధ్య దూరం సరళరేఖా మార్గంలో చూస్తే 13వేల కి.మీ.లు ఉంటుందని, ఒక వేళ ఇది అర్ధచంద్రాకార మార్గంలో ఇక్కడికి చేరుకుని ఉంటే ఇది ఏకంగా 19,000 కిలోమీటర్లు ప్రయాణించి ఉంటుందని లెక్కతేల్చారు. ''ఒక తిమింగలం ఇంతదూరం వలసరావడం చరిత్రలో ఇదే తొలిసారి. సరైన ఆహారం, తోడు దొరక్క సుదూరాలకు ప్రయాణిస్తోంది'' అని టాంజానియా సెటాసియన్స్ ప్రోగ్రామ్ శాస్త్రవేత్త డాక్టర్ ఎకటేరినా కలష్నికోవా చెప్పారు. కలష్నికోవా పరిశోధనా వివరాలు రాయల్ సొసైటీ ఆఫ్ ఓపెన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

కుమార్తె అంటే.. సొంత ఆస్తి కాదు!

- ఆమె పెళ్లికి అంగీకారం తెలపండి
- తల్లిదండ్రుల పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: మైనర్‌గా ఉన్న తన కుమార్తెను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ తల్లిదండ్రులు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 'కుమార్తె అంటే మీ ఇంట్లో వస్తువు కాదు. ఆమె పెళ్లికి అంగీకారం తెలపడం తల్లిదండ్రులుగా మీ బాధ్యత'అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. 'పెళ్లి సమయానికి మీ కుమార్తె మైనర్ కాదు. ఆ పెళ్లి మీకు ఇష్టం లేనందున, వివాహమాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కేసు పెట్టారు. అతడిని జైలులో పెట్టే అధికారం మీకు లేదు. మీ కుమార్తె మీ సొంత ఆస్తి కాదు, ఆమె ఓ వస్తువు కాదు. ఆ పెళ్లికి ఆమోదం తెలపండి'అని సూచించింది. పెళ్లయిన సమయానికి తమ కుమార్తె మైనర్ అని తెలిపేందుకు తల్లిదండ్రులు చూపిన పుట్టిన తేదీ సర్టిఫికెట్ తదితరాల్లో తేడాలున్నాయని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. తమ కుమార్తెను నిర్బంధించి, లైంగిక దాడి చేశాడంటూ మహిద్‌పూర్‌కు చెందిన పిటిషనర్ దంపతులు వేసిన కేసును ఆగస్ట్ 16న మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్ కొట్టివేసింది. ఆమె మేజరేననీ, ఇష్ట ప్రకారమే పెళ్లి చేసుకుందని స్పష్టం చేసింది.

నేను రైతు బిడ్డను.. నేను కార్మికుడి బిడ్డను

రాజ్యసభలో జగదీప్ ధన్‌ఖడ్, ఖర్గే మధ్య మాటల యుద్ధం

- అవిశ్వాస తీర్మానంపై చర్చకు 14 రోజులు ఆగలేకపోతున్నారు
- నిత్యం నాపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారు
- విపక్షాలపై మండిపడ్డ ధన్‌ఖడ్
- బీజేపీ ఎంపీలను ధన్‌ఖడ్ మాపైకి ఉసిగొల్పుతున్నారు: ఖర్గే ఆగ్రహం
- సభ సోమవారానికి వాయిదా





శుక్రవారం రాజ్యసభలో చైర్మన్ ధన్‌ఖడ్‌ను ఉద్దేశించి విమర్శలు చేస్తున్న మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసుపై శుక్రవారం ఎగువ సభలో తీవ్రస్థాయిలో రగడ జరిగింది. అధికార, విపక్ష సభ్యులు పరస్పరం దూషించుకున్నారు. చైర్మన్ ధన్‌ఖడ్, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మధ్య మాటల యుద్ధం కొనసాగింది. తీవ్ర గందరగోళం నెలకొనడంతో సభ మొదటి గంటలోనే సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం సభ ప్రారంభం కాగానే తొలుత బీజేపీ సభ్యుడు రాధా మోహన్ దాస్ మాట్లాడారు. ధన్‌ఖడ్‌పై విపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసు అంశాన్ని లేవనెత్తారు. నిబంధనల ప్రకారం నోటీసు ఇచ్చిన తర్వాత 14 రోజులకు సభలో చర్చ జరగాల్సి ఉండగా, ప్రతిపక్షాలు నిత్యం ధన్‌ఖడ్‌పై అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నాయని తప్పుపట్టారు. దేశాన్ని, ఉపరాష్ట్రపతి పదవిని, రైతులను కించపరుస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రపతులను, ఉప రాష్ట్రపతులను అగౌరవపర్చిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్‌ను పదేపదే కించపర్చేవారని చెప్పారు. బాబూ రాజేంద్ర ప్రసాద్ మృతిచెందితే అంత్యక్రియలు ఢిల్లీలో జరగనివ్వలేదని, మృత దేహాన్ని పట్నాకు తరలించారని గుర్తుచేశారు. అంత్యక్రియలకు హాజరు కాకూడదని అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను నెహ్రూ కోరారని తెలిపారు. అయినప్పటికీ నెహ్రూ మాట లెక్కచేయకుండా పట్నాలో బాబూ రాజేంద్ర ప్రసాద్ అంత్యక్రియలకు రాధాకృష్ణన్ హాజరయ్యారని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగంపై ఏమాత్రం విశ్వాసం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కేవలం ఒక్క కుటుంబాన్ని కాపాడుకోవడానికే ఆరాటపడుతోందని బీజేపీ ఎంపీ కిరణ్ చౌదరి విమర్శించారు. రైతు బిడ్డ అయిన ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ఈ సమయంలో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. మాట్లాడేందుకు కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీకి ధన్‌ఖడ్ అవకాశం ఇచ్చారు. ధన్‌ఖడ్ రైతు బిడ్డ అయితే, ఖర్గే కార్మికుడి బిడ్డ అని చెప్పారు. దళితుడైన ఖర్గేకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో ధన్‌ఖడ్ తీవ్రంగా స్పందించారు. ''నేను రైతు బిడ్డను. ఎవరికీ భయపడను. దేశం కోసం ప్రాణత్యాగమైనా చేస్తా. మీకు(విపక్షాలు) నిత్యం ఒక్కటే పని. నన్ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. నాపై దుష్ప్రచారం చేస్తుండడం వ్యక్తిగతంగ బాధ కలిగిస్తోంది. ఇప్పటికే చాలా సహించా. నాపై అవిశ్వాస తీర్మానం పెట్టే హక్కుమీకు ఉండొచ్చు. నోటీసు ఇచ్చాక చర్చ జరగడానికి 14 రోజులు వేచి చూడాలి. కానీ, వేచి చూసే ఓపిక మీకు లేదు. రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు'' అని ధన్‌ఖడ్ మండిపడ్డారు. దీనిపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

మీ గొప్పలు వినడానికి రాలేదు: ఖర్గే

ఆ తర్వాత ఖర్గే మాట్లాడారు. ''మీరు(ధన్‌ఖడ్) బీజేపీ సభ్యులను ప్రోత్సహిస్తున్నారు. మాపై ఉసిగొల్పుతున్నారు. నేను కార్మికుడి బిడ్డను. జీవితంలో మీకంటే ఎక్కువ సవాళ్లు ఎదుర్కొన్నా. మీరు మా పార్టీని, మా పార్టీ నాయకులను కించపరుస్తున్నారు. మీరు చెప్పుకొనే గొప్పలు వినడానికి మేము ఇక్కడికి రాలేదు. చర్చ కోసం వచ్చాం. మీరు పక్షపాతం చూపుతున్నారు. విపక్షాల గొంతును నొక్కేస్తున్నారు. రాజ్యసభ కార్యకలాపాలకు మీరే పెద్ద అడ్డంకి. మరో పదోన్నతి సాధించుకోవడానికి ప్రభుత్వ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు'' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు. సభ సజావుగా సాగాలన్నదే తన ఉద్దేశమని, సభలో గొడవలకు తావులేకుండా సభ్యులంతా సహకరించాలని కోరారు. దీనిపై చర్చించడానికి తన చాంబర్‌కు రావాలని ఖర్గేతో పాటు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను ధన్‌ఖడ్ ఆహ్వానించారు. దీనిపై ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. మిమ్మల్ని ఎలా గౌరవించాలి? మీరు నన్ను దారుణంగా కించపర్చారు అంటూ మండిపడ్డారు.


ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

కీవ్: ఉక్రెయిన్ సైనిక మౌలిక వసతులను ధ్వంసం చేయడమే లక్ష్యంగా రష్యా శుక్రవారం 93 క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులతో దాడికి తెగబడింది. ఏకంగా 200 డ్రోన్లతో దాడి చేసింది. గత మూడేళ్లలో రష్యా ఒకే రోజులో చేసిన అతిపెద్ద దాడుల్లో ఇది కూడా ఒకటని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. రష్యా నుంచి దూసుకొచ్చిన వాటిల్లో 11క్రూయిజ్ క్షిపణులుసహా 81 మిస్సైళ్లను పశ్చిమదేశాలు అందించిన ఎఫ్–16 యుద్ధవిమానాల సాయంతో నేలమట్టంచేశామని ఆయన చెప్పారు. ''పెనుదాడులతో ఉక్రేనియన్లను భయపెడుతున్న రష్యాకు, పుతిన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం ఐక్యంగా నిలబడాల్సిన తరుణమిది. పెద్ద ప్రతిఘటన, భారీ ఎదురుదాడితో రష్యా ఉగ్రచర్యలను అడ్డుకుందాం'' అని జెలెన్‌స్కీ తన టెలిగ్రామ్ ఛానెల్ ద్వారా చెప్పారు. ఉక్రెయిన్ రక్షణ పారిశ్రామికవాడల్లో ఇంధన, శక్తి వనరులు, మౌలిక వసతులను ధ్వంసంచేయడమే లక్ష్యంగా తమ సైన్యం దాడులు చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. తమ బొగ్గు విద్యుత్ ఉత్పత్తికేంద్రాలకు భారీ నష్టం వాటిల్లిందని ఉక్రెయిన్‌లోని అతి పెద్ద ప్రైవేట్ విద్యుత్ సంస్థ డీటెక్ తెలిపింది. ఉక్రెయిన్‌లో ఆయుధాలు, మందుగుండు సామగ్రి తయారీని నిలువరించడమే లక్ష్యంగా ఇంధన వ్యవస్థలపైనే రష్యా తరచూ దాడులుచేస్తుండటం తెల్సిందే. నవంబర్ 28న చేసిన ఇలాంటి దాడిలో 200 మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. నాటి నష్టం కారణంగా 10 లక్షల కుటుంబాలు అంధకారంలో ఉండిపోయాయి.

రాజ్యాంగం కన్నా... అధికారమే మీకు మిన్న

కాంగ్రెస్‌పై లోక్‌సభలో రాజ్‌నాథ్ ధ్వజం

- రాజ్యాంగ విలువలకే పాతర వేయజూశారు
- రాజ్యాంగాన్ని అవమానించిన వారే ఇప్పుడు దాని ప్రతిని చేత పట్టుకు తిరుగుతున్నారు
- రాహుల్ తదితరులపై రక్షణ మంత్రి విసుర్లు
- లోక్‌సభలో అధికార, విపక్షాల వాగ్వాదం



న్యూఢిల్లీ: రాజ్యాంగంపై కొంతకాలంగా అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఆరోపణలు, ప్రత్యారోపణల యుద్ధం పార్లమెంటుకు చేరింది. ఈ విషయమై ఇరుపక్షాల మధ్య మధ్య వాడీవేడి చర్చకు శుక్రవారం లోక్‌సభ వేదికైంది. రాజ్యాంగ వజ్రోత్సవాలపై లోక్‌సభ చేపట్టిన రెండు రోజుల చర్చను ప్రభుత్వం తరఫున రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ అధికారం పైనే యావ అని, అందుకోసం రాజ్యాంగానికి నిరంతరం తూట్లు పొడుస్తూ వచ్చిందని మండిపడ్డారు. ''కాంగ్రెస్ తన దశాబ్దాల పాలనలో వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని ఎన్నడూ సహించింది లేదు. రాజ్యాంగ విలువలకు, స్ఫూర్తికి పాతర వేసేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. అలాంటి పార్టీ నోట రాజ్యాంగ పరిరక్షణ వంటి మాటలు వినడం ఎబ్బెట్టుగా ఉంది'' అంటూ ఎత్తిపొడిచారు. ఆయన విమర్శలకు కాంగ్రెస్ తరఫున నూతన ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా గట్టిగా కౌంటరిచ్చారు. అసలు దేశానికి రాజ్యాంగం కల్పించిన రక్షణ కవచానికి నిలువునా తూట్లు పొడిచిందే మోదీ ప్రభుత్వమంటూ దుయ్యబట్టారు. జడ్జి బి.హెచ్.లోయా మృతిపై తృణమూల్ సభ్యురాలు మహువా మొయిత్రా చేసిన వ్యాఖ్యలు మంటలు రేపాయి. సభలో ఆద్యంతం ఇరుపక్షాల నడుమ మాటల తూటాలు పేలాయి. నినాదాలు, అరుపులు, కేకల నడుమ రెండుసార్లు సభ వాయిదా పడింది.

జేబులో పెట్టుకోవడమే నైజం

రాజ్యాంగాన్ని దేశానికి తానిచ్చిన కానుకగా కాంగ్రెస్ భ్రమ పడుతోందని రాజ్‌నాథ్ అన్నారు. రాజ్యాంగ కూర్పులో, అది ప్రవచించిన విలువల పరిరక్షణలో విపక్షాలు, కాంగ్రెసేతర నేతల పాత్రను నిరంతరం తక్కువ చేసి చూపేందుకే ప్రయత్నించిందని ఆరోపించారు. 1944లోనే పలువురు దేశభక్త నేతలు స్వతంత్ర హిందుస్తాన్ రాజ్యాంగాన్ని రూపొందించారని నాటి హిందూ మహాసభ ప్రయత్నాలను ఉద్దేశించి రక్షణ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ''పండిట్ మదన్‌మోహన్ మాలవీయ, లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, వీర సావర్కార్ వంటి నాయకులు రాజ్యాంగ పరిషత్తులో సభ్యులు కాకపోయినా వారి భావజాలాలు రాజ్యాంగంలో అడుగడుగునా ప్రతిఫలిస్తున్నాయి. వారంతా నిత్య స్మరణీయులు. అలాంటి మహా నాయకులపైనా మతవాద ముద్ర వేసిన చరిత్ర కాంగ్రెస్‌ది! రాజ్యాంగాన్ని హైజాక్ చేసేందుకు, దాని రూపురేఖలనే మార్చేసేందుకు దుస్సాహసం చేసి పార్టీ ఏదన్నా ఉందంటే అది కాంగ్రెసే. ఆ లక్ష్యంతోనే తన దశాబ్దాల పాలనలో రాజ్యాంగాన్ని చీటికీమాటికీ సవరిస్తూ వచ్చింది. ఎమర్జెన్సీ విధింపు మొదలుకుని విపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టడం, ఇందిర సర్కారు నిరంకుశత్వానికి అడ్డుకట్ట వేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులనే పక్కకు తప్పించడం దాకా ఇందుకు ఉదాహరణలన్నో! భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు తూట్లు పొడిచేందుకు కాంగ్రెస్‌కు చెందిన తొలి ప్రధాని నెహ్రూ కూడా ఏకంగా రాజ్యాంగాన్నే సవరించారు! అలాంటి పార్టీకి చెందిన వాళ్లు నేడు రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతుండటం హాస్యాస్పదం'' అంటూ దుయ్యబట్టారు. ''పైగా విపక్ష నేతలు కొందరు కొద్ది రోజులుగా రాజ్యాంగ ప్రతిని జేబుల్లో పెట్టుకుని తిరుగుతున్నారు. చిన్నతనం నుంచీ వారు నేర్చుకున్నది అదే. ఎందుకంటే వారి కుటుంబ పెద్దలు కొన్ని తరాలుగా రాజ్యాంగాన్ని తమ జేబుల్లో పెట్టుకున్న వైనాన్ని చూస్తూ పెరిగారు మరి!'' అంటూ రాహుల్‌గాంధీ తదితరులను ఉద్దేశించి రాజ్‌నాథ్ ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలను ఎన్డీఏ సభ్యులు చప్పట్లతో అభినందించగా విపక్ష సభ్యులు 'సిగ్గు, సిగ్గు' అంటూ నిరసించారు.

సంవిధాన్.. సంఘ్ కా విధాన్ కాదు

ఆ విషయం ప్రధాని మోదీ అర్థం చేసుకోవడం లేదు

- రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు సాగించారు
- లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా ధ్వజం
- బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించే ధైర్యం ఉందా?

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం అంటే సంఘ్ విధానం కాదన్న సంగతి ప్రధాని నరేంద్ర మోదీ అర్థం చేసుకోవడం లేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. భారత్ కా సంవిధాన్ సంఘ్ కా విధాన్ కాదని తేల్చిచెప్పారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఆమె శుక్రవారం లోక్‌సభలో 32 నిమిషాలపాటు హిందీ భాషలో మాట్లాడారు. రాజ్యాంగంపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. బీజేపీపై విరుచుకుపడ్డారు. న్యాయం, ఐక్యత, భావప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగం ఒక రక్షణ కవచమని ఉద్ఘాటించారు. అలాంటి మహోన్నత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా ఎన్నో ప్రయత్నాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రియాంక ఇంకా ఏం మాట్లాడారంటే...

నెహ్రూ పాత్రను ఎవరూ చెరిపేయలేరు

''ఆర్థిక న్యాయానికి, రైతులకు, పేదలకు భూములు పంపిణీకి చేయడానికి మన రాజ్యాంగమే పునాది వేసింది. బీజేపీ నేతలు తరచుగా జవహర్‌లాల్ నెహ్రూను వేలెత్తి చూపుతున్నారు. వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి నెహ్రూపై నిందలు వేస్తున్నారు. దేశం కోసం మీరేం చేస్తున్నారో చెప్పకుండా నెహ్రూను విమర్శిస్తే లాభం లేదు.



గతంలో అది జరిగింది, ఇది జరిగింది అని బీజేపీ సభ్యుల విమర్శలు చేస్తున్నారు. రాజకీయ న్యాయం గురించి మాట్లాడుతున్నారు. డబ్బు బలంతో ప్రభుత్వాలను పడగొట్టింది మీరు కాదా? మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్‌లో రాజ్యాంగం అమలు కాలేదు. బీజేపీకి నిజంగా ధైర్యం ఉంటే బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలి. అప్పుడు అసలు నిజం ఏమిటో బయటపడుతుంది.

మోదీకి ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేదు

గతంలో రాజులు మారువేషాల్లో ప్రజల్లోకి వెళ్లేవారని చదువుకున్నాం. తమ పనితీరు గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో రాజులు స్వయంగా తెలుసుకొనేవారట. తమపై ప్రజల ఆరోపణలు ఏమిటో గ్రహించేవారట. ఇప్పటి రాజు(నరేంద్ర మోదీ) వేషాలు మార్చేయడంలో ఆరితేరిపోయారు. కానీ, ప్రజల్లో వెళ్లే ధైర్యం గానీ, ఆరోపణలు వినే ధైర్యం గానీ ఆయనకు లేదు. మన ప్రధానమంత్రి రాజ్యాంగం ఎదుట తలవంచి నమస్కరించారు. రాజ్యాంగానికి నుదురు తాకించారు. సంభాల్, హత్రాస్, మణిపూర్‌లో న్యాయం కోసం ఆక్రోశించినప్పుడు ఆయన మనసు చలించలేదు. ఆయన నుదుటిపై చిన్న ముడత కూడా పడలేదు. రాజ్యాంగాన్ని మోదీ అర్థం చేసుకోలేదు.

భయాన్ని వ్యాప్తి చేసినవారు భయంతో బతుకుతున్నారు

దేశంలో కుల గణన జరగాలన్నదే ప్రజల అభిమతం. అందుకోసం వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన ప్రారంభించాలి. కేవలం ఒక్క బిలియనీర్(గౌతమ్ అదానీ) కోసం దేశ ప్రజలంతా కష్టాలు అనుభవించాలా? దేశంలో అసమానతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. బ్రిటిష్ పాలనలో ఉన్నట్లుగానే నేడు భయం అంతటా ఆవహించింది. స్వాతంత్య్రం కోసం పోరాడిన గాంధీజీ భావజాలం కలిగిన వ్యక్తులు ఒక వైపు, బ్రిటిషర్లతో అంటకాగిన భావజాలం కలిగిన వ్యక్తులు మరోవైపు ఉన్నారు. భయానికి ఒక లక్షణం ఉంది. భయాన్ని వ్యాప్తి చేసే వారే ఆదే భయానికి బాధితులవుతారు. ఇది సహజ న్యాయం. నేడు దేశంలో భయాన్ని వ్యాప్తి చేసినవారు అదే భయంతో బతుకున్నారు. చర్చకు, విమర్శకు భయపడుతున్నారు'' అని ప్రియాంక అన్నారు.

ట్రంప్ వచ్చాక మనోళ్లు ఇంటికే..

18 వేల మందికి డిపోర్టేషన్ ముప్పు

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నవారికి డిపోర్టేషన్ ముప్పు పొంచి ఉంది. తమ దేశంలో చట్టవిరుద్ధంగా తిష్టవేసిన వారిని వెనక్కి పంపిస్తానని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. అక్రమ వలసదార్లపై కఠినంగా వ్యవహరించక తప్పదని తేల్చిచెప్పారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డిపోర్టేషన్‌కు శ్రీకారం చుట్టబోతున్నానని స్పష్టంచేశారు. ట్రంప్ వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో అక్రమంగా ఉంటున్నవారిని గణాంకాలను యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) క్రోడీకరించింది. ఇందుకోసం వివిధ రాష్ట్రాల నుంచి వివరాలు సేకరించింది. దాదాపు 10.50 లక్షల మంది చట్టవిరుద్ధంగా ఉంటున్నట్లు తేల్చింది. వీరిలో 17,940 వేల మంది భారతీయులు ఉన్నట్లు గుర్తించింది. వీరంతా అధికారికంగా లెక్కతేలినవారే. ఈ మేరకు గత నెలలో ఒక జాబితా సైతం సిద్ధం చేసింది. నూతన అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి వచ్చాక వీరంతా స్వదేశాలకు వెళ్లిపోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం బలవంతంగానైనా వెనక్కి పంపిస్తుందని అంటున్నారు.

జస్టిస్ చంద్రచూడ్‌పై మొయిత్రా విమర్శలు

లోక్‌సభలో తీవ్ర కలకలం

- జడ్జి మృతి ప్రస్తావనపై రగడ
- చర్యలు తప్పవన్న రిజిజు



న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌ను లక్ష్యంగా చేసుకుని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా శుక్రవారం లోక్‌సభలో చేసిన విమర్శలు తీవ్ర కలకలం రేపాయి. అంతేగాక విమర్శించే గొంతుకలన్నింటినీ నొక్కేయడమే లక్ష్యంగా దేశంలో సర్వ వ్యవస్థలనూ మోదీ సర్కారు చెరబడుతోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసే క్రమంలో ప్రత్యేక కోర్టు జడ్జి బి.హెచ్.లోయా మృతి అంశాన్ని ఆమె ప్రస్తావించడంతో సభలో దుమారం రేగింది. లోయాది అత్యంత అకాల మరణమన్న మొయిత్రా వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ''అత్యంత తీవ్ర ఆరోపణలివి. దీనిపై కచ్చితంగా తగిన రీతిలో పార్లమెంటరీ చర్యలుంటాయి. మొయిత్రా తప్పించుకోలేరు'' అన్నారు. మొయిత్రా ప్రసంగ రికార్డులను స్పీకర్ ఓం బిర్లా పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. ఆమెపై మరోసారి అనర్హత వేటు తప్పదంటున్నారు. నోటుకు ప్రశ్నల ఆరోపణలపై గత లోక్‌సభలో మొయిత్రా సభ్యత్వం రద్దవడం తెలిసిందే. లోయా 2014లో రాజకీయంగా సొహ్రాబుద్దీన్ షేక్ హత్య కేసును విచారిస్తుండగా వివాదాస్పద రీతిలో మృతి చెందారు. దాని వెనక బీజేపీ హస్తముందనేలా విపక్షాలు ఆరోపించాయి. ఆయనది సహజ మరణమేనని సుప్రీంకోర్టు నిర్ధారించింది.

సీజేఐలపై తీవ్ర వ్యాఖ్యలు

రాజ్యాంగాన్ని హత్య చేసేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోందంటూ మొయిత్రా తన ప్రసంగంలో విరుచుకుపడ్డారు. మోదీ సర్కారు చేతిలో వెయ్యి కత్తి పోట్లతో రాజ్యాంగం నిలువెల్లా రక్తమోడుతోందన్నారు. ఈడీ, సీబీఐ వంటివాటిని చివరికి వసూళ్ల సంస్థలుగా, ఈసీ వంటివాటిని జేబు సంస్థలుగా మార్చుకుందని ఆక్షేపించారు. ఆ క్రమంలో జస్టిస్ చంద్రచూడ్ పేరు ప్రస్తావించకుండానే ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. ''న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానాల్లో కొందరు దేశ అత్యున్నత న్యాయస్థానాల సమగ్రతను, స్వతంత్ర ప్రతిపత్తిని పణంగా పెట్టేందుకు ప్రయత్నించారు! తాజా మాజీ సీజేఐ హయాంలో కొందరికే బెయిళ్లు మంజూరయ్యాయి. ఒక వర్గం వారికి మొండిచెయ్యి చూపారు. వారికి ఆయన అక్షరమాలలో స్థానమే లేకుండా పోయింది. ఆ మాజీ సీజేఐ ప్రవర్తన చివరికి సుప్రీంకోర్టు రాజకీయ ప్రతిపక్షంలా వ్యవహరించరాదనే వ్యాఖ్యలకూ కారణమైంది. విపక్ష పాత్ర పోషించేందుకు మేమున్నాం. అందుకు సుప్రీంకోర్టు అవసరమేమీ లేదు'' అన్నారు. జస్టిస్ చంద్రచూడ్ తన నివాసంలో గణేశ్ చతుర్థి వేడుకలకు ప్రధాని మోదీని ఆహ్వానించడాన్ని మొయిత్రా తీవ్రంగా తప్పుబట్టారు. మోదీని దేవునితో పోలుస్తూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ''న్యాయమూర్తులు తీర్పులు రాసేందుకు తర్కం, చట్టం, రాజ్యాంగానికి బదులు ఇలా దేవునితో ప్రైవేట్ సంభాషణలపై ఆధారపడే పరిస్థితిని బహుశా మన రాజ్యాంగ నిర్మాతలు ఎన్నడూ ఊహించి కూడా ఉండరు. మాజీ, ప్రస్తుత సీజేఐలందరికీ నాదో సలహా. ఇలా దేవుడి నుంచి సూచనలు అందుకోవడం మానేయండి. వ్యక్తిగత వేడుకలకు రాజకీయ పెద్దలను అతిథులుగా పిలిచి వాటిని టీవీ సర్కస్‌లుగా మార్చకండి. మీ ఏకైక అతిథి రాజ్యాంగమే. అది మాత్రమే మీ ఇంట్లో కొలువుదీరే దేవుడు కావాలి. మీరు మిగల్చబోయే వ్యక్తిగత వారసత్వం గురించి ఆందోళన పడటం ఆపేయండి. ఎందుకంటే అలా వ్యక్తిగత గుర్తింపు కోరుకునే వాళ్లు ఎలాంటి వారసత్వమూ మిగల్చలేరు. మౌలిక హక్కులను పరిరక్షించేవారు మాత్రమే గుర్తుండిపోతారు'' అన్నారు.

బెంగాల్ మాజీ మంత్రికి భవిష్యత్ బెయిల్!

వినూత్న ఉత్తర్వులిచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం ఒక బెయిల్ కేసులో వినూత్న పోకడకు శ్రీకారం చుట్టింది. బెయిల్‌కు ముందు పూర్తిచేయాల్సిన విధివిధానాలపై కిందికోర్టు సంతృప్తి చెందితే వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటోతేదీ లోపు మాజీ మంత్రి పార్థా ఛటర్జీని షరతులతో కూడిన బెయిల్‌పై విడుదల చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం కింది కోర్టుకు వినూత్న ఉత్తర్వులు జారీచేసింది. సాధారణంగా ఏదైనా కేసులో ఇరువైపులా వాదనలు విన్నాక బెయిల్‌కు అవకాశం ఉంటే వెంటనే బెయిల్ ఉత్తర్వులు ఇస్తారుగానీ ఇలా కొద్దిరోజుల తర్వాతనే బెయిల్‌పై విడుదల చేయాలని సూచించడం ఇదే తొలిసారి అని కోర్టు వర్గాలు పేర్కొన్నాయి. నగదుకు ఉద్యోగం కుంభకోణంలో 2022 జూలై 22న అరెస్టయి ఇన్నాళ్లుగా విచారణ ఖైదీగా జైళ్లో గడుపుతున్న పశ్చిమబెంగాల్ మాజీ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ బహిష్కృత నేత పార్థా ఛటర్జీ బెయిల్ కేసులో విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వినూత్న ఉత్తర్వులు జారీచేసింది. ''జనవరి రెండో, మూడో, నాలుగో వారా ల్లో సాక్షుల వాంగ్మూలాలతోపాటు నేరాభి యోగాల సమర్పణ ట్రయల్ కోర్టులో పూ ర్తవ్వాలి. ఇదంతా పూర్తయితే ఫిబ్రవరి ఒకటి లోపు ఆయనకు బెయిల్ ఇవ్వండి'' అని జడ్జి సూర్యకాంత్ తీర్పు రాశారు. భవిష్యత్ బెయిల్‌గా అభివర్ణించిన ఈ కేసులో ఫిబ్రవరిలో కూడా ఆయన బెయిల్‌పై బయటికొచ్చే అవకాశం లేకపోవడం గమనార్హం . ఈ కుంభకోణానికి సంబంధించిన వేరే కేసుల్లోనూ ఆయనను ఈడీ, సీబీఐ అరెస్ట్ చేయడమే ఇందుకు కారణం. మనీలాండరింగ్, ఇతర అక్ర మాల కోణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)లు పలు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి విచారిస్తున్నాయి. ఈయనపై ఈడీ 3, సీబీఐ 5 కేసులను నమోదు చేశాయి. అరెస్ట్ సమయంలో మంత్రిగా ఉన్నా రన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న ఛటర్జీ తరఫు లాయర్ల వాదనను కోర్టు తప్పుబట్టింది. ''ఎవరైనా నిందితుడు మంత్రి వంటి పదవులు, హోదాల్లో ఉన్నంత మాత్రాన వారికి బెయిల్ ఇచ్చే విషయంలో ప్రత్యేక మినహాయింపులు అంటూ ఏమీ ఉండవు'' అని ధర్మాసనం స్పష్టంచేసింది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 14 । డిసెంబర్ । 2024



..భవన నిర్మాణానికి మరిన్ని నిధులు

ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటినరి పాలన భవనానికి మరో రూ.21 కోట్లు కేటాయించారు. అత్యాధునిక వసతులతో భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. -8లో



పోష్క ఫలం..

అమెరికా స్ట్రాబెర్రీ, న్యూజిలాండ్ కివీ, వాషింగ్టన్ ఆపిల్, కాలిఫోర్నియా ద్రాక్ష, ఆస్ట్రేలియా ఆరెంజ్, థాయ్‌లాండ్ డ్రాగన్ ఇలా విదేశీ పండ్లు నగర మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
29.0/18.0

వాతావరణం

నగరంలో శనివారం ఉదయం పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నేడు కోకాపేటకు సీఎం రాక



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

మణికొండ: కోకాపేటలో శనివారం కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ (కురుమ ఆత్మగౌరవ భవనం)ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కురుమలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌లు కోరారు. శుక్రవారం వారు బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మధ్య స్తంభాలను తొలగిస్తాం

- వచ్చే ఫిబ్రవరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం
- జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, సీపీడీసీఎల్ అధికారుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఆయా విభాగాల అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: రోడ్ల మధ్యలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు శుక్రవారం మింట్ కంపౌండ్‌లో విద్యుత్, జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమావేశమయ్యారు. ఎల్బీనగర్ నుంచి వనస్థలిపురం వరకు, షేక్‌పేట నుంచి గచ్చిబౌలి వరకు, హబ్సిగూడ నుంచి బోడుప్పల్ వరకు రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆయా మార్గాల్లో రోడ్డుకు ఇరువైపులా అనేక విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీకి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు సృష్టిస్తుండటమే కాకుండా అనేక మంది మృత్యువాతకు కారణమవుతున్నాయి. మూడు విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి, రోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాలను గుర్తించాలని నిర్ణయించారు. వచ్చే ఫిబ్రవరి నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ అదనపు కమిషనర్ శివకుమార్, ట్రాఫిక్ పోలీసు అధికారి పి.విశ్వప్రసాద్, విద్యుత్ సంస్థల సీజీఎంలు, ఎస్ఈలు, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎం సీ అధికారులు పాల్గొన్నారు.

లింగంపల్లి నుంచి ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: లింగంపల్లి నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు కొత్తగా పుష్పక్ బస్సులను ప్రవేశపెట్టినట్లు ఆర్టీసీ ఈడీ వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. లింగంపల్లి నుంచి ఆల్విన్ కాలనీ మీదుగా హఫీజ్ పేట్.., కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు రాకపోకలు సాగించనున్నాయి. ఉదయం 5.45 గంటలకు లింగంపల్లి నుంచి మొదటి బస్సు బయలుదేరుతుంది. చివరి బస్సు రాత్రి 10.45 గంటలకు బయలుదేరుతుంది. ఎయిర్‌పోర్టు నుంచి లింగంపల్లికి మొదటి బస్సు ఉదయం 7.30కు, ఆఖరి బస్సు రాత్రి 11.30 గంటలకు బయలుదేరుతుంది.



'ఫ్యూచర్' సిటీకి సూపర్ పవర్!

రెప్పపాటు కూడా కరెంట్ పోనివ్వం

ఫీడర్లకు సెన్సార్లు.. నిరంతర మానిటరింగ్

- సిటీలో 30, శివారులో 40 శాతం డిమాండ్
- 'సాక్షి'తో సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ



సాక్షి, సిటీబ్యూరో: 'మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాటు చేయదలిచిన ఫ్యూచర్/ఫోర్త్‌సిటీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఫార్మా, ఐటీ అనుబంధ సంస్థలు అనేకం ఇక్కడికి రాబోతున్నాయి. ఇక్కడ నెలకొల్పే పరిశ్రమలకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని నిర్ణయించాం. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయబోతున్నాం. లైన్లను విస్తరించడంతో పాటు డిమాండ్ తట్టుకునే విధంగా కొత్త సబ్‌స్టేషన్లు, అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయబోతున్నాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. శుక్రవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన ఏమన్నారంటే..

ఏటా 30 నుంచి 40 శాతం గ్రోత్..

సాధారణంగా ప్రతి ఏటా విద్యుత్ గ్రోత్ రేటు ఏడు శాతం నమోదవుతుంది. కానీ ఈసారి డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. రూరల్ ఏరియాలో గ్రోత్ రేట్ ఏడు శాతం ఉంటే, నగరంలో 30 శాతం, నగర శివారు మున్సిపాలిటీల్లో 40 శాతం ఉన్నట్లు గుర్తించాం. భవిష్యత్‌ను డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ మేరకు పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించాం. ఆ మేరకు 2027లో రావాల్సిన కొత్త సబ్ స్టేషన్లను 2025లోనే తీసుకురాబోతున్నాం. డిస్కం పరిధిలో మొత్తం 164 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలిచాం. వీటిలో ఒక్క గ్రేటర్ జిల్లాల్లోనే 88 సబ్‌స్టేషన్లు రాబోతున్నాయి. బంజారాహిల్స్ సర్కిల్‌లో 5, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో 9, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో 9, సికింద్రాబాద్ సర్కిల్లో 13, రాజేంద్రనగర్ సర్కిల్లో 13 చొప్పున, సైబర్‌సిటీ సర్కిల్‌లో 6, సరూర్‌నగర్ సర్కిల్ 5, వికారాబాద్‌లో 10, మేడ్చల్‌లో 18 చొప్పున కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నాం.

ఫీడర్లకు సెన్సార్లు...

నగరంలోని అన్ని సబ్‌స్టేషన్లకు మల్టీపుల్ ఇన్ కమింగ్, అవుట్‌గోయింగ్ లైన్లు ఏర్పాటు చేయబోతున్నాం. ఔటర్ చుట్టూ విద్యుత్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తాం. 400 కేవీ సబ్‌స్టేషన్లు అనుసంధానిస్తున్నాం. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం జీహెచ్‌ఎంసీ సహా అన్ని ప్రధాన ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్ల ఫీడర్లకు సెన్సార్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తి కరెంట్ సరఫరా నిలిచిపోతే.. వెంటనే ఆ సమాచారం సంబంధిత అధికారులకు చేరే విధంగా సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ అంబులెన్స్‌లను కూడా వీటికి అనుసంధానిస్తున్నాం. ఇప్పటికే టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. మరో మూడు మాసాల్లో ఈ పనులు పూర్తి కానున్నాయి. కనురెప్పపాటు కూడా కరెంట్ పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు పీటీఆర్‌ల సామర్థ్యం కూడా పెంచాం. దెబ్బతిన్న డీటీఆర్‌లను మార్చుతున్నాం. సెక్షన్లవారీగా ఎల్సీలు తీసుకుని, లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతున్నాం.

మణికొండలోనే అత్యధికం..

మణికొండ, అయ్యప్ప సొసైటీల్లో అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇక్కడ ఉన్న భవనాలపై స్పష్టత లేకపోవడంతో డిమాండ్‌పై స్పష్టత కొరవడింది. దీంతో విద్యుత్ వినియోగం ఊహకందడం లేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఉన్న సర్కిళ్ల పరిధిలో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయబోతున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సహా దెబ్బతిన్న డీటీఆర్‌ల స్థానంలో కొత్తవి అమర్చడం వంటి వాటిని గుర్తించి, పునరుద్ధరించడం తదితర పనులు చేపట్టాం. అలాగే.. రాజేంద్రనగర్‌లో 160, సైబర్ సిటీలో 151, మేడ్చల్‌లో 160, హబ్సిగూడలో 857, బంజారాహిల్స్‌లో 89, సికింద్రాబాద్‌లో 148, హైదరాబాద్ సెంట్రల్‌లో 250, హైదరాబాద్ సౌత్‌లో 90, సరూర్‌నగర్‌లో 12, సంగారెడ్డిలో 563 అదనపు డీటీఆర్‌లు ఏర్పాటు చేయబోతున్నాం. ప్రమాదాల నివారణ సహా ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్స్ తొలగింపునకు జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాం.

'సారథి' సా..గుతోంది

సాంకేతిక సమస్యలతో అమలులో జాప్యం

- లైసెన్సుల డేటా బదిలీల్లో అడ్డంకులు
- రవాణా శాఖ నుంచి ఎన్ఐసీకి బదిలీ
- ఆర్టీఏ 'సారథి' సేవలు ఫిబ్రవరికి వాయిదా
- పొరుగు రాష్ట్రాల్లో 18 రకాల సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వాహన్ సారథి'కి సాంకేతిక చిక్కులు తలెత్తాయి. మొదటి దశలో డ్రైవింగ్ లైసెన్సులన్నింటినీ 'సారథి' పరిధిలోకి తెచ్చి రెండో దశలో వాహనాల వివరాలను 'వాహన్'లో నిక్షిప్తం చేయాలని భావించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి సికింద్రాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో 'సారథి'ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు. కాగా.. డేటా బదిలీలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం నెలకొంది. మొదట సికింద్రాబాద్‌లో ప్రారంభించి అనంతరం గ్రేటర్ నగరంలోని అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో 'సారథి' సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. సాంకేతికంగా తలెత్తిన సమస్యల కారణంగా దీని అమలుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా రవాణా సేవలన్నింటిపై ఏకీకృత విధానాన్ని అమలు చేసేందుకు ప్రవేశపెట్టిన 'వాహన్ సారథి' పలు రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతోంది. మన రాష్ట్రంలో మాత్రం ఆదిలోనే హంసపాదు అన్నచందంగా సాంకేతిక అడ్డంకులను ఎదుర్కొంటోంది.

ఎన్ఐసీకు బదిలీ ఆగింది..

డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ల డేటాను రవాణా శాఖ నుంచి కేంద్ర రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ పోర్టల్‌లోకి బదిలీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణ రవాణా శాఖలో సీఎంఎస్ సంస్థ సాంకేతిక సేవలను అందజేస్తోంది. సీఎంఎస్ నుంచి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ద్వారా బదిలీ ప్రక్రియను చేపట్టారు. మొదట సికింద్రాబాద్‌లో ప్రారంభించి అనంతరం అన్ని కార్యాలయాల డేటాను బదిలీ చేయాల్సి ఉంది. కాగా.. ప్రాథమిక దశలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. సీఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రైవింగ్ లైసెన్సుల డేటా రవాణా శాఖతో టూ టైర్, త్రీటైర్ టెక్నాలజీల్లో ఉంది. ఈ రెండు రకాల సాంకేతిక వ్యవస్థల కంటే ముందు మొదట్లో రవాణా అధికారులే లైసెన్స్ పత్రాలను అందజేసేవారు. ఇలా వివిధ రకాలుగా ఉండడంతో సీఎంఎస్ నుంచి ఎన్ఐసీకి బదిలీ కావడం కష్టంగా మారింది. టూ టైర్ టెక్నాలజీలో ఉన్న డాటాను త్రీటైర్‌కు మార్చి ఆ తర్వాత ఎన్ఐసీకి బదిలీ చేయాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో జాప్యం చోటుచేసుకుంటోంది. కొన్ని డ్రైవింగ్ లైసెన్సుల వివరాలు సీఎంఎస్‌లో లేకపోవడం కూడా సమస్యగా మారింది.

18 రకాల సేవలు 'సీమ్‌లెస్'...

- వాహన్ సారథి అమల్లోకి వస్తే వాహనదారులు కనీసం 18 రకాల సేవలను ఇంటి నుంచి పొందేందుకు అవకాశం ఉంటుంది. లెర్నింగ్ లైసెన్సులకు ఆన్‌లైన్‌లో ఇంటి వద్దనే పరీక్షలకు హాజరు కావచ్చు.అనంతరం సర్టిఫికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలను బదిలీ చేసేందుకు ఎలాంటి నిరభ్యంతర పత్రాలను అందజేయాల్సిన అవసరం ఉండదు. రాష్ట్రాల మధ్య కూడా రవాణా శాఖ పౌరసేవల బదిలీ సులభతరమవుతుంది.
- కర్ణాటక, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వాహన్ సారథి విజయవంతంగా అమలవుతోంది.
- డ్రైవింగ్ లైసెన్సుల గడువు పొడిగింపు, లెర్నింగ్ లైసెన్సుల్లో అదనపు కేటగిరీ, డూప్లికేట్ సర్టిఫికెట్‌లు, పన్ను చెల్లింపులు వంటి సులభంగా చేయవచ్చు.
- ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'సారథి' సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేస్తుండగా, ఢిల్లీ కేంద్రంగా 'వాహన్'ను అమలు చేయనున్నారు. దీనికి మరికొంత సమయం పట్టవచ్చు.
- సాంకేతిక సమస్యలన్నింటినీ అధిగమిస్తే వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి సారథిని అమలుచేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



అనుమానంతో ఉన్మాదిలా మారాడు

భార్య, కుమారుడిని చంపి తానూ ఆత్మహత్య

- బేగంబజార్ తోపుఖానాలో దారుణం
- మృతులు ముగ్గురు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు..

గన్‌ఫౌండ్రీ: ఇల్లాలిపై అనుమానంతో ఉన్మాదిగా మారాడు ఓ భర్త. కట్టుకున్న భార్యను, కన్న కొడుకును చంపేసి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎండీ సిరాజ్ (38), ఏలియా (35) దంపతులు. వీరికి నాలుగు, మూడేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఆజాన్, హైజాన్ ఉన్నారు. ఈ కుటుంబం కొన్నేళ్ల క్రితం ఉపాధిని వెతుక్కుంటూ నగరానికి వలస వచ్చింది. బేగంబజార్‌లోని తోపుఖాన్‌పేటలో అద్దె ఇంటిలో ఉంటోంది. సిరాజ్ సమీపంలోని ఓ గాజుల దుకాణంలో పని చేస్తున్నాడు. అతడు తన భార్య ప్రవర్తనపై కొన్నాళ్లుగా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవ శుక్రవారం తెల్లవారుజాము సుమారు 4 గంటల దాకా కొనసాగింది. ఈ నేపథ్యంలోనే కోపోద్రిక్తుడైన సిరాజ్ ఇంట్లోని కత్తితో భార్య ఏలియా గొంతు కోసి చంపేశాడు. అనంతరం చిన్న కుమారుడు హైజాన్ (3) గొంతు నులిమి హత్య చేశాడు. తమ్ముడిని తండ్రి చంపుతున్న దృశ్యాన్ని చూసిన పెద్ద కుమారుడు ఆజాన్ ప్రాణ భయంతో అరుస్తూ బయటకు పారిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి ఇంటి లోపలికి వెళ్లి చూడగా సిరాజ్ అప్పటికే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే వారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. బేగంబజార్ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



ప్రాణాలను దక్కించుకున్న ఆజాన్

ఉత్తరప్రదేశ్‌లోని మృతుడి బంధువులకు సమాచారం అందించారు. తన భార్య ఏలియా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో సిరాజ్ ఇంతటి దారుణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి వీరు స్వగ్రామానికి వెళ్లి వస్తుంటారని, ఇటీవలే అక్కడికి వెళ్లి వచ్చినట్లు చెప్పారు. ఘటనా స్థలంలో సిరాజ్ రాసిన సూసైడ్ నోట్ లభించిందని, మృతదేహాలను ఉత్తరప్రదేశ్‌లోని తమ గ్రామానికి తరలించాలని సిరాజ్ అందులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.



చిన్న కుమారుడు హైజాన్‌తో ఏలియా (ఫైల్)

మీ ఇంటికి సర్వే సిబ్బంది రాలేదా?



- గ్రేటర్ నగరంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇప్పటి వరకు మీ ఇంటికి సిబ్బంది ఎవరూ రాలేదా? సర్వే సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు మీరు ఇంట్లో లేరా?..
- ఇలా.. కారణమేదైనా ఇప్పటి వరకు సర్వే జరగని కుటుంబాల వారు కాల్‌సెంటర్‌కు ఫోన్ చేస్తే సర్వే చేసేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది.
- సర్వే జరగని కుటుంబాల వారు జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్ (నంబర్ 040–21 11 11 11)కు ఫోన్ చేసి వివరాలివ్వాల్సిందిగా పేర్కొంది.

అయితే.. జీహెచ్‌ఎంసీ కాల్ సెంటర్‌కు ఫోన్ చేయండి

- సర్వే జరగని కుటుంబాలకు సూచన

సర్వే సిబ్బంది గుర్తించిన కుటుంబాలు.. జోన్ల వారీగా

జోన్	కుటుంబాలు
ఎల్బీనగర్	3,84,217
చార్మినార్	3,95,595
ఖైరతాబాద్	3,26,815
శేరిలింగంపలి	3,41,269
కూకట్‌పల్లి	4,84,852
సికింద్రాబాద్	3,99,153
కంటోన్మెంట్	50,346
మొత్తం	23,82,247

సాక్షి, సిటీబ్యూరో: సమగ్ర సర్వేకు ముందు జీహెచ్‌ఎంసీ పరిధిలో 28,32,490 కుటుంబాలుంటాయని జీహెచ్‌ఎంసీ అధికారులు అంచనా వేశారు. ఇళ్ల సర్వే చేశాక 23,82,247 కుటుంబాలున్నట్లు లెక్క తేల్చారు. దాదాపు 20.11 లక్షల కుటుంబాలను సర్వే చేశారు. సర్వేలో భాగంగా తమ కుటుంబానికి సంబంధించి వృత్తి, ఉద్యోగాలు ఇతరత్రా వివరాలిచ్చేందుకు కొందరు నిరాకరించారు. వివరాలివ్వమని కచ్చితంగా చెప్పారు. సర్వే కోసం వెళ్లిన సమయంలో వివిధ పనుల నిమిత్తం ఊళ్లకు వెళ్లినవారు, ఉద్యోగాలకు వెళ్లిన వారు తమ వివరాలు ఇవ్వలేకపోయారు. కారణాలేవైనా, ఇప్పటి వరకు సర్వే జరగని కుటుంబాల వారు జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్‌ను సంప్రదించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ పేర్కొంది. సర్వే సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపింది. జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లోనూ ఈ అంశాన్ని పేర్కొంది.

'దేవనార్' సేవలు శ్లాఘనీయం

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

సనత్‌నగర్: బేగంపేట మయూరి మార్గ్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్‌లో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం ఎ– బ్లాక్‌ను శుక్రవారం కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశిష్ట ఔన్నత్యాన్ని, వ్యక్తిత్వాన్ని కొనియాడారు. అంబేడ్కర్ దళితుల చీకటి బతుకులకు వెలుగులు ఏవిధంగా పంచారో అదే మాదిరిగా దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాయిబాబా గౌడ్ అంధులకు విద్యనందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. దేవనార్ సంస్థకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారం అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలోని అంధ చిన్నారులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించి యోగక్షేమాలు, వారి అభ్యాసనా విధానం గురించి సంభాషించారు. కార్యక్రమంలో దేవనార్ వ్యవస్థాపకుడు సాయిబాబా గౌడ్, సెక్రటరీ జ్యోతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దేవనార్ ఫౌండేషన్‌లో నూతన పాఠశాల భవనం ఎ-బ్లాక్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

హైదరాబాద్‌లోనే ఎక్కువ..!

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు

- ఆ తర్వాత మేడ్చల్ జిల్లాలో..

సాక్షి, సిటీబ్యూరో: సొంత స్థలాలున్నవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం సంబంధిత అధికారులు ఆ పనుల్లో పడ్డారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోకొచ్చే జిల్లాలు నాలుగున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కూడా ఉంది. ఈ కార్యక్రమం తొలిదశలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఏ జిల్లా పరిధిలో ఎందరున్నారో ప్రజాపాలన కార్యక్రమాల్లో అందిన దరఖాస్తుల్ని లెక్కలు తీశారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారు హైదరాబాద్ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నారు. ఈ జిల్లా పరిధిలోనే జీహెచ్‌ఎంసీ వార్డులు కూడా ఎక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు. తర్వాత మేడ్చల్ జిల్లాలోని వారు ఎక్కువమంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల వంతున జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెరసి 84 వేల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల కింద ఆర్థికసాయం అందనుంది.

సర్వేయర్లకు సహకారం..

దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో గుర్తించి 'ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్'లో వివరాలు నమోదు చేసేందుకు సర్వేయర్లుగా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు ఆయా జిల్లాల సిబ్బంది పని చేయనున్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల చిరునామాను గుర్తించేందుకు జిల్లాల సిబ్బందికి, కంటోన్మెంట్ సిబ్బందికీ జీహెచ్‌ఎంసీ సర్కిళ్లలో పనిచేస్తున్న యూసీడీ, ఎంటమాలజీ విభాగాల సిబ్బందితోపాటు రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు,తదితరులు సహకరించనున్నారు. మొబైల్ యాప్‌లో వివరాల నమోదు, అప్‌డేషన్‌ల కోసం జీహెచ్‌ఎంసీ జోనల్లస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

జిల్లాల వారీగా వివరాలిలా ఉన్నాయి

జిల్లా	వార్డులు	దరఖాస్తులు
హైదరాబాద్	84	5,00,822
రంగారెడ్డి	25	1,96,940
మేడ్చల్	38	3,22,064
సంగారెడ్డి	3	20,711
కంటోన్మెంట్	8	29,909
మొత్తం	158	10,70,446



'ఫినోమ్' సేవలు భేష్

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్: దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఏఐ కంపెనీ ఫినోమ్ తమ ఉత్పత్తుల ద్వారా మంచి సేవలు అందిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మాదాపూర్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో శుక్రవారం 'ఇంటెలిజెంట్ టాలెంట్ ఎక్స్‌పీరియన్స్ కాన్ఫరెన్స్'ను ఆయన నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే దశాబ్దంలో తెలంగాణను ఒన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. ఏఐ డ్రైవర్లు, సెమీకండక్టర్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై దృష్టి సారించాలన్నారు. ఫినోమ్ కంపెనీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని వన్ బిలియన్ డాలర్ కంపెనీగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన దాదాపు 400 మంది హెచ్‌ఆర్ లీడర్లు పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధికి కృషిచేస్తున్న హెచ్‌ఆర్‌లకు అభినందనలు తెలియజేశారు. ఐటీ రంగంలో ప్రధాన భాగస్వాములు వారే అన్నారు. ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ భారతీయ క్రీడా దిగ్గజం అభినవ్ బింద్రా మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల ద్వారా ప్రముఖ సంస్థల నుంచి ప్రతిభావంతులను వెలికితీయవచ్చన్నారు. ఫినోమ్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు మహే బాయిరెడ్డి, హరిబాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

యాక్సిస్ బ్యాంక్‌పై ఆరోపణలు నిరాధారం

సాక్షి, సిటీబ్యూరో: పరితోష్ ఉపాధ్యాయ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు యాక్సిస్ బ్యాంక్ అధికారులు మోసం చేసినట్లు ఈ నెల 10వ తేదీన మీడియాలో వచ్చిన వార్తలు నిరాధారమైనవని సంస్థ వైస్ ప్రెసిడెంట్ శృతి ముదప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు సదరు లావాదేవీలన్నీ పరితోష్‌కు పూర్తిగా తెలిసే నిర్వహించబడ్డాయని, యాక్సిస్ బ్యాంక్ అధికారులపై ఆయన ఆరోపణలు తప్పని అన్నారు. యాక్సిస్ బ్యాంక్ ఎల్లప్పుడూ కస్టమర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తుందని, విచారణకు సంబంధించి ఈ విషయం సాధ్యమైనంత త్వరగా పరిష్కారమవ్వడంలో అధికారులకు పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. బ్యాంకుపై గానీ, అధికారులపై గానీ తప్పుడు సమాచారం లేదా ప్రతిష్టకు భంగం కలిగించే ప్రకటనలు చేస్తే చట్టపరంగా తగుచర్యలు తీసుకునేందుకు బ్యాంకుకు పూర్తి హక్కులు ఉంటాయని పేర్కొన్నారు.

టీజీబీపాస్ సర్వర్‌డౌన్

- హెచ్‌ఎండీఏలో నిలిచిపోయిన కార్యకలాపాలు
- దరఖాస్తుదారుల పడిగాపులు
- తరచుగా తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు
- వీకెండ్స్‌లోనే సర్వర్‌డౌన్స్ ఎక్కువ...

సాక్షి, సిటీబ్యూరో: లేఅవుట్‌లు, భవనాల నిర్మాణాలు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అనుమతుల కోసం అందుబాటులోకి తెచ్చిన సింగిల్‌విండో సాంకేతిక వ్యవస్థ టీజీబీపాస్ శుక్రవారం మరోసారి స్తంభించింది. దీంతో హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలో పనులు నిలిచిపోయాయి. ఫైళ్ల పరిష్కారంలో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంది. వివిధ రకాల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుదారులు గంటల తరబడి పడిగాపులు కాశారు. టీజీబీపాస్‌లో సర్వర్‌డౌన్ కావడం వల్లనే సమస్యలు తలెత్తినట్లు అధికారులు చెప్పారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచే హెచ్‌ఎండీఏ కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు ఇళ్లు, భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అవసరమైన డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేయలేకపోయారు. పలు కన్సల్టెన్సీల్లో సైతం పనులు నిలిచిపోయాయి. టీజీబీపాస్‌లో తరచుగా సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సకాలంలో ఫైళ్లను పరిష్కరించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏలోని ఘట్కేసర్, మేడ్చల్-1, మేడ్చల్-2, శంషాబాద్, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2 జోన్‌లలో ప్రతి రోజు వివిధ రకాల అనుమతుల కోసం సుమారు 100 వరకు వస్తాయి. ప్రణాళికా విభాగంలోని వివిధ స్థాయిల్లో ఈ ఫైళ్లను పరిశీలించి, చివరకు కమిషనర్ ఆమోదంతో అనుమతులు అందజేస్తారు. ఫైళ్ల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు ఇటీవల హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ కోసం చర్యలు చేపట్టారు. 10 రోజుల్లోనే దరఖాస్తుదారులకు అనుమతులను అందజేసేవిధంగా చర్యలు తీసుకున్నారు. కానీ తరచుగా తలెత్తే ఇలాంటి సాంకేతిక సమస్యల వల్ల ఆటంకం కలిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీకెండ్స్‌లోనే ఇలాంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని పలువురు దరఖాస్తుదారులు చెప్పారు. టీజీబీపాస్ సర్వర్‌డౌన్ కావడంతో హెచ్‌ఎండీఏతో పాటు జీహెచ్‌ఎంసీ, నగర శివార్లలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో కూడా అనుమతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది.

సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి: ఎస్టీయూ

సాక్షి, సిటీబ్యూరో: సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇఫ్తేఖరుద్దీన్, ప్రధాన కార్యదర్శి పి.రామసుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆలియా స్కూల్ వద్ద గత నాలుగు రోజులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఎస్టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపింది. సమగ్ర శిక్షా యూనియన్‌కు రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీసును పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల ప్రయోజనాలను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం, రాష్ట్ర కార్యదర్శి జి.షద్రక్, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రషీద్, చార్మినార్ మండల అధ్యక్షుడు మహమ్మద్ ఇషాక్, తిరుమలగిరి అధ్యక్షుడు ఆశీర్వాదం, నాంపల్లి ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొని మద్దతు తెలుపుతున్న ఎస్టీయూ ప్రతినిధులు

ఈ నెల 16 వరకు ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలోని ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరానికి ఈ నెల 16 వరకు ప్రవేశాలు నిర్వహించనున్నట్లు సీపీజీఈటీ-2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శుక్రవారం తెలిపారు. వర్సిటీల పరిధిలోని ప్రవేటు కాలేజీల్లో 150 ఎంఈడీ, 15 ఎంపీఈడీ సీట్లు మిగిలినట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆయా కాలేజీల్లో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్-ఎమ్‌జేసీఈటీ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వేదికగా ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, రహదారి భద్రత-ప్రాముఖ్యత తదితర అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు సెషన్స్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్, నిబంధనలపై సూచనలు ఇవ్వడంతోపాటు క్యాంపస్ అవుట్‌డోర్‌లో నిర్వహించిన ప్రాక్టికల్ ట్రాఫిక్ పోలీస్ డ్రిల్‌లో విద్యార్థులు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ ప్రాక్టీస్‌లను నేర్చుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కన్సల్టెంట్, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో అన్నపూర్ణ గాడేపల్లి విద్యార్థులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ముఫకంజా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహిపాల్ సింగ్ రావత్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డా. మొహమ్మద్ వికార్ మొహియుద్దీన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్‌బీవీ లక్ష్మీ కుమారి, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఓయూ పాలన భవన నిర్మాణానికి మరిన్ని నిధులు


ఓయూలో నిర్మాణ దశలో ఉన్న నూతన పాలన భవనం

- మరో రూ.21 కోట్ల కేటాయింపు
- వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తయ్యే అవకాశం
- అత్యాధునిక వసతులతో భవన నిర్మాణం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెంటినరి పాలన భవనానికి మరో రూ.21 కోట్లు కేటాయించారు. యూనివర్సిటీలో 2017లో జరిగిన ఓయూ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నూతన పాలన భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. గత వీసీ ప్రొ.రవీందర్ హయాంలో రూ.36.2 కోట్లను కేటాయించి హబ్సిగూడ వైపు ఐఐసీటీ ఎదురుగా.. ఓయూకు చెందిన 20 ఎకరాల భూమిలో నిర్మాణ పనులు చేపట్టారు. తెలంగాణ సచివాలయం నమూనాతో విశాలంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనానికి నిధులు సరిపోక రెండు నెలలుగా పనులు నిలిపివేశారు. కొత్త వీసీ ప్రొ.కుమార్ వచ్చాక తిరిగి పనులను ప్రారంభించారు. ఓయూకు మరో మణిహారంగా నిర్మితమవుతున్న నూతన పాలన భవనం వచ్చే ఏడాది ఆగస్టు వరకు పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు. అధునాతన సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న పాలన భవనంలో సమావేశ మందిరాలు, వీసీ, రిజిస్ట్రార్ చాంబర్లతో పాటు ఇతర అధికారులకు 70 కార్యాలయాలకు గదులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. భవనానికి ముందు వెనుక ప్రవేశ ద్వారాలతో పాటు గాలి, వెలుతురు వచ్చేలా నిర్మిస్తున్న భవనంలో ఇంటర్నెట్, వైఫై, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక అవసరాలను ఏర్పాటు చేశారు.

బంగారం చోరీ కేసు ఇంటి దొంగల పనేనా?

దోమలగూడ: దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరవింద్ నగర్ కాలనీలో గురువారం జరిగిన బంగారం చోరీ ఘటన ఇంటి దొంగల పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు బాధితులు రంజిత్ గౌరాయ్ సోదరుడు ఇంద్రజిత్ గౌరాయ్‌ను పోలీసులు విచారించినట్లు సమాచారం. రంజిత్ గౌరాయ్ వద్ద పనిచేసే 40 మంది కార్మికుల వివరాలతో పాటు కాల్ డేటాను పోలీసులు సేకరించారు. బంగారం దొంగతనం చేసిన వారిని పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

రాజేంద్రనగర్: ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో విసుగు చెందిన ఓ యువకుడు పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే పైనుండి దూకేందుకు ప్రయత్నించగా..అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రక్షించి రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూరంపల్లి ప్రాంతానికి చెందిన యువకుడు విద్యాభ్యాసం పూర్తి కావడంతో ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. ఎక్కడా ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం సాయంత్రం ఆరాంఘర్ చౌరస్తా వద్ద పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే పైకి వచ్చాడు. పై నుండి దూకేందుకు ప్రయత్నించగా అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు చంద్రమౌళి గమనించి యువకుడిని రక్షించాడు. రాజేంద్రనగర్ పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజావాణిలో సర్పంచ్‌ల సంఘం వినతి



లక్డీకాపూల్: పెండింగ్ బిల్లులు విడుదల చేయించి తమను ఆదుకోవాలని కోరుతూ సర్పంచ్‌లు ప్రజావాణిని ఆశ్రయించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్యలు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో తమ పెండింగ్ బిల్లులపై చర్చ జరిపి తమకు రావాల్సిన బకాయిల నిధుల్ని మంజూరు చేయించాలని కోరారు. కాగా ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 441 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 110 అర్జీలు వచ్చాయి. ఇక మైనార్టీ సంక్షేమ శాఖకు సంబంధించి 76, రెవెన్యూ పరమైన సమస్యలపైన 71, విద్యుత్ శాఖ 57, హోంశాఖ 23, ఇతర శాఖలకు సంబంధించి104 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

నాలాలో పడి బాలుడి గల్లంతు


ముజమ్మిల్(ఫైల్)

సనత్‌నగర్: సోదరుడితో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నాలాలో పడిన ఓ బాలుడు గల్లంతయ్యాడు. బాలుడి ఆచూకీ కోసం డీఆర్‌ఎఫ్, పోలీసు బృందాలు తీవ్రంగా గాలిస్తున్నా జాడ దొరకలేదు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం వివరాల ఇలా ఉన్నాయి. ఫతేనగర్ ఇందిరాగాంధీపురం బస్తీకి చెందిన మోసిన్ కుమారులు సయ్యద్ ముజమ్మిల్ (7), చిన్న కుమారుడు ఇనాం (4)లు శుక్రవారం సమీపంలోని ఖబరస్థాన్ వద్ద ఆడుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో ముజమ్మిల్ ప్రమాదవశాత్తు నాలాలో పడిపోయాడు. ఈ విషయాన్ని ఇనాం కుటుంబ సభ్యులకు తెల్పడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, బస్తీవాసులు హుటాహుటిన నాలా వద్దకు వెళ్లి ముజమ్మిల్ కోసం గాలింపు చేపట్టారు. సనత్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు, డీఆర్‌ఎఫ్ బృందాలు కలిసి నాలాలో దిగి బాలుడి కోసం గాలించాయి. నాలాలో ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి బాలుడు బేగంపేట బ్రాహ్మణవాడి వైపు కొట్టుకుపోయి ఉంటాడని భావిస్తున్నారు. బ్రాహ్మణవాడీ వైపు కూడా డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించినప్పటికీ బాలుడి జాడ తెలియలేదు. ఇదిలా ఉండగా బాలుడి పడిన ప్రాంతం, కొట్టుకుపోయినట్టుగా భావిస్తున్న ప్రాంతం బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని, ఆ మేరకు అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వనున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

జస్టిస్ బి.చంద్రకుమార్


మహాసభలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కార్మికుల శ్రమతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో టీయూసీఐ 5వ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ భారత దేశ పురోభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర గణనీయంగా ఉందన్నారు. దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతిలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఎనలేనిది అన్నారు. దొంతి రాజేష్ కన్నా మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్, తుడుం అనిల్ కుమార్, చార్లెస్ చార్జీ, మరీద్ ప్రసాద్‌బాబు, బసవలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తులపై కేసు

సాక్షి, సిటీబ్యూరో: విజిలెన్స్, జీహెచ్‌ఎంసీ అధికారుల పేరుతో ప్రకటనల ఫీజులు ఇవ్వాలంటూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సైనిక్‌పురి ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఇలా వసూళ్లకు పాల్పడుతున్నట్లు కొందరు షాపుల యజమానులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో జీహెచ్‌ఎంసీలోని ప్రకటనల విభాగం అధికారులు రంగంలోకి దిగారు. ఈమేరకు అక్రమంగా వసూళ్లు చేస్తున్న వారిని పట్టుకుని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని, కేసు నమోదు చేయించామని అడిషనల్ కమిషనర్ వేణు గోపాల్ రెడ్డి తెలిపారు.

జలమండలి కార్మికుల సమస్యలపై పోరాడుతాం

- గుర్తింపు ఎన్నికల్లో కామ్‌గార్ యూనియన్‌ను గెలిపించండి
- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి చంద్రశేఖర్


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ, కామ్‌గార్ యూనియన్ నేతలు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జలమండలి కామ్‌గార్ యూనియన్‌ను గెలిపిస్తే వాటర్‌బోర్డు కార్మికులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచక జలమండలి కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆయన అన్నారు. జలమండలి కార్యాలయంలో శుక్రవారం యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామ్‌గార్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జలమండలి కామ్‌గార్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి అధ్యక్షత వహించగా ఆర్.డి. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఐఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక సంఘం అని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని, కామ్‌గార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డికి వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ మేమెంతో చేశామని గొప్పలు చెప్పుకునే బీఆర్‌టీయూ నేతలు జలమండలి కార్మికులకు ఏం చేశారో బహిరంగంగా చెప్పాలని సవాల్ విసిరారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ నేతగా ప్రభుత్వానికి, జలమండలి కార్మికులకు వారధిగా ఉంటానని చెప్పారు. ఎన్నికలలో బాణం గుర్తుకు తమ ఓటువేసి గెలిపించాలని కోరారు. సమ్మేళనంలో యూనియన్ నాయకులు భూమయ్య, రామరాజు, సీత్యా, రమణారెడ్డి, ప్రసాద్, గణేష్ రావ్, జంగారెడ్డి, బిల్డర్ శ్రీనివాస్, రఘునాథ్, నరేందర్, సురేష్ తదితరులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాణాలనే పణంగా పెట్టిన
అమరజీవి పొట్టి శ్రీరాములు


పొట్టి శ్రీరాముల ఫొటోతో ఆర్‌పీ, రేవతి తదితరులు

పంజగుట్ట: తెలుగువారి ఆత్మగౌరవం కాపాడేందుకు తన ప్రాణాలనే తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి డిసెంబర్ 15వ తేదీన తెలుగువారు అందరూ ఆయనను స్మరించుకోవాలని జబర్దస్త్ నటుడు కిరాక్ ఆర్‌పీ కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొట్టి శ్రీరాములు మనవరాళ్లు ప్రొఫెసర్ రేవతి, అనురాధలతో కలిసి ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరవలేనిదని వారు పేర్కొన్నారు. హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించాలని, కులాంతర వివాహాలు, వితంతు వివాహాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన మహనీయుడని అన్నారు. మహాత్మా గాంధీనే స్వయంగా పొట్టి శ్రీరాములు లాంటివారు మరో 10 మంది ఉంటే సంవత్సరంలో స్వాతంత్ర్యం తీసుకువచ్చే వారిని అని మెచ్చుకున్నారని గుర్తుచేశారు. గాంధీజీ స్ఫూర్తితో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సార్లు జైలుకు వెళ్లారని, ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో కూడా పాల్గొన్నారని తెలిపారు. తన తాత చనిపోయే సమయంలో తాను పక్కనే ఉన్నానని, అప్పుడు చిన్న పిల్లనని అనురాధ చెప్పారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి తదితరులు

బంజారాహిల్స్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హెచ్ అండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంయుక్తంగా శుక్రవారం విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకేరెడ్డి, హెచ్ అండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అన్షుజైన్, సీనియర్ మేనేజర్ మిథిలేష్ గగ్లానీ ఇతర సిబ్బంది, వాలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సుమారుగా 700 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, విశ్వవిద్యాలయ అధికారులు ఆనంద్‌పవార్, పల్లవి కాబ్డే, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధికారి మత్స్యవర్ధన్‌రెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్స్, డీన్స్, అన్ని శాఖల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సెరోనా'తో మహిళలకు మెరుగైన సేవలు


'సెరోనా' ప్రారంభ కార్యక్రమంలో ఒలివ్ హాస్పిటల్స్ వైద్యులు

బంజారాహిల్స్: మహిళల సమగ్ర, ప్రత్యేక ఆరోగ్య అవసరాలను తీర్చడంతో పాటు ముఖ్యంగా మాతృ, జనన ఆరోగ్య మెరుగైన సేవలను అందించడం కోసమే 'సెరోనా' ప్రారంభించడం జరిగిందని ఒలివ్ హాస్పిటల్స్ డైరెక్టర్ ఎం.యూనస్ ఫారూఖీ తెలిపారు. ఒలివ్ హాస్పిటల్‌లో శుక్రవారం సెరోనా హెల్త్‌కేర్ ఆఫ్ విమెన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనస్ ఫారూఖీ మాట్లాడుతూ నిపుణుల సహాయంతో మహిళలకు ప్రత్యేక సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో తాము కట్టుబడి పనిచేస్తున్నామన్నారు.

లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయొద్దు

ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు


అవగాహనలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. పంజగుట్టలోని టైగర్ కాపిటల్ ఉద్యోగులకు శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శంకర్‌రాజు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ సూచనల మేరకు డీసీపీ రాహుల్‌హెగ్డే పర్యవేక్షణలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలు శిక్షను కూడా విధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టైగర్ కాపిటల్ ఇన్‌చార్జి సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నామనే భరోసా..!

• కూడళ్లు, జనసంచారం వద్ద గంటపాటు విజుబుల్ పోలీసింగ్ • కాలనీలు, బస్తీల్లో నిరంతర నిఘా • విజుబుల్ పోలీసింగ్‌పై స్థానికుల హర్షం


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో విజుబుల్ పోలీసింగ్ చేస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు గంటపాటు విజుబుల్ పోలీసింగ్‌ను నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, జనసంచారం ఉండే ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, కాలనీలు, బస్తీల్లో గంటపాటు పోలీసులు తిరుగుతూ ప్రజలకు మేమున్నామనే భరోసాను కల్పిస్తున్నారు. గతవారం రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. విజుబుల్ పోలీసింగ్ ద్వారా అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడమే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పెట్టుకున్నారు. గొడవలు, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వారికి ఈ విజుబుల్ పోలీసింగ్ ద్వారా కొంత భయం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అనుమానాస్పద కదలికలు ఉంటే వారిని తనిఖీలు చేస్తున్నారు. ప్రజలు ధైర్యంగా ఉండేవిధంగా ఈ చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు కాలనీల్లో, బస్తీల్లో గంట పాటు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి తిరుగుతుండడం వల్ల స్థానికులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజుబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు అన్ని ప్రాంతాల్లో తిరుగుతుండడంతో పోకిరీలు కూడా జంకుతున్నారు. ప్రతిరోజూ గంటపాటు ప్రత్యేకంగా నిఘా పెడుతున్న పోలీసులు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే గుర్తించగలిగే రీతిలో ఏర్పాట్లు చేసుకున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఫిలింనగర్, మధురానగర్, బోరబండ, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉదయం పోలీసులు గంటపాటు అన్ని ప్రాంతాల్లో నిఘా పెడుతున్నారు. ఒకవైపు విధులు నిర్వర్తిస్తూనే ఇంకోవైపు విజుబుల్ పోలీసింగ్‌పై దృష్టిపెట్టారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండడంతో ఈ పద్ధతికి స్థానికుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

సన్మానం


అయ్యప్ప భక్తులతో లక్ష్మణ్‌గౌడ్

రహమత్‌నగర్: కాలినడకన శబరిమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని బోరబండకు చేరుకున్న అయ్యప్ప భక్తులకు స్థానిక హరిహర పుత్ర అయ్యప్ప దేవాలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ బోరబండ డివిజన్ నుంచి 30 మంది అయ్యప్ప భక్తులు అక్టోబర్ 31 ఇక్కడి నుంచి బయలుదేరి డిసెంబర్ 28న స్వామివారిని దర్శనం చేసకున్నారన్నారు. వారందరూ స్వామి కృప వల్ల క్షేమంగా రావడం ఆనందంగా ఉందన్నారు.

వాహన దొంగ అరెస్టు


నిందితుడు కిరణ్‌కుమార్

బంజారాహిల్స్: వాహనాన్ని దొంగతనం చేసి ఆ తరువాత దర్జాగా తిరుగుతున్న ఓ దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ నందినగర్‌కు చెందిన కిరణ్‌కుమార్ గత సెప్టెంబర్‌లో శ్రీకృష్ణానగర్‌లో దొంగిలించిన బైక్‌పై దర్జాగా తిరుగుతుండగా జూబ్లీహిల్స్ పోలీసులు ఐటీఎంఎస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది సహకారంతో అతని కదలికలపై నిఘా ఉంచారు. ఆ మేరకు శుక్రవారం బంజారాహిల్స్ ప్రాంతంలో సంచరిస్తుండగా కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అలరించిన 'టైనీ టాట్స్'..

• కమ్యూనిటీ హెల్పర్ల వేషధారణలో సందడి • వృత్తి సేవలను తెలియజేసిన చిన్నారులు


కమ్యూనిటీ హెల్పర్ల వేషధారణలో చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్ ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు 'టైనీ టాట్స్' పేరిట కమ్యూనిటీ హెల్పర్స్ పాత్రలో సందడి చేశారు. సమాజానికి సేవలందిస్తున్న పలు వృత్తులకు చెందిన వారి వేషధారణలతో పాటు వారు ఉపయోగించే వస్తువులు, కిట్స్, వారు అందించే సేవలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించిన తీరు అబ్బురపరిచారు. టీచర్లు, డాక్టర్లు, లాయర్లు, ఫ్యాషన్ డిజైనర్లు, ఇంజినీర్లు, నర్సులు, కార్పెంటర్స్, పోలీస్, పోస్ట్‌మెన్ తదితర కమ్యూనిటీ హెల్పర్ల సేవలను తెలియజేశారు. చిన్నతనంలో అనుభవపూర్వకంగా కమ్యూనిటీ హెల్పర్ల సేవలను తెలియజేయడం ద్వారా వారిలో ఆయా వృత్తిపరమైన విషయాలు, వారి సేవలు, విధుల గురించి త్వరితగతిన అవగతమవుతాయని ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు.

జీఎంకు కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి వినతి


జీఎం హరిశంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: డివిజన్‌లో మంచినీటి, సీవరేజీ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి జీఎం హరిశంకర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని చాలా బస్తీల్లో లోప్రెషర్ సమస్య ఉందని ఆయన వాపోయారు. అలాగే మంచినీరు వేళాపాళ లేకుండా సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. డీజీఎం వాహబ్, మేనేజర్ రాజేందర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటం లేకపోవడం బాధాకరం


సమావేశంలో మాట్లాడుతున్న రంగసాయి భట్

పంజగుట్ట: అధికారుల నిర్లక్ష్యంతో జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో మన రాష్ట్ర శకటం ప్రదర్శించలేకపోతున్నామని, ఇది ఎంతో బాధాకరమని సమాచార పౌరసంబంధాల శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సి.హెచ్.రంగ సాయిభట్ అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించి శకటాలు తయారు చేయించి వచ్చే సంవత్సరమైనా తెలంగాణ శకటం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలంగాణ తరపున ఢిల్లీలో శకటం ప్రదర్శించేందుకు తయారు చేయాలని సమాచార,పౌరసంబంధాల శాఖ కళాకారులకు పిలుపునివ్వగా కాటన్ మార్కెట్, నాగోబా జాతర, చిందు భాగవతం, రామప్ప దేవాలయం,బుద్ధవనం, డైమండ్ మైన్స్ మొత్తం 6శకటాలు రూపొందించారని తెలిపారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వంలోని ఎక్స్‌పర్ట్ కమిటీకి ఈ శకటాలు చూపించగా అందులో రామప్ప దేవాలయం శకటం నచ్చి మరిన్ని మెరుగులు దిద్దాలని సూచించినట్లు తెలిపారు. కానీ అధికారుల అలసత్వం వల్ల వారు సూచించిన మెరుగులు దిద్దలేకపోవడంతో మన రాష్ట్ర శకటం ప్రదర్శించే అవకాశం కోల్పోయిందని తెలిపారు. దీనికి కారణమైన అధికారులపై ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈసారి 29 రాష్ట్రాల్లో 24 రాష్ట్రాల శకటాలే ప్రదర్శిస్తున్నారని ఐదు రాష్ట్రాల శకటాలు ప్రదర్శనకు నోచుకోలేదన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ జంపాల రాజేష్, రఘురామ్ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు సంఘటనలో ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ లంబాగుండు ప్రాంతానికి చెందిన రోషన్ (12) ఈనెల 12న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోకవడంతో వారి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే బస్తీకి చెందిన మరో బాలుడు లట్టు (10) సైతం ఈనెల 12 నుంచి కనిపించకుండాపోవడంతో అతని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మ. దురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది.వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఉన్న విజ్ఞానజ్యోతి పబ్లిక్‌స్కూల్ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని కొందరు మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూసి 108కి తెలియజేయగా, సిబ్బంది వచ్చి పరిశీలించగా అతను అప్పటికే మృతి చెందినట్టుగా నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు దాదాపు 55 ఏళ్లు ఉంటాయని, పచ్చచొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని మధురానగర్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేత


రోడ్డునెంబర్-12లోని మోర్ మెడికల్స్ పక్కన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ప్రధాన రహదారిలో మోర్ మెడికల్స్‌తో పాటు పక్కనే ఉన్న మరో ఐదు దుకాణాలను సెట్‌బ్యాక్‌లో అక్రమంగా నిర్మించగా వాటిని శుక్రవారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సంయుక్తంగా కూల్చివేశారు. ఈ దుకాణాలన్నీ అక్రమంగా నిర్మించడమే కాకుండా వీటికి పార్కింగ్ స్థలం కూడా లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు ఆపుతున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో అధికారులు ముందు భాగం పూర్తిగా కూల్చివేశారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల కొత్త పేచీ..

అయితే ఈ కూల్చివేతలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా రావాల్సి ఉండగా కోర్టు కేసు ఉందంటూ అధికారులు తప్పించుకుని సిబ్బందిని పంపించారు. వాస్తవానికి ఈ దుకాణాలన్నీ అక్రమేనని స్పష్టంగా తెలుస్తున్నా, వీరితో లాలూచీ పడ్డ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పూర్తిగా కూల్చకుండా అడ్డుపుల్లలు వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్-18 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ నిర్వాకంతో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తుండగా, ఇప్పటికే నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని పోలీసులు చెబుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం అటువైపు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి చొరవ చూపుతుండడంతో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేతల సమయంలో ఉన్నారు. తీరా శుక్రవారం ముఖం చాటేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్వాకం వల్లనే రోడ్ల పక్కన ఆక్రమణలు పుట్టుకొస్తున్నాయని, పాదచారులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా 'జీసీఎఫ్' 11వ వార్షికోత్సవం

వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ


వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బంజారాహిల్స్: గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ (జీసీఎఫ్) 11వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం సాయంత్రం హోటల్ దస్పల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ 11 సంవత్సరాల వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. జీసీఎఫ్ వంటి లాభాపేక్ష లేని సంస్థలు ప్రజారోగ్యంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఎవరూ కేన్సర్‌తో బాధపడకూడదన్నారు. జీసీఎఫ్ సేవలను ఈశాన్య రాష్ట్రాలకు విస్తరించాలని సూచించారు. అనంతరం గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ 11వ వార్షిక నివేదికను గవర్నర్ ఆవిష్కరించారు. అలాగే జీసీఎఫ్‌కు సహకారాన్ని అందిస్తున్న సంస్థలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్, ప్రసిద్ధ రచయిత అరుణ్ తివారీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేన్సర్‌ను జయించిన పలువురు తమ అనుభవాలను ఈ వేదికపై పంచుకున్నారు.

నియామకం

శ్రీనగర్‌కాలనీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్‌గా ఎర్రగడ్డకు చెందిన బీజేపీ నాయకురాలు, హైదరాబాద్ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సుర సునీత నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఫిల్మ్ సరిఫికేషన్ రీజినల్ ఆఫీసర్ షఫీఅలీ కుమార్ నుంచి అందుకున్నారు. బీజేపీ నేతలు ప్రేమ్‌కుమార్, ఈదులగంటి రాజేష్, గారపాటి అనంతలక్ష్మి, శాంతికుమార్‌లు అభినందనలు తెలిపారు.

నేడు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎర్రగడ్డ సుందర్‌నగర్‌లో ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీసీరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి విద్యుత్ కాంట్రాక్టర్లంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నిక కూడా ఉంటుందని ప్రకటించారు.

అంబేడ్కర్ వర్సిటీ శిక్షణ తరగతులు రద్దు

బంజారాహిల్స్: అంబేడ్కర్ వర్సిటీ తెలంగాణలోని అన్ని అధ్యయన కేంద్రాల్లో ఈనెల 14, 15 తేదీల్లో జరగాల్సిన అన్ని కౌన్సెలింగ్ క్లాసులు రద్దు చేస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఆ తేదీల్లో పలు కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్నందున తరగతులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

డీవీఎస్ రాజుకు నివాళి


డీవీఎస్ రాజుకు నివాళులర్పిస్తున్న రామారావు,కాజా సూర్యనారాయణలు

ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ వ్యవస్థాపకులు డీవీఎస్ రాజు జయంతి సందర్భంగా ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ చైర్మన్ కేఎస్ రామారావు, ఫిలింనగర్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ తదితరులు హాజరై డీవీఎస్ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన అందించిన సేవలను కీర్తించారు.

వైభవంగా సుదర్శన హోమం


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి ఆవరణలోని ఆమోదగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన ఈ పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ సుదర్శన మహా యాగాన్ని ఆలయ అర్చకులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, మహాప్రసాద నివేదన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు తెలిపారు.

విల్లామేరీలో క్రిస్మస్ వేడుకలు


విల్లామేరీ కాలేజీలో విల్లా ఫిస్టా వేడుకలు

పంజగుట్ట: క్రిస్మస్ వేడుకలు విల్లామేరీ కాలేజీలో ముందుగానే ప్రారంభమయ్యాయి. విల్లామేరీ జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విల్లా ఫిస్టా పేరుతో వేడుకలు నిర్వహించారు. వివిధ దేశాల్లో రైతులు, వారి సంప్రదాయాలు ఎలా ఉంటాయి, భారతదేశంలో ఎలా ఉంటాయి అన్న విషయాలపై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా డిజే పాటలకు స్టెప్స్ వేసి అదరగొట్టారు.






అమెరికా స్ట్రాబెర్రీ, న్యూజిలాండ్ కివీ, వాషింగ్టన్ యాపిల్, కాలిఫోర్నియా ద్రాక్ష, ఆస్ట్రేలియా ఆరెంజ్, థాయిలాండ్ డ్రాగన్ ఇలా అనేక రకాల విదేశీ పండ్లు ప్రసుత్తం నగర మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. దీంతో విదేశీ పండ్ల రుచులను ఆస్వాదించడానికి నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రోజు రోజుకూ నగరంలో వీటి అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సగటున రోజుకు 50-60 టన్నుల మేర అమ్మకాలు జరుగుతున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సుమారు 18 దేశాల నుంచి వివిధ రకాలు దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపార వర్గాల చెబుతున్న మాట. కాగా ఈ మొత్తం ప్రక్రియలో అమ్మకాలు, దిగుమతులు గణనీయంగా పెరిగాయని, దీంతో విదేశీ పండ్ల విక్రయాల్లో నగరం దేశంలోనే మూడో స్థానంలో ఉందని తెలుస్తోంది..

- సాక్షి, సిటీబ్యూరో

గచ్చిబౌలిలో ఎకో ఫ్రెండ్లీ క్రిస్మస్ ట్రీ



గచ్చిబౌలి: దేశంలో గాలి నాణ్యత ఆందోళనకర స్థాయిలో ఉన్న నేపథ్యంలో పర్యావరణంపై మరింత అవగాహన కల్పించేందుకు పచ్చని మొక్కలతో ఎకో ఫ్రెండ్లీ క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. క్రిస్మస్ సంబరాలను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో వినూత్న రీతిలో ఐదు రకాల మొక్కలతో క్రిస్మస్ ట్రీ తయారు చేశారు. మంజీర గ్రూప్ ఆఫ్ హోటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎంపీ గణేష్ ఎకో ఫ్రెండ్లీ క్రిస్మస్ ట్రీ ఆవిష్కరించారు. ఆహ్లాదాన్ని పంచే మొక్కలతో క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేయడం పర్యావరణం పట్ల బాధ్యతను గుర్తుచేస్తోంది. అరలియా, మింగ్, అశోకవనం, పెప్‌రోమియా తదితర రకాల చెట్లతో ట్రీ లైటింగ్ సెర్మనీ నిర్వహించారు. సీఓఓ గణేష్ మాట్లాడుతూ పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు మొక్కలతో దీనిని తయారు చేశామని తెలిపారు. గతంలో వివిధ థీమ్‌లతో పోచంపల్లి హడ్లూమ్ ట్రీ, పెరల్ ట్రీ, ఫుట్‌బాల్ ట్రీ, మిల్లెట్ ట్రీలను ఆవిష్కరించినట్లు వివరించారు. హోటల్‌కు వచ్చే సందర్శకులను ఆలోచింపజేసేలా వినూత్న రీతిలో క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.



పోష్‌క ఫలం..

విదేశీ పండ్లకు పెరిగిన క్రేజ్

హైదరాబాద్ వైబ్స్

మార్కెట్‌ని ముంచెత్తుతున్న వివిధ దేశాల పండ్లు

గ్లోబల్ ట్రెండ్స్‌పై నగర ప్రజలకు పెరిగిన మక్కువ

రోజుకు 50-60 టన్నుల అమ్మకం

సుమారు 18 దేశాల నుంచి వివిధ రకాలు దిగుమతి

విదేశీ పండ్ల విక్రయాల్లో నగరానికి దేశంలోనే మూడో స్థానం



ఒకప్పుడు స్థానికంగా దొరికే ఫలాలే సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేవారు. వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఫలాలు ఎగువ మధ్య తరగతి వారు, లేదా ధనవంతులు మాత్రమే కొనుగోలు చేసేవారు. అయితే మారుతున్న పరిస్థితులు, గ్లోబల్ మార్కెటింగ్‌లో భాగంగా ప్రతిదీ సామాన్యులకు అందుబాటులకి వచ్చింది. పైగా వాటికి ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు వాటి అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశంలో అందుబాటులో ఉన్న అనేక రకాల పండ్లు నగర మార్కెట్లో అందుబాటులో అమ్మకాలు జరుగుతున్నాయి...

మాల్స్ నుంచి లోకల్ మార్కెట్‌కి..

విదేశీ పండ్లు ఒకప్పుడు పెద్ద పెద్ద మాల్స్‌లోనో.. లేదా సూపర్ మార్కెట్స్‌లోనో అమ్మకాలు జరిగేవి... అయితే విదేశీ పండ్లు నగరంలో మాల్స్, ఫ్రూట్ షాప్స్ నుంచి తోపుడు బండ్లపై అమ్మకాలు జరుగుతున్నాయి. పైగా దేశీయ పండ్ల ధరలకు సమానంగా వీటిని విక్రయిస్తున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలూ వీటిని కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఏదో ఒక సీజన్‌లో మత్రమే దేశయ మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వివిధ దేశాల పండ్లు అక్కడి సీజన్ల ప్రకారం మార్కెట్‌కు దిగుమతి అవుతున్నాయి. దీంతో యేడాది పొడవునా ఏదో ఒక దేశం నుంచి అన్ని రకాల పండ్లూ అన్ని సీజన్‌లలో లభ్యమౌతున్నాయి.

దేశంలోనే మూడో స్థానంలో..

విదేశీ పండ్లుగా పేరుగాంచిన కివీ, స్ట్రాబర్రీ, బ్లాక్ బెర్రీస్, అవకాడో వంటి పళ్లు నగరంలో విరివిగా లభ్యమవుతున్నాయి. భారీగా అక్కడి నుంచి దిగుమతులు చేయడం ఒక కారణమైతే.. లోకల్ మార్కెట్‌తో పాటు ఇళ్ల వెంబడి కూడా అమ్మకాలు చేయడమే మరో కారణమని బాటసింగారం మార్కెట్ వ్యాపార వర్గాలు చెబుతున్నారు. నగరంతో పాటు ఇతర రాష్ట్రాలకూ, జిల్లాలకూ ఇక్కడి నుంచే ఎగుమతులు జరుగుతాయి. అందుకే రాష్ట్రంలోనే బాటసింగారం పండ్ల మార్కెట్‌కు అతి పెద్దదిగా పెట్టింది పేరు. అయితే విదేశీ పండ్ల వినియోగంలో ముంబయి, బెంగళూరు తర్వాత నగరం మూడో స్థానంలో నిలిచింది.

దిగుమతులు ఇలా..

గ్రీన్ యాపిల్‌కు ఇటీవల అదరణ పెరిగింది. నెదర్లాండ్స్, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. యాపిల్ పళ్లను వాషింగ్టన్, చైనా, న్యూజిల్యాండ్, చిలీ, బెల్జియం నుంచి ముంబాయి, చెన్నై పోర్టు ద్వారా నగరానికి దిగుమతవుతాయి. అవకాడో టాంజానియా నుంచి, కివీ పండ్లు న్యూజిల్యాండ్, ఇటలీ, ఇరాన్‌తో పాటు చైనా నుంచి వస్తాయి. ఇదే క్రమంలో వివిధ పళ్లు ఇతర దేశాల నుంచి దిగుమతవుతున్నాయి.

ప్రతి ఫలం..ఔషధ గుణం..

ప్లమ్.. చూడడానికి పెద్ద రేగు పండు సైజులో యాపిల్‌ను పోలివుంటుంది. ఇందులో క్యాల్షియం, సీ, బీ విటమిన్లు, మెగ్నీషియంతో పాటు ఇతర పోషకాలు మెండుగా ఉంటాయి. కివీ ఫ్రూట్‌లో విటమిన్ సీ, కే, ఇ అధికంగా ఉంటాయి. ఇక డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సీ, ఫాస్ఫరస్, క్యాల్షియం, ఫైబర్‌తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తితో పాటు కేన్సర్‌ను నియంత్రిస్తుంది. చెర్రీలో కార్బోహైడ్రేట్లు, షుగర్, విటమిన్ సీ, పోటాషియం పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలో విటమిన్ సీ, క్యాల్షియం అధిక స్థాయిలో ఉంటుంది.







ఆన్‌లైన్‌లోనే ఆర్డర్స్..

వివిధ దేశాల నుంచి ఇక్కడి వ్యాపారులు ఆయా సీజనల్ ఫ్రూట్స్‌ని ఆన్‌లైన్ ద్వారానే దిగుమతి చేసుకుంటారు.. అదెలా అంటే.. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాట్సాప్, మెయిల్ ద్వారా పండ్ల నమునా ఫొటోలు పంపిస్తారు. దీంతో వ్యాపారులు ఆన్‌లైన్‌లో అడర్ ఇస్తారు. విదేశాల నుంచి ముంబయికి దిగుమితి అవుతాయి. అక్కడి నుంచి ఫ్రీజర్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా నగరానికి వస్తాయి.

మార్కెట్‌లో వివిధ దేశాల పండ్లు



ప్రపంచ వ్యాప్తంగా లభించే దాదాపు 20 రకాల విదేశీ పండ్లు గడ్డిఅన్నారం మార్కెట్‌కు కమీషన్ ఏజెంట్‌ల ద్వారా దిగుమతి అవుతున్నాయి. గతం కంటే ప్రస్తుతం దిగుమతులు పెరిగాయి. ట్రేడర్స్‌కు రెఫ్రిజిరేటర్ చాంబర్‌లు ఏర్పాటు చేశాము. దేశంలోని ఇతర పండ్ల మార్కెట్‌లతో పోలిస్తే నగర మార్కెట్‌లో అన్ని సౌకార్యలూ ఉన్నాయి.

– ఎల్ శ్రీనివాస్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

పెరిగిన అమ్మకాలు



గతంతో పోలిస్తే విదేశీ పండ్ల అమ్మకాలు పెరిగాయి. దీంతోపాటు నగరం ప్రజలకు కూడా విదేశీ పండ్లపై ఆసిక్తి పెరిగంది. కరోనా అనంతరం ప్రజల్లో ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెరగడం మరో కారణం.. దిగుమతులు కూడా విరివిగా జరుగుతుండడంతో ధరలు కూడా దేశీ పండ్ల స్థాయిలోనే ఉంటున్నాయి. యాపిల్, కివీ, పియర్స్‌తో పాటు మరికొన్ని విదేశీ రకాల వైపు కొనుగోలుదారులు మొగ్గు చూపుతున్నారు.

– క్రాంతి ప్రభాత్‌రెడ్డి, విదేశీ పండ్ల హోల్‌సేల్ వ్యాపారి

ఏఐ ఫర్ బిజినెస్ లీడర్స్..

వర్చువల్ మీట్..

సాక్షి, సిటీబ్యూరో: తమ కార్యకలాపాల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అనుసంధానం చేయడం ద్వారా మరిన్ని వ్యాపార విజయాలు అందుకోవచ్చని నగరానికి చెందిన గ్లోబల్ గ్యాన్ లీడర్ షిప్ అకాడమీ నిర్వాహకులు అద్దేపల్లి శ్రీనివాస్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 'మానవ మేధ 2.0: ఏఐ యుగంలో లీడర్ షిప్ నైపుణ్యాలను పెంపొందించుకోడం' అనే అంశంపై వర్చువల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్తమానంతో పాటు భవిష్యత్తుకూ మేలు చేసేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా తాము రూపొందించిన ఏఐ ఫర్ బిజినెస్ లీడర్స్.. కోర్సును పరిచయం చేశారు. సమావేశంలో సంస్థ సేవలు అందిస్తున్న టాటా, గోద్రెజ్, ఎయిర్‌టెల్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీపై..

ఇ-గురుకుల్

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, సురక్షితంగా ప్రయాణించడం వంటి అంశాలపై.. పాఠశాల స్థాయిలోనే అవగాహన ఉండాలని హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎమ్‌ఎస్‌ఐ) నిపుణులు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాము చేపట్టిన రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు దాదాపు 3 లక్షల మందికి చేరింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. తాజాగా సిద్ధిపేట్‌లోనూ కేంద్రియ విద్యాలయ, సహస్ర హైస్కూల్‌కు చెందిన 2,200 మంది విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించామన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో 2030 కల్లా 100 శాతం అవగాహనే లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతాయని, దీనిలో భాగంగా ఇటీవలే డిజిటల్ రోడ్ సేఫ్టీ లెర్నింగ్ ప్లాట్‌ఫార్మ్‌ని ప్రారంభించామని ఇ-గురుకుల్ పేరుతో అందిస్తున్నామని అన్నారు.



సోషల్ మీడియా..

నా హాబీ..

సరికొత్త రెడ్‌మీ నోట్14 సిరీస్ ఆవిష్కరణలో ప్రముఖ సింగర్ మంగ్లీ..



సాక్షి, సిటీబ్యూరో: బిజీ బిజీగా సాగే జీవితంలో సెల్ ఫోన్ ఒక వినోదాత్మక వ్యాపకమని ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ మంగ్లీ అన్నారు. సెల్ బే ఆధ్వర్యంలోని సరికొత్త షావోమి 5జీ హ్యాండ్ సెట్ రెడ్‌మీ నోట్14 సిరీస్‌ను గచ్చిబౌలి షో రూమ్ వేదికగా ఆవిష్కరించారు. ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా ఫోన్‌లో పలు విషయాలు తెలుసుకుంటానని, మంచి కెమెరా ఉన్న ఫోన్‌లు అంటే తనకెంతో ఇష్టమని మంగ్లీ తెలిపింది. సోషల్ మీడియా వేదికగా తన కొత్త పాటలు, ఆల్బమ్స్, ఫొటోలు, రీల్స్ ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంటానన్నారు. తమ కస్టమర్స్‌కు సరికొత్త ప్రొడక్ట్స్ అందించడంలో భాగంగా రెడ్‌మీ నోట్14 సిరీస్‌ను ఆవిష్కరించామని సెల్ బే ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ సోమా నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ షావోమి ఇండియా సయ్యద్ అన్వర్, ఒలింపిక్స్-హాకీ నేషనల్ సెక్రెటరీ కొండా విజయ్ కుమార్, మార్కెటింగ్ డైరెక్టర్ సుదీప్ నల్లచెరు పాల్గొన్నారు.

నగరంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన

డిసెంబరు 19 నుంచి 29 వరకూ

'సాక్షి'తో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్ వాసు



రెండు వేదికలు.. 347 స్టాల్స్..



కవాడిగూడ : నగరంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శనను డిసెంబరు 19 నుంచి 29 వరకూ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్ వాసు వెల్లడించారు. ఈ సందర్భంగా సాక్షితో పలు విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుక్‌ఫేయిర్ ప్రారంభోత్సవానికి ఎవరు వస్తున్నారు..? అని ప్రశ్నించగా.. 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు హాజరవుతారని, పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తారని వాసు తెలిపారు. మొత్తం ఎన్ని స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు..? అనేదానికి ఈ పుస్తక ప్రదర్శనలో మొత్తం 347 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. అందులో తెలుగు 171, ఇంగ్లిష్, ఇతర భాషలు 135, స్టేషనరీ 10, ప్రభుత్వ స్టాల్స్ 14 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఓపెనింగ్స్‌కి రెండు వేదికలు..

అయితే గతంలో సాంస్కృతిక కార్యక్రమాలకు, బుక్‌రిలీజ్ ఫంక్షన్‌లకు ఒకే వేధిక ఉండేదని, ఈ సంవత్సరం ఒకటి బోయి విజయభారతి పేరుతో, మరొకటి తోపుడు బండి సాదిక్ పేరుతో మొత్తం రెండు వేదికలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాగా ఈ సారి బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి కృష్ణమాచార్య పేరుతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా..

ప్రతిరోజూ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రెండు గంటల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, రెండు వేదికలపైనా పలువురు కళాకారులు ప్రదర్శనలు ఇస్తారని వివరించారు. దీంతో పాటు స్టాల్స్ నిర్వాహకుల ఇబ్బంది లేకుండా పలు చర్యలు తీసుకుంటున్నామని, ఇందు కోసం హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు 15 మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పడిందని, మొత్తం 7 టీములుగా ఏర్పడి, గత రెండు నెలలుగా స్టాల్స్ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా, ఏ విధంగా సహాయపడాలో ప్లాన్ వేసుకున్నామని తెలిపారు.

మెరుగ్గా.. ఫుడ్ స్టాల్స్..

గతంలో కంటే ఈ సారి కాస్త మెరుగ్గా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ప్రత్యేకమైన వంటకాలకు సంబంధించిన ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఇరానీ చాయ్, హైదరాబాద్ బిర్యానీ, కబాబ్స్, తెలంగాణ పిండివంటలు, చాట్ ఐటమ్స్ వంటివి ఈ సారి ఆహార ప్రియులకు రుచికరమైన విందును అందించనున్నాయి.

పారిశుధ్యానికీ ప్రాధాన్యం..

పుస్తక ప్రియులకు గతంలో నిర్వహించిన బుక్ ఫెయిర్‌లో టాయిలెట్లకు కొంతమేర ఇబ్బందులు కలిగిన మాట వాస్తవమే. ఈ సారి వాటిని అధిగమించడానికి మొబైల్ టాయిలెట్స్‌తోపాటు ప్రత్యేక టాయిలెట్స్‌నూ ఏర్పాటు చేశాం. అయితే టైమింగ్స్ విషయంలోనూ కొద్దిగా మార్పులు చేశాం.. గతంలో మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ ఉండేది. ప్రస్తుతం సాహితీ అభిమానుల విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ బుక్‌ఫెయిర్ అందుబాటులో ఉంటుంది.



బోనమెత్తిన భక్తుల కోర్కెలు తీర్చే గ్రామదేవతగా పూజించే గండిమైసమ్మ.. అందుబాటు ధరల్లోనే సామాన్య, మధ్యతరగతి సొంతింటి కలనూ తీరుస్తోంది. అర్ధగంట ప్రయాణ వ్యవధిలోనే ఐటీ కారిడార్‌కు చేరుకునే వీలు, శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ఇతర జిల్లా కేంద్రాలకు చేరుకునేందుకు ఔటర్ రింగ్ రోడ్డుతో కనెక్టివిటీ.. సమీప దూరంలోనే అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు, వినోద, ఉపాధి కేంద్రాలు.. అన్నింటికీ మించి అందుబాటులోనే గృహాల ధరలు ఉండటంతో బహదూర్‌పల్లి, గండిమైసమ్మ ప్రాంతాలకు డిమాండ్ ఏర్పడింది.

–సాక్షి, సిటీబ్యూరో

గృహమెత్తిన గండిమైసమ్మ

బహదూర్‌పల్లి, గండిమైసమ్మ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి

సామాన్య, మధ్యతరగతికి తక్కువ ధరలో గృహాలు

మెరుగైన మౌలిక వసతులతో పెరుగుతున్న డిమాండ్



మాడ్యులర్ కిచెన్ ఫ్రీ..



గండిమైసమ్మ- మేడ్చల్ మార్గంలోని అయోధ్య క్రాస్‌రోడ్స్‌లో 5.2 ఎకరాల్లో శ్రీవెన్ త్రిపుర ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాం. 3 టవర్లలో 638 యూనిట్లుంటాయి. న్యూ ఇయర్ సందర్భంగా ప్రతి ఫ్లాట్‌కు మాడ్యులర్ కిచెన్‌ను ఉచితంగా అందిస్తున్నాం. అలాగే ఈ ఏడాది డిసెంబర్ 31లోపు ఫ్లాట్ కొనుగోలు చేసేవారికి లోయర్ ఫ్లాట్, ఈస్ట్, కార్నర్ ఫ్లాట్లపై ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవు. అలాగే 12 నెలల పాటు నిర్వహణ ఉచితం. ఆఫర్లతో కస్టమర్లకు సుమారు రూ.5-6 లక్షలు ఆదా అవుతుంది. 50 వేల చదరపు అడుగుల క్లబ్ హౌస్‌లో స్విమ్మింగ్ పూల్, జిమ్, టెన్నిస్ కోర్ట్, సూపర్ మార్కెట్, బాంక్వెట్ హాల్ వంటి అన్ని రకాల వసతులు ఉంటాయి. 299 యూనిట్లతో కూడిన టవర్-1ను దసరా నాటికి కస్టమర్లకు హ్యాండోవర్ చేస్తాం. నిర్మాణంలో ఉన్న మిగిలిన రెండు టవర్లను 2027 మార్చి వరకు పూర్తి చేస్తాం.

– ఎండీ కృష్ణరావు, రూబ్రిక్ కన్‌స్ట్రక్షన్

అందుబాటు ధరల్లోనే ఇళ్లు..

హైదరాబాద్ రియల్టీలో కొత్త మైక్రో మార్కెట్‌గా వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడ పెద్ద ఎత్తున గృహ నిర్మాణం జరుగుతోంది. బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, బాసుర్‌గడి, గౌడవెల్లి, అయోధ్యక్రాస్ రోడ్స్ వంటి ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్ట్‌లో నిర్మాణంలో ఉన్నాయి. ప్రైమార్క్, రూబ్రిక్ కన్‌స్ట్రక్షన్స్, వాసవి, ప్రణీత్ గ్రూప్, అపర్ణా వంటి సంస్థలు పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడుతున్నాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాలల్లో ధర చదరపు అడుగుకు రూ.5,500 వేలుగా చెబుతున్నారు. ప్రాజెక్ట్‌లలోని వసతులు, విస్తీర్ణాలను బట్టి ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి.

నార్త్ వేవ్‌లో సెంచరీ క్రాస్..

నిర్మాణ రంగంలో దశాబ్దన్నర కాలం అనుభవంలో ఇప్పటివరకు 18 లక్షల చ.అ.ల్లో 30కు పైగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేశాం. తాజాగా బహదూర్‌పల్లిలో 13.5 ఎకరాల్లో నార్త్‌వేవ్ గేటెడ్ కమ్యూనిటీని నిర్మిస్తున్నాం. 14 బ్లాక్‌లు, ఒక్కోటి 9 అంతస్తుల్లో మొత్తం 1,026 యూనిట్లు ఉంటాయి. నార్త్ వేవ్ ప్రాజెక్ట్‌ను కిడ్స్ సెంట్రిక్ జోన్‌గా తీర్చిదిద్దుతున్నాం. ఇందులో పిల్లలకు, పెద్దలకు ప్రత్యేకంగా ప్లే ఏరియా, పెట్ జోన్, ఔట్‌డోర్ ఫిట్‌నెస్ స్టేషన్, యోగా, స్విమ్మింగ్ పూల్, జిమ్, క్రికెట్ పిచ్, బీబీక్యూ పార్టీ లాన్, మినీ గోల్ఫ్, రాక్ క్లయింబింగ్, ప్లే స్కూల్.. ఇలా వందకు పైగా ఆధునిక వసతులను కల్పిస్తున్నాం.



– సాయికృష్ణ బొర్రా, డైరెక్టర్, ప్రైమార్క్ డెవలపర్స్

నీరు ఎత్తు నుంచి పల్లెం వైపు ప్రవహించినట్టే.. అభివృద్ధి కూడా మెరుగైన మౌలిక వసతులు ఉన్న ప్రాంతాల వైపే విస్తరిస్తుంది. ఇందుకు సరైన ఉదాహరణ బహదూర్‌పల్లి, గండిమైసమ్మ ప్రాంతాలు. ఐటీ కారిడార్‌కు చేరువలో ఉండటంతో మియాపూర్, బాచుపల్లి ప్రాంతాల్లో అభివృద్ధి చెందాయి. దీంతో ఇక్కడ పెద్ద ఎత్తున నివాస, వాణిజ్య సముదాయాలు వెలిశాయి. ఇప్పుడా డెవలప్‌మెంట్ బాచుపల్లికి కొనసాగింపుగా.. బహదూర్‌పల్లి, గండిమైసమ్మ మార్గంలో విస్తరించింది. అన్నింటికీ మించి చౌక ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను గండిమైసమ్మ తీరుస్తోంది.

వెస్ట్, నార్త్ జోన్‌లతో కనెక్టివిటీ..

మెరుగైన రోడ్లు, రవాణా సదుపాయాలతో వెస్ట్, నార్త్ హైదరాబాద్ ప్రాంతాలకు సులువుగా చేరుకునే వీలు ఉండటం బహదూర్‌పల్లి, గండిమైసమ్మ ఏరియాల ప్రత్యేకత. ఇక్కడి నుంచి అరగంటలో బాచుపల్లి మార్గంలో ప్రగతినగర్ మీదుగా జేఎన్‌టీయూకి, అక్కడి నుంచి హైటెక్‌సిటీకి వెళ్లొచ్చు. ఇప్పటికే మియాపూర్-బాచుపల్లి ఆరులైన్ల రహదారి మార్గం నిర్మాణంలో ఉంది. ఇది పూర్తయితే ప్రయాణ సమయం మరింత తగ్గుతుంది. అలాగే 1.5 కి.మీ. దూరంలోని దుండిగల్ ఔటర్ ఎగ్జిట్-5 ఎక్కితే శంషాబాద్ విమానాశ్రయానికి ఈజీగా చేరుకోవచ్చు.

ఉపాధి అవకాశాలు మెండుగానే..

ఉపాధిపరంగా ఐటీ కారిడార్‌కు సులువుగా చేరుకోవడంతో పాటు స్థానికంగా పలు ఫార్మా కంపెనీల పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఇక్కడే ఉన్నాయి. కండ్లకోయ, బహదూర్‌పల్లి ఐటీ పార్క్‌లు ఉండటంతో ఉపాధి అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. సమీపంలోని గౌడవెల్లిలో 600 ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్, దూలపల్లిలో ఫారెస్ట్ అకాడమీలు ఉండటంతో చుట్టూ పచ్చదనంతో ప్రశాంత వాతావరణం, కాలుష్య రహిత గృహాలు ఉండటం ఈ ప్రాంతాల ప్రత్యేకత. గండిమైసమ్మ చుట్టు పక్కల పదుల సంఖ్యలో ఇంటర్నేషనల్ స్కూళ్లు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలున్నాయి. మల్లారెడ్డి, టెక్ మహీంద్రా విశ్వవిద్యాలయాలు చుట్టుపక్కలే ఉన్నాయి. వైద్య కళాశాలతో పాటు నారాయణ హృదయాలయ, మల్లారెడ్డి, జీవీకే ఆస్పత్రులు చేరువలోనే ఉన్నాయి.



బోటింగ్ విల్లాస్..

సాక్షి, సిటీబ్యూరో: పొద్దున లేవగానే గలగలా పారే నీటి సవ్వడి.. వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి హ్యాపీగా పడవలో షికారు.. వీటి కోసం ఎక్కడో టూరిస్ట్ ప్లేస్‌కు వెళ్లాల్సిందేనని అనుకోకండి. నగర స్థిరాస్తి రంగంలోనే తొలిసారిగా ప్రణీత్ గ్రూప్ నివాస సముదాయంలోనే బోటింగ్ సదుపాయాన్ని కల్పిస్తోంది. గాగిల్లాపూర్‌లో నిర్మిస్తున్న గ్రూప్ పార్క్ లగ్జరీ విల్లా గేటెడ్ కమ్యూనిటీలో బోటింగ్ వసతిని అందుబాటులోకి తీసుకురానుంది. ఈమేరకు ప్రాజెక్ట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కంపెనీ డైరెక్టర్ నరేంద్ర కుమార్ కామరాజు తెలిపారు. ప్రాజెక్ట్‌కు మధ్యలో చెరువు ఉండటంతో నివాసితులకు వినూత్నంగా బోటింగ్ సేవలను అందించాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. 70 ఎకరాల్లో 884 ట్రిపులెక్స్ విల్లాలను నిర్మిస్తున్నామని, ఇప్పటికే 50 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని ఆయన చెప్పారు. 167 నుంచి 350 గజాల్లో వేర్వేరు విస్తీర్ణాలలో స్పానిష్ ఆర్కిటెక్చర్ విల్లాలు ఉన్నాయని, ప్రారంభ ధర రూ.1.70 కోట్లుగా నిర్ణయించామని పేర్కొన్నారు.

క్రెడాయ్ హైదరాబాద్

రజతోత్సవం!



సాక్షి, సిటీబ్యూరో: భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య(క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్ రజతోత్సవం ఘనంగా జరిగింది. పాతికేళ్ల క్రితం 28 మంది సభ్యులతో బిల్డర్స్ ఫోరంగా మొదలై.. ప్రస్తుతం 330కు పైగా మెంబర్లతో క్రెడాయ్ హైదరాబాద్‌గా అవతరించింది. 25 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వ్యవస్థాపక సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ రంగానికి ఖ్యాతిని తెచ్చిపెట్టిన వ్యవస్థాపక సభ్యుల స్ఫూర్తి, దృఢమైన సహకారాన్ని గుర్తించడం మా గౌరవమని కొనియాడారు. కస్టమర్లతో న్యాయమైన రీతిలో, పారదర్శకంగా వ్యవహరించేలా డెవలపర్లు వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు క్రెడాయ్ ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. ప్రెసిడెంట్-ఎలెక్ట్ ఎస్.జైదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలుదారుల హక్కులు, పెట్టుబడులు సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించడానికి మా సభ్యులకు కఠినమైన నైతిక నియమావళిని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రీలాంచ్, యూడీఎస్ వంటి స్కీమ్‌లలో చిక్కి మోసపోకుండా ఉండేలా కస్టమర్లకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు.

సాక్షి రియల్టీ
శనివారం
14-12-2024

ఇళ్లు నిర్మించుకోవడం ఒక ఎత్తయితే.. టైల్స్ ఎంపిక మరో ఎత్తు.. ఏ మాత్రం తేడా వచ్చినా ఇంటి అందం పూర్తిగా దెబ్బతింటుంది. అయితే ఎంత పెద్ద ఇల్లు కట్టినా ఆకర్షణీయంగా కనిపించడంలో కీలక పాత్ర పోషించేది నేలపై పరిచే టైల్స్. వాటి డిజైన్ ఎంపిక విషయంలో దాదాపు ఒక యుద్ధం చేసినంత కసరత్తు చేస్తారనడంలో అతిశయోక్తి లేదు. అందుకే చాలా కంపెనీలు కస్టమర్ల అభిరుచులు, ట్రెండ్‌కు తగ్గట్టు తయారు చేస్తున్నాయి. ప్రతి ఏటా కస్టమర్ల అభిరుచుల్లో చాలా తేడా కనిపిస్తోందని పలు కంపెనీలు చెబుతున్నాయి. రంగులు, డిజైన్లు, ఆకారాల విషయంలో ప్రజలు ఎంతో జాగ్రత్త వహిస్తున్నారని పేర్కొంటున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

టైల్.. యమస్టైల్!

ఇంటి టైల్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్న ప్రజలు

ప్రకృతి నుంచి స్ఫూర్తి

టైల్స్ డిజైన్ రూపొందించే విషయంలో ప్రతి అంశం నుంచి స్ఫూర్తి పొందుతుంటారని తయారీదారులు చెబుతున్నారు. ఒక్కొక్కరి టేస్ట్ ఒక్కోలా ఉంటుందని, ప్రకృతికి సంబంధించి చెట్లు, పూలు, ఆకులను మనసులో ఉంచుకుని తయారు చేస్తుంటామని పేర్కొంటున్నారు. ఇక, వివిధ రకాల ఆకారాలు కూడా ముఖ్యమని, రంగులు, విభిన్న కాన్సెప్టులతో మార్బుల్, స్టోన్స్‌తో రూపొందిస్తుంటామని చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో సుస్థిరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తయారు చేస్తున్నారు.

- విభిన్న డిజైన్స్, ఆకారాలను ఎంచుకుంటున్న వైనం
- ప్రకృతి నుంచి స్ఫూర్తి పొంది తయారు చేస్తున్న కంపెనీలు
- కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టు డిజైన్ల రూపకల్పన
- భారత ఆర్థికరంగంలో భారీ వృద్ధి నమోదు చేస్తున్న టైల్స్ రంగం



రూ.35 నుంచి ప్రారంభం..

టైల్స్‌లో కూడా ఒక్కో డిజైన్, ఒక్కో ఆకారాన్ని బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంది. ప్రతి చదరపు అడుగు టైల్‌కు రూ.35 నుంచి రూ.500 వరకు కూడా ఉంది. సెరామిక్ టైల్స్‌కు కాస్త తక్కువ ధర ఉంటుంది. విట్రిఫైడ్, మార్బుల్ టైల్స్, గ్రానైట్ టైల్స్, వుడ్ లుక్ టైల్స్, సిమెంట్ టైల్స్ వంటి రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. మార్బుల్ టైల్స్‌కు కాస్త ధర ఎక్కువ ఉంటుందని అందరికీ తెలిసిందే. ఎక్కువగా సెరామిక్ టైల్స్‌కు కస్టమర్లు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తర్వాత విట్రిఫైడ్ టైల్స్‌కు, ఆ తర్వాత వేరే రకం టైల్స్‌ను వాడుతున్నారు.



ఏటా భారీస్థాయిలో వృద్ధి..

టైల్స్ రంగం ఏటా భారీ స్థాయిలో వృద్ధి నమోదు చేస్తోంది. ఏటా 11.96 శాతం పెరుగుదల కనిపిస్తోందని కెన్ పరిశోధనలు తేల్చాయి. 2023లో టైల్స్ మార్కెట్ ఏకంగా 8,543.9 మిలియన్ డాలర్లు నమోదు చేయగా, 2030 నాటికి ఈ మార్కెట్ విలువ ఏకంగా 13,265.2 మిలియన్ డాలర్లకు ఎగబాకుతుందని అంచనా వేస్తున్నారు. 2024 నుంచి 2030 మధ్య ఈ రంగం ఏకంగా 6.5 శాతం వృద్ధి నమోదు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

దినుసుల స్ఫూర్తిగా..

దేశంలోని మసాలా దినుసులను స్ఫూర్తిగా తీసుకుని టైల్స్ డిజైన్ రూపొందిస్తుంటాను. భారతీయత ఉట్టిపడేలా, ఇక్కడి ప్రకృతి రమణీయతను టైల్స్ డిజైన్స్‌లో ఉండేలా చూసుకుంటాను. అనేక దేశాల్లో ఇలాంటి డిజైన్స్‌కు యమ గిరాకీ ఉంది. ప్రజల అభిరుచికి తగ్గట్టు టైల్స్ డిజైన్స్ రూపొందించేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంటాను.
– మారియా కాస్టిలో, రీజెన్సీ టైల్స్ చీఫ్ డిజైనర్.



- మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణతో నగరాభివృద్ధి
- సిటీ, శివార్లకు మధ్య మెరుగైన కనెక్టివిటీ, మౌలిక వసతులు
- నగరం మూడు వైపులా అందుబాటు ధరల్లో గృహాలకు అవకాశాలు
- 'యూజర్ పే' విధానంలో గ్రోత్ కారిడార్‌లో రోడ్లు
- వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌తో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలి
- రాష్ట్ర ఆదాయంలో 25-30 శాతం వాటా స్థిరాస్తి రంగానిదే..

తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవీ రావు

'మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ బృహత్తర ప్రాజెక్టులతో హైదరాబాద్ అభివృద్ధి ఖాయం. ఏ నగరంలోనైనా సరే ప్రభుత్వం, డెవలపర్లు సంయుక్తంగా ప్రజా కేంద్రీకృత విధానాలతో నగరానికి అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టిస్తారు. రోడ్లు, విద్యుత్, డ్రైనేజ్, నీరు వంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్లను ప్రభుత్వం కల్పిస్తే.. కాలనీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను డెవలపర్లు చేపడతారని తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్(టీడీఏ) ప్రెసిడెంట్ జీవీ రావు అన్నారు.' – సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ 2.0

సబర్బన్ పాలసీ అవసరం..

విద్యా, ఉద్యోగం, ఆరోగ్యం, వినోదం ఇలా ప్రతీ అవసరం కోసం ప్రజలు ప్రధాన నగరానికి రావాల్సిన, ఆధారపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఏటా 3 లక్షల మంది నగరానికి వలస వస్తున్నారు. శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయకపోతే కోర్ సిటీలో జనసాంద్రత పెరిగి, బెంగళూరు, ఢిల్లీ మాదిరిగా రద్దీ, కాలుష్య నగరంగా మారే ప్రమాదం ఉంది. అందుకే శివారు ప్రాంతాలు మెరుగైన మౌలిక వసతులతో అభివృద్ధి చెందేందుకు సబర్బన్ పాలసీ అవసరం. మెట్రో విస్తరణతో ప్రధాన నగరం, శివారు ప్రాంతాలు అనుసంధానం కావడంతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. శరవేగమైన పట్టణీకరణ కారణంగా మౌలిక సదుపాయాల కల్పన తప్పనిసరి. అందుకే హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఇందులో ఈ ఏడాది రూ.5 వేల కోట్ల నిధులతో నాలాల పునరుద్ధరణ పూర్తి చేయాలి.

నివాస, వాణిజ్య స్థిరాస్తికి డిమాండ్..

హైడ్రా దూకుడుతో కొంత కాలంగా స్థిరాస్తి రంగం మందగమనాన్ని ఎదుర్కొంది. అయితే నిర్మాణ అనుమతులు ఉన్న ప్రాజెక్టుల జోలికి వెళ్లమని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో నిలకడ వాతావరణం నెలకొంది. దీంతో కొత్త కస్టమర్ల నుంచి ఎంక్వైరీలు పెరిగాయి. ఐటీ, ఫార్మా పరిశ్రమలకు కేరాఫ్ హైదరాబాద్. ఆయా రంగాల్లో 1.50 లక్షల కొత్త ఉద్యోగాలతో రాబోయే కాలంలో నివాస, వాణిజ్య స్థిరాస్తి రంగానికి డిమాండ్ తప్పకుండా ఉంటుంది. ఉప్పల్ నుంచి నారాపల్లి, పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట, పరేడ్ గ్రౌండ్ నుంచి కొంపల్లి ఫ్లై ఓవర్లను ప్రభుత్వం నిర్మించనుంది. ఈ మూడు మార్గాలతో పాటు ఆదిభట్ల నుంచి లేమూరు మార్గంలో నివాస కార్యకలాపాలు పెరగనున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతికి అందుబాటులో ధరల్లో ఇళ్లు లభ్యమవుతాయి.

ఆదాయంలో 25-30 శాతం వాటా..

ప్రస్తుతం గ్రేటర్‌లో 1.1 కోట్ల జనాభా ఉంది. మెరుగైన మౌలిక వసతులతో దేశంలోనే నివాసితయోగ్యమైన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. వ్యవసాయం తర్వాత రెండో అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే పరిశ్రమ రియల్ ఎస్టేట్ రంగం. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, జీఎస్టీ, నిర్మాణ అనుమతుల రుసుము, ఇంపాక్ట్ ఫీజు, ఆదాయ పన్ను ఇలా స్థిరాస్తి రంగం నుంచి ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుంది. రాష్ట్ర ఆదాయంలో 25-30 శాతం వాటా స్థిరాస్తి రంగానిదే.




జీవీ రావు

'యూజర్ పే'తో గ్రోత్ కారిడార్‌లో రోడ్లు..

ఓఆర్ఆర్ నిర్మాణ సమయంలోనే గ్రోత్ కారిడార్‌కు రెండు వైపులా రహదారులను ప్లాన్ చేశారు. కానీ.. ఇప్పటికీ వేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆయా రోడ్లను ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా మార్చుకోవచ్చు. ఫైనాన్షియల్ హోల్డింగ్ కంపెనీతో హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకొని, రైతుల నుంచి భూములను సేకరించి రహదారులను నిర్మించాలి. ఇందుకైన వ్యయాన్ని ఈ రోడ్లను వినియోగించుకునే డెవలపర్ల నుంచి వసూలు చేస్తారు. ఉదాహరణకు టోల్ మాదిరిగా ఏ నుంచి బీ రోడ్డు నిర్మాణానికి అయిన వ్యయాన్ని బిల్డర్లు 'యూజర్ పే' రూపంలో చెల్లిస్తారు. దీంతో ప్రభుత్వంపై వ్యయ భారం తగ్గడంతో పాటు మెరుగైన రోడ్లతో ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయి. ఈ రోడ్లలో కొన్ని రీజినల్ రింగ్ రోడ్ అనుసంధానించబడి రేడియల్ రోడ్లుగా అభివృద్ధి చెందుతాయి.

వాక్ టు వర్క్‌తో.. ఫోర్త్ సిటీ..

తెలంగాణ ప్రభుత్వం 50 వేల ఎకరాల్లో ఫోర్త్ సిటీ నిర్మాణాన్ని తలపెట్టింది. అయితే.. ఈ పట్టణం ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి ప్లాన్ చేయాలి. వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌లతో కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యా, వైద్య, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతో ఫోర్త్ సిటీ స్వయం సమృద్ధి చెందుతుంది. ఈ మోడల్‌ను హైదరాబాద్‌లోని మిగతా మూడు వైపులకూ విస్తరించాలి.



సాక్షి రియల్టీ
శనివారం
14-12-2024

సొగసరి సోఫాతో..
రిచ్ లుక్..

థీమ్ బేస్డ్ ఐటమ్స్‌కూ డిమాండ్

అందుబాటులో మల్టీపర్పస్ సోఫాలు

టేకు, లెదర్, ఫ్యాబ్రిక్ ఫినిషింగ్‌కి క్రేజ్..



లగ్జరీ.. అస్సలు తగ్గేదేలే!

- నగరం ఇళ్ల నగటు ధర రూ.కోటిపైనే..
- ఏడాది 37 శాతం పెరిగిన ధరలు
- రూ.31,993 కోట్ల విలువైన యూనిట్ల విక్రయం
- అనరాక్ గ్రూప్ తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: కరోనా తర్వాత నుంచి విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో హైదరాబాద్‌లో గృహాల ధరలు పెరిగిపోయాయి. 2024 తొలి అర్ధ ఆర్థిక సంవత్సరం(హెచ్1)లో నగరంలో ఇళ్ల సగటు ధర రూ.84 లక్షలుగా ఉండగా.. 2025 హెచ్1 నాటికి రూ.1.15 కోట్లకు పెరిగింది. ఏడాది కాలంలో 37 శాతం ధరలు వృద్ధి చెందాయని అనరాక్ తాజా నివేదిక వెల్లడించింది. అలాగే నగరంలో 2024 హెచ్1లో రూ.25,059 కోట్లు విలువ చేసే 29,940 యూనిట్లు అమ్ముడుపోగా.. 2025 హెచ్1 నాటికి 27,820 ఇళ్లు విక్రయించారు. వీటి విలువ రూ.31,993 కోట్లు.

- దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో విక్రయాలు, లాంచింగ్స్ రికార్డు స్థాయిలో జరిగాయి. 2024 హెచ్1 గృహాల ధర సగటున రూ.కోటిగా ఉండగా.. 2025 హెచ్1 నాటికి 23 శాతం పెరిగి, ఏకంగా రూ.1.25 కోట్లకు చేరింది. ఇక, 2024 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో టాప్–7 సిటీస్‌లో రూ.2,79,309 కోట్లు విలువ చేసే 2,27,400 యూనిట్లు అమ్ముడుపోగా.. 2025 హెచ్1 నాటికి రూ.2,35,800 కోట్ల విలువైన 2,35,200 విక్రయమయ్యాయి. యూనిట్ల అమ్మకాల్లో 3 శాతం క్షీణత ఉన్నప్పటికీ.. సేల్స్ వ్యాల్యూ మాత్రం 18 శాతం పెరిగింది.

2025 హెచ్1లో నగరాల వారీగా గృహ విక్రయాలు

నగరం	యూనిట్లు	విలువ (రూ.కోట్లలో)
ఎంఎంఆర్	77,735	1,14,529
ఎన్‌సీఆర్	32,125	46,611
పుణే	40,190	34,033
బెంగళూరు	31,380	37,863
హైదరాబాద్	27,820	31,993
చెన్నై	9,530	9,015
కోల్‌కత్తా	8,620	5,265



ముంబైలో స్థిరంగా ధరలు..

ఆసక్తికరంగా ఏడాది కాలంలో ముంబై(ఎంఎంఆర్)లో యూనిట్ల ధరలు పెరగలేదు. 2024 హెచ్1లో ధర సగటున రూ.1.45 కోట్లుగా ఉండగా.. 2025 హెచ్1లోనూ అదే ధర ఉంది. ఇక, అత్యధికంగా ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ఇళ్ల ధరలు పెరిగాయి. 2024 హెచ్1లో ఇక్కడ ధర సగటు రూ.93 లక్షలు కాగా.. 2025 హెచ్1 నాటికి రూ.1.45 కోట్లకు పెరిగాయి. ఆ తర్వాత బెంగళూరులో గతంలో రూ.84 లక్షలు ఉండగా.. ఇప్పుడు రూ.1.21 కోట్లు, చెన్నైలో రూ.72 లక్షల నుంచి రూ.95 లక్షలకు, పుణేలో రూ.66 లక్షల నుంచి రూ.85 లక్షలకు, అలాగే 2024 హెచ్1లో కోల్‌కత్తాలో యూనిట్ ధర సగటు రూ.53 లక్షలుగా పలకగా.. 2025 హెచ్1 నాటికి రూ.61 లక్షలకు పెరిగింది.

మల్టీపర్పస్ సోఫాలు..

గతంలో సోఫా అంటే కూర్చునేందుకు మాత్రమే అన్నట్లు ఉండేది. తాజా పరిస్థితులు అందుకు భిన్నంగా మారిపోతున్నాయి. సోఫాను అవసరమైతే కూర్చోవడం, సేద తీరేందుకు వెనకకు వాలడం, నిద్ర వస్తే కునుకు తీయడానికి పరుపులా మలచుకోవడం.. ఇలా మనకు నచ్చినట్లు వినియోగించుకునే మల్టీపర్పజ్ మోడల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఉన్నత శ్రేణి కుటుంబాల్లో ఈ తరహా మల్టీపర్పజ్ సోఫాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఫలితంగా స్థలం ఆదాతో పాటు ఎక్కువ ఫర్నిచర్‌ను ఇంట్లో పెట్టుకోవాల్సిన అవసరం ఉండదని ఇంటీరియల్ డిజైనర్స్ అంటున్నారు. మన అవసరాలకు అనుగుణంగా ఏ విధంగా రిలాక్స్ కావాలనుకుంటే అందుకు తగ్గట్లు ఫోల్డ్ చేసుకుంటే సరిపోతుంది.

హాల్‌కు అందం వచ్చింది..

“ఉద్యోగ విధులు ముగించుకుని ఇంటికి వచ్చాక కొంత సమయం ప్రశాంతంగా టీవీ చూస్తూ, పిల్లలతో కొంత సమయం కేటాయించాలంటే సోఫాలు అనువైనవి. ఇటీవల రూ.1.20 లక్షలు వెచ్చించి ఎల్ ఆకారంలో ఉన్న సోఫా తీసుకున్నాను. దీంతో హాల్‌కు అందం వచ్చింది. చిన్న లైట్ల వెలుతురులో సోఫాలో కూర్చుంటే ప్రశాంతంగా అనిపిస్తుంది.”

– బీవీప.నాయుడు, బ్యాంకు ఉద్యోగి, కేపీహెచ్‌బీ





సాక్షి, సిటీబ్యూరో: సొంత ఇల్లు.. ప్రతి ఒక్కరి కల. తన కలల సౌధం అందంగా కనిపించాలంటే మాత్రం ఫర్నిచర్ తప్పనిసరి. ప్రశాంతంగా హాల్‌లో కూర్చుని సేద తీరాలంటే సొగసైన సోఫా ఉండాల్సిందే. ఇంట్లోకి అడుగుపెట్టగానే ముందుగా అందరికీ కనిపించేవి సోఫాలే.. అందుకే అందరి దృష్టి సోఫాలపై ఉంటుంది. ధరలతో సంబంధం లేకుండా ఎంతైనా ఖర్చు చేసేందుకైనా సిద్ధ పడుతున్నారు. నలుగురిలో ఒకరిలా కాకుండా తమంటూ ప్రత్యేక గుర్తింపు కావాలని కోరుకుంటున్నారు. ఆర్కిటెక్, ఇంటీరియర్ డిజైనర్ల సలహాల మేరకు తన బడ్జెట్‌లో అందంగా తీర్చిదిద్దుతున్నాడు. టేకు, లెదర్, ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన సోఫాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇల్లే కాదు వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో సైతం సోఫాలు విరివిగా వినియోగిస్తున్నారు. లివింగ్ ప్లేస్‌లో రిచ్ లుక్ కోరుకుంటున్నారు.

- భాగ్యనగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ, కేపీహెచ్‌బీ, మియాపూర్ తదితర ప్రాంతాల్లో ఇల్లు, విల్లా ఏదైనా రూ.కోట్లలో మాటే. ఇక్కడ ఆయా గృహ యజమానుల అవసరాలు అదే స్థాయిలో ఉంటాయి. నివాసం, కార్యాలయం ఏదైనా అధునాతన వసతులున్న సోఫాలు తప్పనిసరి. ఇంటి నిర్మాణ సమయం నుంచే ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ నిపుణులతో మాట్లాడి, గోడలకు వేసే కలర్ నుంచి ఇంట్లో వినియోగించే సోఫా కలర్ వరకు అన్నింటినీ కాంబినేషన్ కావాలంటున్నారు. ఆధ్యాత్మికం, స్పోర్ట్స్, రిచ్ లుక్, ఫార్మల్, ఓల్డ్, వివిధ రకాల థీమ్‌లకు అనుగుణంగా సోఫా తయారు చేస్తున్నారు. రిక్లెయినర్, స్టాండర్డ్, వాక్‌ఫిట్, స్లీప్, ఉడ్‌మేడ్‌తో పాటు వివిధ రకాల సోఫాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి ఫినిషింగ్ అనేది అత్యంత ముఖ్యంగా మారిపోయింది. వినియోగించే ముడి సరుకును సైతం తెలుసుకుంటున్నారు. నాణ్యతపైనా ఆరా తీస్తున్నారు. అంతా సరే అనుకున్నాకే ఫర్నిచర్ తయారీదారులతో మాట్లాడుతున్నారు. నచ్చిన మోడల్‌ను తయారు చేసి ఇవ్వాల్సిందిగా ఆర్డర్ చేస్తున్నారు. ఎక్కువ మంది ఎల్, యూ ఆకారంలో సోఫాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంటిలో స్థలాన్ని బట్టి ఆకారం మారుతుంది. దేశ, విదేశాల నుంచి ఫర్నిచర్, ముడి సరుకును దిగుమతి చేసుకుంటున్నారు. మధ్యతరగతి కుటుంబాలకు రెడీమేడ్ సోఫాలు అందుబాటులో ఉంటున్నాయి. ఒక్కో సోఫా కనీసం రూ.లక్ష నుంచి ఆపైనే పలుకుతున్నాయి. ఎంపిక చేసుకున్న మోడల్, మెటీరియల్‌ను బట్టి ధరలు నిర్ణయిస్తారు.





- ఏడాది క్రితం వరకు ఎకరం రూ.కోటి లోపే..
- ఫోర్త్‌సిటీ ప్రకటనతో రెండింతలు పెరిగిన భూముల ధరలు
- మెడికల్, స్కిల్స్ యూనివర్సిటీలకు ఇప్పటికే శంకుస్థాపన
- తాజాగా 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు నోటిఫికేషన్ జారీ
- పోటీ పడి భూములు కొనుగోలు చేస్తున్న రియల్టర్లు

‘ఫ్యూచర్’ చుట్టే..

రియల్ భూమ్!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన ‘ఫ్యూచర్ సిటీ’ చుట్టూ రియల్ భూమ్ కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం కారణంగా దేశవ్యాప్తంగా రియల్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. కానీ రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ప్రభుత్వం ప్రతిపాదించిన ఫ్యూచర్‌సిటీ/ఫోర్త్‌సిటీ/నెట్‌జీరోసిటీ చుట్టూ మాత్రం భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఏడాది క్రితం వరకు ఎకరానికి రూ.కోటి కూడా పలకని భూములకు.. ప్రభుత్వ తాజా ప్రకటనలతో వాటి ధరలు అమాంతం పెరిగిపోయాయి. అంతేకాదు నిన్న మొన్నటి వరకు అటు వైపు కన్నెత్తి చూసేందుకే ఇష్టపడని రియల్టర్లు, ఐటీ, ఫార్మా, ఇతర దిగ్గజ కంపెనీలు ప్రస్తుతం భూముల కోసం ఆరా తీస్తున్నాయి. ప్రత్యేకంగా మార్కెటింగ్ బృందాలను రంగంలోకి దింపి, అమ్మకం దారులను గుర్తించే పనిలో పడ్డాయి. జిల్లాలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ప్రస్తుతం ఫ్యూచర్ సిటీకి ఆనుకుని ఉన్న పరిసర గ్రామాల్లోనే ఈ రియల్ ప్రభావం ఎక్కువగా ఉంది.

రియల్టర్ల దృష్టంతా అక్కడే..

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఫోర్త్‌సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే



ప్రభుత్వం 13,973 ఎకరాల భూమిని సేకరించింది. దీనికి అధనంగా మరో 15 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించేందుకు సన్నాహాలు చేస్తుంది. ఇప్పటికే మహేశ్వరం మెడికల్ కాలేజీకి ఇక్కడ శంకుస్థాపన చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. మెఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ(ఎంఈఐఎల్) సంస్థ యూనివర్సిటీ పరిపాలన భవనం సహా మొత్తం నిర్మాణాలను చేపట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందుకు రూ.200 కోట్ల విరాళాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. నిర్మాణాలకు ఇటీవల భూమిపూజ కూడా చేసింది. హెల్త్‌సైన్స్ పేరుతో 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీని నిర్మించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే 300పైగా ఫార్మా కంపెనీలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాయి. త్వరలోనే ఆయా కంపెనీలకు మేడిపల్లి సమీపంలో భూములను కేటాయించే అవకాశం ఉంది. మలక్‌పేటలో 150 ఎకరాల్లోని హైదరాబాద్ రేస్ క్లబ్‌ను కూడా ఇక్కడికి తరలించేందుకు సన్నాహాలు చేస్తోంది. 250 ఎకరాల్లో ప్రపంచస్థాయి గోల్ఫ్ క్లబ్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. బీసీసీఐ ఇక్కడ అతిపెద్ద స్టేడియాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికాలోనే వరల్డ్ ట్రేడ్ సెంటర్ తరహాలో 70 ఎకరాల్లో అత్యాధునిక వాణిజ్య భవనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. భవిష్యత్తులో ఇక్కడ భారీగా వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు మొదలు కానుండటంతో ఇప్పటి నుంచే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు దృష్టి సారించాయి. పెద్దఎత్తున భూములు కొనుగోలు చేస్తున్నాయి.

విల్లాలు.. బహుళ అంతస్తుల భవనాలకు ప్లాన్

ఔటర్‌రింగ్ రోడ్డు(రావిర్యాల ఎగ్జిట్–13) నుంచి మీర్‌ఖాన్ పేటలో ప్రతిపాదిన ఫ్యూచర్ సిటీ మీదుగా రీజినల్ రింగ్‌రోడ్డు వరకు 41.5 కిలో మీటర్ల మేర నిర్మించనున్న 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 449.27 ఎకరాలు సేకరించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్ ప్రకటనతో ప్రతిపాదిత రోడ్డుకు రెండు వైపులా భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇబ్రహీం పట్నం మండలం కొంగరకలాన్‌లో జిల్లా కలెక్టరేట్, ఫాక్స్‌కాన్, కేన్స్ కంపెనీల రాకతో వాటి పక్కన భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. కొంగర రెవెన్యూ పరిధిలోని కేన్స్ సమీపంలో ఎకరం రూ.8 కోట్లకు అమ్ముడు పోయింది. కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్, ఆకులమైలారం, గుమ్మడివెళ్లి, మాదాపూర్‌లో భూముల ధరలు ఆకాశాన్ని అంటాయి. మీర్‌ఖాన్‌పేట్–నస్దిక్‌సింగారం గ్రామాల మధ్య ఎకరం రూ.3 కోట్లకు అమ్ముడుపోయింది. గత డిసెంబర్‌లో యాచారం మండలంలో నాగార్జునసాగర్ హైవే వెంట ఎకరం రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.2.50 కోట్లకు పెరిగింది. యాచారం మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, నందివనపర్తి, చింతుళ్లలో ప్రధాన రోడ్డు వెంట గతేడాది ఎకరం రూ.కోటి ఉండగా, ప్రస్తుతం రూ.2 కోట్లు పలుకుతోంది. రియల్టర్లు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి విల్లా ప్రాజెక్టులకు, బహుళ అంతస్తుల గృహ, వాణిజ్య సముదాయాలకు ప్లాన్ చేస్తున్నారు. రైతులు కూడా భూములను విక్రయించే విషయంలో ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు.



తడిసి మోపెడు..

దేశంలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల భత్యాలు, ఇంధన ధరల వృద్ధితో భవన నిర్మాణ వ్యయాలు పెరుగుతున్నాయి. దీంతో నివాస, వాణిజ్య, పారిశ్రామిక భవన సముదాయాల నిర్మాణం భారంగా మారుతోంది. ఏడాది కాలంలో స్టీల్, సిమెంట్, అల్యూమీనియం, కాపర్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు 11 శాతం, లేబర్ ఖర్చులు 25 శాతం మేర పెరిగాయని కొల్లియర్స్ ఇండియా తాజా అధ్యయనం వెల్లడించింది.

సాక్షి, సిటీబ్యూరో:

లేబర్ శిక్షణ, భద్రతతో కూడా వృద్ధి..

నివాస, వాణిజ్య, పారిశ్రామిక ఏ భవన నిర్మాణ ఖర్చులోనైనా సరే 67 శాతం నిర్మాణ సామగ్రి, 28 శాతం కార్మికులు, 5 శాతం ఇంధన వ్యయాలు ఉంటాయి. ఇసుక, ఇటుక, కలప, గ్లాస్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు అందుబాటులోనే ఉన్నా.. నిర్మాణ కూలీల వేతనాల పెరుగుదల నిర్మాణ వ్యయంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తుంది. అలాగే నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం, శిక్షణ, భద్రత, నిర్వహణ సంబంధిత ఖర్చులతో నిర్మాణ వ్యయం మరింత పెరుగుతుంది.



వ్యయం ఎంత పెరిగిందంటే? (ధర/చ.అ.)

నిర్మాణ వ్యయం	నివాసం	వాణిజ్యం	పారిశ్రామికం
అక్టోబర్–2020	2.000	1,850	1,875
అక్టోబర్–2021	2,200	2,100	2,000
అక్టోబర్–2022	2,300	2,450	2,100
అక్టోబర్–2023	2,500	2,700	2,300
అక్టోబర్–2024	2,780	2,850	2,380

(నోట్: ఈ నిర్మాణ వ్యయాలు 15 ఫ్లోర్ల అపార్ట్‌మెంట్, గ్రేడ్–ఏ కమర్షియల్, ఇండస్ట్రీయల్ బిల్డింగ్‌కు సంబంధించనవి)

సామగ్రి ధరల పెరుగుదల..

స్టీల్, సిమెంట్, కాపర్, అల్యూమీనియం వంటి ప్రధాన నిర్మాణ సామగ్రి ధరలతో పాటు కార్మికుల వ్యయం విపరీతంగా పెరిగిపోయాయి. అత్యధికంగా కార్మికుల భత్యాలు, కాపర్ ధరలు వృద్ధి చెందాయి. గత ఐదేళ్లలో కాపర్ ధర 91 శాతం, స్టీల్, అల్యూమీనియం 57 శాతం, సిమెంట్ 30 శాతం మేర ధరలు పెరగగా.. కార్మికుల వేతనాలు ఏకంగా 150 శాతం పెరిగాయి. ఏటా లేబర్ ఖర్చులు 25 శాతం కంటే ఎక్కువే వృద్ధి చెందుతున్నాయి.

ఎంత పెరిగాయంటే..

2020 అక్టోబర్‌లో 15 అంతస్తుల నివాస భవన నిర్మాణానికి చ.అ.కు రూ.2 వేలు వ్యయం కాగా.. 2024 అక్టోబర్ నాటికి రూ.2,780కు చేరింది. అలాగే గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్ నిర్మాణ వ్యయం రూ.1,850 నుంచి రూ.2,850కు, అలాగే పారిశ్రామిక భవన నిర్మాణ ఖర్చు రూ.1,875 నుంచి రూ.2,380కు పెరిగాయి. ఏడాది కాలంలో నివాస విభాగంలో నిర్మాణ వ్యయం 11 శాతం, కమర్షియల్‌లో 6 శాతం, ఇండస్ట్రియల్‌లో 3 శాతం మేర పెరిగాయి.


కొనుగోలుదారుల జేబుకే చిల్లు..

నిర్మాణ వ్యయ భారాన్ని డెవలపర్లు మోయరు.. కొనుగోలుదారులకే బదలాయిస్తారు. ఏమేరకు ఖర్చు పెరిగిందో అంతమేర భవనం చ.అ. ధరలను పెంచి విక్రయిస్తారు. దీంతో కస్టమర్ల జేబుకే చిల్లు పడుతుంది. ఏటేటా నిర్మాణ వ్యయం పెరుగుతున్నప్పటికీ డెవలపర్లు నాణ్యత, ఆధునిక వసతుల కల్పనలో ఏమాత్రం రాజీపడటం లేదు. మరోవైపు కొనుగోలుదారుల్లోనూ నిర్మాణ నాణ్యత, సౌకర్యాల స్పృహ పెరగడంతో హైరైజ్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలకు డిమాండ్ ఏర్పడింది. మరోవైపు ఈ ఏడాది వాణిజ్య, పారిశ్రామిక విభాగంలో సరఫరా పెరిగింది. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో 37 మిలియన్ చ.అ. ఆఫీస్ స్పేస్, 22 మిలియన్ చ.అ. ఇండస్ట్రియల్ స్పేస్ సప్లయి జరిగింది.



ఇలా చేస్తే వ్యయం తగ్గుదల..

- నిర్మాణ వ్యయాలు, సవాళ్లను అధిగమించేందుకు డెవలపర్లు సమగ్ర బడ్జెట్ అంచనాలను పునఃసమీకించుకోవాలి.
- ప్రధానమైన నిర్మాణ సామగ్రిని స్థానికంగా సమీకరించుకోవాలి. సరఫరా గొలుసు వ్యవస్థలను మెరుగుపర్చుకోవాలి.
- నైపుణ్యం ఉన్న కార్మికులు, మానవ వనరుల లభ్యతను సమర్థవంతంగా నిర్వహించుకోవాలి.
- గ్రీనరీ, ప్రీ–ఫ్యాబ్, రీసైక్లింగ్ వంటి ప్రత్యామ్నాయ నిర్మాణ ఉత్పత్తులను వినియోగించాలి.
- కార్మికులకు భద్రతతో పాటు నిరంతరం శిక్షణ అందించాలి.
- భవన నిర్మాణంలో ఆటోమేషన్, సాంకేతిక వ్యవస్థల వినియోగాన్ని పెంచాలి.
- ఉత్పత్తి, వినియోగం, భాగస్వామ్యం, పునర్వినియోగం వంటి వృత్తాకార ఆర్థిక వ్యవస్థ నిర్వహణతో నిర్మాణ వ్యయం నియంత్రణలో ఉంటుంది.



యూజీసీ సిఫార్సులు ఆచరణ సాధ్యమేనా?

డిగ్రీ, పీజీలో ఏటా రెండుసార్లు ప్రవేశాలకు ప్రతిపాదన | రెండున్నరేళ్ల వ్యవధిలోనే బ్యాచిలర్ డిగ్రీ

స్కిల్ కోర్సులు అందించేలా మార్గదర్శకాలు | అకడమిక్ నేపథ్యం ఏదైనా.. నచ్చిన కోర్సులో చేరే అవకాశం

యూజీసీ సిఫార్సులపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు

సాక్షి, ఎడ్యుకేషన్: ఉన్నత విద్యలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రతిపాదించిన సంస్కరణలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీ, పీజీలో ప్రవేశాలు మొదలు.. కోర్సుల వ్యవధి వరకు యూజీసీ సిఫార్సులు ఆచరణలోకి వస్తే ఉన్నత విద్యా రంగంలో కీలక మార్పులు చోటుచేసుకొంటాయి. అయితే ఈ సిఫార్సులపై నిపుణులు భిన్నంగా స్పందిస్తున్నారు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా ఈ మార్పులు సత్ఫలితాల నివ్వడానికి కనీసం పదేళ్ల సమయం పడుతుందని అంటున్నారు. ఉన్నత విద్యలో సంస్కరణల కోసం 'మినిమమ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్ ఫర్ ద గ్రాంట్ ఆఫ్ అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ అండ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ రెగ్యులేషన్స్–2024' పేరుతో యూజీసీ ఈ నెల ఐదో తేదీన ముసాయిదాను విడుదల చేసింది. దీనిని అన్ని రాష్ట్రాలకు పంపి, ఈ నెల 23వ తేదీలోగా అభిప్రాయాలు తెలపాలని లేఖలు రాసింది. యూజీసీ సిఫార్సులపై అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యామండలిని ఆదేశించింది.

ఏటా రెండు సార్లు ప్రవేశం..

యూజీసీ సిఫార్సుల్లో ముఖ్యమైనది.. బ్యాచిలర్, పీజీ స్థాయిలో ఏటా రెండు సార్లు (జూలై / ఆగస్టు, జనవరి/ఫిబ్రవరి) ప్రవేశ ప్రక్రియ నిర్వహించటం. ఇది విద్యార్థులకు కొంత మేలు చేసే అంశమేనని విద్యావేత్తలు అంటున్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత పొందని.. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉన్నత విద్య అభ్యసించే విషయంలో సమయం వృథా కాకుండా ఈ ప్రతిపాదన మేలు చేస్తుందని చెబుతున్నారు. అయితే..ఈ ప్రతిపాదన అమలుచేయాలంటే ఫ్యాకల్టీ, ఇతర బోధన సదుపాయాలను రెట్టింపు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఇప్పటికిప్పుడు అది సాధ్యం కాకపోవచ్చని పేర్కొంటున్నారు.

హెచ్ఈసీతో బీటెక్ చదవగలరా?

యూజీసీ మరో సిఫార్సు.. అకడమిక్ నేపథ్యం ఏదైనా.. విద్యార్థులు ఉన్నత విద్యలో తమకు నచ్చిన కోర్సులో చేరే అవకాశం కల్పించడం. ఉదాహరణకు.. ఇంటర్మీడియెట్‌లో హెచ్ఈసీ చదివిన విద్యార్థి.. బీటెక్ ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రన్స్‌లలో (జేఈఈ, ఈఏపీసెట్ తదితర) ఉత్తీర్ణత సాధించి బీటెక్‌లో చేరొచ్చు. దీనిపై వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ట్స్, హ్యూమానిటీస్ విద్యార్థులు.. గణితం, సైన్స్, ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల సమ్మేళనంగా ఉండే బీటెక్‌లో రాణించడం సాధ్యం కాదని అంటున్నారు.

బహుళ ప్రవేశ, నిష్క్రమణ అవకాశం

యూజీసీ ప్రతిపాదనల్లో మరో కీలకమైన అంశం బహుళ ప్రవేశ, నిష్క్రమణ (మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్) విధానం. బ్యాచిలర్, పీజీ ప్రోగ్రామ్‌లలో చేరిన విద్యార్థులు తమకు నచ్చిన సమయంలో కోర్సు నుంచి వైదొలగే అవకాశం, ఆ తర్వాత మళ్లీ అదే కోర్సులో.. తదుపరి తరగతిలో ప్రవేశం పొందే అవకాశం కల్పించటం ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశం. కానీ.. ఇలాంటి విధానం ఫలితంగా విద్యార్థుల్లో ఉన్నత విద్య స్ఫూర్తి కొరవడే ప్రమాదం ఉందని, ఇది జాబ్ మార్కెట్‌పై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు.

స్కిల్ కోర్సులు, అప్రెంటిస్‌షిప్స్

ఉన్నత విద్యలో స్కిల్ కోర్సులను, అప్రెంటిస్‌షిప్స్‌ను సమీకృతం చేసేలా మరో ప్రతిపాదన చేశారు. బ్యాచిలర్ డిగ్రీలో మొత్తం క్రెడిట్స్‌లో 50 శాతం పూర్తి చేసుకున్న వారు.. మరో 50 శాతం క్రెడిట్స్ కోసం స్కిల్ కోర్సులను, అప్రెంటిస్‌షిప్‌ను, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. అయితే స్కిల్ కోర్సులను అందించే క్రమంలో.. రాష్ట్రాల స్థాయిలో యూనివర్సిటీలకు మౌలిక సదుపాయాల కొరత సమస్యగా మారుతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఒకే సమయంలో రెండు డిగ్రీలు

అకడమిక్ ఫ్లెక్సిబిలిటీ విధానంలో ఒకే సమయంలో రెండు డిగ్రీ ప్రోగ్రామ్స్‌ను అభ్యసించే విధానాన్ని కూడా యూజీసీ ప్రతిపాదించింది. విద్యార్థులు తాము చేరిన కోర్సు / విద్యా సంస్థతోపాటు మరో ఇన్‌స్టిట్యూట్‌లో లేదా మరో అభ్యసన విధానంలో అర్హత మేరకు మరేదైనా బ్యాచిలర్ లేదా పీజీ డిగ్రీలో చేరొచ్చు. అయితే ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం మన విద్యా వ్యవస్థకు సరితూగేలా లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రెండున్నరేళ్లకే బ్యాచిలర్ డిగ్రీ

రెండున్నరేళ్లకే డిగ్రీ పూర్తి చేసుకునేలా యూజీసీ ప్రతిపాదన చేసింది. యాక్సెలరేటెడ్ డిగ్రీ ప్రోగామ్ పేరుతో ప్రతి విద్యా సంస్థలోని మొత్తం విద్యార్థుల్లో పది శాతం మందికి ఈ అవకాశం కల్పించాలని సూచించింది. నాలుగేళ్ల డిగ్రీ ప్రోగామ్స్ విషయంలో మూడేళ్లలో వాటిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించాలి. కానీ యాక్సలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ విధానంలో.. టీచింగ్ – లర్నింగ్ కోణంలో సమస్య ఉత్పన్నమవుతుందని, విద్యార్థులు ఒత్తిడికి గురవుతారని నిపుణులు అంటున్నారు. బ్యాచిలర్ డిగ్రీని రెండున్నరేళ్లలో పూర్తి చేసుకునే అవకాశం కల్పించిన యూజీసీ.. పీజీ విషయంలో మాత్రం మూడేళ్లు లేదా నాలుగేళ్ల డిగ్రీ పూర్తి చేసుకున్న వారినే అర్హులుగా నిర్దేశించాలని సూచించింది. దీంతో.. రెండున్నరేళ్లకు లేదా మూడేళ్లకే బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి పీజీ ప్రవేశాల అర్హతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తక్షణ అమలు సాధ్యం కాదు..



యూజీసీ ప్రతిపాదనలు, సిఫార్సులను తక్షణం అమలు చేసే పరిస్థితి ప్రస్తుతం మన దేశంలో లేదు. ఇవి పూర్తి స్థాయిలో అమలు కావాలంటే అయిదు నుంచి పదేళ్ల సమయం పట్టొచ్చు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యా సంస్థలు ఈ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీల్లో కొంత మేర వీటిని వెంటనే అమలు చేసే వీలుంది.

– ప్రొఫెసర్. డి.ఎన్. రెడ్డి, యూజీసీ మాజీ సభ్యుడు, జేఎన్‌టీయూ మాజీ వీసీ

ఆహ్వానించదగ్గ పరిణామం



యూజీసీ తాజా సిఫార్సులను ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పొచ్చు. విద్యార్థులు ఫ్లెక్సిబుల్ లర్నింగ్ విషయంలో అదనపు కసరత్తు చేయాల్సి ఉంటుంది. కొంత మానసిక ఒత్తిడిని కూడా తట్టుకునే సామర్థ్యం ఉండాలి. ఇందుకోసం అవసరమైన వనరులను ఉన్నత విద్యా సంస్థలు కల్పించాలి.

– ప్రొఫెసర్. వి.ఎస్.రావు, ప్రొ వైస్ ఛాన్స్‌లర్ అడ్వయిజర్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

దశలవారీగా అమలు చేయాలి



గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఈ సంస్కరణలు అవసరమే.. కానీ అమలు విషయంలో ఫ్యాకల్టీ కొరత సమస్యగా మారుతోంది. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కోణంలో పలు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ట్స్, హ్యూమానిటీస్ విద్యార్థులు ఫ్లెక్సిబుల్ లర్నింగ్ విధానంలో బీటెక్, సైన్స్ కోర్సుల్లో రాణించడం కష్టంగానే ఉంటుంది.

– ప్రొఫెసర్. వి. బాలకిష్టారెడ్డి, ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి

కాకినాడలో



ఒంగోలులో



దగాకోరు పాలనపై చెళ్లుమన్న చర్నాకోల!

మోసపోయిన అన్నదాతలకు బాసటగా నిలిచిన వైఎస్ జగన్

రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసనలకు పిలుపు

- వైఎస్సార్‌సీపీ నేతలను ఎక్కడికక్కడ పోలీసులతో హౌస్ అరెస్టు చేయించిన కూటమి సర్కారు
- రైతన్నలను అడుగడుగునా అడ్డగించిన ఖాకీలు...
- ప్రభుత్వ వేధింపులు, పోలీసుల బెదిరింపులకు వెరవని రైతన్నలు.. జిల్లా కేంద్రాల్లో ఉవ్వెత్తున రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీలు
- ఆర్నెళ్ల చంద్రబాబు మోసాల పాలనపై ప్రజా వ్యతిరేకతకు నిరసన ర్యాలీలు అద్దం పట్టాయంటున్న రాజకీయ పరిశీలకులు
- రైతులకు అండగా పార్టీ చేపట్టిన తొలి పోరాటమే విజయవంతమవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం
- రెండు సీజన్లు గడుస్తున్నా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వకుండా రైతులను దగా చేసిన కూటమి ప్రభుత్వం
- ధాన్యం, పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించకుండా రైతులకు ద్రోహం
- ఉచిత పంటల బీమాను రద్దు చేసి కర్షకులను దిక్కుతోచని దుస్థితిలోకి నెట్టిన చంద్రబాబు

కర్నూలులో



అనంతపురంలో



సాక్షి, అమరావతి: అన్నం పెట్టే రైతన్నను దగా చేస్తున్న టీడీపీ కూటమి సర్కారు తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శుక్రవారం నిర్వహించిన రైతు పోరులో కర్షకులు కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ నేతలపై ఎక్కడికక్కడ పోలీసులను ఉసిగొల్పి గృహాల్లో నిర్బంధించినా.. నిరసనలో పాల్గొనడానికి కదలి వస్తున్న రైతులపై ఖాకీలు బెదిరింపులకు దిగినా వెనక్కి తగ్గ లేదు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను నిరసిస్తూ.. అన్యాయాలను ప్రశ్నిస్తూ రైతన్నలు రోడ్డె క్కారు. తక్షణమే పెట్టుబడి సాయంగా రూ.20వేలు అందించాలని..పండించిన ధాన్యం, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని.. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని.. ఉచిత పంటల బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని నినదిస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీల్లో రైతులు కదం తొక్కా రు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేస్తూ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి డిమాండ్ పత్రాలు అందజేశారు. 6 నెలల చంద్రబాబుప్రభుత్వ పాలనపై పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేక తకు ఈ నిరసన ర్యాలీలు అద్దం పట్టాయని రాజ కీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కూటమి ప్రభు త్వం దగా చేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు అండగా నిలుస్తూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన తొలి పోరాటం విజయవంతమవడంతో పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహం తొణికిసలాడుతోంది.

అక్రమ అరెస్టులు.. నిర్బంధాలతో బెదిరించినా..

కూటమి ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద అన్నదాతలకు ఇవ్వాల్సిన రూ.20 వేలు ఇంతవరకూ ఇవ్వకపోవడం.. పండించిన ధాన్యం, పంటలకు కనీస మద్దతు ధర కల్పించకపోవడం.. ఉచిత పంటల బీమా రద్దుతో దీమా లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. అన్నదాతను కుడి, ఎడమల దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున రైతులతో ర్యాలీలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్లకు డిమాండ్ పత్రాలతో తరలి వచ్చారు. దీన్ని పసిగట్టిన కూటమి ప్రభుత్వ పెద్దలు వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులపై పోలీసులను ఉసిగొలిపారు. ఉదయమే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న పోలీసులు వారిని నిరసనలో పాల్గొననివ్వకుండా హౌస్ అరెస్టులు చేశారు. ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్న రైతులను అడుగడుగునా అడ్డుకున్నారు. అయితే పోలీసుల బెదిరింపులకు ఏమాత్రం వెరవకుండా జిల్లా కేంద్రాలకు రైతులు భారీ ఎత్తున తరలి వచ్చారు. వైఎస్సార్‌సీపీ సారథ్యంలో నిర్వహించిన ర్యాలీల్లో కదం తొక్కారు.

ఏలూరులో



మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నరసరావుపేటలో



విశాఖపట్నంలో





శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం పంప్‌హౌస్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ శాఖ నిర్వీర్యం

రూ.1.81 లక్షల కోట్లు అప్పుచేసి ఒక్క ఎకరాకూ నీరివ్వలే

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపణ

ఐదేళ్లలో 30 లక్షల కొత్త ఆయకట్టుకు నీరందిస్తామని వెల్లడి


బాల్కొండ /నిజాంసాగర్ (జుక్కల్): పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేసిందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం పంప్‌హౌస్ వద్ద ఇరిగేషన్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట ఎక్కువ వడ్డీలకు రూ.1.81 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి పథకానికి రూ.27 వేల కోట్లు, సీతారామ సాగర్ ప్రాజెక్టు మీద రూ.8,500 కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క ఎకరం ఆయకట్టు కొత్తగా రాలేదని మండిపడ్డారు. దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఎస్ఎండీసీ ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు

కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును అందుబాటులోకి తెచ్చేలా ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం ఇరిగేషన్‌కు రూ.22,500 కోట్లు ఖర్చు పెడుతున్నామని వివరించారు. ఈ వానాకాలం పంటకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కనీరు తీసుకోకున్నా, 66.7 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని తెలిపారు. కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో మరో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందిస్తామని చెప్పారు. దశలవారీగా ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపడతామని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సూచన ప్రకారం ముందుకెళ్తామని పేర్కొన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు జారీచేసి సన్నబియ్యం అందిస్తామని ప్రకటించారు. మంత్రి వెంట బోధన్, నిజామాబాద్ రూరల్, జుక్కల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతరావు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం–ఒకే ఎన్నికలతో అధ్యక్ష తరహావైపు తీసుకెళ్లే ప్రయత్నం

'ద హిందూ లిట్ ఫర్ లైఫ్ డైలాగ్–2025 'ద పొలిటికల్ సర్కస్' చర్చా కార్యక్రమంలో రాజ్‌దీప్ సర్దేశాయ్



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్ దీప్ సర్దేశాయ్. చిత్రంలో మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం –ఒకే ఎన్నికలు' అని చెబుతున్నా, భారత్‌ను అధ్యక్ష తరహా ఎన్నికల వైపు తీసు కెళ్లేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని తాను భావిస్తున్నట్టు ప్రముఖ టీవీ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దే శాయ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల ప్పుడే ఎక్కువ సీట్లలో గెలిచి ఆధిపత్యం ప్రదర్శించాలని మోదీ ప్రయత్నించినా, ప్రజలు దానిని అంగీకరించలేదన్నారు. శుక్రవారం 'ద హిందూ లిట్ ఫర్ లైఫ్ డైలాగ్–2025 'ద పొలిటికల్ సర్కస్'చర్చా కార్యక్రమంలో రాజ్ దీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ నేషన్–వన్ ఎలక్షన్ పేరిట పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి వారిని ఆకర్షించి, ఒకేసారి ఎన్నికల నిర్వహణ ద్వారా వారి డబ్బు ఆదా అవుతుందని నమ్మించే ప్రయ త్నం జరుగుతోందన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ బద్ధకపు పార్టీగా మారిందని, టీ–20 రోజుల్లో టెస్ట్‌మ్యాచ్ ఆడినట్టుగా కాకుండా విరాట్ కోహ్లీ మాది రిగా రాహుల్‌గాంధీ, ఆ పార్టీ యావత్ యంత్రాంగం చురుకుగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ దేనినైనా తారుమారు చేసి తిమ్మిని బమ్మిని చేయడంలో సిద్ధహస్తురాలిగా మారిన తీరును ఎదుర్కోవడంలో తమ పార్టీ విఫలమైందన్నారు. ప్రముఖ జర్నలిస్టు నీరజా చౌదరి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తోందన్నారు. 'ద హిందూ'అసిస్టెంట్ ఎడిటర్ స్వాతి వడ్లమూడి సమన్వయకర్తగా వ్యవహరించారు. వచ్చేనెల 18,19 తేదీల్లో చెన్నైలో నిర్వహిస్తున్న లిటరరీ ఫెస్టివల్‌కు ముందస్తుగా హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు గురుకులాలు, హాస్టళ్లకు సీఎం, మంత్రులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లోని స్థితిగతులను నేరుగా పరిశీలించేందుకు.. సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి.. అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడంతోపాటు అధికారులు, టీచర్లు, సిబ్బందితో సమావేశమవుతారు. సమస్యలను అడిగి తెలుసుకుంటారు. విద్యార్థులతో కలసి భోజనం చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.667.25 కోట్లను కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలతోపాటు హాస్టళ్లలోని సుమారు 8లక్షల మంది విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచింది. మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి అధ్యక్షతన రాష్ట్ర విద్యా కమిషన్ కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలోని సమస్యలను నేరుగా పరిశీలించేందుకు గురుకులాలు, హాస్టళ్ల విజిట్ కార్యక్రమం చేపట్టింది. గురుకులాలు, హాస్టళ్ల సందర్శనలో భాగంగా సీఎం శనివారం రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల్లోని ఏదో ఒక సంక్షేమ విద్యాసంస్థను సందర్శిస్తారు.

ధాన్యం దారి మళ్లితే కఠిన చర్యలు

పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్

4 రోజుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు.. పలువురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: కస్టమ్ మిల్లింగ్ కోసం కేటాయించిన ధాన్యాన్ని దారి మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ హెచ్చరించారు. రైస్ మిల్లర్ల వద్దకు చేరిన ధాన్యం నిల్వలపై ఎన్ ఫోర్స్‌మెంట్ విభాగం ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 4 రోజుల వ్యవధిలోనే 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, పలువురిని అరెస్టు కూడా చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యహరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగవేసి డిఫాల్టర్లుగా ముద్రపడిన వారికి ఈసారి ధాన్యం కేటాయించలేదని వెల్లడించారు. కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి ఇస్తామని, దుర్వినియోగం చేయబోమని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో పాటు ఆయా జిల్లాల అసోసియేషన్లు ప్రభుత్వానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధాన్యం మిల్లింగ్ , సీఎంఆర్ బియ్యం డెలివరీతో ఇటు కార్పొరేషన్ అటు మిల్లర్లు పరస్పరం లబ్ధి పొందవచ్చునని అన్నారు. అయితే అందుకు భిన్నంగా కొందరు రైస్ మిల్లర్లు అవకతవకలకు పాల్పడుతున్నారని, అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ట్రయల్‌రన్ కోసం వెళ్తున్న ట్యాంక్

ఓడీఎఫ్‌లో యుద్ధ ట్యాంకుల ట్రయల్‌రన్

అత్యాధునిక టెక్నాలజీతో తయారీ

ఓడీఎఫ్ జనరల్ మేనేజర్ రత్నప్రసాద్

కొండాపూర్ (సంగారెడ్డి): ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ (ఓడీఎఫ్)లో అత్యాధునిక సాంకేతికతతో తయారు చేసిన యుద్ధ ట్యాంకులను శుక్రవారం పరీక్షించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ చెరువులో ఓడీఎఫ్ మెదక్ జనరల్ మేనేజర్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎంపీ -2, ఓవర్‌హాల్డ్ బీఎంపీ -2 వాహనాల ట్రయల్‌రన్ నిర్వహించామని తెలిపారు. ఇవి నీటిలో గంటకు 7 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని చెప్పారు. ఈ వాహనాలు రాత్రి పూట డ్రైవర్‌కు చూపు సామర్థ్యం పెంచేలా ఉంటాయని వెల్లడించారు. 30 మి.మీ. 7.62 మి.మీ గన్ ప్రధాన ఆయుధంగా మిస్సైల్ లాంచర్ సదుపాయాన్ని కలిగి ఉంటాయని వివరించారు. ఈ వాహనాలకు స్మోక్ గ్రనేడ్ లాంచర్, ఆర్మర్ స్టీల్‌తో ఆల్‌రౌండ్ ఫైర్ ప్రొటెక్షన్ వంటి ఇతర ఫీచర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఓడీఎఫ్‌లో 40 సంవత్సరాలుగా సుమారు 3 వేల యుద్ధ ట్యాంకులను తయారుచేసినట్లు చెప్పారు.



ట్రయల్‌రన్‌లో పాల్గొన్న ఓడీఎఫ్ ఉద్యోగులు

క్లుప్తంగా...

నిఖేశ్ చిట్టా విప్పుతున్న ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన నీటిపారుదలశాఖ ఏఈఈ నిఖేశ్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం రెండోరోజు కస్టడీకి తీసుకున్నారు. గురువారం నాటి విచారణకు కొనసాగింపుగా పలు అంశాలపై ఆయనను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ప్రధానంగా సోదాల సమయంలో గుర్తించిన ఆస్తుల పత్రాలు, లాకర్ల తాళాలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కినప్పటి నుంచి ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు వరకు నిఖేశ్‌కుమార్ అక్రమార్జనకు సంబంధించి ఏసీబీ సేకరించిన ప్రాథమిక ఆధారాలను సైతం ఆయన ముందు ప్రస్తావిస్తూ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. నిఖేశ్ తన స్నేహితులు, బంధువుల పేర్లపైనే ఎక్కువ ఆస్తులను పెట్టినట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నందున, ఈ అంశంలో లోతుగా ప్రశ్నించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని పలు బ్యాంకులతోపాటు జహీరాబాద్‌లోని ఓ బ్యాంక్ లాకర్‌లోనూ నిఖేశ్ తన బినామీ ఆస్తుల పత్రాలు దాచినట్లు గుర్తించారు. శనివారం మరోమారు నిఖేశ్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకుని ప్రశ్నించనున్నారు.

'భూదాన్' కేసులో మరో నలుగురికి సమన్లు

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, మరికొందరికి తాఖీదులు

సాక్షి, హైదరాబాద్: భూదాన్ భూముల బదలాయింపు కుంభకోణం కేసులో ఈడీ అధికారులు మరో నలుగురికి సమన్లు జారీ చేశారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, వంశీరామ్ బిల్డర్స్‌కు చెందిన బి. సుబ్బారెడ్డి, అమ్మోడ డెవలపర్స్‌కు చెందిన తలసు సూర్యతేజ, కేఎస్‌ఆర్ మైన్స్‌కు చెందిన కె. సిద్ధారెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 16 నుంచి విచారణకు హాజరు కావాలని వీరిని ఈడీ ఆదేశించింది. ఈ కేసులో ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ పాత్రపై ఈడీ ఇప్పటికే సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే.

కేటీఆర్ రూ.100 కోట్ల పరువునష్టం కేసు వాయిదా

జనవరి 6కు వాయిదా వేసిన కోర్టు

సిటీ కోర్టులు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కొండా సురేఖపై దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసు విచారణ శుక్రవారం హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో జరిగింది. తనపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, ఆధారాలు లేకుండా ఆమె అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడంతో తన పరువు పోయిందంటూ రూ.100 కోట్లకు కేటీఆర్ పరువునష్టం కేసు దాఖలు చేశారు. ప్రతివాదులు ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయలేదని వచ్చే విచారణలోపు కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను జనవరి 6కు వాయిదా వేసింది.

రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు: శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయని, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేస్తామంటూ రెండ్రోజులుగా రేవంత్ ప్రభుత్వం పుకార్లను వ్యాప్తి చేస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా కార్ల రేసింగ్‌కు సంబంధించి కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీకి గవర్నర్ అనుమతిచ్చారని వస్తున్న వార్తలను ప్రస్తావించారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలకే పరిమితమైన ఫార్ములా కార్ల రేసింగ్‌ను హైదరాబాద్‌కు రప్పించడమే కేటీఆర్ చేసిన తప్పా? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు.

అల్లు కుటుంబానికి బాసటగా యావత్ భారతీయ సినీ పరిశ్రమ

అరెస్టును కనీసం ఖండించని వైనం

- అల్లు అర్జున్ అరెస్టును వ్యతిరేకించిన వైఎస్ జగన్
- అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి, సంజయ్, కేటీఆర్

సాక్షి, అమరావతి: ప్రముఖ సినీ హీరో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్ రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రధానంగా ఆయన అరెస్ట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా సమర్థించుకోగా.. అర్ధరాత్రి వరకు ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ఉదంతంపై ఉద్దేశపూర్వకంగా మౌనం వహించడం సినీ, రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్ అరెస్ట్‌ను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ద్వంద్వంగా ఖండించి ఆయనకు సంఘీభావం ప్రకటించారు. మరోవైపు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీఆర్‌ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఇతర ప్రముఖులు కూడా ఆ అరెస్ట్‌ను వ్యతిరేకించారు. భాషలకు అతీతంగా భారతీయ సినీ పరిశ్రమ యావత్తూ అల్లు అర్జున్‌కు బాసటగా నిలిచింది. కానీ ఆ అరెస్ట్‌ను చంద్రబాబు, పవన్ మాత్రం ఖండించకపోవటాన్ని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. ఓ జాతీయ చానల్ ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న రేవంత్ రెడ్డి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టును పూర్తిగా సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలు విస్మయానికి గురిచేశాయి. మరోవైపు పార్టీలకు అతీతంగా రేవంత్‌కు సన్నిహితులుగా గుర్తింపు పొందిన చంద్రబాబు, పవన్ ఈ ఉదంతంపై మౌనంగా ఉండిపోవడాన్ని పరిశీలకులు ప్రస్తావిస్తున్నారు. అదే సందర్భంలో 2015లో చంద్రబాబు సీఎం హోదాలో రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాల్లో పాల్గొన్నప్పుడు జరిగిన తొక్కిసలాటలో 29 మంది దుర్మరణం చెందిన ఉదంతాన్ని గుర్తు చేస్తున్నారు. బోయపాటి శ్రీనివాస్ నేతృత్వంలో టీడీపీ ప్రచార వీడియోల చిత్రీకరణ కోసమే వేలాది మంది భక్తులను ముందు రోజు రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ నిరీక్షించేలా చేసి... చంద్రబాబు పుష్కర స్నానం చేయగానే ఒక్కసారిగా గేట్లు తెరవడంతో తొక్కిసలాటకు దారితీసి 29 మంది దుర్మరణం చెందారు. ఇక ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా కందుకూరులో చంద్రబాబు ప్రచార సభలో టీడీపీ నిర్వహణ వైఫల్యంతోనే 8 మంది ప్రాణాలు కోల్పోయారు. గుంటూరులో చంద్రబాబు పాల్గొన్న కార్యక్రమంలో కూడా టీడీపీ నిర్లక్ష్యంతోనే ముగ్గురు దుర్మరణం చెందారు. మరి ఈ ఘటనల విషయంలో చంద్రబాబును అరెస్టు చేయాలా అని ప్రస్తుతం పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

అర్ధరాత్రి వరకు స్పందించని చంద్రబాబు, పవన్‌కల్యాణ్

పాలకొల్లు పిల్లగాడేగా...!

ప్రముఖ హాస్య నటుడు అల్లు రామలింగయ్య స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు. ఆయన కుమారుడు అల్లు అరవింద్ ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందారు. అరవింద్ కుమారుడు, రామలింగయ్య మనవడు అల్లు అర్జున్ ఐకాన్ స్టార్‌గా దేశవ్యాప్తంగా విశేషమైన ప్రజాదారణ ఉన్న హీరో. ఆయన తాజాగా నటించిన పుష్ప 2 జాతీయ స్థాయిలో రికార్డులను బద్దలు కొట్టి చరిత్ర సృష్టించింది. ఏపీలో మూలాలు ఉన్న అల్లు కుటుంబ వారసుడు, ప్రముఖ హీరో అర్జున్ అక్రమ అరెస్టుపై చంద్రబాబు, పవన్ మౌనంగా ఉండిపోవడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులకు ముందే సమాచారం!


సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ వస్తున్నట్టు 2 రోజుల ముందు పోలీసులకు యాజమాన్యం లేఖ

- అవసరమైన స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- అయినా తగిన భద్రతా చర్యలు చేపట్టడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు
- తొక్కిసలాట తర్వాత అల్లు అర్జున్ రాకపై సమాచారమే లేదని పోలీసుల ప్రకటన
- ఇప్పుడేమో వీఐపీల రాక వద్దంటూ థియేటర్ వారిని వారించామని చెప్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: అల్లు అర్జున్ రాకపై పోలీసులకు ముందే సమాచారం ఉన్నా సంధ్య థియేటర్ వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయలేదని... ఈ అంశంలో పోలీసుల వైఫల్యం కనిపిస్తోందని వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసులు వివిధ సమయాల్లో చెప్పిన వేర్వేరు అంశాలే దీనిని స్పష్టం చేస్తున్నాయని అల్లు అర్జున్ అభిమానులు పేర్కొంటున్నారు. వాస్తవానికి పుష్ప-2 సినిమా ఈ నెల 5న విడుదలైంది. టికెట్ రేట్ల పెంపు, ప్రీమియర్ షో, అదనపు షోలకు అనుమతించాలంటూ.. నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ గత నెల 22నే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దాన్ని పరిశీలించిన రాష్ట్ర హోంశాఖ 4న ప్రీమియర్ షో, 5, 6, 7 తేదీల్లో అదనపు షోలు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతించింది. ఈ మేరకు గత నెల 29న హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని మైత్రీ మూవీస్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లకు పంపారు.

రెండు రోజుల ముందే సమాచారమిచ్చినా..

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఉన్న సంధ్య థియేటర్‌లో 4వ తేదీ రాత్రి 9.30 గంటలకు ప్రీమియర్ షో కోసం యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. దీనితోపాటు అదనపు షోలకు భారీగా అభిమానులు వచ్చే ఆస్కారం ఉందని.. సినిమా హీరో, హీరోయిన్, పలువురు వీఐపీలు హాజరవుతారని, అవసరమైన స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఈ నెల 2న లేఖ రాసింది. చిక్కడపల్లి ఏసీపీకి రాసిన ఈ లేఖ ప్రతిని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీసులకు కూడా అందించింది. లేఖ అందినట్టుగా చిక్కడపల్లి ఏసీపీ కార్యాలయం థియేటర్ యాజమాన్యానికి ఎక్నాలెడ్జ్‌మెంట్ కూడా అందించింది. అయితే సరైన బందోబస్తు, భద్రత చర్యలు లేకపోవడంతో సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది.



SANDHYA 70 m.m.
AIR-COOLED
02-12-2024

To
The Asst. Commissioner of Police,
Chikkadpally PS,
RTC 'X' Roads,
Hyderabad.

Sir,

Sub: Request for arrangement of bandobust on 04-12-2024 and 05-12-2024 at Sandhya 70 MM theatre - Releasing of PUSHPA – 2 – Reg.

We request you to arrange to provide Police Bandobust at SANDHYA 70 MM RTC 'X' Roads, Hyderabad in connection with release of PUSHPA – 2 on 04-12-2024 because there will be heavy fans crowd. The Hero, Heroine and VIPs and Production unit of the film are coming to see the movie.

We are screening picture of Mythri Movies PUSHPA – 2, Star caste: Allu Arjun, Rashmika Mandana and other stars on 04-12-2024 at 9.30 PM and on 05-12-2024 at 01.50 AM, 05-50 AM, 09-50 AM and 01-50 pm (i.e One show on 04-12-2024 and on 05-12-2024 - Four shows) and continues the movie regular.

We thank you for providing the police bandobust.

Yours faithfully,
For SANDHYA CINE ENTERPRISE 70MM
Manager

...Officer, Chikkadpally, Hyd.
2. Traffic PS, Chikkadpally, Hyd.

బందోబస్తు కోసం చిక్కడపల్లి ఏసీపీకి సంధ్య థియేటర్ యాజమాన్యం సమర్పించిన లేఖ.. దానిపై పోలీసుల ఎక్నాలెడ్జ్‌మెంట్

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ వస్తున్నట్టు సమాచారమే లేదని తొక్కిసలాట జరిగిన మరునాడు పోలీసులు ప్రకటించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో వస్తారనే అంచనాతో ఆ మేరకే బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అయితే శుక్రవారం అల్లు అర్జున్ అరెస్టు తర్వాత.. న్యాయస్థానంలో కొత్త వాదన వినిపించారు. ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ వస్తే తొక్కిసలాటకు ఆస్కారం ఉంటుందని.. ఆయన పర్యటన వద్దని థియేటర్ యాజమాన్యానికి చెప్పామని కోర్టుకు పోలీసులు వెల్లడించారు. ఈ నెల 4 నుంచి ఎక్కడా ఈ ప్రస్తావన తీసుకురాని పోలీసులు.. సంధ్య థియేటర్ చిక్కడపల్లి ఏసీపీకి ఇచ్చిన లేఖ ప్రతి బయటికి వచ్చాక కొత్త వాదన లేవనెత్తడంపై చర్చ జరుగుతోంది.

తగిన భద్రతా ఏర్పాట్లలో విఫలం!

ఈ నెల 4న హైదరాబాద్‌లోని పలు థియేటర్లలో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షోలకు ఏర్పాట్లు జరిగాయి. ఆయా థియేటర్ల వద్ద పోలీసులు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. సంధ్య థియేటర్ వద్ద కూడా 20–30 మందిని మోహరించామని అధికారులే ప్రకటించారు. అక్కడ ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ వస్తున్నారంటూ రెండు గంటల ముందు నుంచే ప్రచారం జరిగింది. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు, అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. అల్లు అర్జున్ వాహనాల రాకను గుర్తించినా, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు కాస్త ముందు నుంచీ ఆ వాహనాలు నెమ్మదిగానే వస్తున్నా అడ్డుకునే ప్రయత్నాలు గానీ... అదనపు బలగాల మోహరింపునకు చర్యలుగానీ తీసుకోలేదు.

ఉద్దేశపూర్వకంగానే శుక్రవారం అరెస్టు?

సినీహీరో అల్లు అర్జున్ అరెస్టు విషయంలో ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. మరునాడు రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకుని.. ఉద్దేశపూర్వకంగా, అల్లు అర్జున్‌ను జైలులో ఉంచాలనే ఇలా చేసి ఉంటారని అభిమానులు ఆరోపిస్తున్నారు.

అధికారులపై చర్యలు ఉండవా?

2008 జనవరి 3న విజయవాడలోని కనకదుర్గమ్మ గుడి వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు. అప్పటి ప్రభుత్వం దీనికి బాధ్యులుగా పరిగణిస్తూ నాటి కృష్ణా జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, విజయవాడ పోలీసు కమిషనర్ టి.కృష్ణప్రసాద్‌లను బదిలీ చేసింది. ఇప్పుడు సంధ్య థియేటర్ ఉదంతంలో పోలీసుల నిర్లక్ష్యం కనిపిస్తున్నా... కనీసం కానిస్టేబుల్‌పై కూడా చర్యలు లేకపోవడం ఏమిటని అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

సంధ్య యాజమాన్యం ఏ అధికారినీ కలవలేదు

పోలీసుల బందోబస్తు కోరుతూ సంధ్య థియేటర్ యాజమాన్యం ఏ అధికారిని కలవలేదు. కేవలం ఏసీపీ కార్యాలయ ఇన్‌వార్డు విభాగంలో లేఖను సమర్పించింది. ఆ రోజు సినీనటుడు అల్లు అర్జున్ వచ్చే వరకు థియేటర్ వద్ద ఉన్న అభిమానులు అదుపులో ఉన్నారు. థియేటర్‌కు అల్లు అర్జున్ వచ్చాక తన వాహన సన్ రూఫ్ నుంచి బయటకు వచ్చి అక్కడ గుమికూడి ఉన్న ప్రజలకు చేతులు ఊపడం ప్రారంభించారు. దీంతో అనేకమంది అటు వైపు వెళ్లారు. ఆయన ప్రైవేట్ సెక్యూరిటీ ఆ వాహనానికి దారి కల్పించడానికి ప్రజలను పక్కకు నెట్టడం ప్రారంభించింది. పరిస్థితిని గమనించి ఆయన్ను వెనక్కి తీసుకువెళ్లాలని టీమ్‌కు చెప్పినా, వారు అలా చేయలేదు. అల్లు అర్జున్ రెండు గంటలకు పైగా థియేటర్‌లోనే ఉన్నాడు. ఆయన చర్యలే ఈ దురదృష్టకర సంఘటనకు దారితీశాయి. ఫలితంగా ఓ మహిళ మరణించగా ఆమె కుమారుడు ఇప్పటికీ వెంటిలేటర్‌పై అపస్మారక స్థితిలో ఉన్నాడు. అల్లు అర్జున్ అరెస్టు సమయంలో పోలీసు సిబ్బంది ఆయన భార్య పట్ల దురుసుగా ప్రవర్తించారు అనే ప్రచారంలో వాస్తవం లేదు.

– అక్షాంశ్‌యాదవ్, మధ్య మండల డీసీపీ

సినీ నటులు సైనికులా?

▶ మొదటి పేజీ తరువాయి

చర్చ ఎందుకు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమా థియేటర్ వద్ద తొక్కిసలాటలో చనిపోయిన మహిళ కుటుంబం గురించి ఎవరూ ఎందుకు ప్రశ్నించటంలేదని నిలదీశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం.. శుక్రవారం ఎజెండా ఆజ్‌తక్ కార్యక్రమంలో పాల్గొని పలు అంశాలపై తన అభిప్రాయాలు వెల్లడించారు. 'అల్లు అర్జున్ ఒక సినిమా నటుడు మాత్రమే. సినిమాకు డబ్బులు పెట్టారు.. డబ్బులు వసూలు చేసుకున్నారు'అని సీఎం అన్నారు. ఆయన అరెస్టు విషయంలో తన ప్రమేయం లేదని స్పష్టంచేశారు. 'పుష్ప' ప్రమోషన్ కార్యక్రమంలో అల్లు అర్జున్ తన పేరును చెప్పకపోవటం వల్లనే అరెస్టు చేశారన్న విమర్శలను సీఎం తోసిపుచ్చారు.

రాజ్యాంగం అందరికీ సమానమే..

అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం భారత పౌరులందరికీ సమాన హక్కులు ప్రసాదించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'గతంలో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ ఎందుకు అరెస్ట్ అయ్యారు? దేశంలో సామాన్య ప్రజల నుంచి ప్రధానమంత్రి వరకు అందరికీ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి అనుగుణంగానే చట్టం పనిచేస్తుంది. పుష్ప-2 బెనిఫిట్ షోకు మేమే అనుమతి ఇచ్చాం. కానీ, తొక్కిసలాట జరిగిన థియేటర్ వద్ద సరైన భద్రతా ఏర్పాట్లు చేయని కారణంగానే ఆ ఘటన జరిగింది. తొక్కిసలాటలో ఒక మనిషి ప్రాణం పోయిన తర్వాత కూడా కేసు పెట్టకపోతే సినిమా నటుడికి ఏమైనా కొత్త రాజ్యాంగాన్ని తయారుచేశారా అని మీరే ప్రశ్నిస్తారు కదా? నేరం జరగడానికి కారణం ఎవరు అనేది మాత్రమే ప్రభుత్వం చూస్తుంది. సినిమా స్టార్లు, పొలిటికల్ స్టార్ల కోసం ప్రత్యేకంగా ఏమీ ఉండదు'అని స్పష్టం చేశారు.

అల్లు అర్జున్ హంగామా వల్లే ఘటన

సినిమా థియేటర్ వద్ద అల్లు అర్జున్ హంగామా చేయటం వల్లనే తొక్కిసలాట జరిగిందని సీఎం అన్నారు. 'అల్లు అర్జున్ కారులోంచి బయటికి వచ్చి చేతులూపి హడావుడి చేశారు. దాంతో జనం పెద్ద ఎత్తున ఎగబడ్డారు. కంట్రోల్ కాలేదు. ఆయనను ఈ కేసులో ఏ1గా కాకుండా ఏ11గా చేర్చారు. అక్కడ మహిళ ప్రాణం పోయింది.. అందుకు ఎవరు బాధ్యులు? ఆమె కొడుకు ఇంకా కోమాలోనే ఉన్నాడు. కోమా నుంచి బయటికి వచ్చిన తర్వాత ఆ పిల్లవాడికి పోయిన తల్లిని తెచ్చివ్వగలరా?'అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'అల్లు అర్జున్ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. నేను అతనికి తెలుసు. అల్లు అర్జున్ మామ చిరంజీవి కాంగ్రెస్ మనిషి. ఆయనకు పిల్లనిచ్చిన మామ చంద్రశేఖర్ రెడ్డి నాకు బంధువు. ఈయన కూడా కాంగ్రెస్ నేతనే'అని పేర్కొన్నారు. కాగా తన ఫేవరెట్ హీరో కృష్ణ అని తెలిపారు. 'ఇప్పుడు నేనే ఒక స్టార్‌ను. నాకే ఫ్యాన్స్ ఉంటారు'అని రేవంత్‌రెడ్డి చమత్కరించారు.

రైతులను పట్టించుకోని బీజేపీ: బీజేపీ ఎప్పుడూ దేశం కోసం, రైతుల కోసం పనిచేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వాళ్లు ఇచ్చే నినాదాలకు, క్షేత్రస్థాయిలో చేసే పనికి చాలా తేడా ఉందని అన్నారు. ఈ తేడాను ప్రజలకు సవివరంగా తెలియచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతూ సుమారు 750 మంది రైతులు చనిపోతే.. ప్రధాని మోదీ ఒక్కసారైనా వారి గురించి తెలుసుకునేందుకు ప్రయత్నం చేశారా? అని ప్రశ్నించారు. బీజేపీ నిజ స్వరూపాన్ని ప్రజలకు చూపిస్తే.. వారే ఆ పార్టీని ఓడిస్తారని పేర్కొన్నారు. 11 ఏళ్లలో నరేంద్ర మోదీ ఒక్కసారి కాదు, మూడు సార్లు దేశ ప్రజలను మోసం చేశారని సీఎం విమర్శించారు. రాహుల్, రేవంత్ ట్యాక్స్ (ఆర్‌ఆర్ ట్యాక్స్) అని ఆరోపణలు చేస్తోన్న ప్రధాని నరేంద్ర మోదీ.. అందుకు ఒక్క ఆధారమైన చూపాలని సవాల్ విసిరారు. వచ్చే సంవత్సరం వైబ్రంట్ గుజరాత్ కార్యక్రమానికి పోటీగా తెలంగాణ రైజింగ్ నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకొస్తామని ప్రకటించారు. అదానీ విషయంలో రాహుల్‌గాంధీ బాటలోనే తానూ ఉన్నానని తెలిపారు.

చట్టం తనపని తాను చేసుకుపోతుంది

సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో తన జోక్యమేదీ ఉండదని స్పష్టంచేశారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మరణించారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో నా ప్రమేయం కానీ, జోక్యం కానీ ఏముంటుంది? అంతా చట్టానికి లోబడే ఉంటుంది'అని అన్నారు. మీడియా ప్రతినిధిపై నటుడు మోహన్‌బాబు దాడి చేసిన ఘటనలో కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు నడుచుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణపై ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదంటూ మీడియాపై అసహనం వ్యక్తం చేశారు. తాను ఢిల్లీకి వచ్చిన ప్రతి సారీ కేబినెట్ విస్తరణ అంటూ కథనాలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

2030 @ 20 గిగావాట్ల గ్రీన్‌పవర్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



కేలండర్‌ను ఆవిష్కరించిన భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2030 సంవత్సరం నాటికి విద్యుత్ పొదుపు ద్వారా 20 గిగావాట్ల గ్రీన్ పవర్‌ను వినియోగంలోకి తేవాలని లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డిసెంబర్ 14 నుంచి 20వ తేదీవరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి విద్యుత్ అభివృద్ధి సంస్థ రూపొందించిన 2025 కేలండర్‌ను ఆయన శుక్రవారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ విద్యుత్ పొదుపునకు వీలుగా అన్ని రంగాల్లో టెక్నాలజీ ఆధారిత చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, దీని ప్రకారం 879 కమర్షియల్ భవనాలు తదనుగుణంగా మార్పు చెందడంతో 392.21 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అయ్యిందని వివరించారు.ఈ కార్యక్రమంలో టీజీ రెడ్కో జీఎం ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధిక పాల్గొన్నారు.

'పదేళ్లలో రూ.84 లక్షల కోట్ల ఆర్థిక తెలంగాణ'

'ఐయామ్ ఫెనామ్ ఇండియా'సదస్సులో శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: వచ్చే పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల (రూ.84 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌లు చోదక శక్తులుగా ఈ అసాధారణ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని ఆయన వెల్లడించారు. కృత్రిమ మేధలో దిగ్గజ సంస్థ 'ఫెనామ్'హైటెక్ సిటీలో శుక్రవారం నిర్వహించిన 'ఐయామ్ ఫెనామ్ ఇండియా'సదస్సు ముగింపు సందర్భంగా శ్రీధర్‌బాబు ప్రసంగించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా భవిష్యత్ అవసరాలకు సరిపడా నిపుణులైన మానవ వనరులను అందిస్తామన్నారు. ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించడం ద్వారా యువతలోని పూర్తి సామర్థ్యాలను వెలికితీయడంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఫెనామ్ లాంటి యూనికార్న్ సంస్థలు సహాయ పడాలని కోరారు. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వినియోగం ద్వారా విప్లవాత్మక మార్పులు సృష్టించడంలో ఉన్న అవకాశాలపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 500 మందికి పైగా హెచ్‌ఆర్ నిపుణులు, చీఫ్ ఎక్స్‌పీరియన్స్ అధికారులు, ఆవిష్కర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఒలింపియన్ అభినవ్ బింద్రా, ఫెనామ్ అధ్యక్షుడు, సహ వ్యవస్థాపకుడు హరి బైరెడ్డి, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, ఐటీ వ్యూహకర్త శ్రీకాంత్ లంకా పాల్గొన్నారు.

ఊరూరా ఉద్యమ తెలంగాణ తల్లిని పెడతాం: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని జీవోలు ఇచ్చినా.. కేసులు పెట్టినా ఊరూరా ఊరేగించి మరీ 'ఉద్యమ తెలంగాణ తల్లి'ని నిలుపుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చి చెప్పారు. తెలంగాణ జాగృతి, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి రూపం మార్చేందుకు జీవోలు, బెదిరింపులు ఎందుకని ప్రశ్నించారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కవిత గురువారం మీడియాతో మాట్లాడారు. 'మేము బతుకమ్మను విశ్వవ్యాప్తం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మరుగున పడేసే ప్రయత్నంలో ఉంది. 1978లో వరంగల్ మహిళలతో కలిసి ఇందిరా గాంధీ బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనడం ఒక మధుర స్మృతి అని ప్రియాంకా గాంధీ ట్వీట్ చేశారు. ఓట్ల సమయంలో మాత్రమే కాంగ్రెస్ నాయకులకు బతుకమ్మ గుర్తుకొస్తుంది'అని కవిత మండిపడ్డారు.

14న రౌండ్ టేబుల్ సమావేశం: 'ప్రభుత్వ వేడుకల్లో తెలంగాణ చరిత్ర, ఉద్యమం, అస్తిత్వం, సంస్కృతికి సంబంధం లేని పాటలు పాడుతున్నారు. చరిత్రలో కొన్ని నల్ల పేజీలు మాత్రం రేవంత్ పేరు మీద రాయడం ఖాయం'అని కవిత అన్నారు. తెలంగాణలో సాంస్కృతిక విధ్వంసం, తెలంగాణ తల్లి రూపం మార్చడం తదితరాలపై శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కవిత ప్రకటించారు. సమావేశంలో కవులు, కళాకారులు, మేధావులు, రచయితలు, ప్రొఫెసర్లు పాల్గొంటారన్నారు.

నైతిక విలువలతోనే అభివృద్ధి

- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



దత్తాత్రేయకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

యాదగిరిగుట్ట: ప్రజల్లో ధార్మికత, నైతిక విలువలు, నీతి నిజాయితీ లాంటి మానవ వనరులశక్తి ఎంత పెరిగితే రాష్ట్రం అంత అభివృద్ధి చెందుతుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం ఆయన యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దత్తాత్రేయ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి వారితో మాట్లాడారు.

వేం కృష్ణకీర్తన్‌కు హైకోర్టులో దక్కని ఊరట

- ఓటుకు రూ.కోట్లు కేసులో సమన్ల కొట్టివేతకు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన ఓటుకు రూ.కోట్లు కేసులో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కుమారుడు కృష్ణకీర్తన్‌కు హైకోర్టులో ఊరట దక్కలేదు. ఈడీ కోర్టు జారీ చేసిన సమన్లను కొట్టివేసేందుకు నిరాకరించింది. కృష్ణకీర్తన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2015లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరో ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నోట్ల కట్టలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ దొరికిపోవడంతో కేసు నమోదైంది. దీనిపై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. రేవంత్‌రెడ్డితోపాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహ, సండ్ర వెంకటవీరయ్యతోపాటు రూ.50 లక్షలు సమకూర్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేం కృష్ణకీర్తన్ తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే ఓటుకు రూ.కోట్లు కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నాంపల్లిలోని ఈడీ కోర్టులో 2021లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ ఈడీ కోర్టు నిందితులకు 2021, ఆగస్టు 9న సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను సవాల్ చేస్తూ కృష్ణకీర్తన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈడీ కోర్టు జారీ చేసిన సమన్లను కొట్టివేయలేంటూ.. విచారణకు హాజరు కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేశారు.





రాజ్‌కపూర్ శతజయంతి 1924-2024

జన్మించి నూరేళ్లు.
మరణించి ముప్పై ఆరేళ్లు.
మొదటి సినిమా 'ఆగ్'
వచ్చి 75 ఏళ్లు.
ఇవాళ్టికీ రష్యా వెళితే
వినిపించే పాట 'ఆవారా హూ'...
చైనాలో పలికే
భారతీయ నటుడి పేరు
రాజ్ కపూర్.
'ది గ్రేటెస్ట్ షో మేన్ ఆఫ్ ఇండియా'.

మేరా జూతా హై జపానీ
పంట్లూన్ ఇంగ్లిస్తానీ...
కాని మనసు?
'ఫిర్ భి దిల్ హై హిందూస్తానీ'.
ఉత్సవంలా బతికి ఉత్సవంలా
మరణించినవాడు రాజ్ కపూర్.
'జీనా యహా.. మర్‌నా యహా'
సినిమాను ప్రేమించి
పులకించినవాడు.
అతనికి నివాళి. ఘన స్మరణ.

జీనా ఇసీకా నామ్ హై!

మే 2, 1988.

న్యూఢిల్లీ సిరిఫోర్ట్ ఆడిటోరియమ్... జాతీయ పురస్కారాల ప్రదానం. హాలు కిక్కిరిసి ఉంది. ప్రభుత్వ, సినీ రంగ పెద్దలు ఆసీనులై ఉన్నారు. వేదిక మీద రాష్ట్రపతి ఒక్కొక్కరి పేరు పిలిచి పురస్కారాలు అందిస్తున్నారు.

'ఇప్పుడు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార బహూకరణ. గ్రహీత– రాజ్ కపూర్'.

ఆ పేరు వినగానే ఆడిటోరియం చప్పట్లతో దద్దరిల్లింది. అందరూ వేదిక మీదకు రాబోతున్న రాజ్ కపూర్ కోసం చూస్తున్నారు. కాని ముందు వరుసలో ఉన్న రాజ్ కపూర్ కుర్చీలో నుంచి లేవలేకపోతున్నారు. కొన్ని నిముషాల ముందే ఆయనకు ఆస్తమా అటాక్ వచ్చింది. అలా రాకూడదని రెండు గంటల ముందు హోటల్‌లో ఇంజెక్షన్ చేసుకొని వచ్చారు. అయినా వచ్చింది. సభలో ఉన్నవారి ఎదురు చూపు. లేవలేని తన అశక్తత. మాట పెగలట్లేదు. కాని కళ్లు పని చేస్తున్నాయి. కళాకారుడి కళ్లు అవి. 'నేను వేదిక మీదకు రాలేను రాష్ట్రపతి గారూ'... కళ్లతోనే మొర పెట్టుకున్నారు రాజ్ కపూర్. వేదిక మీద ఉన్న రాష్ట్రపతి కె.వెంకట్రామన్ ఆ కళ్లలోకి చూసి సంగతి గ్రహించారు. ప్రొటోకాల్ పట్టించుకోకుండా స్వయంగా తానే వేదిక దిగి రాజ్ కపూర్ వైపు కదిలారు. ఆయన వస్తుంటే శక్తినంతా కూడగట్టుకుని రాజ్‌కపూర్ లేచి నిలబడ్డారు. 'దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం' సగౌరవంగా ఆయనకు దక్కింది.

రాష్ట్రపతిని స్టేజ్ మీద నుంచి కిందకు వచ్చేలా చేసిన సంఘటన మరొకటి లేదు.

రాజ్ కపూర్ మాత్రం? అలాంటి వాడు మరొకడున్నాడా ఏమిటి?

•••

1955.

జవహర్‌లాల్ నెహ్రూ 'సోవియెట్ యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ రష్యా'ను ప్రధాని హోదాలో సందర్శించారు. ఇరు దేశాల మధ్య స్నేహం వెల్లివిరుస్తున్న సమయం. రష్యన్లను, స్థానిక భారతీయులను ఉద్దేశించి ఇరు దేశాల ప్రధానులు మాట్లాడే సభ. ముందు నెహ్రూ మాట్లాడి జనాన్ని ఉత్సాహపరిచి కూచున్నారు. నెహ్రూ గొప్ప వక్త. రష్యా ప్రధాని నికొలాయ్ బల్గనిన్‌కు నెహ్రూని మించి సభను రక్తి కట్టించాలనిపించింది. తన మంత్రులకు సైగ చేశారు. వాళ్లంతా వచ్చి బల్గనిన్ ఇరు పక్కలా నిలుచున్నారు. నెహ్రూకు ఏం అర్థం కాలేదు. ఒక్కసారిగా రష్యా ప్రధాని, మంత్రులు పాట అందుకున్నారు.



ఆవారా హూ... ఆవారా హూ..
యా గర్దిష్ మే హూ ఆస్‌మాన్‌కా తారాహూ
ఆవారాహూ...

జనం కేరింతలు. నెహ్రూ ఉన్న సభ అది. మార్మోగుతున్నది రాజ్ కపూర్ పేరు.

•••

'ఉదయాన్నే తెల్లబట్టలు వేసుకొని వెళ్లాలి. సాయంత్రానికి దుమ్ము కొట్టుకుపోయి రావాలి' అని చెప్పాడు పృథ్వీరాజ్ కపూర్ తన పెద్ద కొడుకు రాజ్ కపూర్‌ని రంజిత్ స్టూడియోలో పనిలో పెట్టి. మెట్రిక్యులేషన్ తర్వాత 'ఇక చదవను సినిమాల్లో పని చేస్తా' అని రాజ్ కపూర్ కోరడంతో సినిమా తీయాలంటే అన్ని పనులు తెలియాలి అని స్టూడియో పనిలో పెట్టి పృథ్వీరాజ్ కపూర్ అన్న మాట అది. అప్పటికే ప్రాభవంలో ఉన్న నటుడి కొడుకైనప్పటికీ రాజ్ కపూర్ ఒక ఆర్డినరీ క్లాప్ బాయ్‌లానే జీవితాన్ని మొదలుపెట్టాడు. రంజిత్ స్టూడియో, బాంబే టాకీస్, ఫిల్మ్‌స్థాన్... వీటన్నింటిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి చివరకు తండ్రి దగ్గరే పృథ్వీ థియేటర్‌లో చేరితే పది రూపాయల జీతం, రెండు జతల బట్టలు, వానాకాలంలో ఉచితంగా వాడుకోవడానికి రైన్ కోట్, టోపీ దక్కాయి. రాజ్ కపూర్ అలా రాజ్ కపూర్ అయ్యాడు. తెల్లబట్టలు నల్లగా పీలికలయ్యేంతగా కష్టపడ్డాడు. కష్టం చేసేవాడిని అవకాశం వెతుక్కుంటూ వస్తుంది. ఈ నీలికళ్ల అందగాడిలో ఏదో ఉంది అని దర్శకుడు కేదార్ శర్మ రాజ్ కపూర్‌తో హీరోగా అతని మొదటి సినిమా 'నీల్ కమల్' తీశాడు. హీరోయిన్ పదమూడేళ్ల మధుబాల. ఆడలేదు. అయితే సినిమాల్లో ఫస్ట్ టేక్ ఓకే కాకపోతే రీటేక్ చేయొచ్చు. రీటేక్ కోసం మరింత కాన్ఫిడెన్స్ తెచ్చుకోవాలి. తెచ్చుకోనివాడు పోతాడు. రాజ్ కపూర్ పడి లేవడం తెలిసినవాడు.

•••

రాజ్ కపూర్‌కు పెళ్లయ్యింది (1946). ఎవరి దయా దాక్షిణ్యాలపై ఆధారపడకూడదని తానే ప్రొడ్యూసర్‌గా, డైరెక్టర్‌గా 'ఆగ్' (1947) తీశాడు. ఏంటి... మూతి మీద సరిగా మీసాలు కూడా రాని కుర్రాడు సినిమా తీయడమా.. 'ఆగ్' (మంట) అని టైటిలా? సీనియర్ డిస్ట్రిబ్యూటర్లకు ఒళ్లు



మండింది. రాజ్ కపూర్ కనపడితే 'ఏమయ్యా రాజ్. అన్నీ నువ్వే అయ్యి సినిమా తీస్తున్నావ్. సినిమా హాలు కూడా కట్టుకోరాదూ?' అన్నారు. 'హాలెందుకు?' అనడిగాడు రాజ్ కపూర్. 'ఎందుకేంటయ్యా. మంట అంటుకుంటే నీ హాలు బూడిదైతే చాలదా? మావన్నీ ఎందుకు?' అన్నారు. హేళన అలా ఉంటుంది. 'ఆగ్' విడుదలైంది. ఓ మోస్తరుగా ఆడింది. నవ్వులు ఆగాయి. రాజ్‌కు తెలుసు... ఈ ప్రయత్నాలన్నీ అడ్డ పెడలు వేసి సైకిలు తొక్కడమేనని. సీటెక్కి తొక్కే సమయానికి తోటి కుర్రాళ్లు తోడవుతారని. అయ్యారు. కె.ఎ. అబ్బాస్ (రచయిత), శంకర్ జైకిషన్ (సంగీత దర్శకులు), ముకేష్ (గాయకుడు), శైలేంద్ర–హస్రత్ జైపూరి (గీత కర్తలు)... వీళ్ల తోడుగా రాజ్ కపూర్ మరో సినిమా తీశాడు. విడుదలైంది.

బర్సాత్ (1949).

భారీ హిట్. రాజ్ కపూర్ అట... నర్గిస్ అట... పదండి హాళ్లకు... కలుద్దాం వీళ్లను... థియేటర్లలో మంట అంటుకుంది... కలెక్షన్ల మంట... కాసుల మంట.... అగ్గితో కురిసే కుంభవృష్టి.

•••

రాజ్‌కపూర్ టీమ్‌కు ఇద్దరు ముఖ్యమైన స్త్రీలు తోడయ్యారు. నర్గిస్, లతా మంగేష్కర్. 'బర్సాత్'లో నర్గిస్, రాజ్ కపూర్.



ఒక దాని వెంట ఒకటిగా సినిమాలు చేశారు. ఆవారా, ఆహ్, శ్రీ 420, చోరి చోరి.... కేవలం వినోదం రాజ్ కపూర్ ఉద్దేశం కాదు. కథ ఉంటుంది. జనం తమ కథే అనుకునే కథ. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆనాటి రోజుల్లో అగమ్యంగా ఉన్న పేదవాళ్లు, ఎవరికీ పట్టని బీదలకు ప్రతినిధిగా కథానాయకుణ్ణి పెట్టి 'ఆవారా' తీశాడు. పని దొరక్క ఉపాధి కోసం వలసకు బయలుదేరి గ్రామీణ నిష్కల్మషం నుంచి నగర పతనాలకు ప్రయాణిస్తూ నైతిక ఘర్షణను ఎదుర్కొంటున్న యువకులకు ప్రతినిధిగా హీరోని పెట్టి 'శ్రీ420' తీశాడు. చార్లి చాప్లిన్‌ను పోలిన ఆహార్యం, చలాకీతనం, అమాయకత్వం.. తోడుగా వ్యక్తిత్వం ఉన్న పాత్రల్లో నర్గిస్... ఆ జంట పండింది. క్లాసిక్స్ అందరూ తీస్తారు. కాని కొందరు వాటితో అందరినీ తాకుతారు.

సాంస్కృతిక ఆదాన ప్రదానాలలో భాగంగా రష్యాలో సినిమాల విడుదలకు మన దేశం అనుమతించింది. వాటిలో ప్రధానమైనవి రెండు: 'దో భిగా జమీన్' (బిమల్ రాయ్ – 1953), ఆవారా (1951). మాస్కోలో మన ప్రభుత్వం పూనికతో 'దో భిగా జమీన్' పోస్టర్లు ఎక్కువ పడ్డాయి. ఎందుకంటే రష్యన్లు అలాంటి సినిమాలను మెచ్చుతారని. ఒక్కరోజు. రష్యన్లు దో భిగా జమీన్, ఆవారా రెండూ చూశారు. రాత్రికి రాత్రి అంతా మారిపోయింది. మాస్కో అంతా ఎక్కడ చూసినా ఆవారా పోస్టర్లే. 4 రోజుల్లో 15 లక్షల మంది మూడు నగరాల్లో చూశారు. అదీ రాజ్‌కపూర్.

•••

రాజ్ కపూర్ ఏది చేసినా పెద్దగా ఆలోచించి చేసేవాడు. అతడు సన్నివేశాన్ని ముందు సంగీతంతో ఊహిస్తాడని అంటారు. సంగీతం ఇలా ఉంటే సన్నివేశం అలా తీయొచ్చు అనుకుంటాడట. 'ఆవారా'లో డ్రీమ్ సీక్వెన్స్. 'శ్రీ 420'లో 'ప్యార్ హువా ఇక్‌రార్ హువా' పాటకు వేసిన సెట్.. సినిమా అంటే విజువల్స్... మ్యూజిక్.... ఇవి రెండు బెస్ట్‌గా ఉంటే సినిమా హిట్. 'సంగం'కు ఇంకో ఆకర్షణ అమర్చాడు– లొకేషన్స్. విదేశీ లొకేషన్లలో తీసిన మొదటి హిందీ సినిమా అది. భారీ హిట్. ఆ తర్వాతి రోజుల్లో యశ్ చోప్రా ఆ ఫార్ములాను స్థిరపరిచాడు. రాజ్‌కపూర్ గొప్పగా కలగని... కాలం కంటే ముందుకెళ్లి రెండు ఇంటర్వెల్స్‌తో తీసిన 'మేరా నామ్ జోకర్' దెబ్బ కొట్టింది. ఇప్పుడు క్లాసిక్‌గా నిలిచింది. ఆ సినిమాలో మూడు ఎపిసోడ్స్ ఉంటాయి. కౌమార స్థితిలోని రిషి కపూర్, అతని టీచర్‌గా సిమి గెరెవాల్... వీరి ఎపిసోడ్ ఫ్రెంచ్ సినిమాకు తగ్గదని విమర్శకులు మెచ్చుకున్నారు. ఆ ఎపిసోడ్‌ను కొనసాగిస్తూ, 'మేరా నామ్ జోకర్'ను ఫ్లాప్ చేసినందుకు ప్రేక్షకుల మీద ప్రతీకారం తీర్చుకుంటూ రాజ్ కపూర్ తీసిన సినిమాయే 'బాబీ'. ఈ టీనేజ్ లవ్ స్టోరీ నేటికీ వందల భారతీయ సినిమాలకు కథను అందిస్తూనే ఉంది.

•••

రాజ్ కపూర్ ప్రకృతిలోని, మగాడిలోని, స్త్రీలోని స్త్రీత్వాన్ని గొప్పగా పట్టించుకున్న దర్శకుడు. స్త్రీ పురుషుల భావోద్వేగాలను, వీటిని ప్రేరేపించే లేదా నియంత్రించే సాంఘిక పరిమితులు, నియంత్రణలు... వీటినే అతడు ఎక్కువగా కథాంశాలు తీశాడు. అయితే మార్పు గురించి తన తాపత్రయం ఒదులుకోలేదు. 'జాగ్తే రహో', 'బూట్ పాలిష్', 'జిస్ దేశ్ మే గంగా బెహతీ హై', 'దిల్లీ దూర్ నహీ', 'సత్యం శివమ్ సుందరం', 'ఈ దేశంలో బీదవాళ్లు ఎక్కువ. వారు బాగు పడితే దేశం బాగు పడినట్టే' అని రాజ్ కపూర్ అంటారు.

•••

ఉజ్వలమైన కాలాన్ని చరిత్రలో నుంచి తుడిచిపెట్టడం అసాధ్యం. జనులు మెచ్చిన కళాకారుణ్ణి సాంస్కృతిక పుటల్లో నుంచి చెరిపివేయడం దుస్సాధ్యం. దేవ్ ఆనంద్, దిలీప్ కుమార్ అతని సరిజోడిగా గొప్ప ప్రతిభ చాటారు. కాని రాజ్ కపూర్ సినిమానే తన జీవితం చేసుకున్నాడు. సినిమా నుంచి పొందాడు. సినిమాకు ఇచ్చాడు. నటుడుగా, దర్శకుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, గొప్ప సంగీత సాహిత్యాలకు వారధిగా... దేదీప్యంగా నిలిచిన స్ఫూర్తిగా... ఇలా మరొకరు లేరు.

అందుకే రాజ్ కపూర్ శత జయంతి ముగింపును దేశమంతా సగౌరవంగా జరుపుకుంటోంది.

రాజ్ కపూర్‌ను గుర్తు చేసుకోవడం ద్వారా తన సినీ సౌందర్యాన్నీ, సినీ రసాత్మకతను గుర్తు చేసుకుంటోంది.

ఒక పూట వెచ్చించి రాజ్ కపూర్ సినిమాలు చూసినా, పాటలు విన్నా జీవిత కాలం అంటిపెట్టుకొని పోయే ప్రియమైన కళాకారుడతడు. మళ్లీ మళ్లీ పుట్టడు. అతని కాలంలో మనం ఉన్నాం. అతని శత జయంతి ముగింపులోనూ ఉన్నాం. ఎంత సంతోషం. ఈ ఘనత కొనసాగాలి. ది షో మస్ట్ గో ఆన్.

జీనా యహా మర్నా యహా
ఇస్‌కే సివా జనా కహా.



రూట్స్

ఆమె... ఒక హి'స్టోరీ'

ఆ అవ్వని చూస్తే కర్ణాటక వాసి అని ఎవరూ అనుకోరు.

'ఆఫ్రికన్' అనే అనుకుంటారు.

గోపీ సిద్దీ పూర్వీకులు వందల సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి ఇండియాకు తీసుకురాబడ్డారు.

ఇక్కడికి వచ్చిన తరువాత స్థానిక సంస్కృతులతో కలిసిపోయినప్పటికీ, తమ మూల సంస్కృతిని కాపాడుకుంటున్నారు.

సిద్దీస్ జాతి ప్రజలు రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యలతో పాటు తమ సంస్కృతిని తన కథల ద్వారా లోకానికి చాటుతోంది గోపి సిద్దీ.

తులసికొండ(కర్నాటక) ప్రాంతానికి చెందిన కుంటగని గ్రామానికి చెందిన గోపి సన్నా సిద్దీ జనాలకు ఒక వింత. ఒక పురాగాథ. విలువైన కథల చెట్టు.

గోపి సిద్దీస్ అనేది ఆఫ్రికన్ సంతతికి చెందిన ఒక ప్రత్యేక జాతి. బానిసలు, కిరాయి సైనికులుగా, నావికులుగా వీరిని భారతదేశానికి తీసుకువచ్చారు. కాలక్రమంలో వీరు స్థానిక భాషలు నేర్చుకున్నారు. ఇక్కడి సంస్కృతిలో భాగం అయ్యారు. అదే సమయంలో తమ ఆఫ్రికన్ వారసత్వ మూలాలను కాపాడుకున్నారు. సంగీతం నుంచి నృత్యరూపాల వరకు అందులో ఎన్నో ఉన్నాయి.

ఈ సిద్దీలు కర్నాటక, మహారాష్ట్రలలో ఎక్కువగా కనిపిస్తారు.

ఆ బాధ భరించలేనంత!

భాషపరమైన అడ్డంకులు ఉన్నప్పటికీ పట్నం పిల్లలు నా కథలను ఇష్టపడుతుంటారు. వారి అభిమానం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. కథలు చెప్పడం పూర్తయిన తరువాత నన్ను ఆప్యాయంగా కౌగిలించుకొని వీడ్కోలు చెబుతారు. బరువెక్కిన హృదయంతో ఇంటికి వస్తాను. వారిని విడిచి ఇంటికి వస్తుంటే... ఒక్కోసారి ఆ బాధ భరించలేనంతగా ఉంటుంది.

– గోపి సిద్దీ

గోపి సిద్దీ బాల్యంలో కొత్త ప్రాంతానికి వెళితే... 'ఆఫ్రికన్' 'నీగ్రో' అని పిలిచేవారు. 'అలా ఎందుకు పిలుస్తున్నారు?' అని అడిగితే తమ పూర్వీకులు ఆఫ్రికా నుంచి ఇక్కడికి వచ్చారు అని తల్లి చెబుతుండేది.

ఎప్పుడూ ఏవో కథలు వినిపించే గోపి సిద్దీకి ఎన్నో సమస్యలు ఉన్నాయి.

భర్త ఆమెను వదిలేసి మూడు దశాబ్దాలు దాటింది. ఆక్రమణదారుల చెర నుంచి తన వ్యవసాయ భూమిని తిరిగి పొందాలి... ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ తన కథల పుస్తకాలను ప్రచురించాలనే ఉత్సాహం, ఉక్కు సంకల్పంలో మాత్రం మార్పు లేదు. తన పుస్తక ప్రచురణ కోసం నగలు కూడా తాకట్టు పెట్టింది.

తమ జాతి ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు తనలో నుంచి రచయిత్రి బయటికి రావడానికి కారణం అయ్యాయి.

'స్వేచ్ఛ గురించి తపించే దృఢమైన వ్యక్తిత్వం గోపి సిద్దీ సొంతం. జీవితంలో ఆమె ఎన్నో పోరాటాలు చేసింది. గోపి సిద్దీ కథల్లో బాధ మాత్రమే కాదు జ్ఞానం కూడా ఉంటుంది. పర్యావరణ స్పృహ ఉంటుంది. తన తాతల కాలం నుంచి వింటూ పెరిగిన కథలు అవి. తనకు పరిచయం అయిన వారికల్లా ఆ కథలను చెబుతుంది. ఆమె శక్తిమంతమైన రచయిత్రి' అంటుంది 'బుదా ఫోక్‌లోర్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలైన సవితా ఉదయ్.



పిల్లలకు కథలు చెబుతున్న గోపి

పది సంవత్సరాల క్రితం తన ఇంట్లో పని చేయడానికి ఒక పనిమనిషిని వెదుకుతున్న సమయంలో ఉదయ్‌కు గోపీతో పరిచయం ఏర్పడింది.

మారుమూల గ్రామానికి పరిమితమైన గోపి సిద్దీ జీవిత కథను తన డాక్యుమెంటరీ ద్వారా అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాడు బెంగళూరుకు చెందిన నిశాంత్ గురుమూర్తి. తన స్వచ్ఛంద సంస్థ 'బుదా ఫోక్‌లోర్' ద్వారా జానపదల కథానిలయమైన గోపి సిద్దీతో కర్ణాటక అంతటా పాఠశాల విద్యార్థులతో కథా సెషన్‌లు నిర్వహిస్తోంది సవితా ఉదయ్. కొంకణీ, కన్నడ భాషలలో ఆమె చెప్పే కథలకు పిల్లలు ఫిదా అవుతుంటారు.

పెరగాల్సింది బలం... బరువు కాదు!

రోజంతా పని చేయాలంటే శక్తి ఉండాలి. అందుకోసం కడుపు నిండా తినాలి. కంటినిండా నిద్రపోవాలి. ఈ రొటీన్‌లో ఏం తింటున్నామో తెలియకపోతే స్లిమ్‌గా ఉండడం కష్టం. ఆహారం బలాన్ని పెంచాలి కానీ బరువును పెంచకూడదు. నాజూగ్గా ఉండే జాన్వి కపూర్... అంత స్లిమ్ గా, ఎనర్జిటిక్‌గా ఉండడానికి ఏం తింటుంది? డిన్నర్‌లో రాగి – చిలగడ దుంప (స్వీట్ పొటాటో) పరాఠా తింటానని చెప్పింది. ఆమె షెఫ్ ఎలా వండుతున్నారో చూద్దాం.

రాగి-చిలగడ దుంప పరాఠా

వంటిల్లు

కావలసినవి: చిలగడ దుంప – ఒకటి (పెద్దది); రాగి పిండి – 250 గ్రాములు; **నువ్వులు**– టీ స్పూన్; **కొత్తిమీర తరుగు** – 2 టేబుల్ స్పూన్‌లు; **అల్లం తురుము** – అర టీ స్పూన్; **పచ్చిమిర్చి**– 2 (సన్నగా తరగాలి); **ఉల్లిపాయ**– ఒకటి (సన్నగా తరగాలి); **జీలకర్ర పొడి**– అర టీ స్పూన్; **మిరప్పొడి**– అర టీ స్పూన్; **ఉప్పు** – అర టీ స్పూన్ లేదా రుచిని



బట్టి; **మిరియాల పొడి**– అర టీ స్పూన్; **నెయ్యి** – టేబుల్ స్పూన్;

తయారీ

- ఒక పాత్రలో పావు లీటరు నీటిని పోసి వేడి చేయాలి. అందులో నెయ్యి (సగం మాత్రమే), నువ్వులు, కొద్దిగా ఉప్పు, రాగి పిండి వేసి కలుపుతూ రెండు నిమిషాల పాటు ఉడికించి స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తర్వాత ఈ మిశ్రమాన్ని చేత్తో అదుముతూ పూరీల పిండిలా కలిపి పాత్ర మీద మూత పెట్టి పక్కన పెట్టాలి.
- ఈ లోపు ప్రెషర్ కుక్కర్‌లో నీటిని పోసి గెణుసుగడ్డను ఉడికించాలి. వేడి తగ్గిన తరవాత తొక్కు వలిచి మరొక పాత్రలో వేసి చిదమాలి. ఇందులో కొత్తిమీర, పచ్చిమిర్చి, అల్లం, ఉల్లిపాయ, జీలకర్ర పొడి, మిరప్పొడి, ఉప్పు, మిరియాల పొడి కలిపి ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ముద్దలు చేయాలి.
- రాగి పిండి మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి. ఒక్కొక్క గోళీని చపాతీల పీట మీద వేసి కొద్దిగా వత్తి అందులో గెనుసు గడ్డ మిశ్రమాన్ని పెట్టి అంచులు మూసేయాలి. ఆ తరవాత జాగ్రత్తగా (లోపలి మిశ్రమం బయటకు రాకుండా) పరాఠా చేసి వేడి పెనం మీద వేసి నెయ్యి రాస్తూ కాల్చాలి.

వికాసం

మైండ్ స్పోర్ట్స్



ముగ్ధ బవరే

'ఆలోచనల గురించి పెద్దగా ఆలోచించవద్దు' అనుకునేవాళ్లకు ముగ్ధ బవరే చెప్పే మాట...

'మన ఆలోచనలే మన పనితీరును ప్రభావితం చేస్తాయి'

ముగ్ధ ఒకప్పుడు ప్రతిభావంతురాలైన స్విమ్మర్. స్పోర్ట్స్ సైకాలజీపై పెద్దగా అవగాహన లేని కాలంలో ఎంతోమంది అథ్లెట్ల మనసును అధ్యయనం చేసింది. క్రికెట్ టీమ్ నుంచి మొదలు ఒలింపిక్, పారాలింపిక్ అథ్లెట్ల వరకు ఎంతోమంది అథ్లెట్లతో కలిసి పనిచేసింది.

మానసిక సమస్యలు, ఒత్తిడి, ప్రతికూల ఆలోచనలతో పోరాడడానికి వారికి మార్గం చూపిన ముగ్ధ ప్రస్తుతం 'మైండ్ స్పోర్ట్స్' పేరుతో సొంతంగా ప్రాక్టీస్ నిర్వహిస్తోంది. ఎంతోమంది అథ్లెట్లకు దిశానిర్దేశం చేస్తోంది. 'మైండ్ స్పోర్ట్స్'పై పుస్తకం కూడా రాసింది.

ఒక అథ్లెట్ మనసు మార్చడానికి ఏ అంశాలు ఉపయోగపడతాయో ఈ పుస్తకంలో వివరించింది.

'ఒక అథ్లెట్ మనసు ఇతర ప్రొఫెషనల్స్ కంటే ఏ రకంగా భిన్నంగా ఉంటుంది?' అనే ప్రశ్నకు ముగ్ధ బవరే చెప్పే జవాబు...

'పూర్తిగా భిన్నం కాదు. మనం ఆలోచించే విధానం స్పోర్ట్స్ అయినా కార్పొరేట్ అయినా తేడా తీవ్రంగా ఉండకపోవచ్చు. అందుకే ఏ రంగంలోనైనా మానసిక శిక్షణ(మెంటల్ ట్రెనింగ్) చాలా కీలకం. మనం ఆలోచించే విధానమే మన పనితీరును ప్రభావితం చేస్తుంది. సక్సెస్ మాత్రమే సర్వస్వం అనుకునేచోట వైఫల్యం బాధ పెడుతుంది. చాలామందిని కోలుకోకుండా చేస్తుంది. అయితే గెలుపు, ఓటములు ప్రతిభకు, ప్రతిభ లేకపోవడానికి నిర్వచనం కాదనే అవగాహన ప్రస్తుత కాలంలో పెరిగింది'

కిచెన్ టిప్స్



- కిచెన్ ర్యాక్స్‌లో బొద్దింకలు తిరుగుతూ చికాకు పెడుతుంటాయి.. ర్యాక్స్‌లో అక్కడక్కడా బిర్యానీ ఆకులను ఉంచితే, బొద్దింకలు చేరవు.
- వేడిగా ఉన్న ఆయిల్‌లో టొమాటో, ఉల్లిపాయ పేస్టు వేసినప్పుడు నూనె ఒక్కసారిగా చిందుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే.. కాగిన నూనెలో ముందుగా నీళ్లు కలిపిన పసుపు మిశ్రమం కొద్దిగా వేసి బాగా కలపాలి. తరువాత ఉల్లిపాయ, టొమాటో పేస్ట్ వేస్తే ఆయిల్ పైకి చిందదు.
- మురికిపట్టిన గ్యాస్ లైటర్‌ను ముందుగా కొద్దిగా ఫ్లోర్ క్లీనర్ వేసి తుడవాలి. తరువాత నిమ్మచెక్కకు కొద్దిగా బేకింగ్ సోడా అద్ది లైటర్‌పై ఉన్న మొండి మరకలపై రుద్దితే కొత్తదానిలా మెరుస్తుంది.

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

నువ్వులతో చుండ్రుకి చెక్



- కప్పు నల్లనువ్వులను తీసుకుని మెత్తగా పొడి చేసి పక్కన పెట్టుకోవాలి.
- అరలీటరు కొబ్బరి నూనెను మందపాటి పాత్రలో పోయాలి. దీనిలో నువ్వులపొడి, నాలుగు మందార పువ్వులు, పది కరివేపాకులు వేసి సన్నని మంటమీద మరిగించాలి.
- మందారపువ్వులు, కరివేపాకు వేగాక నూనెను దించేసి చల్లారనిచ్చి, ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవాలి. రెండురోజులకొకసారి ఈ ఆయిల్‌ను తలకు పట్టించి మర్దన చేసి నాలుగు గంటల తరువాత తలస్నానం చేయాలి.
- క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల చుండ్రు తగ్గడమేగాక, బాల నెరుపు నియంత్రణలో ఉంటుంది. జుట్టుకూడా ఒత్తుగా పెరుగుతుంది.
- తెల్లనువ్వుల్లో పోషకాలు ఉంటే నల్ల నువ్వుల్లో ఒమేగా 3, 6 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మాడుని తేమగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి మాడుని పొడిబారకుండా చేసి, చుండ్రుని తగ్గిస్తాయి.
- యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చుండ్రుని మరింత విస్తరించకుండా నియంత్రిస్తాయి.



అందరికీ 7-8 గంటల నిద్ర అవసరమని అందరికీ తెలిసిందే. అయితే ఎనిమిది గంటలసేపు నిద్రపోయిన తర్వాత కూడా, ఉదయం ఇంకా రిఫ్రెషింగ్‌గా లేకుండా, ఇంకా అలసటగా... బద్ధకంగా ఉన్నట్లయితే నిద్ర సరిపోలేదని అర్థం. అయితే స్త్రీల విషయంలోనే! అందరికీ కాదు. వినడానికి విడ్డూరంగా ఉన్నా, ఇది అక్షరాలా నిజం. వైద్య పరిశోధకులు వివరణాత్మకంగా చెప్పిన విషయమే.

అవును... ఆమెకు కొంచెం ఎక్కువ నిద్ర అవసరం

పురుషులు 7-8 గంటల నిద్రలో బాగా పని చేయగలిగినప్పటికీ, మహిళలకు నిద్రకు మరికాస్త ఎక్కువ సమయం అవసరం. మహిళలకు ఎక్కువ నిద్ర ఎందుకు అవసరమో తెలుసుకునే ముందు, నిద్ర గురించి మరికొంత అర్థం చేసుకుందాం.

మంచి నిద్ర ఎందుకు ముఖ్యం?

మంచి నిద్ర మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. మెరుగైన గుండె ఆరోగ్యం, జీవక్రియలు, చర్మం, జుట్టు నాణ్యతను, దీర్ఘాయువును ప్రోత్సహిస్తుంది. నాణ్యమైన నిద్ర మీ భావోద్వేగాలను మెరుగ్గా నిర్వహించడానికి కూడా మిమ్మల్ని సన్నద్ధం చేస్తుంది. కంటినిండా నిద్రపోయేవారికి ఆందోళన, డిప్రెషన్ స్థాయిలు తక్కువ గా ఉండటం వల్ల వారు కార్యాలయాల్లో మెరుగైన పనితీరును కనబరుస్తున్నట్లు రుజువైంది.

నాణ్యమైన నిద్ర చాలా ముఖ్యం

ఆర్టెమిస్ హాస్పిటల్‌లోని పల్మోనాలజీ అండ్ స్లీప్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ అరుణ్ కొటారు, నిద్ర సమయంలో శరీరం కణజాల మరమ్మత్తు, కండరాల పెరుగుదల, హార్మోన్ నియంత్రణ వంటి ముఖ్యమైన ప్రక్రియలకు లోనవుతుందని అంగీకరిస్తున్నారు. 'దీర్ఘకాలిక నిద్ర లేమి శారీరక, మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది. ఇది మన మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే సామర్థ్యాలను దెబ్బతీస్తుంది, ఉత్పాదకత తగ్గుతుంది. ప్రమాదాల ప్రమాదాన్ని పెంచుతుంది' అని ఆయన చెప్పారు.

పురుషుల కంటే మహిళలకు 20 నిమిషాలు ఎక్కువ నిద్ర అవసరమని ఇటీవలి పరిశోధనలో తేలింది. 'మెదడు కోలుకోవడానికి, రిపేర్ చేసుకోవడానికి నిద్ర చాలా ముఖ్యం. మహిళల్లో నిద్ర, నిద్ర రుగ్మతలకు సంబంధించి తక్కువ డేటా అందుబాటులో ఉన్నప్పటికీ, రోజువారీ కార్యకలాపాల నుండి కోలుకోవడానికి పురుషుల కంటే మహిళలకు ఎక్కువ నిద్ర అవసరమని పరిశోధనలు సూచిస్తున్నాయి' అని డాక్టర్ చెప్పారు.

నిద్రకు సంబంధించి స్త్రీ పురుషులలో వ్యత్యాసం చాలా ఎక్కువని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. కానీ వివిధ కారణాల రీత్యా పురుషుల కన్నా స్త్రీలకు కేవలం 11 నుంచి 13 నిమిషాల అధిక నిద్ర సరిపోతుందని పరిశోధకులు చెబుతున్నారు. అలాగని వారికి కావలసిన అధిక నిద్రను సమస్యలా చేసి చూపడం లేదా వారికి ఎక్కువ నిద్ర కావాలనడాన్ని అంగీకరించకపోవడం వల్ల అసలే నిద్రలేమితో సతమతమవుతున్న మహిళలు మరింత ఒత్తిడికి గురవుతారు. దీని గురించి ఆలోచిస్తూ వారు సరిగ్గా నిద్రపోలేరు. దీంతో సమస్య మళ్లీ మొదటికొస్తుంది. ఇది చాలా సమస్యలను కొనితెస్తుంది.

ఏది ఏమైనప్పటికీ పురుషుల కన్నా స్త్రీలకు ఎక్కువ నిద్ర అవసరమే అన్నది నిర్వివాదాంశం. అయితే వారు మరికాసేపు ప్రశాంతంగా పడుకునేందుకు పురుషుల సహకారం పూర్తిగా అవసరం. ●

వయసును బట్టి నిద్ర అవసరాలు



నవజాత శిశువులు, పసిబిడ్డలకు ఎక్కువ నిద్ర అవసరం. సరైన ఆరోగ్యం, పనితీరు కోసం సగటున, పెద్దలకు సాధారణంగా రాత్రికి 7-9 గంటల నిద్ర అవసరం. వయస్సుతో పాటు నిద్ర అవసరాలు కొద్దిగా తగ్గవచ్చు, వృద్ధులకు ఇప్పటికీ రాత్రికి 7-8 గంటల నిద్ర అవసరం.

● యోగా

ముక్కోణంతో మజిల్స్‌కు బలం



వెన్నునొప్పిని తగ్గించడానికి, కండరాలను బలోపేతం చేయడానికి త్రికోణాసనం సహాయపడుతుంది. సయాటికా సమస్యను తగ్గించడానికి ప్రభావ వంతంగా పనిచేస్తుంది. ఈ ఆసనంలో వెన్నెముక, చేతులు, ఛాతీ స్ట్రెంచింగ్ అవుతాయి. దీనివల్ల కండరాలు దృఢపడతాయి.

త్రికోణాసనం వేయాలంటే...

● ముందు పాదాలను దూరంగా పెట్టి నిటారుగా నిల్చోవాలి. ● తర్వాత చేతులను రెండువైపులకు చాచాలి. దీర్ఘ శ్వాస తీసుకోవాలి. ● నెమ్మదిగా శ్వాస వదులుతూ తుంటి నుంచి శరీరాన్ని కుడివైపునకు వంచాలి. ● ఇలా వంచేటప్పుడు కూడా నడుము నిటారుగానే ఉంచాలి.
● ఎడమ చేయిని పైకెత్తి, కుడి చేతిని కుడి పాదానికి తాకించాలి. ● చేతులు రెండూ ఒకే వరుసలో ఉండేలా చూసుకోవాలి. ● తల కుడివైపునకు తిప్పి, ఎడమ చేయిని చూడాలి.
● తర్వాత శ్వాస తీసుకుంటూ యథాస్థితికి రావాలి. ఆ తర్వాత.. మరోవైపున కూడా ఇలాగే చేయాలి. ఈ ఆసనాన్ని రోజూ సాధన చేయడం వల్ల శరీరమంతా స్ట్రెచ్ అవడంతో పాటు, మానసిక శారీరక ఒత్తిడులు తగ్గుతాయి.



– అనూషా కార్తీక్

● ఏం తినాలి

వర్కవుట్స్ డైట్... డౌట్





శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం కోసం వర్కవుట్లు చేయాలని సలహా ఇస్తుంటారు అందరూ. అయితే కేవలం ఎక్సర్‌సైజ్ చేయడంతోనే సరిపోదు, వ్యాయామం చేయక ముందు, చేసిన తర్వాత తీసుకునే ఆహారాలను బట్టి కూడా దాని ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఒక క్రమపద్ధతిలో చేస్తేనే ఫలితం కనిపిస్తుంది. ఈ విషయంలో నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.

ఏ వయసువారికైనా ఆరోగ్యంగా ఉండడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి వ్యాయామం చేయడానికి ముందు, చేసిన తర్వాత ఏం తినాలో తెలుసుకోవడం అవసరం. అందువల్ల వ్యాయామం చేసే ముందు, తర్వాత ఏం తినాలి..? అనేదానిని ఇక్కడ చూద్దాం.

వర్కౌట్స్‌కు ముందు..?

ఎక్సర్‌సైజ్‌లు చేయడానికి కొద్దిసేపటి ముందే ఏదైనా తినడం మంచిది కాదు. దానివల్ల కొన్ని సమస్యలు వస్తాయి. అందువల్ల తిన్న వెంటనే వర్కవుట్స్‌కి దిగకుండా కొంత గ్యాప్ ఇవ్వాలి. వ్యాయామానికి కనీసం అరగంట నుంచి గంట ముందు అల్పాహారం పూర్తి చేయాలి. అలాగే కసరత్తులు చేసిన తర్వాత కూడా శరీరానికి శక్తి కావాలి. అందుకే వ్యాయామం అయిన తర్వాత గంటలోపు మీకిష్టమైన పోషకాలున్న ఆహారాన్ని తినాలి. ఆ ఆహారం కొవ్వులు, పిండి పదార్థాల మిశ్రమంగా ఉండాలి.

ఇక వ్యాయామం ముగిసిన తర్వాత బాడీ అలసిపోతుంది. ఈ సమయంలో శరీరానికి శక్తి ఎంతో అవసరం. అదే సమయంలో కసరత్తుల వల్ల ఖర్చైపోయిన శక్తిని పొందడానికి వోట్ మీల్, క్వినోవా, గుడ్లు, చికెన్, చేపలు, గింజలు, మొలకెత్తిన విత్తనాల వంటివి తీసుకోవాలి. వ్యాయామానికి ముందు, తర్వాత కూడా నీళ్లు తాగొచ్చు. ముఖ్యంగా ఎక్సర్‌సైజ్ చేయడానికి ముందు సుమారు 2 నుంచి 3 కప్పుల నీళ్లు తాగాలి. ఇక అయిపోయిన తర్వాత కూడా అంతే పరిమాణంలో తాగాలి.



ఏం తినకూడదు.?

వ్యాయామానికి ముందు గానీ, తర్వాత గానీ కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలను గానీ, నిల్వ ఉంచిన ఆహారాలను గానీ అస్సలు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది.

కసరత్తులు చేస్తున్నప్పుడు..

హెవీ వెయిట్లు లేపడం, ఎక్కువ క్యాలరీలు ఖర్చయ్యే వ్యాయామాలు చేస్తే.. ప్రతి అరగంటకు 50 నుంచి 100 కేలరీల ఆహారం తీసుకోవాలి. దీనికోసం తక్కువ కొవ్వు ఉన్న పెరుగు, ఎండు ద్రాక్ష లేదా అరటి పండు తీసుకోవాలి.

ముత్యమంత పసుపు ముక్కైనా చాలు



పసుపులో ఎన్నో పోషకాలు, మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మారిన పరిస్థితుల కారణంగా పసుపు వాడకం చాలా ఎక్కువ అయింది. ముఖ్యంగా పచ్చిపసుపును విరివిగా వాడుతున్నారు. అయితే ఎలా పడితే అలా కాకుండా పద్ధతి ప్రకారం పచ్చిపసుపును వాడటం వల్ల అధిక ప్రయోజనాలున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అవేమిటో చూద్దాం...

పసుపును కొన్ని ఆయుర్వేద ఔషధాలలో చాలా కాలంగా ఉపయోగిస్తున్నారు. వంటలో కూడా ఉపయోగిస్తారు. గ్లాసుడు వేడిపాలలో చిటికడు పసుపు కలుపుకుని తాగడం వల్ల ఒళ్లు నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. అంతేకాదు, జలుబు, దగ్గు తగ్గుతాయి. శరీరంలో అధికంగా ఉన్న చెడు కొవ్వు కూడా కరిగిపోతుంది. అలాగని పసుపును ఎక్కువగా తీసుకోవడం వల్ల కొన్ని సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.



ఇలా వాడాలి!

పచ్చి పసుపుతో ఆయుర్వేదిక్ టీలు, సూప్‌లు, స్మూతీస్ వంటివి తయారు చేసుకోవచ్చు. ఇది వంటకాలకు మంచి రంగు, రుచి, వాసనలను జత చేస్తుంది. అయితే పసుపు పొడిని మరిన్ని అవసరాలకు వాడొచ్చు. మారినేషన్, మసాలాలు, సాస్‌లు, డ్రింక్స్‌లో దీన్ని యాడ్ చేసుకోవచ్చు.

పసుపు టీ: రెండంగుళాల పొడవున్న తాజా పచ్చిపసుపు కొమ్మును తీసుకుని దాని మీదుండే పొరను తీసేయాలి. దానిని సన్నటి ముక్కలుగా తరుక్కోవాలి. స్టవ్ మీద మరుగుతున్న గ్లాసున్నర నీటిలో ఆ ముక్కలు వేయాలి. దానికి చిటికెడు మిరియాల పొడి, కాస్తంత బెల్లం తరుగు జతచేయాలి. కాగిన తర్వాత కొద్దిగా నెయ్యి లేదా వర్జిన్ కోకోనట్ ఆయిల్ కలిపి ఒక నిమిషం పాటు మరిగిన తర్వాత స్టవ్ మీది నుంచి దించి వడపోసి గ్లాసులో పోసుకుని టీలాగే సిప్ చేయాలి.



స్మూతీస్‌లో కలపడం...

పైనాపిల్, మ్యాంగో, ఇతర రకాల పండ్ల ముక్కలతోపాటు సన్నగా తురుమిన పచ్చి పసుపు కొమ్ము, కొబ్బరినీళ్లు, బాదం పాలు కలిపి చేసిన స్మూతీ తీసుకోవడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. నిమ్మరసం, అల్లం రసం, మిరియాల పొడి, కొబ్బరి నీళ్లు లేదా గోరువెచ్చటి నీళ్లలో చిటికడు పచ్చిపసుపు కలిపి వడకట్టి తాగితే జలుబు, దగ్గు, ఒంట్లో వాపులు తగ్గుతాయి.



వెజిటబుల్ సలాడ్‌తో...

టమోటా, దోస, బీర, బెండ, క్యారట్, బీట్‌రూట్, ముల్లంగి, స్ప్రింగ్ ఆనియన్స్ తదితర కూరగాయల ముక్కల మీద పసుపు, మిరియాలపొడి చల్లుకుని తింటే మంచిది.

పసుపు నీళ్లు...

తేలికైన మార్గం ఏమిటంటే... తాజా పసుపు కొమ్మును పొట్టు తీసి ముక్కలుగా తరిగి వాటర్ బాటిల్‌లో వేయాలి. కొన్ని గంటల తర్వాత ఆ నీటిని తాగుతూ ఉంటే పసుపులో ఉన్న లక్షణాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

సరికొత్త లుక్‌లో...



● విక్రమ్

హీరో విక్రమ్ 63వ చిత్రం షురూ అయింది. 'చియాన్ 63' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. 'మండేలా, మావీరన్' (తెలుగులో 'మహావీరుడు') వంటి చిత్రాలతో ప్రశంసలు అందుకున్న దర్శకుడు మడోన్ అశ్విన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. శాంతి టాకీస్‌పై అరుణ్ విశ్వ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా అరుణ్ విశ్వ మాట్లాడుతూ– ''దేశంలోని అత్యుత్తమ నటుల్లో ఒకరైన విక్రమ్‌తో కలిసి మా ప్రొడక్షన్ నంబర్ 3ని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. మనకు ఎన్నో చిరస్మరణీయమైన పాత్రలు, సంచలనాత్మక చిత్రాలను అందించిన విక్రమ్ గారితో సినిమా నిర్మించనుండటం మాకు గౌరవం. మడోన్ అశ్విన్‌తో రెండో సినిమా చేయనుండటం చాలా ఆనందంగా ఉంది. విక్రమ్‌గారికి కరెక్టుగా సరిపోయే కథతో ఆయన్ని సరికొత్త లుక్‌లో చూపించబోతున్నారు మడోన్ అశ్విన్. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని చెప్పారు.

అందుకే ఆ నిర్ణయం తీసుకున్నా! – నయనతార



''విఘ్నేశ్ శివన్, నేను కలిసి ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే ఎక్కువగా నెగటివ్ కామెంట్స్ పెడుతున్నారు. అందుకే ఎక్కువ సార్లు మా ఫొటోలు పోస్ట్ చేయకూడదనే నిర్ణయం తీసుకున్నాను'' అని హీరోయిన్ నయనతార తెలిపారు. విజయ్ సేతుపతి, నయనతార జంటగా నటించిన 'నేను రౌడీనే' (2015) చిత్రానికి విఘ్నేశ్ శివన్ దర్శకుడు. ఆ సినిమా సమయంలో నయన్–విఘ్నేశ్‌ల మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారడం.. ఆ తర్వాత 2022 జూన్ 9న పెళ్లి చేసుకోవడం తెలిసిందే. సందర్భం వచ్చినప్పుడల్లా పరస్పరం ప్రేమను వ్యక్తపరుచుకుంటూ ఇద్దరూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేస్తుంటారు. అయితే కొన్ని రోజులుగా విఘ్నేశ్‌తో దిగిన ఫొటోలను నయనతార పోస్ట్ చేయకపోవడంపై రకరకాల పుకార్లు వినిపించాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నయనతార ఈ విషయంపై స్పందించారు.

''నా జీవితంలోకి విఘ్నేశ్ వచ్చాక ఆనందంగా ఉన్నానని చెబితే చాలు.. అన్నీ నెగటివ్ కామెంట్స్ పెడుతున్నారు. ఈ కారణంగానే విఘ్నేశ్ గురించి ఓపెన్‌గా మాట్లాడలేని స్థితిలో ఉన్నాను. అందుకే మా ఇద్దరి ఫొటోలు పోస్ట్ చేయడం మానేశాను. అయితే షూటింగ్ కోసం విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రం తనని మిస్ అవుతాను. అప్పుడు మాత్రం ఫొటోలు షేర్ చేస్తున్నాను. కొందరైతే విఘ్నేశ్‌ను ద్వేషించడమే పనిగా పెట్టుకున్నారు. బహుశా తను తీసిన మూవీస్ హిట్ కాకపోవడం వల్లో.. లేదంటే నేను అప్పటికే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందడం వల్లో తెలియదు కానీ, నన్ను విఘ్నేశ్‌తో పోలుస్తూ... అతడిని నిందించడం అన్యాయం. ఒకవేళ తన స్థానంలో నేను ఉంటే ఇలానే నిందిస్తారా? అని ఎన్నోసార్లు అనుకున్నాను'' అన్నారు. కాగా నయనతార–విఘ్నేశ్‌లకు ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్న సంగతి తెలిసిందే.

ప్రేమ కథకు వారధి



● అనిల్, విహారిక

అనిల్ అర్కా, విహారికా చౌదరి జంటగా శ్రీ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వారధి'. రాధాకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై పెయ్యాల భారతి, ఎం.డి. యూనస్ నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా తాజాగా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ మాట్లాడుతూ– ''యువతను ఆకట్టుకునే ప్రేమ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాలు 'వారధి'లో ఉన్నాయి. యూత్‌ఫుల్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కథ, కథనాలు, నటీనటుల అభినయం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయి'' అని తెలిపారు. ప్రశాంత్ మదుగుల, రిధి ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: శక్తి జేకే, సంగీతం: షారుఖ్ షేక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బి.ఎస్. చందు.

శివానీ శివాజీ రాయ్ నాకు చాలా ప్రత్యేకం



● రాణీ ముఖర్జీ

బాలీవుడ్ హీరోయిన్ రాణీ ముఖర్జీ ప్రధాన పాత్రలో నటించనున్న 'మర్దానీ 3' సినిమా ప్రకటన వచ్చింది. ప్రదీప్ సర్కార్ దర్శకత్వంలో రాణీ ముఖర్జీ లీడ్ రోల్ చేసిన 'మర్దానీ' చిత్రం 2014 ఆగస్టు 22 విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ సినిమాకి సీక్వెల్‌గా గోపీ పుత్రన్ డైరెక్షన్‌లో రూపొందిన 'మర్దానీ 2' సినిమా 2019 డిసెంబరు 13న రిలీజై బ్లాక్‌బస్టర్ అయింది. తొలి, ద్వితీయ భాగాల్లో సిన్సియర్ పోలీసాఫీసర్ శివానీ శివాజీ రాయ్ పాత్రలో రాణీ ముఖర్జీ నటనకు ప్రశంసలు దక్కాయి. ఇక 'మర్దానీ 2' ఐదవ వార్షికోత్సవం సందర్భంగా 'మర్దానీ 3'కి సంబంధించిన మేకింగ్ వీడియోను యశ్ రాజ్ ఫిల్మ్స్ విడుదల చేసింది. ఈ చిత్రానికి అభిరాజ్ మినవాలా దర్శకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా రాణీ ముఖర్జీ మాట్లాడుతూ– ''2025 ఏప్రిల్‌లో 'మర్దానీ 3' చిత్రం షూటింగ్‌ను ప్రారంభించబోతున్నామని తెలియజేయటానికి ఎంతో సంతోషంగా ఉంది. పోలీస్ డ్రెస్ వేసుకుని అద్భుతమైన పాత్ర (శివానీ శివాజీ రాయ్) ను చేయటం నాకెప్పుడూ ప్రత్యేకమే. ఈ పాత్ర చేయటం ద్వారా ప్రేక్షకుల నుంచి నాకు అపరిమితమైన ప్రేమాభిమానాలు లభించాయి. 'మర్దానీ 3'లోనూ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనుండటం ఎంతో గర్వంగా ఉంది. మనల్ని కంటికి రెప్పలా కాపాడుతూ, విధి నిర్వహణలో ప్రాణ త్యాగానికి సైతం వెనుకాడని ధైర్యవంతులైన పోలీస్ ఆఫీసర్స్‌కి ఈ సినిమా అంకితం. తొలి, మలి భాగాలను మించేలా 'మర్దానీ 3'లో గొప్ప సన్నివేశాలున్నాయి'' అని తెలిపారు. కాగా 'రైల్వే మెన్' మూవీ ఫేమ్ ఆయుష్ గుప్తా 'మర్దానీ 3'కి స్క్రిప్ట్‌ను అందించారు.

రామ్‌చరణ్‌కి రంగస్థలంలా నరేశ్‌కి బచ్చల మల్లి – రాజేశ్ దండా

''జీవితంలో తప్పులు చేయొచ్చు. కానీ, సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే ఎలా ఉంటుందో 'బచ్చల మల్లి' సినిమాలో చూపించాం. మూర్ఖత్వం అనేది హద్దులు దాటిన మల్లి కథ ఇది. డైరెక్టర్ సుబ్బు చాలా కష్టపడి ఈ సినిమా తీశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే రామ్‌చరణ్‌గారి కెరీర్‌లో 'రంగస్థలం' సినిమా ఎలానో నరేశ్‌గారికి 'బచ్చల మల్లి' అలాంటి సినిమా అవుతుంది'' అని నిర్మాత రాజేశ్ దండా తెలిపారు. 'అల్లరి' నరేశ్, అమృతా అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజేశ్ దండా విలేకరులతో మాట్లాడుతూ– ''బచ్చల మల్లి' మంచి ఎమోషనల్, ఫ్యామిలీ, లవ్, యాక్షన్ డ్రామా... ఇవన్నీ నన్ను బాగా ఎగ్జయిట్ చేశాయి. అయితే నరేశ్‌గారు వేరే సినిమాలు ఒప్పుకొని ఉండటం వల్ల ఆయన కోసం రెండేళ్లు వేచి చూసి, ఈ సినిమా చేశాం. ఈ చిత్రం చూశాక నరేశ్ 2.0 అని ఫీల్ అవుతారు. 1980 నేపథ్యంలో జరిగే కథతో ఈ చిత్రం రూపొందింది. మా బ్యానర్‌లో 'సామజ వరగమన, ఊరుపేరు భైరవకోన' చిత్రాల తర్వాత వస్తున్న 'బచ్చల మల్లి'తో హ్యాట్రిక్ హిట్ అందుకోబోతున్నాం. 'ఊరు పేరు భైరవకోన'కి సీక్వెల్ గురించి డైరెక్టర్ వీఐ ఆనంద్ చెప్పాలి. ప్రస్తుతం సందీప్ కిషన్‌గారితో 'మజాకా' సినిమా చేస్తున్నాను. కిరణ్ అబ్బవరం గారి సినిమాని ఫిబ్రవరిలో ఆరంభిస్తాం. ఒక పాన్ ఇండియా సబ్జెక్ట్ కుదిరింది'' అన్నారు.



ఓటీటీ ఇది చూడొచ్చు

ఓ సైకలాజికల్ థ్రిల్లర్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'కిష్కింధకాండమ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మన జీవితమనేది ఒడుదుడుకుల ప్రయాణం. ఎప్పుడు ఏ అడ్డంకి వస్తుందో చెప్పలేం. కానీ ఎటువంటి అడ్డంకి వచ్చినా ఎదురొడ్డి దాటుకొని ప్రయాణం చేస్తేనే మనకు మిగతా జీవితం. అలాంటి అడ్డంకుల ఆధారంగా అల్లుకున్న కథే 'కిష్కింధకాండమ్'. ఏడు కోట్లు పెట్టి తీసిన ఈ సినిమా 75 కోట్లకు పైనే ఆర్జించి పెట్టింది. అంతటి ప్రేక్షకాదరణ పొందిన ఈ సినిమాలో ఏముందో ఓసారి చూద్దాం. ఈ మలయాళ సినిమా హాట్ స్టార్ ఓటీటీ వేదికగా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌లోనూ లభ్యమవుతోంది. ఈ చిత్రానికి దింజిత్ అయ్యతాన్ దర్శకత్వం వహించారు. ఆసిఫ్ ఆలీ, అపర్ణా బాలమురళి, విజయ రాఘవన్, నిశల్‌గళ్ రవి తదితరులు నటించారీ చిత్రంలో. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే.. ఫారెస్ట్ ఆఫీసరైన హీరో అజయ్ పెళ్లితో సినిమా ప్రారంభమవుతుంది. అజయ్ రెండో పెళ్లిగా అపర్ణను చేసుకుంటాడు. అజయ్‌కి మొదటి పెళ్లి కారణంగా చాచు అనే కొడుకుంటాడు. అలాగే అజయ్ తండ్రి అప్పుపిల్లా ఓ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్. అప్పుపిల్లా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతూ ఉంటాడు. అజయ్ ఫారెస్ట్ ఆఫీసరవడం వల్ల ఓ దట్టమైన అడవిలో తన నివాసం ఉంటుంది. చుట్టూ ఎక్కువగా కోతులు ఉంటాయి. ఆ కోతులు అన్ని ఇళ్ళలోంచి వస్తువులు ఎత్తుకు పోతూ ఊళ్లోవాళ్లందరినీ ఇబ్బంది పెడుతుంటాయి. అజయ్, అపర్ణలకు పెళ్ళై ఇంట్లో అడుగుపెట్టే సమయంలో పోలీసులు ఎదురుపడతారు. ఊర్లో ఎన్నికల సందర్భంగా అజయ్ తండ్రి తన లైసెన్స్ రివాల్వరును పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పాలని పోలీసులు వస్తారు. ఆ సమయంలోనే తెలుస్తుంది అజయ్ తండ్రి తన తుపాకీని రెండేళ్ల క్రిందటే పోగొట్టుకున్నాడని. అంతే కాదు అజయ్ కొడుకు చాచు కూడా కనబడకుండా పోతాడు. ఓ పక్క తుపాకీ... మరో పక్క పిల్లాడు... ఆపై మామ మతిమరుపు వ్యాధి... ఇన్ని విషయాలపై కొత్తగా పెళ్లై వచ్చిన అపర్ణ దృష్టి సారిస్తుంది. ఇక అక్కడ నుండి కథ అనేక అనూహ్యమైన మలుపులు తిరుగుతూ, చూసే ప్రేక్షకులను కథ సాగే కొద్దీ ఉత్కంఠను రేపుతుంది. ఈ సినిమా స్క్రీన్‌ప్లే మొదట్లో కాస్త నెమ్మదిగా ఉన్నా పోను పోను ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. అందుకే సినిమా అపరిమితమైన ప్రేక్షకాదరణను నోచుకుంది. ఓ ముఖ్య విషయం... ఇది పిల్లలతో చూడవలసిన సినిమా అయితే కాదు. వర్త్ టు వాచ్ దిస్ సైకలాజికల్ థ్రిల్లర్.

– ఇంటూరు హరికృష్ణ



ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సాక్షి బిజినెస్
శనివారం
14-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ △	నిఫ్టీ △
843	220
82,133	24,768

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,844	▽ 60
డోజోన్స్	43,819	▽ 95
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,300	▽ 11
డాక్స్	20,406	▽ 20
షాంఘై	3,391	▽ 70
నికాయ్	39,849	▽ 379

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,922	▽ 1,225
బంగారం (22 క్యారెట్)	76,614	▽ 1,220
వెండి (కేజీ)	89,976	▽ 3,324

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.46	85.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.20	109.01
€	యూరో	ఎస్‌బీఐ	87.60	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.83	56.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.43	55.62
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.82	65.54
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.73	23.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.21	24.00
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.80	12.62

-1,207 నుంచి +843 పాయింట్లకు సెన్సెక్స్

- 24,750 స్థాయి పైకి నిఫ్టీ
- ఆరంభ నష్టాల నుంచి పుంజుకున్న సూచీలు



ముంబై: ప్రారంభ నష్టాల నుంచి బలంగా పుంజుకున్న స్టాక్ సూచీలు శుక్రవారం భారీ లాభాలు నమోదుచేశాయి. టెలికం, ఐటీ, కన్జూమర్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఇందుకు అండగా నిలిచాయి. దేశీయంగా ద్రవ్యోల్బణ దిగిరావడమూ కలిసొచ్చింది. ఇంట్రాడేలో 1,207 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ అనూహ్యంగా రికవరీ అయ్యి చివరికి 843 పాయింట్ల లాభంతో 82,133 వద్ద నిలిచింది. నిఫ్టీ 220 పాయింట్లు పెరిగి 24,768 వద్ద స్థిరపడింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. వీక్లీ ఎక్స్‌పైరీ ప్రభావంతో ప్రారంభంలో సెన్సెక్స్ 1,207 పాయింట్లు క్షీణించి 80,083 వద్ద, నిఫ్టీ 368 పాయింట్లు పతనమై 24,181 వద్ద కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ద్రవ్యోల్బణం తగ్గిన నేపథ్యంలో వడ్డీరేట్ల సంబంధిత షేర్లు ఫైనాన్స్, రియల్టీ, ఆటో షేర్లు రాణించడంతో సూచీలు నష్టాల నుంచి గట్టెక్కాయి. మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్ల తీవ్రత మరింత పెరగడంతో లాభాలు ఆర్జించగలిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 924 పాయింట్లు పెరిగి 82,213 వద్ద, నిఫ్టీ 243 పాయింట్లు బలపడి 24,792 వద్ద గరిష్టాలు అందుకున్నాయి. మెటల్, సర్వీసెస్, కమోడిటీస్, ఇండస్ట్రియల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.29%, 0.08 శాతం చొప్పున నష్టపోయాయి.

ఏటీఎం నుంచే పీఎఫ్ నిధుల డ్రా

- క్లెయిమ్‌ల పరిష్కారం సులభతరం
- ఇన్సూరెన్స్ ప్రయోజనాలూ పొందొచ్చు



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులు అతి త్వరలోనే తమ భవిష్యనిధి (పీఎఫ్) క్లెయిమ్‌ల మొత్తాన్ని ఏటీఎం నుంచి ఉపసంహరించుకునే అవకాశం అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వో సభ్యుల ఆన్‌లైన్ క్లెయిమ్ ఆమోదానికి 7-10 రోజుల సమయం తీసుకుంటోంది. క్లెయిమ్ పరిష్కారం తర్వాత ఆ మొత్తాన్ని సభ్యుల బ్యాంక్ ఖాతాకు బదిలీ చేస్తున్నారు. ప్రతిపాదిత కొత్త విధానంలో సభ్యులకు ప్రత్యేకమైన కార్డులు అందించనున్నారు. వీటి ద్వారా ఏటీఎం నుంచి క్లెయిమ్ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఏడు కోట్లకు పైగా సభ్యులకు బ్యాంక్‌ల మాదిరి సేవలు అందించాలన్నది ఈపీఎఫ్‌వో ఆలోచనగా పేర్కొన్నారు. ఈపీఎఫ్‌వో తన ఐటీ సదుపాయాలను మెరుగుపరుచుకుంటోందని కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. కొత్త వ్యవస్థ అమల్లోకి వస్తే పీఎఫ్ ప్రయోజనాలు, బీమా ప్రయోజనాలను ఏటీఎంల నుంచే పొందొచ్చని చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
మొబిక్విక్, విశాల్ మెగా మార్ట్, సాయి లైఫ్ సైన్సెస్... 'హిట్'
ఏవియేషన్‌లో అగ్రగామిగా భారత్.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-12-2024

విశాఖ	620-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	630-00
విజయవాడ	630-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

గోల్డ్ బాండ్లకు చెక్..!



ఫిజికల్‌గా పసిడి కొనుగోలుకు చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్ల పథకానికి తెరతీసింది. యూనిట్ల(ఒక గ్రాము)లో జారీ చేయడం ద్వారా నెమ్మదిగా రిటైల్ ఇన్వెస్టర్లను ఆకట్టుకుంది. తద్వారా దిగుమతుల భారాన్ని తగ్గించుకునే ప్రణాళికలు వేసింది. అయితే బంగారం ధర ప్రతీ ఏడాది రేసు గుర్రంలా పరుగు తీయడంతో బాండ్ల గడువు ముగిసేసరికి రుణ భారం భారీగా పెరిగిపోతూ వచ్చింది. వెరసి ఇకపై వీటికి ఫుల్‌స్టాప్ పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాల అంచనా. వివరాలు చూద్దాం.. - సాక్షి, బిజినెస్ డెస్క్

- రుణాలను తగ్గించుకునే యోచన
- ద్రవ్యలోటు కట్టడి ప్రణాళికలకు దన్ను
- బంగారం ధరల పెరుగుదల ఎఫెక్ట్
- 2015లో తొలిసారి గోల్డ్ బాండ్ల జారీ

కేంద్ర ఆర్థిక శాఖ వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26) నుంచి సావరిన్ గోల్డ్ బాండ్ల(ఎస్‌జీబీలు) జారీని నిలిపివేసే అవకాశముంది. ప్రభుత్వ రుణాలను తగ్గించుకునే బాటలో ప్రభుత్వం ఎస్‌జీబీల జారీని నిలిపివేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఫిజికల్‌గా బంగారం దిగుమతులను తగ్గించుకునే యోచనతో ప్రభుత్వం వీటిని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ఈ ఏడాది జూలైలో వెలువడిన బడ్జెట్‌లో రూ. 18,500 కోట్ల విలువైన ఎస్‌జీబీల జారీకి ప్రణాళికలు వేసింది. అయితే గతేడాది జారీ చేసిన రూ. 26,852 కోట్లతో పోలిస్తే అంచనాలను భారీగా తగ్గించింది. ఎస్‌జీబీల గడువు ముగిశాక ప్రభుత్వం బంగారం మార్కెట్ ధరకు అనుగుణంగా ఇన్వెస్టర్లకు తిరిగి చెల్లించవలసి ఉంటుంది. అంతేకాకుండా వీటిపై నిరంతరంగా వడ్డీని సైతం చెల్లిస్తుంది. ఫలితంగా ప్రభుత్వంపై అదనపు రుణ భారానికి ఆస్కారం ఏర్పడుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం 2026-27కల్లా స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో రుణ(డెట్) నిష్పత్తిని తగ్గించుకునే ప్రణాళికల్లో ఉంది. దీంతో ఇకపై ఎస్‌జీబీలను జారీ చేసే యోచనకు ప్రభుత్వం స్వస్తి పలకవచ్చని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పసిడి మెరుపులు

అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు నిరంతరం బలపడుతూనే ఉన్నాయి. భవిష్యత్‌లోనూ మరింత పెరిగే అవకాశముంది. ఇందుకు రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు, ప్రభుత్వాల విధానాలు, యుద్ధ భయాలు వంటి అంశాలు కారణంకానున్నట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశీయంగా 2015లో ఎస్‌జీబీలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఫిజికల్‌గా పసిడి కొనుగోళ్లకు చెక్ పెట్టే యోచనతో రిటైల్ ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు వీటిని తీసుకువచ్చింది. తద్వారా ఫిజికల్ గోల్డ్ నుంచి పేపర్ గోల్డ్‌కు ఇన్వెస్టర్లను మళ్లించే ప్రయత్నం చేసింది. తొలుత 8 ఏళ్ల కాలపరిమితితో వీటికి శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల గడువు తదుపరి మార్కెట్ ధరలకు అనుగుణంగా రిడీమ్ చేసుకునేందుకు వీలు కల్పించింది. 2017-18లో వ్యక్తులు, కుటుంబాలకు ఒక ఆర్థిక సంవత్సరంలో 4 కేజీలవరకూ పెట్టుబడులకు అనుమతించింది. ట్రస్ట్‌లు, సంబంధిత సంస్థలు 20 కేజీలవరకూ ఇన్వెస్ట్ చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2015-16లో జారీ చేసిన బాండ్ల ముఖ విలువపై 2.75 శాతం, తదుపరి కాలంలో జారీ చేసిన బాండ్లపై 2.5 శాతం వడ్డీ చెల్లింపునకు తెరతీసింది. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరి 21న రూ. 8,008 కోట్ల విలువైన ఎస్‌జీబీలను జారీ చేసింది.

ఎస్‌జీబీలంటే



కేంద్ర ప్రభుత్వం తరఫున రిజర్వ్ బ్యాంక్ ఎస్‌జీబీలను జారీ చేస్తుంది. ఒక గ్రాము బంగారాన్ని ఒక యూనిట్‌గా జారీ చేస్తుంది. అప్పటి మార్కెట్ ధర ఆధారంగా వీటిని కేటాయిస్తుంది. అంటే ఇది పేపర్ గోల్డ్. కాలపరిమితి 8 ఏళ్లుకాగా.. ఐదేళ్ల తదుపరి ఎప్పుడైనా వీటిని విక్రయించేందుకు వీలుంటుంది. అప్పటి బంగారం మార్కెట్ ధర ఆధారంగా మెచ్యూరిటీ విలువ ఉంటుంది. అంతేకాకుండా వీటిపై తొలి ఏడాది నుంచి 2.5 శాతం వార్షిక వడ్డీ అందుతుంది. ఈ బాండ్లు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో ట్రేడవుతాయి.

14.7 కోట్ల యూనిట్లు జారీ

2015 మొదలు ఆర్‌బీఐ 67 ఎస్‌జీబీ పథకాల ద్వారా మొత్తం 14.7 కోట్ల యూనిట్లను జారీ చేసినట్లు అంచనా. అయితే పసిడి విలువ ఎప్పటికప్పుడు పరుగు తీస్తుండటంతో వీటి విలువ సైతం పెరుగుతూ వస్తోంది. ఉదాహరణకు 2016లో గ్రాము(యూనిట్)కు రూ. 3,007 ధరలో ఎస్‌జీబీలను విడుదల చేసింది. వీటి గడువు తీరేసరికి విలువ రూ. 4,781 జంప్‌చేసి రూ. 7,788కు చేరింది. అంటే 8 ఏళ్లలో 159% వృద్ధి. అంతేకాకుండా వార్షికంగా 2.5% వడ్డీ కూడా లభించింది.



దీంతో ఆర్‌బీఐ 2017 మే నెలలో, 2020 మార్చిలో జారీ చేసిన ఎస్‌జీబీలను ముందుగానే చెల్లించేందుకు ఈ ఏడాది ఆగస్టులో నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వ రుణభారాన్ని తగ్గించేందుకు సంకల్పించింది. మరోవైపు ప్రభుత్వం సైతం జూలై బడ్జెట్‌లో పసిడిపై దిగుమతుల సుంకాన్ని 15% నుంచి 6 శాతానికి భారీగా తగ్గించింది.

రామ్‌కో సిమెంట్స్‌కు సీఐఐ డీఎక్స్ అవార్డు



హైదరాబాద్: రామ్‌కో సిమెంట్స్ ఢిల్లీలో జరిగిన 6వ విడత సీఐఐ డీఎక్స్ (డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్) అవార్డుల కార్యక్రమంలో ఆపరేషనల్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని దక్కించుకుంది. అత్యంత వినూత్న టాప్ 10 ప్రాజెక్టుల జాబితాలో 'రామ్‌కో బిజినెస్ ఇంటెలిజెన్స్' ప్రాజెక్టు ఒకటిగా నిల్చింది. ఆపరేషనల్ ఎక్సలెన్స్ కేటగిరీలో పురస్కారం దక్కించుకున్నట్లు సీఈవో ఏవీ ధర్మకృష్ణన్ తెలిపారు. అవార్డును కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జి. మురుగేశన్, డిప్యుటీ జీఎంలు పీఎల్ సత్యనారాయణ, అబ్దుల్ బాసిత్ అందుకున్నారు. సీఐఐ-టాటా కమ్యూనికేషన్స్ సెంటర్ ఫర్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఏడాది 300 పైగా కంపెనీలు ప్రతిష్టాత్మక పురస్కారాల కోసం పోటీపడ్డాయి.

పోస్టాఫీసుల్లో మరో 600 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు



న్యూఢిల్లీ: తపాలా శాఖల్లో 2028-29 నాటికి మరో 600 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల ఏర్పాటుకు వీలుగా తపాలా శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ మధ్య ఒప్పందం కుదిరినట్టు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రకటించారు. 'భారత ఆర్థిక సదస్సు 2024' కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. తపాలా శాఖకు దేశవ్యాప్తంగా 6,40,000 విక్రయ కేంద్రాలున్నాయని, ప్రపంచంలో మరే సంస్థకు ఈ స్థాయి నెట్‌వర్క్ లేదన్నారు. పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు 2017తో ప్రారంభం కాగా.. 1.52 కోట్ల మందికి పైగా సేవలు అందించడంలో ఇవి కీలకంగా పని చేస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 442 పోస్టాఫీసు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలున్నాయి.


సాక్షి స్పోర్ట్స్

గుకేశ్‌కు రూ. 5 కోట్ల నజరానా... తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై: భారత గ్రాండ్‌మాస్టర్, కొత్త ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ. 5 కోట్ల ప్రోత్సాహక బహుమతి ప్రకటించారు. 'చారిత్రక విజయం సాధించిన ప్రపంచ చాంపియన్‌కు నా అభినందనలు. గుకేశ్ పదర్శనకు ప్రోత్సాహకంగా రూ. 5 కోట్లు నగదు బహుమతి అందజేస్తాం. అతని చిరస్మరణీయ విజయం పట్ల జాతి యావత్తు గర్వపడుతోంది. భవిష్యత్తులోనూ ఇదే ప్రదర్శన కొనసాగించాలి. మరింత ఎత్తుకు ఎదగాలి' అని 'ఎక్స్'లో స్టాలిన్ ట్వీట్ చేశారు.

'విజయోత్సవం'

- వరల్డ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకున్న గుకేశ్
- విజేతగా బిజీ బిజీగా గడిపిన చాంపియన్ ప్లేయర్



ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ విన్నర్స్ ట్రోఫీ, స్వర్ణ పతకంతో గుకేశ్

సింగపూర్ సిటీ: 'ట్రోఫీ చూడటానికి చాలా బాగుంది. కానీ నేను ఇప్పుడు దీనిని ముట్టుకోను. బహుమతి ప్రదానోత్సవ సమయంలోనే అందుకుంటాను'... విశ్వ విజేతగా నిలిచిన తర్వాతి రోజు కొత్త ఉత్సాహంతో కనిపిస్తూ గుకేశ్ చెప్పిన మాట ఇది. ముగింపు కార్యక్రమానికి కొద్దిసేపు ముందు జరిగిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో ఇది చోటు చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని ఇంత దగ్గరగా చూడటం ఇదే మొదటిసారి అంటూ గుకేశ్ తన ఆనందాన్ని ప్రదర్శించాడు. ఫొటో షూట్ సమయంలోనూ అతను దానిని ముట్టుకోలేదు. ప్రపంచ చాంపియన్ హోదాలో శుక్రవారం గుకేశ్ బిజీబిజీగా గడిపాడు. ప్రపంచ చెస్ సమాఖ్య (ఫిడే) నిర్ణయించిన అధికారిక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలతో పాటు పెద్ద సంఖ్యలో చెస్ అభిమానులకు అతను ఆటోగ్రాఫ్‌లు ఇచ్చాడు. వీరిలో భారత అభిమానులతో పాటు సింగపూర్‌కు చెందిన చదరంగ ప్రోత్సాహికులు కూడా ఉన్నారు. తాము వెంట తెచ్చుకున్న చెస్ బోర్డులపై వారు వరల్డ్ చాంపియన్ ఆటోగ్రాఫ్‌ను తీసుకున్నారు. ఆటోగ్రాఫ్ కోసం నిలబడిన వారి సంఖ్య అనంతంగా సాగింది. ఆ తర్వాత గుకేశ్ ఎంతగానో ఎదురు చూసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. 'ఫిడే' అధ్యక్షుడు అర్కాడీ వొర్కొవిచ్ జగజ్జేత గుకేశ్‌కు ట్రోఫీతో పాటు బంగారు పతకాన్ని, ప్రైజ్‌మనీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన భారత గ్రాండ్‌మాస్టర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అద్భుతమైన ఆట, చిరకాల గుర్తుండిపోయే ప్రదర్శనగా గుకేశ్ విజయాన్ని ఆయన అభివర్ణించారు. తన విజయానందాన్ని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ...'18వ ఏట 18వ చాంపియన్' అంటూ గుకేశ్ ట్వీట్ చేశాడు.

> ఇలాంటి క్షణం కోసం ఇంతకాలం ఎదురు చూశాను. ఇలాంటి రోజు కోసమే ప్రతీ రోజూ నిద్ర లేచేవాడిని. ఇప్పుడు ఈ ట్రోఫీని నా చేతుల్లో తీసుకున్న ఆనందంతో పోలిస్తే నా జీవితంలో ఏదీ సాటి రాదు. నా ప్రయాణం ఒక కలలా సాగింది. ఈ క్రమంలో ఎన్నో ఎత్తుపల్లాలు, సవాళ్లు ఎదురయ్యాయి. కానీ నా చుట్టూ ఉన్నవారి అండతో అన్నింటినీ అధిగమించగలిగాను. కష్టాల్లో ఉన్న సమయంలో పరిష్కారం లభించనప్పుడు దేవుడే నాకు తగిన దారి చూపించాడు.
>
> -ట్రోఫీని అందుకున్న తర్వాత గుకేశ్ స్పందన

ఎత్తులు మాత్రమే గెలిపించవు!

- మానసిక దృఢత్వం కూడా విజయం అందిస్తుంది
- విమర్శకులకు ప్రపంచ చాంపియన్ గుకేశ్ జవాబు

సింగపూర్: 'గుకేశ్, లిరెన్ మధ్య గేమ్‌లు చూస్తే అసలు వరల్డ్ చాంపియన్‌షిప్‌లా లేదు... చదరంగం చచ్చిపోయింది... ఒక చిన్న తప్పు వరల్డ్ చాంపియన్‌ను నిర్ణయించడం ఏమిటి?'... గురువారం గుకేశ్ గెలుపు అనంతరం వచ్చిన విమర్శలివి! స్టార్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్‌తో పాటు మాజీ ఆటగాడు క్రామ్నిక్ తదితరులు గుకేశ్ ఘనతకు గౌరవం ఇవ్వకుండా ఆ విజయం స్థాయిని తక్కువగా చేసి మాట్లాడుతున్నారు. దీనిపై గుకేశ్ సూటిగా సమాధానం ఇచ్చాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ విజయానికి ఆటతో పాటు మరెన్నో కారణాలు ఉంటాయని అతను అభిప్రాయపడ్డాడు. 'ఇలాంటి వ్యాఖ్యలు నన్నేమీ బాధపెట్టలేదు. కొన్ని గేమ్‌లు ఆశించిన స్థాయిలో దూకుడుగా సాగలేదనేది వాస్తవమే. అయితే చెస్ బోర్డుపై ఆటలో వేసే ఎత్తులు మాత్రం వరల్డ్ చాంపియన్‌ను నిర్ణయించవు. పట్టుదల, పోరాటతత్వం ఉండటంతో పాటు మానసికంగా దృఢంగా ఉండే వ్యక్తే గెలుస్తాడు. వీటిన్నింటిని నేను చూపించానని నమ్ముతున్నా. ఆట విషయానికి వస్తే ఇది అత్యుత్తమ స్థాయి ప్రదర్శన కాకపోవచ్చు. ఎందుకంటే నేను తొలిసారి ఆడుతున్నాను. ఇతరులతో పోలిస్తే నాపై ఒత్తిడి కూడా భిన్నంగా ఉంటుంది. కొన్నిసార్లు నేను పేలవంగా ఆడాననేది కూడా నిజం. అయితే కీలక సమయాల్లో నేను సత్తా చాటి స్థాయిని ప్రదర్శించగలిగాను. దాని పట్ల నేను సంతోషంగా ఉన్నా' అని గుకేశ్ వివరించాడు.

> గుకేశ్ విశ్వ విజేతగా నిలిచిన క్షణం మా జీవితంలోనే అత్యుత్తమమైనది. ఇన్నేళ్ల తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడంతో చాలా సంతోషంగా ఉంది. గుకేశ్ ప్రపంచ చాంపియన్ అయ్యాడనే వార్త విని నేను నమ్మలేకపోయా. పది నిమిషాల పాటు ఏడ్చేశా. చిన్నప్పటి నుంచి గుకేశ్ ఎంతో క్రమశిక్షణతో చాలా కష్టపడ్డాడు. తానూ ఎన్నో త్యాగాలు చేశాడు. ఈ టైటిల్‌తో ఆ కష్టమంతా సంతోషంగా మారిపోయింది.
>
> -గుకేశ్ తల్లి పద్మాకుమారి



విమర్శలను పట్టించుకోవద్దు: ఆనంద్

వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత గుకేశ్ ఆటపై వస్తున్న కొన్ని విమర్శలను భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తిప్పి కొట్టాడు. ఎవరో ఒకరు ఇలాంటి మాటలు అంటూనే ఉంటారని, వాటిని పట్టించుకోవద్దని అతను గుకేశ్‌కు సూచించాడు. 'గుకేశ్ చరిత్ర సృష్టించడం నేను కళ్లారా చూశాను. నాకు చాలా ఆనందంగా అనిపించింది. విమర్శలు ప్రతీ మ్యాచ్‌కు వస్తూనే ఉంటాయి. విజయాలు సాధించినప్పుడు ఇలాంటివి సహజం. వాటిని పట్టించుకోవద్దు. గుకేశ్ ఎదుగుదల, ఈ పోటీకి అర్హత సాధించే క్రమంలో క్యాండిడేట్స్‌ను గెలిచిన తీరు, ఒలింపియాడ్‌లో ప్రదర్శించిన ఆట అతని సత్తా ఏమిటో చూపించాయి. వరల్డ్ చాంపియన్ అయ్యాక ఎవరో అనే ఇలాంటి మాటలను లెక్క చేయవద్దు. లిరెన్ క్షణం పాటు ఉదాసీనత ప్రదర్శించాడు. ఇలాంటి క్షణాలు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో దాదాపు ప్రతీ మ్యాచ్‌లో వస్తాయి. గుకేశ్ దానిని బాగా వాడుకున్న తీరును ప్రశంసించాలి' అని ఆనంద్ పేర్కొన్నాడు. 'చెస్‌లో గుకేశ్ శిఖరానికి చేరుకున్నాడు. ఈ విజయంతో అతని తల్లి ఎంతో ఆనందపడి ఉంటుంది. భారత చెస్‌లో ఎంతో ప్రతిభ ఉంది. ఇకపై మరిన్ని విజయాలు రావడం ఖాయం' అని దిగ్గజం కాస్పరోవ్ వ్యాఖ్యానించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆధిక్యంలోకి వెళతారా!

- నేటి నుంచి ఆస్ట్రేలియాతో భారత్ మూడో టెస్టు
- ఉదయం గం. 5:50 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బ్రిస్బేన్: 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య నేటి నుంచి బ్రిస్బేన్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్లు చెరో విజయంతో 1-1తో సమఉజ్జీలుగా ఉండగా... పేస్‌కు స్వర్గధామమైన బ్రిస్బేన్‌లో ఎవరు పైచేయి సాధిస్తారనేది కీలకంగా మారింది. అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో... టీమిండియాకు పరాజయం తప్పకపోగా... ఈ మ్యాచ్‌లో వాటిని అధిగమించి విజయం సాధించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. తొలి టెస్టులో సెంచరీ చేసినప్పటికీ... ఆఫ్‌స్టంప్ అవతల పడుతున్న బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్న విరాట్ కోహ్లి నుంచి సాధికారిక ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. ఇక గత కొంత కాలంగా సుదీర్ఘ ఫార్మాట్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న రోహిత్ శర్మ తిరిగి ఓపెనింగ్ చేయడం ఖాయమే. మరోవైపు గత మ్యాచ్‌లో విజయంతో ఆస్ట్రేలియా ఆత్మవిశ్వాసంతో ఉన్నా... స్టీవ్ స్మిత్, ఉస్మాన్ ఖ్వాజా పేలవ ఫామ్ ఆసీస్‌ను ఇబ్బంది పెడుతోంది.

ఒత్తిడిలో రోహిత్, కోహ్లి

కెరీర్‌లో దాదాపు చివరి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, కోహ్లి ఒత్తిడిలో కనిపిస్తున్నారు. తొలి టెస్టుకు అందుబాటులో లేని రోహిత్... అడిలైడ్‌లో మిడిలార్డర్‌లో బరిలోకి దిగి ప్రభావం చూపలేకపోయాడు. దీంతో మరోసారి రోహిత్ ఇన్నింగ్స్ ఆరంభించనుండగా... కేఎల్ రాహుల్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయనున్నాడు. ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్, సుందర్, జడేజా మధ్య పోటీ ఉన్నా... గతంలో ఇక్కడ మెరుగైన ప్రదర్శన చేసిన వాషింగ్టన్ సుందర్ వైపు మొగ్గు చూపొచ్చు. ఇక మూడో పేసర్‌గా హర్షిత్ రాణా స్థానంలో ఆకాశ్‌దీప్ సింగ్‌కు అవకాశం దక్కవచ్చు.



ఆత్మవిశ్వాసంలో ఆస్ట్రేలియా..

సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆస్ట్రేలియా అదే జోరులో సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో ఘోర పరాజయం ఎదురైనా... అడిలైడ్‌లో హెడ్ మెరుపు సెంచరీతో చెలరేగడంతో కంగారూలు గాడిన పడ్డారు. అయితే స్టార్ ఆటగాడు స్టీవ్ స్మిత్‌తో పాటు ఉస్మాన్ ఖ్వాజా, మెక్‌స్వీనీ, మిషెల్ మార్ష్, అలెక్స్ కేరీ రాణించాల్సిన అవసరముంది. లబుషేన్ గత మ్యాచ్‌లో అర్ధశతకంతో ఆకట్టుకున్నా... పూర్తి నియంత్రణతో కనిపించలేదు. బౌలింగ్‌లో మాత్రం ఆసీస్‌కు ఎలాంటి ఇబ్బందులు కనిపించడం లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లి, పంత్, రాహుల్, నితీశ్ రెడ్డి, సుందర్/అశ్విన్, ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా. **ఆస్ట్రేలియా:** కమిన్స్ (కెప్టెన్), ఖ్వాజా, మెక్‌స్వీనీ, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, కారీ, స్టార్క్, లయన్, హాజల్‌వుడ్.

పిచ్, వాతావరణం

బ్రిస్బేన్ పిచ్ పేస్, బౌన్స్‌కు సహకరించనుంది. ఈ టెస్టుకు వర్షం ముప్పు పొంచి ఉంది. తొలి రోజు ఉదయం వర్షం కురిసే అవకాశముంది.

వేద్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శన



సాక్షి, హైదరాబాద్: విజయ్ మర్చంట్ ట్రోఫీ దేశవాళీ అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు ఖాతాలో తొలి విజయం చేరింది. మేఘాలయ జట్టుతో లక్నోలో జరిగిన ఎలైట్ గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 101 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. వేద్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచి హైదరాబాద్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. వేద్ రెడ్డి 58 పరుగులు చేయడంతోపాటు 4 వికెట్లు తీసుకున్నాడు. మొదట మేఘాలయ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 54.2 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. వేద్ రెడ్డి 11.2 ఓవర్లలో 9 మెయిడెన్లు తీసుకొని 2 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులకు ఆలౌటైంది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన వేద్ రెడ్డి (58; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 141 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన మేఘాలయ జట్టు 28.4 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. రోహన్, దేవ్ 3 వికెట్ల చొప్పున తీయగా... ఆయుశ్‌కు 2 వికెట్లు, వేద్ రెడ్డి, ఉజైర్‌లకు ఒక్కో వికెట్ లభించింది.



తెప్పలపై వెళ్లి.. విద్యుత్ సమస్యను తీర్చి..

వేములవాడ రూరల్: రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను సెస్ సిబ్బంది తెప్పలపై వెళ్లి పరిష్కరించారు. వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల్లోని పొలాలకు వచ్చే విద్యుత్ తీగలు మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో ఉండిపోయాయి. తరచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడుతుండటంతో దీన్ని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం సెస్ సిబ్బంది తెప్పలపై వెళ్లి తీగలను సరిచేశారు. తమ సమస్య పరిష్కరించిన సెస్ సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆపదలో ఉన్నా.. డబ్బులు పంపండి!

అత్యవసరంలో ఉన్నామంటూ ఫేక్ మెసేజ్‌లు.. నేరుగా సంప్రదించకుండా ఆన్‌లైన్‌లో డబ్బులు పంపొద్దని హెచ్చరిస్తున్న పోలీసులు

ప్రొఫైల్ క్లోనింగ్‌తో చీటింగ్ • సోషల్ మీడియా ఖాతాల్లోని వివరాలతో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేస్తున్న సైబర్ మోసగాళ్లు

కేస్-01

'నాకు యాక్సిడెంట్ అయ్యింది అక్కా..ఆసుపత్రిలో ఉన్నాను..అర్జెంట్‌గా బిల్లు కట్టాలని అంటున్నారు..నేను తర్వాత వివరంగా మాట్లాడతాను. ముందు నేను పంపిన నంబర్‌కు గూగుల్ పే చెయ్యి'అని మలకోపేట్‌కు చెందిన ఓ గృహిణికి వాట్సప్ కాల్ వచ్చింది. వాట్సప్ ప్రొఫైల్ ఫొటో తన సోదరుడిదే..మాట కొంచెం తేడాగా ఉన్నా..నంబర్ కూడా తనదే ఉంది. నిజంగానే ఆసుపత్రిలో ఉన్నాడనుకుని రూ.50 వేలు ఫోన్‌పే చేసింది. తర్వాత తెలిసింది అది సైబర్ మోసగాళ్ల పని అని..

కేస్-02

మనోజ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆఫీస్‌లో ఉన్న సమయంలో వాట్సప్ మెసెంజర్‌లో ఓ మెసేజ్ వచ్చింది. 'నేను మా అమ్మను ఆసుపత్రికి తీసుకువచ్చాను. హడావుడిలో పర్స్ తీసుకురాలేదు. నేను చెప్పిన అకౌంట్‌కి ఆసుపత్రి వాళ్లకు రూ.75 వేలు పంపించు. నేను నీతో కాసేపటి తర్వాత ఫోన్‌లో వివరంగా మాట్లాడతాను..'అని ఆ మెసేజ్ సారాంశం. ప్రొఫైల్ ఫొటో, వివరాలు తన కొలీగ్ ప్రశాంత్‌వే..నిజంగానే స్నేహితుడు ఆపదలో ఉన్నాడేమో అని ఆన్‌లైన్‌లో డబ్బులు పంపాడు మనోజ్. 'అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది' అని సాయంత్రం ప్రశాంత్‌కి ఫోన్ చేస్తేగానీ మనోజ్‌కు తెలియదు తాను సైబర్‌మోసానికి గురయ్యానని.



ప్రొఫైల్ క్లోనింగ్ అంటే..?

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్, స్నాప్‌చాట్.. ఇలాంటి సోషల్ మీడియా వేదికలలో పలువురు పంచుకునే వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు, అందులో పేర్కొంటున్న సమాచారం, అభిరుచులు ఇలా అన్ని వివరాలు సేకరించి కొద్దిపాటిగా పేర్లు మార్చి నకిలీ ప్రొఫైల్స్‌ను తయారు చేయడమే ప్రొఫైల్ క్లోనింగ్. ఆ తర్వాత స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు ఇలా అందరికీ ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతారు. ఆ తర్వాత మోసానికి తెరతీస్తారు. ఆపదలో ఉన్నానని, అత్యవసరంగా కొంత డబ్బు అవసరం ఉందని, ఇలా మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌తో మోసాలకు పాల్పడతారు.

ఎలా గుర్తించాలి.. ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

మనకు బాగా తెలిసిన వ్యక్తుల ఫొటోలు, ప్రొఫైల్స్‌తో ఉన్న ఫోన్ నంబర్లు, సోషల్ మీడియా ఖాతాల నుంచి అకస్మాత్తుగా ఒక ఫోన్ కాల్‌గానీ, మెసేజ్ కానీ వస్తే.. అది సైబర్ నేరగాళ్ల పనే అయిఉండొచ్చని అనుమానించాలి. కంగారుపడిపోయి వెంటనే డబ్బులు పంపవద్దు. అసలు విషయం ఏంటన్నది నేరుగా వాళ్ల ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో వ్యక్తిగత సమాచారం అవసరానికి మించి పంచుకోకపోవడమే మేలు. కుటుంబసభ్యులు, స్నేహితులతో ఉన్న సన్నిహితమైన ఫొటోలు, వీడియోలు పంచుకోవద్దు. మనం సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టే సమాచారమే సైబర్ నేరగాళ్లు వినియోగించుకుని మోసాలకు తెరతీస్తున్నారన్నది గుర్తించాలి. ప్రొఫైల్ లాక్ ఉపయోగించకపోతే మోసాలకు అవకాశం ఉంది. కాబట్టి ప్రైవసీ సెట్టింగ్‌లు తప్పక పెట్టుకోవాలి.



మీకు తెలుసా?

సురభివారి గాలి మోటార్

- 93 ఏళ్ల క్రితమే కొల్లాపూర్‌లో విమానం
- పైలట్‌గా రాజా ఇనుగంటి వెంకటకృష్ణారావు
- జేఆర్‌డీ టాటాతో పోటీ పడి విమానం నడిపిన ఐవీఆర్



కొల్లాపూర్: నేడు విమానాల్లో ప్రయాణించటం పెద్ద విషయమేమీ కాదు. సామాన్యులు కూడా విమాన ప్రయాణాలు చేస్తున్నారు. కానీ, ఓ వందేళ్ల వెనక్కు వెళితే? అప్పుడప్పుడే గాల్లోకి ఎగురుతున్న విమానం సాధారణ ప్రజలకు ఒక వింత. డబ్బున్నవాళ్లకు దానిని సొంతం చేసుకోవాలన్న ఆరాటం. నాడు సొంత విమానాలు కలిగి ఉండటమంటే మామూలు విషయం కాదు. కానీ, తెలంగాణలోని ఓ సంస్థానాధీశులు ఆ ఘనతను సాధించారు. జటప్రోలు (కొల్లాపూర్) సంస్థానాన్ని పాలించిన సురభి వంశస్తులు దాదాపు 93 ఏళ్ల క్రితమే సొంత విమానాల్లో తిరిగారు. పైలట్లుగా శిక్షణ పొంది లైసెన్సులూ సంపాదించారు.

ఐవీఆర్‌తో ప్రారంభం

క్రీ.శ. 6వ శతాబ్దం నుంచి కొల్లాపూర్ ప్రాంతాన్ని సురభి వంశస్తులు పరిపాలించినట్లు చరిత్ర చెబుతోంది. 1507 సంవత్సరం నుంచి వారి పాలనకు సంబంధించిన ఆధారాలున్నాయి. 1840లో తమ సంస్థానాన్ని జటప్రోలు నుంచి కొల్లాపూర్‌కు మార్చారు. 1884 నుంచి 1929 వరకు నిజాం నవాజ్‌వంత్ బహదూర్‌గా పిలిచే రాజా వెంకటలక్ష్మారావు కొల్లాపూర్‌ను పాలించారు. ఆయన తర్వాత రాణి వెంకటరత్నమ్మ రాజ్యపాలన చేపట్టారు. వెంకటలక్ష్మారావు కుమార్తె సరస్వతీ దేవిని బొబ్బిలి రాజ్యంలోని తిరుపాచారు జమీందారు ఇనుగంటి వెంకటకృష్ణారావు (ఐవీఆర్) వివాహం చేసుకున్నారు. ఆయన విమానాలు నడపాలనే కోరికతో పైలట్‌గా శిక్షణ కూడా పొందారు. 1931 నవంబర్ 11న ఆయన ఢిల్లీలో పైలట్‌గా లైసెన్స్ తీసుకొన్నారు. తమ అల్లుడు ఐవీఆర్ కోసం సురభి రాజులు ఇద్దరు ప్రయాణించగల విమానాన్ని కొనుగోలు చేశారు. అప్పట్లో మద్రాసు ప్రావిన్సులో మాత్రమే ఒక రాజ కుటుంబానికి సొంత విమానం ఉండేది. దక్షిణ భారతదేశంలో సొంత విమానం కొనుగోలు చేసిన రెండో కుటుంబం సురభి రాజులదే. దీనికి వేంకట అనే పేరు పెట్టారు. విమానాన్ని నిలిపేందుకు కొల్లాపూర్‌లోని జఫర్ మైదానాన్ని ఎయిర్‌పోర్టుగా వినియోగించారు. హకీంపేటలో నిర్వహించిన విమానాల పోటీల్లో జేఆర్‌డీ టాటాతోపాటు ఐవీఆర్ కూడా పాల్గొన్నారు. మద్రాసు నుంచి బెంగళూరు వరకు 1,800 అడుగుల ఎత్తులో విమానాన్ని నడిపి ఐవీఆర్ రికార్డు సృష్టించారు. ఇంతటి ప్రతిభావంతుడైన ఐవీఆర్.. దురదృష్టవశాత్తు విమాన ప్రమాదంలోనే 1935 ఆగస్టు 25న మరణించారు. ఆయన స్మారకార్థం జఫర్ మైదానం సమీపంలోనే (ఆర్‌ఐడీ బాలుర జూనియర్ కళాశాల పక్కన, వాల్మీకి గుడి వద్ద) స్తూపం ఏర్పాటుచేశారు.

మళ్లీ గజగజ!

- రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా తగ్గిపోయిన ఉష్ణోగ్రతలు
- పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి.. ఉదయం పూట పొగమంచు కమ్మేసే చాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తిరిగి తగ్గుముఖం పట్టాయి. మళ్లీ చలి తీవ్రత పెరిగిపోయింది. బంగాళాఖాతంలో తుఫాను కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాల నేపథ్యంలో వారం పాటు సాధారణం కంటే అధికంగా నమోదైన ఉష్ణోగ్రతలు.. గురువారం రాత్రి నుంచి ఒక్కసారిగా పతనమయ్యాయి. పలుచోట్ల సాధారణ స్థాయిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవగా.. కొన్నిచోట్ల సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. ఆదిలాబాద్, హన్మకొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రామగుండంలలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. మరో మూడు రోజులు కూడా రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉదయం పూట పొగమంచు ఏర్పడే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో ఉష్ణోగ్రతల తీరు

కేంద్రం	కనిష్టం
ఆదిలాబాద్	8.7
మెదక్	12.0
హనుమకొండ	12.5
రామగుండం	13.4
నిజామాబాద్	13.9
దుండిగల్	14.8
హకీంపేట్	15.4
హైదరాబాద్	17.9
నల్లగొండ	19.0
ఖమ్మం	19.4
భద్రాచలం	19.5
మహబూబ్‌నగర్	19.6

2025 నాటికి 'కోచ్, వ్యాగన్ తయారీ' పనులు పూర్తి

దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



వ్యాగన్ షెడ్ నమూనాను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

కాజీపేట రూరల్: కాజీపేటలో రైల్వే కోచ్, వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు 2025, ఆగస్టు నాటికి పూర్తి చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. శుక్రవారం ఆయన ప్రత్యేక రైలులో సికింద్రాబాద్ నుంచి కాజీపేట వ్యాగన్ షెడ్ నిర్మాణం జరిగే రైల్వే గేట్ సమీపంలో దిగారు. అనంతరం కాజీపేట మండలం అయోధ్యపురం-మడికొండ శివారులో నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అంతకుముందు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో అన్ని రకాల కోచ్‌లను తిలకించారు. వ్యాగన్‌షెడ్ నిర్మాణ లేఅవుట్ నమూనాను చూసి పలు మార్పులు, చేర్పులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాజీపేటలో రూ.720 కోట్లతో రైల్వే వ్యాగన్, ఈఎంయూ, మెము, ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల తయారీ యూనిట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇండియాలో అత్యంత వేగంగా, ఆధునిక టెక్నాలజీ, ఆటోమెటిక్ సిస్టం, హై క్వాలిటీతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే 50% పూర్తయిందని అరుణ్‌కుమార్ వెల్లడించారు. అనంతరం కాజీపేట రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న అమృత్‌భారత్ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఆర్‌ఎం భర్తేశ్‌కుమార్ జైన్, రైల్వే పీసీఎంఈ మధుసూదన్ రావు, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ రామారావు, ఇతర రైల్వే సికింద్రాబాద్ విభాగాల అధికారులు, కాజీపేట రైల్వే అధికారులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సర్కారు బడి..
కార్పొరేట్ స్కూళ్లతో ఢీ

ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేటలోని ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్

- కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తుండటంతో భారీగా అడ్మిషన్లు
- గతేడాది టెన్త్‌లో 99.13 శాతం ఉత్తీర్ణత
- పాఠశాలలో 1,219 మంది విద్యార్థులు
- దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: ఆ స్కూల్ నుంచి ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలను రాసేందుకు 242 మంది సిద్ధమవుతున్నారు. అదేదో ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ అనుకుంటున్నారా? కానే కాదు. అది సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్). పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 1,219 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దత్తత తీసుకుని అభివృద్ధి చేయడంతో పాటు పలు సంస్థల నిపుణులతో విద్యార్థులకు పాఠాలు బోధించేలా చర్యలు తీసుకున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఇక్కడ విద్యాబోధనను అందిస్తుండటంతో డిమాండ్ పెరుగుతోంది. దీంతో రాష్ట్రంలోనే రెండవ అతి పెద్ద ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు పొందింది.


పదో తరగతి విద్యార్థులకు క్లాస్ చెబుతున్న ఉపాధ్యాయుడు

అడ్మిషన్లు దొరకడమే కష్టం

ప్రభుత్వ పాఠశాలలోనే కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుండటంతో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతున్నారు. ప్రతీ సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తర్వాత విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ పాఠశాలలో అడ్మిషన్ దొరకడమే కష్టంగా ఉంటుంది. రోజూ ఉదయం 8:30 గంటలకు మోటివేషన్ క్లాసులు, 8:45 గంటలకు మెడిటేషన్, 9 గంటలకు ప్రేయర్‌లో ప్లెడ్జ్, జాతీయ గీతం, న్యూస్, జీకే ప్రశ్నలు, విద్యార్థుల పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పిస్తారు. పాఠశాలలో రోబోటిక్స్, డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్, ఎన్‌సీసీ, సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయి. అలాగే విద్యార్థులతో ఫుడ్ కమిటీని ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనం పథకంను అమలు చేస్తున్నారు. ప్రతీ మూడు నెలలకోసారి తరగతుల వారీగా తల్లిదండ్రులతో సమావేశాలను ఏర్పాటు చేసి పిల్లలు ఎలా చదువుతున్నారు అని వివరిస్తున్నారు. దీంతో ఈ పాఠశాలలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు.

1982లో పాఠశాల ప్రారంభం

ఇందిరానగర్ పాఠశాలను 1982లో ప్రారంభించారు. ఇది అప్‌గ్రేడ్ అవుతూ 1991 నుంచి ఉన్నత పాఠశాలగా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 23 సెక్షన్లలో 1,219 మంది విద్యార్థులుండగా అందులో బాలురు 691, బాలికలు 528 మంది ఉన్నారు. వీరికి 40 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. 2024–2025 ఏడాదికి పదో తరగతి 34వ బ్యాచ్ ఐదు సెక్షన్లలో 242 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే వీరందరూ పరీక్ష ఫీజు చెల్లించారు. అందులో బాలురు 141, బాలికలు 101 మంది ఉన్నారు. గత నాలుగేళ్ల నుంచి డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు ఉచితంగా అందిస్తున్నారు. గతేడాది 231 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 99.13 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే బాసర ట్రిపుల్‌టీలో 17 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్యకు 20 మంది ఎంపికయ్యారు.



ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల



కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నాం



మా పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నాం. ప్రతీ సంవత్సరం అడ్మిషన్ల కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులు క్యూ కడుతారు. దరఖాస్తులను స్వీకరించి కుటుంబ పరిస్థితుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యాబోధన చేస్తున్నాం.

– రాజ ప్రభాకర్ రెడ్డి, హెచ్ఎం

గ్యాస్‌ను ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగించాలి

- చెత్తాచెదారం కాల్చివేతను తీవ్రంగా పరిగణించాలి
- రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ చుట్టుపక్కల బొగ్గును ఇంధనంగా వినియోగించే పరిశ్రమలు.. ప్రత్యామ్నాయ ఇంధనంగా గ్యాస్‌ను వినియోగించే దిశగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం, నూతన ఈవీ పాలసీ, పరిశ్రమల నుంచి విడుదలయ్యే ఉద్గారాల నియంత్రణకు ఎమిషన్ మానిటరింగ్ సిస్టమ్, రోడ్లు, ఫ్లైఓవర్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితరాల ద్వారా వాయు నాణ్యతను పెంచేందుకు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. టీజీ ఆర్టీసీకి ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు నిమిత్తం రూ.100 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. పలు ప్రాంతాల్లో కమ్మరివారు పొట్టకూటి కోసం రోడ్లకిరువైపులా చేస్తున్న పనులతో జరుగుతున్న కాలుష్య నివారణకు ఆయా కులసంఘాల ఫెడరేషన్‌లతో చర్చించాలన్నారు. వారికి కాలుష్యరహితంగా ఉపాధి పొందే దిశగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ సమన్వయంతో వాహనాల ఫిట్‌నెస్‌పై నిఘా పెట్టాలన్నారు. జీహెచ్ఎంసీ, టీజీ ఆర్టీసీ, టీజీ రెడ్కో, టీజీఐఐసీ, టీజీఆర్టీఏ, ట్రాఫిక్ పోలీస్, హెచ్ఎండీఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రంలో వాయు కాలుష్య నియంత్రణకు సమష్టిగా ముందుకు పోవాల్సిన ఆత్యయిక స్థితి నెలకొన్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)పై మంత్రి సమీక్షించి మాట్లాడారు. ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారాన్ని ఇష్టం వచ్చినట్టు కాలుస్తుండటం (ఓపెన్ బర్నింగ్) వల్ల గాలి నాణ్యత దెబ్బ తిని, ఊపిరితిత్తులకు తీవ్రమైన హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఈ సమస్యను చాలా తీవ్రంగా పరిగణించాలని, చలికాలంలో ఓపెన్ బర్నింగ్ వల్ల కాలుష్య సమస్య మరింత తీవ్రమవుతుందని పేర్కొన్నారు. దీనిని పూర్తిస్థాయిలో నివారించే దిశగా కార్యాచరణను అమలు చేయాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 131 నాన్ అట్టెయిన్‌మెంట్ సిటీల (అత్యంత కాలుష్య నగరాలు) ను గుర్తించగా, తెలంగాణ నుంచి హైదరాబాద్, నల్లగొండ, సంగారెడ్డిలు ఇందులో ఉన్నాయని, అధికారులు మంత్రికి వివరించారు. పీఎం (పర్టిక్యులేట్ మ్యాటర్) 10 ప్రమాణాలు ఐదేళ్ల పాటు మించిపోయినందున తెలంగాణ నుంచి ఈ నగరాలను నాన్ అట్టెయిన్‌మెంట్ నగరాల జాబితాలో చేర్చినట్టు తెలిపారు. పీఎం 10 లెవల్స్‌ను 30–40 శాతానికి తగ్గించే లేదా జాతీయ ప్రమాణాల ప్రకారం 60 మైక్రోగ్రామ్/క్యూబిక్ మీటర్ సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తూ పోతుండటంతో తలెత్తున్న ఆరోగ్య సమస్యలపై మంత్రి సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్య, పరిశ్రమల విస్తరణతో గాలిలోని పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం) పెరిగి తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీస్తున్న తీరు పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ కాలుష్య నియంత్రణకు రాష్ట్రంలో త్రీ లెవల్ కమిటీ పనిచేస్తున్న తీరును అధికారులు మంత్రికి వివరించారు. అత్యంత కాలుష్య నగరాలైన హైదరాబాద్, పటాన్‌చెరు, నల్లగొండ, సంగారెడ్డిలకు అందుతున్న నిధులు, కాలుష్య నియంత్రణ, నివారణకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, టీజీ పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, సీఈఈ రఘు, జేసీఈఎస్ సత్యనారాయణ, ఎస్ఈఎస్‌డీ ప్రసాద్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, నల్లగొండ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ సంధ్య, ఈడీ మునిశేఖర్ పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు ఆలోచనలతో ముందుకు సాగాలి: పొన్నం

తెలంగాణ సచివాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ఏడాదికి ఒకసారి ప్రపంచ వ్యాప్తంగా జరిగే పెద్ద పండుగ క్రిస్మస్ అని, సమాజంలో అందరూ బాగుండాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో క్రిస్టియన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సచివాలయం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ఏసు ప్రభువు కీర్తనలు, ప్రవచనాలు, ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. రైతులు పాడి పంటలతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెక్యులర్ భావాలతో అన్ని మతాలను గౌరవిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఏఐసీసీ మైనారిటీ నాయకుడు అనిల్ థామస్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మైనారిటీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్ క్రిస్మస్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ సబిత కేక్ కట్ చేశారు. ఎంప్లాయీస్ క్వైయర్ బృందం ప్రత్యేక పాటలు వినిపించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ ఎంప్లాయీస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిట్టిబాబు, చైర్మన్ లాల్ బహదూర్ శాస్త్రి, సువర్ణ రాజు, విక్రమ్, శశిభూషణ్, విప్లవ్, మనోహరమ్మ, జేకబ్ రాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ నిరుద్యోగం పెరిగింది!

- గత మూడేళ్లతో పోలిస్తే పెరిగిన నిరుద్యోగుల సంఖ్య
- పట్టణ ప్రాంతాల్లో కాస్త మెరుగు
- రాష్ట్రాల వారీగా నిరుద్యోగ గణాంకాలు విడుదల చేసిన ఆర్బీఐ

ప్రతి వెయ్యిమందిలో 35 మంది నిరుద్యోగులే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరిగింది. కోవిడ్–19 అనంతర పరిస్థితుల నుంచి ఉపాధి అవకాశాలు ఇప్పటికీ మెరుగుపడలేదు. దేశవ్యాప్తంగా పరిస్థితులు కొంతమేర మెరుగుపడుతుండగా... రాష్ట్రంలో మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని పరిస్థితులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 'హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియాన్ స్టేట్స్: 2023–24' నివేదికను తాజాగా విడుదల చేసింది. ఇందులో గ్రామీణ, పట్టణ నిరుద్యోగంపై ఇరవై ఏళ్లుగా ఉన్న పరిస్థితులను ప్రస్తావించింది. రాష్ట్రాల వారీగా గణాంకాలను ప్రకటించింది. దీన్ని బట్టి చూస్తే.. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందిలో సగటున 35 మందికి ఉపాధి లేదు. 2022–23లో ఈ సంఖ్య 28 మాత్రమే ఉండగా... అంతకుముందు ఏడాది 31గా ఉంది. గత విడతలతో పోలిస్తే ప్రస్తుతం నిరుద్యోగం మరింత పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక పట్టణ ప్రాంతంలో మాత్రం పరిస్థితి కాస్త మెరుగుపడింది. ఇక్కడ ప్రతి వెయ్యిమందిలో 73 మందికి ఉపాధి లేదు. గతేడాది ఈ సంఖ్య 78 కాగా... అంతకుముందు ఏడాది 69గా ఉంది.



కోవిడ్–19తో కుప్పకూలిన గ్రామీణం

ప్రపంచాన్నే వణికించిన కోవిడ్–19 మహమ్మారి నుంచి పారిశ్రామిక రంగం ఇంకా గాడిన పడలేదు. ద్రవ్యోల్బణ పరిస్థితులతో ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. పట్టణ ప్రాంతాల్లో కాస్తో కూస్తో మెరుగుపడుతున్నా... గ్రామీణ ప్రాంతంలో మాత్రం పరిస్థితులు దారుణంగానే ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పురుషుల్లో నిరుద్యోగాన్ని పరిశీలిస్తే... పురుషుల్లో ప్రతి వెయ్యి మందిలో 37 మందికి పని లేదు. గతేడాది ఈ సంఖ్య 33గా ఉండగా... అంతకుముందు 31గా ఉంది. ఇక మహిళల విభాగంలో ప్రతి వెయ్యి మందిలో 31 మందికి ఉపాధి లేదు. గతేడాది ఈ సంఖ్య 21 కాగా... అంతకుముందు 31గా ఉంది. వరుసగా మూడేళ్ల నుంచి గ్రామీణ ఉపాధి అవకాశాల్లో లోటు కనిపిస్తున్నట్లు ఆర్బీఐ గణాంకాలు చెబుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని పురుషుల్లో ప్రతి వెయ్యి మందిలో 60 మందికి ఉపాధి లేదు. గతేడాది ఈ సంఖ్య 71గా ఉండగా.. అంతకుముందు ఏడాది 53గా ఉంది. మహిళల కేటగిరీలో ప్రతి వెయ్యి మందిలో 104 మందికి పని లేదు. గతేడాది ఈ సంఖ్య 96 ఉండగా... అంతకుముందు ఏడాది 113గా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మహిళల ఉపాధి అవకాశాలు తగ్గుతున్నట్లు ఆర్బీఐ అధ్యయనం చెబుతోంది.

రాష్ట్రంలో నిరుద్యోగం రేటు (ప్రతి వెయ్యి మందికి)

కేటగిరీ	2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
గ్రామీణ	65	68	52	34	31	28	35
పట్టణ	94	112	103	77	69	78	73

వ్యవసాయంలో నష్టాలతోనే..

కోవిడ్ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి లేకపోవడంతో వాళ్లంతా సొంత ఊర్లకు వెళ్లిపోయారు. అలా వెళ్లిపోయిన వాళ్లు తిరిగిరాలేదు. మరోవైపు గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండడం, వెనక్కి వచ్చిన వాళ్లకు పని లభించకపోవడం కూడా నిరుద్యోగరేటు పెరుగుదలకు ఓ కారణం. గ్రామీణ ప్రాంతంలో ప్రధాననమైన ఉపాధి రంగం వ్యవసాయమే. కానీ సాగు నష్టాల బాట పట్టడం, యాంత్రీకరణ ప్రభావంతో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని చెప్పొచ్చు. వ్యవసాయంలో రోజువారీ కూలీ కూడా ఆశించినట్లు లేకపోవడం మరో కారణం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పంట దిగుబడులకు కనీస మద్దతు ధరలు పెంచాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెరుగుతుంది.

– డి.పాపారావు, ఆర్థికరంగ నిపుణుడు

ఎక్సైజ్ శాఖ అభివృద్ధికి సమష్టిగా పని చేయాలి

అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్‌శాఖ అభివృద్ధి కోసం అధికారులంతా సమష్టిగా పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏఎం రిజ్వీ, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరికిరణ్, ఓఎస్డీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు ఇతర అంశాలపై ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ అజయ్‌రావుతో, మద్యం సేల్స్ అంశాలపై జాయింట్ కమిషనర్ హెడ్‌క్వార్టర్స్ కేఏబీ శాస్త్రి, మద్యం తయారీ కంపెనీల వ్యవహారాలపై జాయింట్ కమిషనర్ డిస్టిలరీస్, మద్యం అమ్మకాలు, మద్యం నిల్వలపై బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహం, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పురోగతిపై జాయింట్ కమిషనర్ ప్రణవీలతో మంత్రి విడివిడిగా సమావేశమయ్యారు. పలు అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు.



వామ్మో.. పంటంతా తినేస్తున్నాయ్!

- వరి పంటను మూడు రోజుల్లోనే తినేస్తున్న రెల్లరాల్చు పురుగులు
- నివారణ చర్యలు చేపట్టేలోగానే చేలను చుట్టేస్తున్న పురుగులు
- ఉత్తరాంధ్రలో పంటకు నిప్పుపెడుతున్న రైతులు

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర ప్రాంతంలో వరి చేలను కత్తెర, కొమ్ము పురుగులు రైతుల పాలిట అశనిపాతంలా తయారయ్యాయి. నివారణ చర్యలు చేపట్టేలోగా చేలను చుట్టేసి కేవలం మూడు రోజుల్లోనే వరి కంకులను తినేస్తున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. ఆ మూడు జిల్లాల్లో ఖరీఫ్ సీజన్‌లో 10లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయ్యాయి. ఈ దశలో కత్తెర, కొమ్ము పురుగులు విజృంభిస్తూ పంటను తినేస్తున్నాయి. పురుగులు ఆశించిన పొలాల్లో 30నుంచి 80 శాతం పంట పూర్తిగా దెబ్బ తింది. నీటిఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పురుగుల దాడి తీవ్రంగా కనిపిస్తోంది. విజయనగరం జిల్లాలో 30 వేల ఎకరాల్లో పంట ఈ పురుగుల ఉధృతితో దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. జామి, గంట్యాడ, గరివిడి, నెల్లిమర్ల, గజపతినగరం, బొండపల్లి, పూసపాటిరేగ, చీపురుపల్లి మండలాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

పంటకు నిప్పు పెడుతున్న రైతులు



విజయనగరం జిల్లా బుడతనాపల్లిలో పురుగు సోకడంతో 75 ఎకరాల్లో వరి పంట గడ్డిలా తెల్లబారిపోవడంతో కోసేందుకు పనికిరాకుండా పోయింది. దీంతో చేసేది లేక ఈ ప్రాంత రైతులు వరి పొలాలకు నిప్పు పెడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం ఎస్.నర్సాపురం పరిసర గ్రామాలతో పాటు అనకాపల్లి జిల్లాలోని పలు మండలాల్లో కూడా కత్తెర పురుగు వ్యాపిస్తున్నట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదని, స్థానిక వ్యవసాయాధికారులకు చెప్పినా తమను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో ఇలాంటి పురుగులు, తెగుళ్ల సోకినప్పుడు శాస్త్రవేత్తల బృందాలను రంగంలోకి దింపి సామూహిక నివారణ చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు.

ఏడెకరాల పంటను మూడు రోజుల్లో తినేశాయి



7 ఎకరాలను కౌలుకు తీసుకుని ఎంటీయూ–1126 రకం వరి వేశాను. ఎకరాకు 40 బస్తాలకుపైగా దిగుబడి వస్తుందని ఆశించాను. పంట కోత కొచ్చిన వేళ ఉన్నట్టుండి కత్తెర, కొమ్ము పురుగులు విరుచుకుపడ్డాయి. కేవలం మూడే మూడు రోజుల్లో 7 ఎకరాల పంటను పూర్తిగా తినేశాయి.. ఎకరాకు రూ.35వేల చొప్పున అప్పు చేసి పెట్టిన రూ.2.50 లక్షలు ఆవిరైపోయాయి. ఏం చేసేది లేక పంటకు నిప్పు పెట్టాను. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు.

– చల్లా రామునాయుడు, బుడతానాపల్లి, విజయనగరం జిల్లా

నష్టపరిహారం చెల్లించాలి



యుద్ధప్రాతిపదికన ఆ ప్రాంతాలకు శాస్త్రవేత్తలను పంపించి వరి పంటను ఆశిస్తున్న పురుగులను పరిశీలించి డ్రోన్ల సాయంతో సామూహిక నివారణ చర్యలు చేపట్టాలి. ఈ పురుగుల ఉధృతి కారణంగా ఉత్తరాంధ్రలో కోతకు సిద్ధంగా ఉన్న పంట పొలాల్లో 30 శాతానికి పంట దెబ్బతింది. నష్టపోయిన రైతులకు ప్రకృతి విపత్తుల కింద పంట నష్టపరిహారం ఇవ్వాలి.

– ఎం.హరిబాబు, ప్రధాన కార్యదర్శి, ఏపీ కౌలురైతుల సంఘం

• హిమోదయం

రాయలసీమ జిల్లాల్లో చలి తీవ్రత పెరిగింది. ఉదయాన్నే దట్టంగా కురుస్తున్న పొగమంచుతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సత్యసాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటలైనా మంచు తీవ్రంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అయితే మంచు అందాలు మాత్రం చూపరులను కట్టిపడేస్తున్నాయి. – చిలమత్తూరు



చిలమత్తూరు: పొలాలపై పొగ మంచు ఇలా..



పొగమంచు కారణంగా ఉదయం పూట కూడా లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

మా ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచలేదు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి

నరసరావుపేట: రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను తమ ప్రభుత్వం పెంచలేదని, గత వైఎస్సార్‌సీపీ తీసుకున్న నిర్ణయాల వలనే ఈ పరిస్థితి దాపురించిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌ను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పెరిగిన విద్యుత్ అవసరాలకు తగ్గట్లుగా గత ప్రభుత్వం ఉత్పత్తి చేయలేదు అన్నారు. కమీషన్ల కోసం గత ప్రభుత్వం ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసిందన్నారు. ఇటువంటి తప్పిదాల వలనే డిస్కంలకు నష్టాలు వాటిల్లి డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ సరఫరా చేయటానికి చార్జీలు పెంచాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వం రైతులను ఏనాడు పట్టించుకోలేదని, ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడే హక్కు వైఎస్సార్‌సీపీ నాయకులకు లేదన్నారు.

మద్ది క్షేత్రంలో ఘనంగా హనుమద్ వ్రతం

జంగారెడ్డిగూడెం రూరల్: మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో శుక్రవారం సామూహిక హనుమద్ వ్రతం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులచే హనుమద్ వ్రత పూజలు చేయించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన పాల్గొన్నారు.

శ్రవనాందనకరం...

ఘంటసాల పాటల గానామృతం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించిన అమరగాయకుడు ఘంటసాల పాటల గానామృతం శ్రవనానందకరంగా సాగుతూ శ్రోతుల హృదయాలను మైమరిపించింది. ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకొని తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మనసు పరిమళించెనే అనే పేరుతో మూడు రోజుల పాటు తలపెట్టిన ఘంటసాల పాటల సంగీత విభావరి శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బీటీ అధినేత వెంకటేశ్వర చౌదరి, గేట్ విద్యాసంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, పారిశ్రామికవేత్తలు డాక్టర్ పీసీ.రాయులు, సనత్‌కుమార్, మ్యూజిక్ కళాశాల అధ్యాపకుడు సుధాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి సంగీతం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమధుర కంఠస్వరంతో ఘంటసాల తన పాటలతో ప్రపంచ స్థాయిలో తెలుగు ఖ్యాతిని ఇమిడింపజేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచారని కొనియాడారు. ఘంటసాల ఆలపించిన ప్రతి పాట, పద్యం, భగవద్గీత వంటి సంగీత అజరామజరంగా నిలిచాయన్నారు.

గ్రీన్ బెల్ట్‌ను మింగేసి..



గ్రీన్ బెల్ట్ ఫెన్సింగ్‌ను తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్న షాపింగ్ మాల్ యాజమాన్యం

కూటమి ప్రభుత్వంలో పర్యావరణానికి పాతరేస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలకు పూనుకుంటున్నారు. నగర శివార్లలోనే కాదు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను మింగేసి మరీ భారీ షాపింగ్ మాల్ కట్టేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో బిర్లా జంక్షన్ సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న స్థలంలో భారీ వృక్షాలను నరికేసి, గ్రీన్‌బెల్ట్ మీదే కాంక్రీట్ రోడ్డు వేసేసి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులెవరూ అటువైపుగా కన్నెత్తి చూడకుండా ఉండేందుకు తెలివిగా ముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధుల కటౌట్లు పెట్టి అది కూటమి నేతలకు సంబంధించిన నిర్మాణంగా కలరింగ్ ఇస్తూ చెలరేగిపోతున్నారు. అధికారులు సైతం మామూలు (రా)గానే కళ్లు మూసుకుని చోద్యం చూస్తున్నారు.

- కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో ఏఎస్ఎన్ మెగా మాల్ కన్‌స్ట్రక్షన్
- మామూళ్ల మత్తులో కళ్లుమూసుకున్న అధికారులు

విశాఖ సిటీ : విశాఖ నగరంలో బిర్లా జంక్షన్ సమీపంలో ఏఎస్ఎన్ మెగా మాల్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో షాపింగ్, గేమింగ్, ఎంటర్‌టైన్మెంట్, మల్టీప్లెక్స్ థియేటర్లు, ఆఫీస్ స్పేస్, ఫంక్షన్ హాల్, రెస్టారెంట్, కేఫ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు ఈ మాల్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇక్కడ గ్రీన్‌బెల్ట్‌ను కప్పేసి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వరకు 40, 60 అడుగుల వెడల్పుతో నాలుగు రోడ్లు వేశారు. గ్రీన్ బెల్ట్ పరిరక్షణ కోసం జీవీఎంసీ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతోపాటు ఆ ఏరియా మొత్తాన్ని కలిపేసుకొని మరీ బౌండరీ వాల్ నిర్మాణం చేపట్టారు. అందులో కల్వర్టులు, డ్రైనేజీలు నిర్మించారు. గ్రీన్ బెల్ట్‌లో గత ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలు, అభివృద్ధి చేసిన పార్కులను ధ్వంసం చేశారు.

కళ్లు మూసుకున్న అధికారులు

జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్‌ను కప్పేసి, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని భారీ మాల్ నిర్మిస్తున్నా జీవీఎంసీ అధికారులు కళ్లుమూసుకునే ఉన్నారు. కొన్ని నెలలుగా ఈ అక్రమ నిర్మాణం జరుగుతున్నా అధికారులు అటువైపుగా కనీసం కన్నెత్తి చూడలేదు. మామూళ్ల మత్తులో జోగుతూ నిర్మాణదారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

బీజేపీ ఎమ్మెల్యే ఫిర్యాదుతో..

కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి చేపడుతున్న ఈ మెగా మాల్ అక్రమ నిర్మాణంపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఫిర్యాదు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. గ్రీన్‌బెల్ట్‌ను దెబ్బతీసి, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మాల్ నిర్మాణం చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే ఆ నిర్మాణాలు తొలగించేందుకు జేసీబీని సైతం పంపించారు. తీరా అక్కడకు వెళ్లిన తరువాత కేవలం కాంపౌడ్ వాల్, కల్వర్టు, కొంచెం విస్తీర్ణంలో మాత్రమే రహదారిని తొలగించి చేతులు దులుపేసుకున్నారు.



గ్రీన్ బెల్ట్‌లో రహదారుల నిర్మాణం



గ్రీన్ బెల్ట్‌లో నిర్మాణాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కూటమి ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విశాఖలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. శివారు ప్రాంతాల్లోనే కాకుండా కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డును ఆనుకొని ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొన్ని, సీఆర్‌జెడ్ అనుమతులు లేకుండా మరికొన్ని కట్టడాలు జరుగుతున్నాయి. బిర్లా జంక్షన్ సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని పర్యావరణాన్ని దెబ్బతిస్తూ భారీ షాపింగ్ మాల్ నిర్మాణం జరిగిపోతోంది. కూటమి ప్రజాప్రతినిధుల ఆశీర్వాదాలతో ఈ తరహా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆక్వా రైతుల దాష్టీకం

- చెరువుల ఫొటో తీస్తున్నాడని యువకుడిపై దాడి
- ఆక్వా సాగు నిలిపివేయాలని హైకోర్టు తీర్పు.. అయినా దొడ్డిదారిన సాగు
- నిలిపివేయాలని అధికారులకు ఫిర్యాదు చేసిన యువకుడు
- ఆధారం చూపించాలన్న మత్స్య శాఖ అధికారి
- ఫొటో తీసేందుకు వెళ్లిన వీర దుర్గా ప్రసాద్
- స్తంభానికి కట్టేసి చితకబాదిన ఆక్వా రైతులు

సాక్షి, అమలాపురం: కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ప్రశాంతంగా ఉండే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సైతం ప్రశ్నించే వారిపై అధికార పార్టీ వారు దాడులకు దిగుతున్నారు. హైకోర్టు తీర్పుకు విరుద్ధంగా సాగవుతున్న ఆక్వా చెరువుల ఫొటోలు తీసిన ఓ యువకుడిని అధికార పార్టీకి చెందిన ఆక్వా రైతులు స్తంభానికి కట్టేసి, తీవ్రంగా కొట్టారు. ఈ ఘటన కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో జరిగింది.

సన్నవిల్లి గ్రామంలో 85 ఎకరాల్లో కొన్నేళ్లుగా అనధికారికంగా ఆక్వా సాగు జరుగుతోంది. దీనివల్ల కొబ్బరి చెట్లు చనిపోతున్నాయి. చుట్టూ ఉన్న వరి చేలకు సైతం నష్టం వాటిల్లుతోంది. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఉప్పగా మారిపోతున్నాయి. దీంతో అదే గ్రామానికి చెందిన చిక్కం వీర దుర్గాప్రసాద్, మరికొందరు యువకులు 2018లో హైకోర్టును ఆశ్రయించారు. ఆక్వా చెరువులతో గ్రామానికి నష్టం జరుగుతోందని హైకోర్టు గుర్తించింది. ఇక్కడ ఆక్వా సాగు నిలిపివేయాలని ఈ ఏడాది మార్చి 20న తీర్పు ఇచ్చింది. అప్పటినుంచీ సాగు నిలిపివేశారు. అయితే అధికారుల వత్తాసుతో తిరిగి ఆక్వా సాగుకు కొంతమంది సిద్ధమయ్యారు. దీనిపై మండల మత్స్యశాఖ అధికారి హేమానంద్‌కు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు చేశారు. అక్కడ సాగు జరగడంలేదని, జరుగుతున్నట్లు సాక్ష్యం చూపించాలని ఆ అధికారి చెప్పడంతో ఫొటోలు తీసేందుకు దుర్గా ప్రసాద్ చెరువు వద్దకు వెళ్లాడు. ఇది చూసిన గ్రామానికి చెందిన గనిశెట్టి వెంకట్రాజు, గనిశెట్టి శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, చిక్కం గాంధీ అతనిపై దాడి చేశారు. దుర్గాప్రసాద్‌ను స్తంభానికి కట్టేసి చితకబాదారు. దుర్గాప్రసాద్ కుటుంబీకులను పిలిచి హెచ్చరించారు. ఈ ఘటనపై దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులకు బెయిల్ మంజూరైంది.

ఈ మొత్తం వ్యవహారంలో మత్స్య శాఖ, రెవెన్యూ శాఖల అధికారుల తీరు విమర్శలకు దారి తీస్తోంది. హైకోర్టు తీర్పును అమలు చేయాల్సిన అధికారులు ఆక్వా రైతులకు లోపాయికారీగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. చప్ప నీటి సాగు పేరుతో అనుమతులు తీసుకోవడం, ఉప్పు నీరు తోడి వెనామీ రొయ్యలు సాగు చేయడం జిల్లాలో సర్వసాధారణంగా మారిపోయింది. చివరకు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌డీ) పరిధిలో సముద్ర తీరం, గోదావరి నదీ పాయల మధ్య కూడా ఆక్వా చెరువులు తవ్వుతున్నారు. వీటికి దొడ్డి దారిన మత్స్యశాఖ అనుమతులిస్తుంటే విద్యుత్ శాఖ రాయితీ విద్యుత్ అందిస్తోంది.



దుర్గా ప్రసాద్‌ను స్తంభానికి కట్టేసిన ఆక్వా రైతులు

అక్రమార్కులకు అధికారుల వత్తాసు

కొంత కాలం నుంచి అనుమతులు లేని ఆక్వా సాగుతో మా గ్రామం కలుషితమవుతుండటంతో మా గ్రామంలో కొందరం హైకోర్టును ఆశ్రయించాం. చెరువులను మూసివేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా అధికారులు ఆక్వా సాగు చేసే వారికి వత్తాసు పలుకుతున్నారు. ఇటీవల రైతులు సాగు చేపట్టడంతో స్థానిక ఎఫ్‌డీఓ హేమానంద్‌కు సమాచారమిచ్చారు. ఆయన ఆధారం ఉంటే ఫొటో పెట్టమని అన్నారు. ఆయన ఆదేశాలతోనే చెరువు గట్టుకు వెళ్లి ఫొటో తీస్తుండగా ఆ రైతులు దాడి చేశారు. నాకు అన్యాయం జరిగినప్పటికీ గ్రామం శ్రేయస్సు కోసం ఎంత దూరమైనా వెళ్తాను.

– చిక్కం వీర దుర్గాప్రసాద్

దొంగ నోట్ల కేసులో పోలీసులపై దాడి!

నిందితుడిని ఎత్తుకెళ్లిన దుండగులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దొంగ నోట్ల కేసులో అరెస్టు చేసిన వ్యక్తిని తీసుకుని వెళ్తున్న పోలీసులపై 20 మందికి పైగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, నిందుతుడిని ఎత్తుకెళ్లిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని ప్రకాశ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. దొంగ నోట్ల మార్పిడి కేసులో శ్రీకాకుళం పోలీసులు అక్కడ కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉన్నాడని తెలిసి, గురువారం అక్కడకు వెళ్లి ఆ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దొంగ నోట్ల మార్పిడి కేసులో మరో వ్యక్తి రాజమహేంద్రవరంలో ఉన్నాడని తెలిసి భీమవరం నుంచి గురువారం రాత్రికి రాజమహేంద్రవరం వచ్చారు. అయితే, అతడి ఆచూకీ లభించేలేదు. దీంతో శ్రీకాకుళం పోలీసులు ఇక్కడి నుంచి తిరిగి వెళ్లిపోతుండగా వీఎల్ పురం సమీపంలోని క్రోమా షోరూము వద్ద వారి కారుకు సుమారు 20 మంది పైగా అడ్డం వచ్చారు. కారును నిలుపు చేసి, పోలీసులపై దాడి చేసి, నిందుతుడిని తమ వెంట తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై శ్రీకాకుళం పోలీసులు ప్రకాశ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, దీనిని పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు.

పదినెలల బాలుడు కిడ్నాప్

- ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రగతి కాలనీలో కలకలం



ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో పదినెలల పసిబాలుడు కిడ్నాప్‌కు గురైన ఘటన శుక్రవారం సంచలనం సృష్టించింది. బాధితుల కథనం ప్రకారం.. ఒడిశాలోని జార్ఖంగూడకు చెందిన ప్రదీప్ సునాని, ఊర్వశీ సునానికి నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. వారికి పది నెలల బాబు మహిర్ ఉన్నాడు. మూడేళ్లుగా ఒంగోలులోని కార్ కేర్‌లో పనిచేస్తున్న ప్రదీప్.. మూడు నెలల క్రితం నగరంలోని ప్రగతికాలనీ మొదటి లైనులో ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల పక్కింటిలో పనిచేయడానికి వస్తున్న దయామణి అనే మహిళ ఊర్వశికి పరిచయమైంది. తరచూ ఇంటికి వచ్చి బాబును ఎత్తుకుని ఆడించేది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో బాలుడు మహిర్ నిద్రపోతుండగా తల్లి ఊర్వశి స్నానం చేసేందుకు వెళ్లింది. అదే అదునుగా భావించిన దయామణి ఇంట్లో నిద్రపోతున్న బాలుడిని ఎత్తుకెళ్లింది. స్నానం చేసి వచ్చిన ఊర్వశి ఇంట్లో బిడ్డ లేకపోవడంతో ఆందోళనకు గురైంది. చుట్టుపక్కల వెతికినా బాబు కనిపించలేదు. దయామణి ఒక్కతే వచ్చివెళ్లడంతో ఆమెపై అనుమానంతో ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ప్రదీప్, ఊర్వశి దంపతులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న తాలూకా పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సీసీ కెమేరాలను పరిశీలించారు. నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన మణికంఠతో కలిసి బాలుడిని దయామణి ఎత్తుకెళ్తున్న దృశ్యాలు రైల్వేస్టేషన్లో కనిపించినట్లు సమాచారం.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,178 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,464 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది.

16 నుంచి ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

తిరుపతి కల్చరల్ : పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు తిరుపతితోపాటు దేశ వ్యాప్తంగా 232 కేంద్రాల్లో ప్రముఖ పండితులతో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందుకోసం టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తియపతిలో అన్నమాచార్య కళామందిరం , కేటీ రోడ్డులోని వరదరాజ స్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలను పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారుల్లో ఒకరైన శ్రీగోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం ద్వారా దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో ఉంది.

భక్తిప్రపత్తులతో భరణి దీపోత్సవం

నారాయణవనం: తమిళ కార్తీక భరణి దీపోత్సవాన్ని మండలంలోని శైవ క్షేత్రాలలో శుక్రవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. భక్తులు, మహిళలు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలో కామాక్షాంబిక సమేత కైలాసనాధస్వామికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వ, కుంకుమార్చనలు చేశారు. వర్షాలకు జలపాతంలో నీరు ఉధృతంగా దూకుతుండడంతో భక్తులను స్నానాలకు అనుమతించలేదు. మహిళలు ఆలయాన్ని దర్శించుకుని పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ప్రదోష సమయంలో కైలాసనాధకోన కొండపై అర్చకులు ఆకాశ దీపానికి పూజలు చేసి వెలిగించారు. పాలమంగళం ఉత్తరపుకండ్రిగలోని పాలీశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించి భజనలు చేశారు. భక్తులకు ఉత్సవ నిర్వాహకులు ప్రసాదాల వితరణ చేశారు.

విద్యా సమాచారం

వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది కీలక పాత్ర



తిరుపతి తుడా: వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోందని స్విమ్స్ ఆస్పత్రి డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ తెలిపారు. స్విమ్స్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కంటిన్యూడ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీపీడీ) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఏఐతో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. రోగికి సంబంధించిన సమాచారం, పరిశోధనపై త్వరితగతిన సమాచారం అందుతోందన్నారు. దీంతో చికిత్స, మానసిక ఆరోగ్యం, ఇతర రోగి అవసరాలకు సంబంధించి వైద్యులు నిర్ణయాలు తీసుకోవడంలో క్లినికల్ నిర్ణయాలు సహాయపడతాయని చెప్పారు. మెడికల్ ఇమేజింగ్ సిటీ స్కాన్, ఎక్సరేలు, ఎంఆర్ఐ వంటి ఇమేజింగ్‌ను విశ్లేషించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల, హైదరాబాదుకు చెందిన డాక్టర్ సత్యవ్రతన్ గోవిందరాజన్, ఐసర్ బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పీవీజీకే శర్మ, ప్రొఫెసర్ బీసీఎం ప్రసాద్, డాక్టర్ వీవీ రమేష్ చంద్ర, డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'యువ ఉత్సవ్'

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, జిల్లా గణాంకాధికారి ఎంసీ బాబురెడ్డి, నెహ్రూ యువ కేంద్రం అధికారి జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ, పద్యగానం, సైన్స్ ఎగ్జిబిషన్, కల్చరల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కల్చరల్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి పాల్గొన్నారు.







● మన సినిమా | ఔట్ ఆఫ్ మై మైండ్

ఆ అమ్మాయి గెలిచిందా?



పిల్లలూ... మన దగ్గర అన్నీ వుండి మంచి మార్కులు తెచ్చుకోలేకపోతే అది మన ప్రాబ్లం. కానీ చాలా సమస్యలు వుండి ఎవరైనా కష్టపడి ఏదైనా సాధిస్తే అలాంటి వాళ్లను గ్రేట్ అని ఒప్పుకోవాల్సిందే. అలాంటి వాళ్ళు మనకు స్ఫూర్తి. సో అలాంటి స్ఫూర్తినిచ్చే ఎమోషనల్ లైన్‌తో చేసిన సినిమానే ఈ 'అవుట్ ఆఫ్ మై మైండ్'. ఈ సినిమాను ఆంబర్ సీలే అనే డైరెక్టర్ తీశారు. ఇందులోని కథ మెలోడీ అనే అమ్మాయికి సంబంధించినది. ఆ అమ్మాయికి సెలిబ్రల్ పాల్సీ అనే జన్యుపరమైన సమస్య ఉంటుంది. దాని వల్ల తను మాట్లాడలేదు, నడవలేదు. కాబట్టి వీల్ ఛైర్‌లో వుంటుంది. ఆ అమ్మాయి ఏమైనా చెప్పాలనుకుంటే మెడ్ టెక్ వాయిస్ ద్వారా ఇతరులకు కమ్యునికేట్ చేస్తుంది. కాని ఈ కమ్యునికేషన్ వల్ల మెలోడీ తాను చదివే స్కూల్‌లో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. స్కూల్ తరఫున జరగబోయే విజ్ కిడ్స్ కాంపిటీషన్‌లో పార్టిసిపేట్ చేయాలనుకుంటుంది మెలోడీ. అయితే అందుకు అందరూ హేళన చేస్తారు. మెలోడీ క్లాస్ టీచరైన డయాన్‌తో పాటు తోటి స్టూడెంట్ అయిన రోజ్ కూడా మెలోడీని చాలా ఇబ్బంది పెడుతుంటారు. మరి మెలోడీ విజ్ కిడ్స్‌లో పార్టిసిపేట్ చేసిందా... ఒకవేళ చేస్తే ఎలా చేసింది అనే విషయాలు హాట్ స్టార్ ఓటిటిలో స్ట్రీమ్ అవుతున్న 'ఔట్ ఆఫ్ మై మైండ్'లో చూడాల్సిందే. సినిమా మొత్తం మాటల్లేకుండా మెలోడీ పాత్రలో ఫోబ్ రే టేలర్ అనే ఆర్టిస్ట్ తన యాక్టింగ్‌తో మైండ్ బ్లోయింగ్ అని అనిపించుకుంది. తను నిజ జీవితంలో కూడా ఈ సెలిబ్రల్ పాల్సీతో సఫర్ అవుతోంది. కిడ్స్... ఒక్కసారి ఆలోచించండి. మనం కదల్లేక, మాట్లాడలేక వున్న టైంలో మనం చేయాలనుకున్న పనులు ఎలా చేయగలుగుతాం? బట్ ఈ మూవీలో మెలోడీ అవన్నీ చేసి చూపించింది. ఎలానో మీరు మూవీ చూసేయండి. వాచ్ దిస్ వీకెండ్ ది ఇన్స్పిరేషనల్, ఎమోషనల్ మైండ్ బ్లోయింగ్ మూవీ 'ఔట్ ఆఫ్ మై మైండ్'. ఓన్లీ ఇన్ హాట్ స్టార్.

– ఇంటూరు హరికృష్ణ









నీటిలోన నింగిలోన శాంటా తాతా

పిల్లలూ... క్రిస్మస్ వచ్చేస్తోంది. క్రిస్మస్ అనగానే మనందరికీ గుర్తుకొచ్చేది ఎవరు? శాంటా తాతేగా. ఈ సంవత్సరం శాంటా తాత మన కోసం ఏం గిఫ్టులు తెస్తాడో. ఒకటే ఎగ్జయిట్‌మెంట్. శాంటా తాత మనసు నిండా దయా, ప్రేమ. అందుకే అందరూ ఆ తాత వేషం కట్టడానికి ఇష్టపడతారు. ఎర్రటి ఆ డ్రస్ భలే ఉంటుందిగా. ఇక్కడ ఫొటోలు చూడండి. జపాన్‌లోని టోక్యోలో ఒక భారీ అక్వేరియంలో ఒక డైవర్ శాంటా వేషంలో ఉన్నారు. అమెరికాలోని న్యూరి అనే ప్రాంతంలో స్నోబోర్డ్స్ మీద స్కీయర్స్ శాంటాల వేషం కట్టారు. ఇక బెర్లిన్‌లో అథ్లెట్లందరూ శాంటాగా మారి సరదా పరుగు తీశారు. శాంటా తాతా... తొందరగా రా.

కు..కు...కు... కూత పెట్టే ఆట కబడ్డీ



ఇది అసలు సిసలు పల్లెటూరి ఆట. కబడ్డీ ఆడకుండా ఒకప్పుడు పల్లెటూళ్లలో ఎవరూ ఉండేవారు కాదు. మధ్యలో కొన్నాళ్లు మాయమైనా ఇప్పుడు కార్పొరేట్ లీగ్‌ల వల్ల ఊపు మీద ఉంది. కోర్టులో దిగి 'కబడ్డీ.. కబడ్డీ' అంటూ గుక్క తిరక్కుండా కూత పెట్టే ఈ ఆట చరిత్రేమిటో తెలుసా? తెలియకపోతే తెలుసుకోవాలి.

కబడ్డీ భారతదేశంలో పుట్టి మన దేశంలోనే ప్రఖ్యాతి పొందింది. అనంతరం ఆసియా ఖండంలోని ఇతర దేశాలకూ చేరింది. మన రాష్ట్రంతో సహా దేశంలోని అనేక రాష్ట్రాలకు ఇదే రాష్ట్ర క్రీడ. క్రీ.పూ 1500 నుంచి క్రీ.పూ 500 మధ్యలో కబడ్డీ పుట్టినట్లు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. రోనోజోయ్ సేన్ అనే రచయిత "Nation At Play' పుస్తకంలో వేదకాలంలోనే కబడ్డీ ఆట ఉన్నట్లు పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు, బుద్ధుడు కూడా కబడ్డీ ఆడినట్లు కొన్ని పుస్తకాల్లో ఉంది. రెండు వేల ఏళ్ల క్రితమే ఈ ఆట ఉందని మరికొందరంటారు.



తమిళ పదాలు 'కై', 'పిడి' కలిసి 'కబడ్డీ'గా మారింది. 'కై' అంటే 'చెయ్యి, 'పిడి' అంటే 'పట్టుకోవడం'. చేత్తో పట్టుకుని ఎదుటివారిని ఓడించే ఆట కాబట్టి ఇలా పిలిచేవారు. ఈ ఆటను తెలుగువాళ్లు 'చెడుగుడు' అని కూడా అంటారు. కొన్ని ప్రాంతాల్లో 'కాడ్డీ', 'కోమోంటి' అని కూడా అంటారు. మొదట్లో ఎక్కడికక్కడ రకరకాల నియమాలతో ఈ ఆట ఆడేవారు. 1920 నుంచి దేశవ్యాప్తంగా ఈ ఆటకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు రూపొందించారు.

మన దేశంలో 1950లో 'అఖిల భారత కబడ్డీ సమాఖ్య' ఏర్పాటు చేశారు. 1951లో ఢిల్లీలో జరిగిన తొలి ఆసియా క్రీడా పోటీల్లో కబడ్డీ ఆడారు. కబడ్డీ ఆడేందుకు రెండు జట్లు అవసరం. ఒక్కో జట్టులో ఏడుగురు ఉండాలి. గీత దాటి ఎదుటి జట్టు మీదుకు వెళ్లాక నోటితో 'కబడ్డీ.. కబడ్డీ' అని అంటూ ఉండాలి. అలా అనడం ఆపితే అవుట్ అయినట్టే.

మైదానాల్లోనే కాదు, సముద్ర తీరాల్లో, మేడల మీద, చిన్నచిన్న స్థలాల్లో కూడా కబడ్డీ ఆడుతుంటారు. అంతర్జాతీయ స్థాయిలో 'కబడ్డీ వరల్డ్ కప్' పోటీతో పాటు దేశీయంగా 'ప్రో కబడ్డీ లీగ్' నిర్వహిస్తున్నారు. ప్రదీప్ నర్వల్, నవీన్ కుమార్, అజయ్ ఠాకూర్, అంకుశ్, వి.తేజశ్వినీ బాయి, కవితాదేవి, మమతా పూజారి, ముస్కాన్ మాలిక్ తదితరులు మనదేశంలో ప్రసిద్ధ కబడ్డీ క్రీడాకారులుగా పేరుపొందారు.

బ్రెయిన్ జిమ్



1. ఈయన వస్తే ఎవరైనా నోరు తెరవాల్సిందే
జవాబు: ఆవులింత

2. నేను రోజంతా మీతో పాటే తిరుగుతాను.రాత్రి మాత్రం బయట పడక వేస్తాను. నేను ఎవరు?
జవాబు: చెప్పులు

3. పొంచిన దెయ్యం పోయిన చోటికల్లా వస్తుంది. ఏమిటది?
జవాబు: నీడ

4. యంత్రం కాని యంత్రం. కాదిది మంత్రం. ఏమిటది?
జవాబు: సాయంత్రం

5. ప్రతిరోజూ వచ్చేదే. కాని మరుసటి రోజు వరకు రాదు. ఏమిటది?
జవాబు: రేపు



ఇంగ్లిష్‌లో మాట్లాడదం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.


ఈ వారం కొన్ని పదాలు...

ఖటికము	పిడికిలి
ఖద్యోతుడు	సూర్యుడు
ఖగము	పక్షి
ఖంబు	ఆకాశము
ఆదానము	పుచ్చుకొనుట
నడత	ప్రవర్తన
నరాజి	కత్తి
నర్తనప్రియము	నెమలి
నాదము	ధ్వని
నిక్కము	నిజం
నికేతనం	ఇల్లు
నిక్కల	నిజమైన కల
నిట్ట	ప్రవాహం
నిరాకారము	ఆకాశం
నిర్యాణము	చావు
నీరదము	మేఘం
నెరసు	తప్పు
నమ్రత	అణకువ, వినయం

బుజ్జి పాట

రెండేళ్ల వయసులో పిల్లలు మాట్లాడటం మొదలుపెడతారు. చిన్నచిన్నపదాలు పలుకుతారు. అయితే జపాన్‌కు చెందిన లిన్ టేకీ అనే పాప మూడేళ్లకే గాయనిగా మారింది. అంతేనా? మ్యూజిక్ ఆల్బమ్ విడుదల చేసి తన ఘనతను ప్రపంచానికి చాటింది.

ఆరు నెలల వయసులోనే లిన్ సంగీతం పట్ల ఆసక్తి చూపడం ఆమె తల్లిదండ్రులు గమనించారు. మెల్లగా సంగీతం వినిపించడం మొదలుపెట్టారు. ఏడాది వయసు వచ్చేసరికి లిన్ ఆటలకు బదులు పాటలు పాడుతూ కూర్చునేది. చేతిలో వస్తువులు పట్టుకుని, స్టేజీ మీద గాయకులు అభినయిస్తున్నట్లు అభినయించేది. ఇదంతా చూసి ఆమె తప్పకుండా పాపులర్ అవుతుందని తల్లిదండ్రులు గుర్తించారు. లిన్ పాడే పాటలు కూడా కొత్తగా ఎక్కడా వినని భాషలో ఉండేవి. అంటే పసిపిల్లలు మాట్లాడే విచిత్ర భాషన్నమాట. ఈ విషయాన్ని కనిపెట్టిన అమ్మానాన్నలు లిన్ పాడుతున్న సమయంలో రికార్డు చేయడం మొదలుపెట్టారు. అయితే అన్నిసార్లూ వారి రికార్డింగ్ సజావుగా సాగేది కాదు. కొన్నిసార్లు పాడుతూ లిన్ మధ్యలో ఆపేసేది. మరికొన్నిసార్లు ఆపకుండా పాడుతూనే ఉండేది. ఇలాంటి ఇబ్బందులను దాటి ఆ పాటలను రికార్డు చేశారు.






ఆపై "Nonsense makes Sense' పేరుతో మ్యూజిక్ ఆల్బమ్ విడుదల చేశారు. అయితే లిన్ టేకీ అనే పేరు కాకుండా 'జలింపా' అనే పేరుతో ఈ ఆల్బమ్ రూపొందించారు. సొంత పేరుతో ఆల్బమ్ విడుదల చేస్తే తనకు ఇప్పట్నుంచే జనాల నుంచి ఒత్తిడి పెరుగుతుందని అందుకే వేరే పేరుతో విడుదల చేసినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. లిన్ చిత్రాలు కూడా బయట ఎక్కడా కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. రోజంతా ఏదో ఒకటి పాడుతూ ఉండే లిన్ పెద్దయ్యాక గొప్ప గాయని అవ్వాలని ఇప్పట్నుంచే బలంగా అనుకుంటోంది.

● బాలల గేయం

రంగుల లోకం



ఇదిగో ఇదిగో రంగుల లోకం
చూడు.. చూడు.. భలే ప్రపంచం
ఇదిగో ఇదిగో వన్నెల లోకం
చూడు.. చూడు.. భలే వినోదం

తియ్యగా పాడే కోయిలమ్మలు
నలుపు రంగులో నిండేను
ఉరుముల మెరుపుల మబ్బేమో
తళతళ తెలుపులో మెరిసేను

వెలుగును పంచే సూరీడు
ఎరుపు రంగులో విరిసేను
వెన్నెల నింపే చందమామ
తెలుపు రంగులో మురిసేను

చెట్టుకు మెరిసే ఆకేమో
పచ్చరంగులో నిలిచేను
కొమ్మన పూసిన పూవేమో
రంగురంగులగ మెరిసేను

ఇదిగో ఇదిగో రంగుల లోకం
చూడు.. చూడు.. భలే ప్రపంచం
ఇదిగో ఇదిగో వన్నెల లోకం
చూడు.. చూడు.. భలే వినోదం

జలజలపారే సెలయేరు
తెల్లగ తేటగ నడిచేను
ఒడ్డున నిలిచిన రాళ్లన్నీ
నల్లరంగులో నిలిచేను

ఇదిగో ఇదిగో రంగుల లోకం
చూడు.. చూడు.. భలే ప్రపంచం
ఇదిగో ఇదిగో వన్నెల లోకం
చూడు.. చూడు.. భలే వినోదం

భూమి లేని పేదలకు దారి చూపిన వినోబా



పిల్లలూ! మీ దగ్గర పది రూపాయలుంటే అందులో నుంచి పేదలకు ఎన్ని రూపాయలు ఇస్తారు? ఒక రూపాయి, రెండు రూపాయలు? లేదా అలా ఇవ్వడం వల్ల మాకేంటి లాభం అనుకుంటారా? అయితే మనదేశంలో జరిగిన ఒక గొప్ప ఉద్యమం గురించి మీకు చెప్పాలి. అదే భూదాన ఉద్యమం.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951లో వినోబాభావే అనే గొప్ప నేత, స్వాతంత్ర్య సమర యోధుడు మన రాష్ట్రంలో పర్యటిస్తూ ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లికి వచ్చారు. అక్కడ ఆయన మాట్లాడుతూ ఉండగా ఒక దళితుడు వచ్చి 'మా బతుకులు మారాలంటే మాకు భూమి ఇప్పించండి' అని ఆయన్ని అడిగాడు. వెంటనే ఆయన ఆ వేదిక మీదే భూదానోద్యమానికి శ్రీకారం చుట్టారు. భూమి లేని వారి కోసం భూమి ఉన్నవారు తమ భూమిలో కొంత దానం చేయాలని కోరారు.

దానికి ప్రతిస్పందనగా ఒక భూస్వామి తన భూమిలో కొంత అక్కడికక్కడే దానం చేశారు. అలా ఆ ఊరిలో ఆ ఉద్యమానికి పునాది పడింది. దాంతో ఆ ఊరిని 'భూదాన్ పోచంపల్లి' అని పిలవడం మొదలైంది. ఆ తర్వాత ఆయన అనేక గ్రామాలు తిరుగుతూ ఎంతోమందిని కలిశారు. ఎన్నో సభలు పెట్టి భూమి దానం చేయాలని పిలుపునిచ్చారు. భూమి లేని నిరుపేదలకు భూమినిచ్చి వారికో జీవనోపాధి చూపించాలని కోరారు. ఆయన మీద గౌరవంతో ఆయన మాటల ద్వారా పొందిన స్ఫూర్తితో ఎంతోమంది తమ భూమిని దానం చేశారు. ఆ భూముల్ని వినోబాభావే నిరుపేదలకు పంచిపెట్టారు.

ఇదంతా ఒక్క రోజులో సులభంగా జరిగిపోలేదు. దీనికోసం వినోభా చాలా కష్టపడ్డారు. 70 ఏళ్ల వయసులో అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా దేశమంతా తిరిగారు. భూదాన ఉద్యమంలో సుమారు 25 లక్షల ఎకరాలను సేకరించి భూమిలేని వారికి పంచిపెట్టారు. ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా 1958లో రామన్ మెగసెసే పురస్కారం అందించారు. ఈ పురస్కారం అందుకున్న తొలి భారతీయుడు ఆయనే. 1982లో ఆయన మరణించగా, ఆయన మరణానంతరం 1983లో ఆయనకు 'భారతరత్న' పురస్కారం ప్రకటించారు.

చూశారా! భూమి లేని నిరుపేదల కోసం ఆయన ఎంత శ్రమించారో! మీరు కూడా అలా మీకు తోచినంత సాయం ఇతరులకు చేయండి. మీ దగ్గరున్న దాంట్లో కొంత వారికి పంచండి. అప్పుడు అందరూ ఆనందంగా జీవిస్తారు.

● మన సామెతలు



- రౌతు కొద్దీ గుర్రం
- రెక్కలు విరిగిన పక్షి వలే
- లంక మేత, గోదావరి ఈత
- కూచిపూడిలో కుక్క మొరిగినా సంగీతమే
- కూటికుంటే కోటికి ఉన్నట్లు
- కుక్క సంతకు పోయి వచ్చినట్లు (కొనదు-అమ్మదు)
- 'ఆ దారి ఎక్కడికి పోతుంది' అని అడిగితే 'ఎక్కడికి పోదు. నేను పుట్టినప్పటి నుంచి ఇక్కడే ఉంది' అని చెప్పినట్లు.
- ఆదిలోనే హంసపాది
- తల్లి పుట్టిన ఇల్లు మేనమామ దగ్గర పొగిడినట్లు
- తలప్రాణం తోకకు వచ్చినట్లు
- తలలో నాలుక, పూసలలో దారం వలే

బిజినెస్ రీల్

ఏవియేషన్‌లో అగ్రగామిగా భారత్..

- ఉడాన్ స్కీమ్‌తో కోట్ల మంది గగనవిహారం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ: భారత్‌లో ఏవియేషన్ రంగం గత పదేళ్లుగా గణనీయంగా వృద్ధి చెందిందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో అగ్రగామి దేశీయ ఏవియేషన్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. విప్లవాత్మకమైన ఉడాన్ స్కీముతో గత ఎనిమిదేళ్లలో కోట్లాది మంది విమానప్రయాణాలు చేసినట్లు మంత్రి చెప్పారు. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయం 100 ఏళ్ల వేడుకల లోగోను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. దేశీయంగా అతి పెద్ద మార్కెట్ ఉన్న దేశాల్లో భారత్ ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నట్లు వివరించారు. ఇక్కడి నుంచి మరింత పురోగమించాల్సి ఉందని పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పన కోణంలో చూస్తే అత్యంత కీలకమైన ఏవియేషన్ రంగాన్ని వచ్చే ఐదేళ్లలో మరో స్థాయికి తీసుకెళ్లడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు.

స్విచ్ మొబిలిటీ నుంచి రెండు విద్యుత్ బస్సులు



న్యూఢిల్లీ: భారీ వాణిజ్య వాహనాల తయారీ దిగ్గజం అశోక్ లేల్యాండ్ అనుబంధ సంస్థ స్విచ్ మొబిలిటీ కొత్తగా రెండు లో-ఫ్లోర్ విద్యుత్ సిటీ బస్సులను (ఈఐవీ12, ఈ1) విడుదల చేసింది. చాసిస్ మౌంటెడ్ బ్యాటరీతో వీటిని రూపొందించినట్లు సంస్థ చైర్మన్ ధీరజ్ హిందుజా తెలిపారు. వీటితో పాటు మరికొన్ని ఉత్పత్తులను కూడా ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈఐవీ 12 అనేది 400 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో దేశంలోనే తొలి లో-ఫ్లోర్ సిటీ బస్ అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాట్‌ఫాంను దేశీయంగానే డిజైన్, అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులకు ఇప్పటికే 1,800 ఆర్డర్లు లభించినట్లు సంస్థ సీఈవో మహేష్ బాబు తెలిపారు.

న్యూలాండ్ వాటాలను విక్రయించిన క్యాపిటల్ గ్రూప్

NEULAND
WHERE OPPORTUNITY BECOMES REALITY

న్యూఢిల్లీ: ఆర్థిక సేవల్లో ఉన్న యూఎస్ సంస్థ క్యాపిటల్ గ్రూప్ తాజాగా ఫార్మా కంపెనీ న్యూలాండ్ ల్యాబొరేటరీస్ నుంచి తప్పుకుంది. క్యాపిటల్ గ్రూప్ అనుబంధ కంపెనీ స్మాల్ క్యాప్ వరల్డ్ ఫండ్ 3.77 శాతం వాటాలను రూ.756 కోట్లకు ఓపెన్ మార్కెట్ ద్వారా ఎన్ఎస్ఈలో విక్రయించింది. 4.84 లక్షల షేర్లను సగటున ఒక్కో షేరుకు రూ.15,618.16 చొప్పున విక్రయించింది. ఎన్ఎస్ఈలో న్యూలాండ్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే గురువారం 5.54 శాతం ఎగసి రూ.16,014.95 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,682.00	4.44
ITC	471	2.26
KOTAKBANK	1,804.90	2.05
HINDUNILVR	2,391.25	1.97
ULTRACEMCO	12,082.35	1.9

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	3,169.00	-2.44
TATASTEEL	148.8	-1.31
INDUSINDBK	987.5	-1.05
JSWSTEEL	997.15	-0.86
HINDALCO	665	-0.55

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,037
ఎన్ఎస్ఈ	1,00,830
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,36,945
ఎఫ్ఐఐ	+ 2,335
డీఐఐ	- 732

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.31	$ 70.02
బ్రెంట్	74.34	$ 74.41

జోరుగా వంట నూనెల దిగుమతులు

- నవంబర్‌లో 38.5% వృద్ధి
- పెరుగుతున్న సాఫ్ట్ ఆయిల్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వంట నూనెల దిగుమతులు భారత్‌లో 2024 నవంబర్‌లో 15.9 లక్షల టన్నులు నమోదైంది. గతేడాది నవంబర్‌తో పోలిస్తే ఇది 38.5 శాతం అధికం. ముఖ్యంగా విదేశాల నుంచి ముడి పొద్దుతిరుగుడు నూనె, ముడి సోయాబీన్ నూనెలు భారత్‌కు వెల్లువెత్తడం ఇందుకు కారణం. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) ప్రకారం.. 2024-25 నవంబర్-అక్టోబర్ ఆయిల్ మార్కెటింగ్ సంవత్సరం మొదటి నెలలో వివిధ దేశాల నుంచి భారత్‌కు వెజిటబుల్ ఆయిల్స్ సరఫరా 40 శాతం అధికమై 16,27,642 టన్నులకు చేరుకుంది. ఇది ఏడాది క్రితం 11,60,590 టన్నులుగా ఉంది. 2023 నవంబర్‌లో నమోదైన 12,498 టన్నులతో పోలిస్తే నాన్ ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతి గత నెలలో 37,341 టన్నులకు పెరిగింది. ఆర్‌బీడీ పామోలిన్ 1,71,069 టన్నుల నుంచి 2,84,537 టన్నులకు ఎగసింది. ముడి సన్‌ఫ్లవర్ ఆయిల్ 1,28,707 టన్నుల నుంచి 3,40,660 టన్నులకు చేరింది.

పెరిగిన సాఫ్ట్ ఆయిల్స్..

గత నెలలో భారత్‌కు ముడి సోయాబీన్ ఆయిల్ రాక 1,49,894 టన్నుల నుంచి 4,07,648 టన్నులకు దూసుకెళ్లింది. విదేశాల నుంచి భారత్‌కు ముడి పామాయిల్ సరఫరా 6,92,423 టన్నుల నుంచి గత నెలలో 5,47,309 టన్నులకు పడిపోయింది. గత నెలలో ముడి, శుద్ధి చేసిన పామాయిల్ దిగుమతి 8,69,491 టన్నుల నుండి 8,41,993 టన్నులకు వచ్చి చేరింది. విదేశాల నుంచి భారత్‌కు సాఫ్ట్ ఆయిల్ సరఫరా 2023 నవంబర్‌తో పోలిస్తే 2024 నవంబర్‌లో 2,78,601 టన్నుల నుంచి ఏకంగా 7,48,308 టన్నులకు దూసుకెళ్లింది. పామాయిల్ వాటా 76% నుంచి 53 శాతానికి పడిపోయింది. సాఫ్ట్ ఆయిల్స్ 24 నుంచి 47 శాతానికి పెరిగాయి. ఇండోనేషియా, మలేషియా నుంచి ఆర్‌బీడీ పామోలిన్, ముడి పామాయిల్ ప్రధానంగా సరఫరా అవుతోంది. సోయాబీన్ నూనె ప్రధానంగా అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా నుండి, సన్‌ఫ్లవర్ ఆయిల్ రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా నుండి భారత్‌కు వస్తోంది.

ఎన్‌పీఏ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయండి

- ఎన్‌సీఎల్‌టీ, ఎన్ఏఆర్‌సీఎల్ వద్ద జాప్యాన్ని నివారించండి
- బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచన



న్యూఢిల్లీ: జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), జాతీయ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఆర్‌సీఎల్) వద్ద ఎన్‌పీఏ కేసుల సత్వర పరిష్కారానికి వీలుగా బ్యాంక్‌లను కేంద్ర ఆర్థిక శాఖ కీలక సూచనలు చేసింది. విధానపరమైన జాప్యం, కేసుల విచారణలో వాయిదాలను సాధ్యమైన మేర తగ్గించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని, ఆయా కేసుల పురోగతిని పర్యవేక్షించాలని కోరింది. వసూలు కాని నిరర్థక రుణ ఖాతాలను ఎన్ఏఆర్‌సీఎల్‌కు విక్రయించడం లేదంటే దివాలా పరిష్కార చర్యలు కోరుతూ ఎన్‌సీఎల్‌టీ ముందుకు బ్యాంక్‌లు తీసుకెళ్లడం తెలిసిందే. ఎన్‌సీఎల్‌టీలో కేసుల తాజా సమాచారాన్ని బ్యాంక్‌లు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా కార్పొరేట్ శాఖ ఒక పోర్టల్‌ను కూడా అభివృద్ధి చేస్తోంది. ఎన్ఏఆర్‌సీఎల్, ఎన్‌సీఎల్‌టీలో కేసుల పరిష్కార యంత్రాంగం సమర్థతను పెంచడం, నిర్వహణ సవాళ్ల పరిష్కారం కోసం కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు అధ్యక్షతన తాజాగా సమావేశం జరిగింది. కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసే విషయమై ఇందులో చర్చించినట్టు ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. రూ.95,711 కోట్ల విలువతో కూడిన 22 మొండి ఖాతాలను ఎన్ఏఆర్‌సీఎల్ సొంతం చేసుకోగా, రూ.1.28 లక్షల కోట్ల విలువ చేసే మరో 28 ఎన్‌పీఏ ఖాతాలను బ్యాంక్‌లు పరిష్కరించుకున్నట్టు సమావేశంలో చర్చకు వచ్చినట్టు పేర్కొంది.

ఐపీవో వేవ్

ఓవైపు సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లు చవిచూస్తున్నప్పటికీ మరోపక్క ప్రైమరీ మార్కెట్లు దుమ్ము రేపుతున్నాయి. వెరసి వారంతాన(13న) మూడు కంపెనీల పబ్లిక్ ఇష్యూలు విజయవంతమయ్యాయి. ఈ బాటలో వచ్చే వారం సైతం మరో 4 కంపెనీలు ఐపీవోలు చేపట్టనుండగా.. 11 కంపెనీలు లిస్ట్‌కానున్నాయి.



వన్ మొబిక్విక్‌కు ఇన్వెస్టర్ల క్యూ

119 రెట్లు అధికంగా బిడ్స్



డిజిటల్ పేమెంట్ సేవలు, ఫైనాన్షియల్ ప్రొడక్టుల అప్లికేషన్ సంస్థ వన్ మొబిక్విక్ పబ్లిక్ ఇష్యూకి ఇన్వెస్టర్లు క్యూ కట్టారు. దీంతో చివరి రోజు శుక్రవారానికల్లా 119 రెట్లుపైగా బిడ్స్ దాఖలయ్యాయి. తద్వారా రూ. 572 కోట్లు సమీకరించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1,18,71,696 షేర్లు ఆఫర్ చేయగా.. 141,72,65,686 షేర్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. రిటైల్ ఇన్వెస్టర్లు దాదాపు 135 రెట్లు అధికంగా స్పందించగా.. క్విబ్ విభాగంలో 120 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 109 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. షేరుకి రూ. 265-279 ఇష్యూలో భాగంగా మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 257 కోట్లు సమీకరించింది.

విశాల్ మెగా మార్ట్

27 రెట్లు అధికంగా స్పందన

రిటైల్ స్టోర్ల దిగ్గజం విశాల్ మెగా మార్ట్ పబ్లిక్ ఇష్యూ సక్సెస్ అయ్యింది. చివరి రోజు శుక్రవారానికల్లా 27 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. తద్వారా రూ. 8,000 కోట్లు సమీకరించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 75,67,56,757 షేర్లు ఆఫర్ చేయగా.. 20,64,25,23,020 షేర్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. క్విబ్ విభాగంలో 81 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 14 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. రిటైల్ ఇన్వెస్టర్లు 2.3 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. షేరుకి రూ. 74-78 ధరలో చేపట్టిన ఇష్యూలో భాగంగా మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 2,400 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

సాయి లైఫ్ సైన్సెస్

10 రెట్లు అధికంగా దరఖాస్తులు



కాంట్రాక్ట్ రీసెర్చ్ ఫార్మా రంగ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు శుక్రవారానికల్లా 10 రెట్లుపైగా స్పందన నమోదైంది. తద్వారా రూ. 3,043 కోట్లు సమీకరించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 3,88,29,848 షేర్లు ఆఫర్ చేయగా.. 39,85,59,690 షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. క్విబ్ విభాగంలో 31 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 5 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు 1.4 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. రూ. 522-549 ధరలో చేపట్టిన ఇష్యూలో భాగంగా మంగళవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 913 కోట్లు సమీకరించింది

19 నుంచి మమతా మెషినరీ ఐపీవో

షేరు ధరల శ్రేణి రూ.230-243



న్యూఢిల్లీ: ప్యాకేజింగ్ మెషినరీ తయారీలో కార్యకలాపాలు నిర్వహించే గుజరాత్ కంపెనీ 'మమతా మెషినరీ లిమిటెడ్' ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఈ నెల 19న ప్రారంభం కానుంది. ఒక్కో షేరుకు రూ.230-243 ధరల శ్రేణిని ప్రకటించింది. ఈ మేరకు రూ.179 కోట్ల నిధులు సమీకరించనుంది. ఈ నెల 23న ఇష్యూ ముగుస్తుంది. ఈ నెల 18న యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్లు స్వీకరించనుంది. 50 శాతం సంస్థాగత ఇన్వెస్టర్లకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు, 15 శాతం కోటాను నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేశారు. ఐపీవో ద్వారా కంపెనీ కోసం నిధులు సమీకరించడం లేదు. ప్రమోటర్లు తమకున్న వాటాల నుంచి 73.82 లక్షల షేర్లను విక్రయిస్తున్నారు(ఓఎఫ్ఎస్). అంటే ఐపీవో ద్వారా సమీకరించే నిధులు మొత్తం ప్రమోటర్ల ఖాతాలోకే వెళ్లనున్నాయి. స్టాక్ ఎక్స్చేంజ్‌లో లిస్ట్ చేయడం ద్వారా ప్రయోజనం పొందాలన్నదే ఐపీవో ఉద్దేశ్యమని కంపెనీ ప్రకటించింది. లిస్టింగ్‌తో కంపెనీ బ్రాండ్ ఇమేజ్ మెరుగుపడుతుందని పేర్కొంది. గరిష్ట విక్రయ ధర ప్రకారం చూస్తే కంపెనీ మార్కెట్ విలువ రూ.600 కోట్లుగా ఉంటుంది. ఈ నెల 27న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో కంపెనీ షేర్లు లిస్ట్ కానున్నాయి.

ఐపీవోకు బ్లూస్టోన్ జ్యువెలరీ

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: వజ్రాల ఆభరణ రిటైలర్ బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. కంపెనీ ప్రధానంగా బ్లూస్టోన్ బ్రాండుతో డైమండ్, గోల్డ్, ప్లాటినం, స్టడెడ్ జ్యువలరీ విక్రయిస్తోంది. ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో భాగంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2.4 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. కలారి క్యాపిటల్, సామా క్యాపిటల్, సునీల్ కాంత్ ముంజాల్ తదితరులు షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 750 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీలో ప్రస్తుతం ఇన్వెస్టర్లకు 26.82 శాతం వాటా ఉంది. కంపెనీ దేశవ్యాప్తంగా 203 స్టోర్లను నిర్వహిస్తోంది. గతేడాది(2024-25) మొత్తం ఆదాయం 64 శాతం జంప్‌చేసి రూ. 1,266 కోట్లకు చేరింది.

వివో ఎక్స్200 సిరీస్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ తయారీ సంస్థ వివో తాజాగా భారత్‌లో ఎక్స్200 సిరీస్ విడుదల చేసింది. వీటిలో వివో ఎక్స్200 ప్రో, వివో ఎక్స్200 ఉన్నాయి. భారత్‌లో తొలిసారిగా 200 మెగాపిక్సెల్ జైస్ అపోక్రోమాటిక్ టెలిఫోటో కెమెరా, 6,000 ఎంఏహెచ్ సెమీ-సాలిడ్ స్టేట్ బ్యాటరీని వివో ఎక్స్200 ప్రో మోడల్‌కు పొందుపరిచారు. 6.78 అంగుళాల ఆమర్ గ్లాస్ డిస్‌ప్లేతో తయారైంది. 50 ఎంపీ జైస్ ట్రూ కలర్ మెయిన్ కెమెరా, 50 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా సైతం జోడించారు. ఎక్స్200 మోడల్ 6.67 అంగుళాల షాట్ ఆల్ఫా గ్లాస్ డిస్‌ప్లేతో రూపుదిద్దుకుంది. 50 ఎంపీ వీసీఎస్ ట్రూ కలర్ మెయిన్ కెమెరా, 50 ఎంపీ జైస్ టెలిఫోటో కెమెరా, 50 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా, 5,800 ఎంఏహెచ్ బ్యాటరీ ఏర్పాటు ఉంది. ఫన్‌టచ్ ఓఎస్ 15, జెమినై అసిస్టెంట్, ఏఐ ట్రాన్స్‌క్రిప్ట్ అసిస్ట్, వివో ఏఐ లైవ్ కాల్ ట్రాన్స్‌లేషన్ వంటి హంగులు ఉన్నాయి. ఎక్స్200 ప్రారంభ ధర రూ.65,999 కాగా, ఎక్స్200 ప్రో ధర రూ.94,999 ఉంది.

పీవీ హోల్‌సేల్స్‌లో 4 శాతం వృద్ధి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా తయారీ కంపెనీల నుండి డీలర్‌షిప్‌లకు చేరిన ప్యాసింజర్ వెహికిల్స్ (పీవీ) సంఖ్య గతేడాదితో పోలిస్తే 2024 నవంబర్‌లో 4 శాతం పెరిగి 3,47,522 యూనిట్లకు చేరుకున్నాయి. భారత పీవీ రంగంలో నవంబర్ నెలలో ఇవే ఇప్పటి వరకు అత్యధికం. అక్టోబర్‌లో పండుగ తర్వాత డిమాండ్ ఊపందుకుందని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) శుక్రవారం తెలిపింది. సియామ్ గణాంకాల ప్రకారం.. గత ఏడాది నవంబర్‌లో మొత్తం ప్యాసింజర్ వాహనాల హోల్‌సేల్ విక్రయాలు 3,33,833 యూనిట్లుగా ఉన్నాయి. మార్కెట్ లీడర్ మారుతీ సుజుకీ ఇండియా గత నెల హోల్‌సేల్ అమ్మకాలు 5 శాతం వృద్ధితో 1,41,312 యూనిట్లను తాకాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా నుంచి డీలర్లకు చేరిన వాహనాల సంఖ్య 49,451 నుంచి 48,246 యూనిట్లకు తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు 16 శాతం వృద్ధితో 46,222 యూనిట్లకు ఎగశాయి. ద్విచక్ర వాహనాల హోల్‌సేల్స్ 2023 నవంబర్‌లో 16,23,399 యూనిట్లు నమోదు కాగా, గత నెలలో 1 శాతం తగ్గి 16,04,749 యూనిట్లకు చేరుకున్నాయి. స్కూటర్ల విక్రయాలు 12 శాతం పెరిగి 5,68,580 యూనిట్లకు చేరుకున్నాయి. మోటార్‌సైకిల్స్ 7.5 శాతం తగ్గి 9,90,246 యూనిట్లకు పడిపోయాయి. గత నెలలో మోపెడ్ హోల్‌సేల్స్ 6 శాతం పెరిగి 45,923 యూనిట్లు నమోదయ్యాయి. త్రీ-వీలర్స్ 1 శాతం క్షీణించి 59,350 యూనిట్లకు వచ్చి చేరాయి. దీపావళి కాని నవంబర్‌లో మొదటిసారిగా టూవీలర్స్ హోల్‌సేల్ విక్రయాలు 16 లక్షల యూనిట్ల మార్కును దాటింది.

బ్రూక్‌ఫీల్డ్ ఇండియా నిధుల సమీకరణ

క్విప్ ద్వారా రూ. 3,500 కోట్లు



న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్) తాజాగా నిధులను సమీకరించింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ (క్విప్) ద్వారా రూ. 3,500 కోట్లు సమకూర్చుకుంది. నిధులను ప్రధానంగా రుణభారాన్ని తగ్గించుకునేందుకు వినియోగించనుంది. ఇష్యూకి ఎంఎఫ్‌లు, బీమా కంపెనీలు తదితర దీర్ఘకాలిక ఇన్వెస్టర్ల నుంచి పటిష్ట డిమాండ్ కనిపించినట్లు కంపెనీ పేర్కొంది. దేశీయంగా ప్రపంచ బ్యాంకు సంస్థ ఐఎఫ్‌సీ, ప్రభుత్వ రంగ దిగ్గజం ఎల్ఐసీ తొలిసారి రీట్‌లో ఇన్వెస్ట్‌చేసినట్లు వెల్లడించింది. ఇతర యాంకర్ ఇన్వెస్టర్లలో ఎస్‌బీఐ ఎంఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ సైతం ఉన్నట్లు తెలియజేసింది. మొత్తం రూ. 5,200 కోట్ల విలువైన రీట్స్‌కు డిమాండ్ నమోదుకాగా.. రూ. 3,500 కోట్లమేరకు యూనిట్లను కేటాయించనున్నట్లు వివరించింది. వెరసి క్విప్ ద్వారా 12.77 కోట్ల కొత్త యూనిట్ల జారీకి ఇష్యూ కమిటీ ఆమోదించినట్లు పేర్కొంది. కంపెనీ లిస్టయ్యాక రెండోసారి సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమీకరించింది! 2023 ఆగస్ట్‌లో క్విప్ ద్వారా రూ. 2,300 కోట్లు అందుకుంది.

2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారడానికి..

ఇన్‌ఫ్రాపై 2.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి

- భారత్ ఆర్థిక వ్యవస్థపై నైట్ ఫ్రాంక్ నివేదిక
- మౌలిక రంగంలో ప్రైవేటు పెట్టుబడులు పెరగాలని వ్యాఖ్య
- తద్వారా ఇతర రంగాల్లో ప్రభుత్వ వ్యయాలకు మార్గం

న్యూఢిల్లీ: భారతదేశం 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి అవసరమని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ఇందుకు సంబంధించి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి పలు సత్వర చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించింది. ఈ మేరకు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా, 'ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: రివైవింగ్ ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్స్' శీర్షికన ఒక నివేదికను విడుదల చేసింది. ''2030 నాటికి భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పరిమాణాన్ని 7 ట్రిలియన్ డాలర్లకు విస్తరించడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి అత్యవసరం' అని నివేదికలో పేర్కొంది. నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ వివరించిన నివేదికలోని కొన్ని కీలక అంశాలను పరిశీలిస్తే...

- 2030 నాటికి భారత్ 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక పరిమాణాన్ని సాధించడానికి దేశం 2024-2030 మధ్య 10.1 శాతం పురోగతి సాధించాలి.
- మౌలిక సదుపాయాల అభివృద్ధి దేశ అభివృద్ధికి కీలకం. ఈ విషయంలో దేశం ఎంతో పురోగతి సాధించింది. పెరిగిన బడ్జెట్ కేటాయింపులతో లాజిస్టిక్స్ పనితీరు సూచిక (ఎల్‌పీఐ) విషయంలో భారత్ ర్యాంకింగ్ 2023లో 54కు ఎగసింది. 2014లో ఇది సూచీ 54 వద్ద ఉంది.
- గత కొన్ని సంవత్సరాలుగా దేశ మౌలిక సదుపాయాలను గణనీయంగా విస్తరించేందుకు విధాన నిర్ణేతలు దూకుడుగా ముందుకు సాగుతున్నారు.
- దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధి తద్వారా ఆర్థిక వృద్ధిలో చురుగ్గా పాల్గొనేందుకు ప్రైవేట్ సంస్థలకు దేశంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఈ దిశలో మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- అయితే మౌలిక రంగం పురోగతికి సంబంధించి ఎదురయ్యే కొన్ని సవాళ్లు సైతం ఉన్నాయి.



ముఖ్యంగా ప్రభుత్వ పరంగా చూస్తే, ద్రవ్యలోటు పరంగా ఎదురయ్యే సవాళ్లను ఇక్కడ ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం-ద్రవ్యలోటు తీవ్రం కాకుండా చూసుకోవడంలో భాగంగా మౌలిక రంగంపై పెట్టుబడుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది.

- భారతదేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ప్రైవేట్ భాగస్వామ్యం గణనీయంగా తగ్గింది, 2009-13 మధ్య 160 బిలియన్ల (మొత్తం పెట్టుబడులలో 46.4 శాతం) ప్రైవేటు పెట్టుబడులు ఉన్నాయి. 2019-23 మధ్య ఈ విలువ దారుణంగా 39.2 బిలియన్ (మొత్తం పెట్టుబడుల్లో 7.2 శాతం)క డాలర్లకు పడిపోయింది. అయితే ప్రభుత్వ పరంగా ఈ విభాగంలో పెట్టుబడులు పెరిగాయి. అయితే ఇది ద్రవ్యలోటు సమస్యలకూ దారితీస్తున్న సమస్య. ప్రైవేటు రంగంలో మౌలిక విభాగ పెట్టుబడులు పెరగడం వల్ల ప్రభుత్వాలు ద్రవ్యలోటు సమతౌల్యతను రక్షించగలుగుతాయి.
- మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధికి తోడ్పడే చర్యల విషయంలో ప్రభుత్వ వ్యయాన్ని వినియోగించవచ్చు. ప్రజారోగ్య సంరక్షణ, మానవ వనరుల పురోగతి, రుణ చెల్లింపులు వంటి ఇతర ఆర్థిక వృద్ధికి సంబంధించిన ఇతర కీలక విభాగాలకు ప్రభుత్వం వ్యయాన్ని మళ్లించవచ్చు.
- రంగాల వారీగా చూస్తే పునరుత్పాదక ఇంధనం, డేటా సెంటర్లు, రోడ్డు రవాణా రహదారులు, గోడౌన్లు, రవాణా రంగాలు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి తగిన కీలక విభాగాలు.
- వేగవంతమైన పట్టణీకరణ, యువత అధికంగా ఉండడం, పట్టణ ప్రాంతాల పురోగతి, ఎయిర్‌పోర్ట్‌లు, విద్యుత్ సరఫరా వంటి రంగాలు భారీ పెట్టుబడి అవకాశాలను కలిగి ఉన్నాయి.

హైబ్రిడ్ మోడల్‌తోనే...

● 'చాంపియన్స్ ట్రోఫీ' ఖరారు
● నేడు పీసీబీ చీఫ్‌తో ప్రకటన



న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పట్టుబట్టినట్లుగానే హైబ్రిడ్ మోడల్‌తో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ణయించింది. ఈ మేరకు ఆతిథ్య దేశానికి చెందిన బోర్డు అధ్యక్షుడుతో శనివారం స్వయంగా ప్రకటన వెలువరించేందుకు ఏర్పాట్లు చేసింది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు మొసిన్ నఖ్వీ ఈ ప్రకటన చేస్తారని ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఐసీసీ చైర్మన్ జై షా బ్రిస్బేన్ నుంచి వర్చువల్ ఈ సమావేశంలో పాల్గొని అధికారికంగా ప్రకటన చేస్తారని తెలిసింది. వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌ల్ని దుబాయ్‌లో నిర్వహిస్తారు. ఇదొక్క టోర్నీయే కాదు... ఇకపై అన్ని ఐసీసీ టోర్నీలకు చిరకాల ప్రత్యర్థుల మధ్య జరిగే మ్యాచ్‌లు హైబ్రిడ్ పద్ధతిలోనే నిర్వహిస్తారు. అంటే వచ్చే ఏడాది భారత్‌లో జరిగే మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆడేందుకు పాక్ రాదు. పాక్ మ్యాచ్‌ల్ని తటస్థ వేదికపై నిర్వహిస్తారు. 2026లో భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే పురుషుల టి20 ప్రపంచకప్ కూడా హైబ్రిడ్ పద్ధతిలోనే జరుగుతుంది. పాక్ ఆడే మ్యాచ్‌లు శ్రీలంకలో జరుగుతాయి.

గుకేశ్‌తో పోటీ పడే ఆలోచన లేదు: కార్ల్‌సన్



న్యూఢిల్లీ: చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో తలపడాలని అనుకుంటున్న గుకేశ్ కోరిక ఇప్పట్లో నెరవేరకపోవచ్చు. విశ్వ విజేతగా నిలిచిన తర్వాత గుకేశ్ తన మనసులో మాటను వెల్లడించాడు. కార్ల్‌సన్‌తో పోరు అన్నింటికంటే పెద్ద సవాల్ అని... అతడిని ఓడిస్తే అసలైన చాంపియన్ అవుతారని అతను వ్యాఖ్యానించాడు. అయితే కార్ల్‌సన్ పరోక్షంగా దీనిపై స్పందించాడు. నేరుగా గుకేశ్ పేరు చెప్పకపోయినా తనకు ఆసక్తి లేదని వెల్లడించాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు ప్రయత్నించనంటూ గతంలో స్వచ్ఛందంగా కిరీటాన్ని వదిలేసుకున్న కార్ల్‌సన్...'వరల్డ్ టైటిల్స్ సర్కస్‌లో నేను ఇకపై ఎక్కడా భాగం కాబోను' అని తాజాగా వ్యాఖ్యానించాడు. దాంతో మున్ముందు గుకేశ్, కార్ల్‌సన్ మధ్య పోరు దాదాపు అసాధ్యం కావచ్చు!

వావ్రింకాకు 'వైల్డ్ కార్డు'



మెల్‌బోర్న్: వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొనేందుకు మాజీ చాంపియన్ స్టాన్ వావ్రింకా (స్విట్జర్లాండ్)కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. కెరీర్‌లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన వావ్రింకా 2014లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. ఇటీవలి కాలంలో గాయాలతో సతమతమవుతున్న 39 ఏళ్ల వావ్రింకా చివరిసారిగా 2020లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు.

మధ్యప్రదేశ్ X ముంబై



పాటిదార్

దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై, మధ్యప్రదేశ్ జట్లు తుదిపోరుకు దూసుకెళ్లాయి. సీనియర్ ప్లేయర్ అజింక్య రహానే దంచి కొట్టడంతో బరోడాపై ముంబై జట్టు ఘన విజయం సాధిస్తే.... కెప్టెన్ రజత్ పాటిదార్ మెరుపులతో ఢిల్లీపై మధ్యప్రదేశ్ పైచేయి సాధించింది. బెంగళూరులో ఆదివారం జరగనున్న ఫైనల్లో మధ్యప్రదేశ్‌తో ముంబై అమీతుమీ తేల్చుకోనుంది.

ముస్తాక్ అలీ ట్రోఫీ టైటిల్ కోసం అమీతుమీ

● సెమీఫైనల్స్‌లో బరోడాపై ముంబై; ఢిల్లీపై మధ్యప్రదేశ్ విజయం
● రాణించిన రహానే, రజత్ పాటిదార్

బెంగళూరు: సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే (56 బంతుల్లో 98; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ముంబై జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్లో అడుగు పెట్టింది. శుక్రవారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్లో ముంబై 6 వికెట్ల తేడాతో బరోడాను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బరోడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. శివాలిక్ శర్మ (24 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ కృనాల్ పాండ్యా (30; 4 ఫోర్లు), శాశ్వత్ రావత్ (33; 4 ఫోర్లు) రాణించారు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (5) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ముంబై బౌలర్లలో సుర్యాంశ్ షెగ్డే 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై 17.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రహానే త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (30 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. ఈ టోర్నీలో ఫుల్ ఫామ్ కనబర్చిన రహానే... బరోడా బౌలర్లను కుదురుకోనివ్వకుండా మైదానం నలువైపులా షాట్లతో అలరించాడు. ఓపెనర్ పృథ్వీ షా (8), సూర్యకుమార్ యాదవ్ (1) విఫలమైనా... లక్ష్యం పెద్దది కాకపోవడంతో ముంబై జట్టుకు పెద్దగా ఇబ్బందులు ఎదురవలేదు. బరోడా బౌలర్లలో హార్దిక్ పాండ్యా, అతిత్ సేత్, అభిమన్యు సింగ్, శాశ్వత్ రావత్ తలా ఒక వికెట్ తీశారు. రహానేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

13 ఏళ్ల తర్వాత...

ఢిల్లీతో జరిగిన రెండో సెమీఫైనల్లో మధ్యప్రదేశ్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. 7 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ ఢిల్లీని చిత్తుచేసిన మధ్యప్రదేశ్ జట్టు 13 ఏళ్ల తర్వాత ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్‌కు చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. వికెట్ కీపర్ అనూజ్ రావత్ (33 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), ప్రియాన్ష్ ఆర్య (29; 3 ఫోర్లు, 1 సిక్స్), మయాంక్ రావత్ (24; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. మధ్యప్రదేశ్ బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టమైన బంతులతో ఆకట్టుకోవడంతో... ఢిల్లీ జట్టు పరుగులు రాబట్టేందుకు తీవ్రంగా శ్రమించింది. ఈ క్రమంలో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన ఢిల్లీ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. మధ్యప్రదేశ్ బౌలర్లలో ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ 2 వికెట్లు పడగొట్టగా... త్రిపురేశ్ సింగ్, అవేశ్ ఖాన్, కుమార్ కార్తికేయ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో మధ్యప్రదేశ్ జట్టు 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 152 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పాటిదార్ (29 బంతుల్లో 66 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... హర్‌ప్రీత్ సింగ్ (38 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్ష్ (18 బంతుల్లో 30, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ముఖ్యంగా రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఢిల్లీ బౌలింగ్‌ను ఏమాత్రం లెక్కచేయని రజత్ భారీ షాట్లతో విజృంభించాడు. హర్‌ప్రీత్‌తో కలిసి రజత్ అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 57 బంతుల్లోనే 106 పరుగులు జోడించడంతో... మధ్యప్రదేశ్ జట్టు మరో 26 బంతులు మిగిలుండగానే విజయం సాధించింది. ఢిల్లీ బౌలర్లలో ఇషాంత్ శర్మ 2 వికెట్లు, హిమాన్షు చౌహాన్ ఒక వికెట్ తీశారు. రజత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



రహానే



ముగిసిన గాయత్రి-ట్రెసా జోడీ పోరు

హాంగ్జౌ (చైనా): బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ టూర్ ఫైనల్స్ నుంచి భారత జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. మొదటిసారి ఈ టోర్నీకి అర్హత సాధించిన గాయత్రి-ట్రెసా జంట సెమీఫైనల్ చేరాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడిపోయింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 17-21, 13-21తో ప్రపంచ నాలుగో ర్యాంక్ జంట నామి మసుయామ-చిహారు షిడా (జపాన్) చేతిలో ఓడిపోయింది. గ్రూప్ 'ఎ'లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన లియు షెంగ్ షు-టాన్ నింగ్ (చైనా), నామి మసుయామ-చిహారు షిడా (జపాన్) జోడీలు సెమీఫైనల్ చేరుకున్నాయి. మూడో స్థానంలో నిలిచిన గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి 32,500 డాలర్ల (రూ. 27 లక్షల 56 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

క్రీడల్లో పొరపాట్లు సహజం

ప్రపంచ చెస్ పోటీ తీవ్రతపై 'ఫిడే' స్పష్టీకరణ



సింగపూర్ సిటీ: క్రీడల్లో ఆటగాళ్లు పొరపాటు చేయడం సహజమని అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) అధ్యక్షుడు అర్కాడీ వొర్కొవిచ్ తెలిపారు. అంత మాత్రాన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో పోటీతత్వం, తీవ్రత లేవనే విమర్శలు అర్థరహితమని ఆయన కొట్టిపారేశారు. గురువారం ముగిసిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన 18 ఏళ్ల టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ టైటిల్‌తో ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. ఈ టోర్నీ పోటీలపై మాజీ ప్రపంచ చాంపియన్, రష్యా గ్రాండ్‌మాస్టర్ వ్లాదిమిర్ క్రామ్నిక్ స్పందిస్తూ చెస్ ఆట అంతమైందని తీవ్ర పదజాలాన్ని వాడాడు. 14 రౌండ్ల పాటు జరిగిన గేముల్లో పోటాపోటీ కొరవడిందని, గట్టి పోటీ కనిపించనే లేదని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. డిఫెండింగ్ చాంపియన్ హోదాతో బరిలోకి దిగిన చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ వేసిన ఎత్తులు పిల్లచేష్టలుగా అభివర్ణించాడు. దీనిపై రష్యాకే చెందిన వొర్కొవిచ్ స్పందిస్తూ 'క్రీడల్లో పొరపాట్లు చాలా సహజం. ఈ పొరపాట్లనేవి జరగకపోతే ఫుట్‌బాల్‌లో గోల్స్ కావు. ప్రతీ ఆటగాడు పొరపాట్లు చేస్తాడు. ఆ తప్పుల కోసమే ప్రత్యర్థి కాచుకొని ఉంటాడు. సరైన అవకాశం రాగానే అందిపుచ్చుకుంటాడు. ఇదంతా ఏ ఆటలోనైనా సహజమే. ప్రపంచ చెస్ టైటిల్ కోసం తలపడిన లిరెన్, గుకేశ్‌లకు అభినందనలు, టైటిల్ గెలిచిన గుకేశ్‌కు కంగ్రాట్స్' అని అన్నారు. వరుసగా ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన మాగ్నస్ కార్ల్‌సన్ కూడా కొన్ని రౌండ్లు చూస్తే ప్రపంచ చెస్ టైటిల్ కోసం జరిగినట్లుగా తనకు అనిపించలేదని... ఏదో ఓపెన్ టోర్నీలోని గేములుగా కనిపించాయని అన్నారు. కానీ భారత సూపర్ గ్రాండ్‌మాస్టర్, ఐదుసార్లు చాంపియన్ అయిన విశ్వనాథన్ ఆనంద్ అంతా అయ్యాక ఇలాంటి విమర్శలు రావడం ఎక్కడైనా జరుగుతాయని, వీటిని గుకేశ్ పట్టించుకోవాల్సిన అవసరం లేనేలేదని కొత్త చాంపియన్‌కు సూచించాడు. గురువారం భారత యువ గ్రాండ్‌మాస్టర్ కొత్త చరిత్ర లిఖించాడని హర్షం వ్యక్తం చేశాడు.

అన్వయ్ ద్రవిడ్ అజేయ శతకం

విజయ్ మర్చంట్ ట్రోఫీలో అదరగొట్టిన ద్రవిడ్ తనయుడు



మూలపాడు (ఆంధ్రప్రదేశ్): భారత బ్యాటింగ్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ (153 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకంతో అదరగొట్టాడు. విజయ్ మర్చంట్ ట్రోఫీలో జార్ఖండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో కర్ణాటక బ్యాటర్ అన్వయ్ ఆకట్టుకున్నాడు. మూడు రోజుల మ్యాచ్‌లో ఆఖరి రోజు కర్ణాటక తొలిఇన్నింగ్స్‌లో 123.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 441 పరుగుల భారీస్కోరు చేయగా, మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. జట్టు తరఫున నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన అన్వయ్ మొదట శమంతక్ అనిరుధ్ (76)తో కలిసి మూడో వికెట్‌కు 167 పరుగులు జతచేశాడు. అనిరుధ్ అవుటయ్యాక వచ్చిన సుకుర్థ్ (33)తో నాలుగో వికెట్‌కు 43 పరుగులు జోడించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 128.4 ఓవర్లలో 387 పరుగులు చేసి ఆలౌటైంది. 54 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన కర్ణాటకకు 3 పాయింట్లు లభించగా, జార్ఖండ్ ఒక్క పాయింట్‌తో సరిపెట్టుకుంది. అన్వయ్ ద్రవిడ్ గతేడాది కర్ణాటక అండర్-14 జట్టుకు సారథ్యం వహించాడు. విజయ్ మర్చంట్ టోర్నీకి ముందు జరిగిన కేఎస్‌సీఏ (కర్ణాటక క్రికెట్ సంఘం) అండర్-16 ఇంటర్ జోనల్ టోర్నమెంట్‌లో బెంగళూరు జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన అన్వయ్... తుంకూర్ జోన్‌పై చెలరేగి ఆడాడు. డబుల్ సెంచరీ (200 నాటౌట్)తో అజేయంగా నిలిచాడు. అన్వయ్ సోదరుడు (అన్న) 19 ఏళ్ల సుమిత్ కూడా ఇదివరకే జూనియర్ క్రికెట్లో ఆల్‌రౌండర్‌గా నిరూపించుకున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన పరిమిత ఓవర్ల, ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో సమిత్ రాణించాడు.

అరుంధతిపై వేటు



● ప్రతిక, తనూజలకు తొలిసారి చోటు
● విండీస్‌తో సిరీస్‌కు భారత మహిళల జట్ల ఎంపిక

ముంబై: భారత మహిళల జట్టు ఎంపికలో అనూహ్య పరిణామం. నిలకడగా ఆడుతున్న హైదరాబాద్ పేసర్ అరుంధతీ రెడ్డిపై సెలక్షన్ కమిటీ వేటు వేసింది. వెస్టిండీస్ మహిళల జట్టుతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్ (టి20, వన్డే)లకు అనుభవజ్ఞురాలైన ఈ పేసర్‌ను తప్పించారు. రెండు ఫార్మాట్లలోనూ ఆమెకు ఉద్వాసన పలికారు. నిజానికి జట్టులో చోటు కోల్పోయేంత పేలవంగా ఆమె ప్రదర్శన అయితే లేదు. కుదురుగా బౌలింగ్ చేస్తున్న ఆమె వికెట్లు లేదంటే పరుగుల కట్టడితో ఆకట్టుకుంటోంది. కాగా జట్టులో ముగ్గురు కొత్త ముఖాలకు చోటిచ్చారు. ప్రతిక రావల్, తనూజ కన్వర్‌లను తొలిసారి వన్డే జట్టులోకి తీసుకోగా... నందిని కశ్యప్, రాఘవి బిస్త్‌లను తొలిసారి టి20 జట్టులోకి ఎంపిక చేశారు. ఈ రెండు జట్లకు రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌరే సారథ్యం వహిస్తుంది. ముందుగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ జరుగుతుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ఈ నెల 15, 17, 19 తేదీల్లో టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అనంతరం వడోదరలో ఈ నెల 22, 24, 27 తేదీల్లో మూడే వన్డేల సిరీస్ జరుగుతుంది. వరుసగా ఈ రెండు సిరీస్‌లకు షఫాలీ వర్మను ఎంపిక చేయలేదు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌కు ఫామ్‌లో లేని షఫాలీని తీసుకోలేదు. గాయాల కారణంగా యస్తిక భాటియా, శ్రేయాంక పాటిల్, ప్రియా పూనియాలను సెలక్షన్‌కు పరిగణించలేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది.

భారత టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, నందిని కశ్యప్, జెమీమా, రిచా ఘోష్, ఉమా ఛెత్రి, దీప్తి శర్మ, సజన సజీవన్, రాఘవి బిస్త్, రేణుక సింగ్, ప్రియా మిశ్రా, టిటాస్ సాధు, సైమా ఠాకూర్, మిన్ను మణి, రాధా యాదవ్.

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, జెమీమా, రిచా ఘోష్, ఉమా ఛెత్రి, దీప్తి శర్మ, రేణుక సింగ్, ప్రియా మిశ్రా, టిటాస్ సాధు, సైమా ఠాకూర్, మిన్ను మణి, తేజల్ హసబ్నిస్, ప్రతిక రావల్, తనూజ కన్వర్.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ పరాజయం



సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ ఐ-లీగ్ ఐదో రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్ 1-0 గోల్ తేడాతో శ్రీనిధి డెక్కన్ జట్టుపై విజయం సాధించింది. శ్రీనిధి గోల్‌కీపర్ సీకే ఉబేద్ నిర్లక్ష్యంతో జట్టుకు ఓటమి తప్పలేదు. ఎలాంటి అవకాశం లేని చోట డెంపో ఆటగాడు పెరెజె రోవా పెనాల్టీ కిక్ ద్వారా గోల్ కొట్టాడు. సొంత మైదానంలో శ్రీనిధికి ఇది వరుసగా రెండో ఓటమి కాగా ఓవరాల్‌గా మూడోది. ఈ మ్యాచ్ తర్వాత శ్రీనిధి జట్టు ఖాతాలో మొత్తం ఆరు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు 10 పాయింట్లతో డెంపో ప్రస్తుతం అగ్ర స్థానానికి చేరుకుంది.

38 పాయింట్ల తేడాతో...

బెంగళూరు బుల్స్‌పై పుణేరి పల్టన్ ఘనవిజయం

పుణే: ప్రొ కబడ్డీ లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ 38 పాయింట్ల తేడాతో భారీ విజయం నమోదు చేసుకుంది. సొంతగడ్డపై శుక్రవారం జరిగిన ఈ పోరులో పల్టన్ 56-18 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. మ్యాచ్ ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన పల్టన్ ఓవరాల్‌గా 26 రెయిడ్ పాయింట్లు సాధించగా... బెంగళూరు బుల్స్ 11 రెయిడ్ పాయింట్లకే పరిమితమైంది. డిఫెన్స్‌లోనూ ఆకట్టుకున్న పల్టన్ 15 పాయింట్లతో మెరిస్తే... బుల్స్ 7 ట్యాకిల్ పాయింట్లే సాధించింది. ప్రత్యర్థిని నాలుగు సార్లు ఆలౌట్ చేసిన పల్టన్ 8 పాయింట్లు ఖాతాలో వేసుకుంటే... బుల్స్ ఒక్కసారి కూడా ప్రత్యర్థిని ఆలౌట్ చేయలేకపోయింది. పల్టన్ తరఫున రెయిడర్లు ఆకాశ్ షిండే, మోహిత్ గోయత్, ఆర్యవర్ధన్ తలా 8 పాయింట్లు సాధించారు. బెంగళూరు బుల్స్ తరఫున స్టార్ రెయిడర్ ప్రదీప్ నర్వాల్ 7 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 19 మ్యాచ్‌లు ఆడిన పుణేరి పల్టన్ 8 విజయాలు, 8 పరాజయాలు, 3 'టై'లతో 54 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. మరోవైపు ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న బెంగళూరు బుల్స్ 19 మ్యాచ్‌ల్లో రెండే విజయాలతో పట్టిక అట్టడుగున కొనసాగుతోంది. శుక్రవారమే జరిగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-38 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. పట్నా తరఫున అయాన్ 13, దేవాంక్ 12 పాయింట్లతో రాణించగా... తలైవాస్ తరఫున మోయిన్ 11 పాయింట్లతో పోరాడాడు. లీగ్‌లో 18 మ్యాచ్‌లాడిన పైరేట్స్ 11 విజయాలు, 6 పరాజయాలు, ఒక 'టై'తో 63 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో రెండో స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో గుజరాత్ జెయింట్స్ (రాత్రి 8 గంటలకు), దబంగ్ ఢిల్లీతో హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



వెడ్డింగ్ కార్డ్ సెటైర్లు!

మా ఇంట్లో పెళ్లి. తప్పకుండా రండి అంటూ ఎవరైనా వివాహ ఆహ్వాన పత్రిక ఇవ్వగానే టక్కున మనం ఒక నాలుగైదు అంశాలు చూసి కార్డును పక్కన పెట్టేస్తాం. పెళ్లికూతురు, పెళ్లి కొడుకు పేర్లు, పెళ్లి ఏరోజు, ఎప్పుడు, ఎక్కడ, భోజనాలు ఎన్ని గంటలకు మొదలవుతాయి.. ఇవి చూసి, కాస్తంత గుర్తుంచుకుని పత్రికను పక్కన పెడతాం. అలా పత్రికను పక్కన పెట్టేయకుండా పత్రికను ఆద్యంతం చదివి ఆనందపడి, మళ్లీ మరోసారి చదివి మళ్లీ నవ్వుకోవాలని ఒక కుటుంబం ఆశపడింది. అనుకున్నదే తడవుగా కార్డ్‌ను వినూత్న రీతిలో సిద్ధంచేశారు. వింత వెడ్డింగ్ కార్డ్ వివరాల్లోకి వెళితే..



శ్రీరస్తుకు బదులుగా..

శ్రీరస్తు.. శుభమస్తు.. అవిఘ్నమస్తు అన్న పదాలకు బదులుగా ఒక వాక్యం ముద్రించారు. అదేంటంటే ''మీరాక మాకెంతో ప్రత్యేకం. మీరే రాకపోతే మా పెళ్లి భోజనాల్లో ఆ కూర బాలేదు. ఈ మిఠాయి లేదు, ఐస్‌క్రీమ్ అప్పుడే అయిపోయిందా? అని ఎవరు గోల చేస్తారు?''అని రాశారు. ఇక పెళ్లి కూతరు 'శర్మ గారి కుమార్తె'అన్న పదాల పక్కనే ''చదువుల్లో మేటి''అని రాశారు. ఇక ''గోపాల్ గారి అబ్బాయి''పక్కనే బ్రాకెట్లో ''బీటెక్ చదివాడు.. దుకాణంలో పనులు కూడా బాగా చేస్తాడు''అని రాసుకొచ్చారు. 2025 జనవరి ఐదో తేదీన శుభముహూర్తం ఖాయం చేశామని ఖరారుచేశారు. ఇది అత్యంత శుభదినమని ఏకంగా ముగ్గురు పండితులు ఘంటాపథంగా చెప్పారని వారినీ ప్రస్తావించారు. అదే రోజున పిల్లాడు టింకూ గాడి పరీక్షలు కూడా అయిపోతున్నాయని సంబరపడిపోయారు.



వివాహవేదిక ఎక్కడంటే?

వివాహ వేదిక పేరు ప్రస్తావించకుండా.. 'అదే నండీ.. మన దూబే గారు గత ఏడాది రిటైర్ అయితే ఫంక్షన్ చేశాంకదా. అదే ఫంక్షన్‌హాల్'అంటూ మన ల్ని ఆలోచనల్లో పడేశారు. ఫంక్షన్‌హాల్ కోసం బాగా వెతకండి.. ఎందుకంటే అక్కడ ఒకే రకం గేట్లు ఉన్న ఫంక్షన్‌హాళ్లు పక్కపక్కనే ఉన్నాయి మరి''అని రాసుకొచ్చారు.

రిసెప్షన్ సంగతి?

పెళ్లి తంతు ముగించాం. ''ఇక రిసెప్షన్‌లో ఆంటీల పట్టుచీరల హంగామా, అంకుల్‌ల తాగుడు, గొడవ మిగిలే ఉన్నాయి''అని కుడివైపు పేజీకి హెడ్డింగ్ పెట్టేశారు. పెళ్లి అసలైన హ్యాంగోవర్ ఇప్పుడు మొదలవుతుంది''అంటూ రిసెప్షన్ సమయాన్ని రాశారు. ఏడు గంటలకు రిసెప్షన్ మొదలవుతుందిగానీ కొత్తజంట రెడీ అయి వేదిక మీదకు వచ్చేసరికి 8.30 కావొచ్చని ఒక అంచనా ఇచ్చేశారు.



రిసెప్షన్ హెచ్చరికలు!

''చిచ్చరపిడుగుల్లాంటి మీ చిన్నారులు, పిల్లల సంగతి మీరే చూసుకోండి. ఇన్ని డబ్బులుపోసి సర్వాంగ సుందరంగా సిద్దంచేసిన రిసెప్షన్ స్టేజీని పిల్లలు ఆటస్థలిగా మార్చకుండా చూసుకోండి. పెళ్లి పెద్దలు మామగారిని ఖచ్చితంగా కలిసి వెళ్లండి. లేదంటే ఆయన ముఖం గోల్‌గప్పలాగా మారి పగలిపోతుంది''అని సూచనలుచేశారు. ''రుచికరమైన వంటకాలన్నీ ఒక పట్టుపట్టాకే ఇంటికి తిరుగుముఖం పట్టండి. అయితే భోజనం మాత్రం ఒక్కసారే తినండి. ఎందుకంటే ఒక్కో ప్లేటు భోజనం ఖరీదు రూ.2,000''అంటూ ముగించారు. ఇంత వింత ఆహ్వానాన్ని చూసి చాలా మంది నెటిజన్లు ఆనందం వ్యక్తంచేస్తూ పోస్టులు పెట్టారు. పెళ్లికి రాకముందే సరదాల సందడిని కార్డుతోనే మొదలెట్టేశారని పొగిడారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



సిరియాలో రాజధాని డమాస్కస్‌లోని సెంట్రల్ స్క్వేర్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న జన సందోహమిది. బషర్ అల్‌-అసద్ నియంత పాలన ముగిశాక సెంట్రల్ స్క్వేర్‌లో జరిగిన మొట్టమొదటి శుక్రవారం ప్రార్థనల్లో వీరంతా పాల్గొన్నారు.

పార్లమెంట్‌పై ఉగ్రదాడి ఘటన.. అమరులకు లోక్‌సభ నివాళి

న్యూఢిల్లీ: 2001 డిసెంబర్ 13వ తేదీన పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిని ఎదుర్కొని ప్రాణ త్యాగం చేసిన భద్రతా సిబ్బందికి లోక్‌సభ శుక్రవారం ఘనంగా నివాళులర్పించింది. సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే అమరుల గౌరవార్థం సభ్యులంతా లేచి నిలబడి కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం పాత పార్లమెంట్ సంవిధాన్ సదన్ వెలుపల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అమరులకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ జవాన్లు అమరులకు సెల్యూట్ చేశారు. అనంతరం మౌనం పాటించారు. బాధిత కుటుంబాల సభ్యులతో నేతలు మాట్లాడారు. కాగా, అప్పటి ఘటనలో పార్లమెంట్ భద్రతా విభాగం, ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్‌లకు చెందిన 8 మంది సిబ్బందితోపాటు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ శాఖకు చెందిన ఓ ఉద్యోగి నేలకొరిగారు. పార్లమెంట్‌లోకి ప్రవేశించి మారణ హోమం సృష్టించేందుకు తెగబడిన పాకిస్తాన్‌కు చెందిన మొత్తం ఐదుగురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు.

సర్వదా రుణపడి ఉంటాం: రాష్ట్రపతి ముర్ము

2001లో ఉగ్ర మూకల దాడి నుంచి పార్లమెంట్‌ను రక్షించే క్రమంలో ప్రాణత్యాగం చేసిన వారికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా నివాళులర్పించారు. అమరులకు సర్వదా రుణపడి ఉంటామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఉగ్ర మూకలను జాతి యావత్తూ కలిసికట్టుగా ఎదుర్కొందని, ఉగ్రవాదంపై పోరుకు దేశం కట్టుబడి ఉంటుందని ఆమె 'ఎక్స్'లో తెలిపారు.

రైతు నేతకు వైద్యం అందించండి

కేంద్రం, పంజాబ్ ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ: పదిహేడు రోజులుగా పంజాబ్–హరియాణా సరిహద్దులోని ఖనౌరిలో నిరవధిక దీక్ష సాగిస్తున్న రైతు సంఘం నేత జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆయనకు తక్షణమే వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించింది. రైతు నేత దల్లేవాల్‌తో వెంటనే మాట్లాడాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం కేంద్రం, పంజాబ్ ప్రభుత్వాలను కోరింది. అయితే, ఆయనతో బలవంతంగా ఆందోళన విరమింప జేయడం వంటి చర్యలకు దిగరాదంది. ఈ నెల 17న చేపట్టే తదుపరి విచారణలో దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించడంపై నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. అదేవిధంగా, రైతులు గాంధేయ మార్గంలో శాంతియుతంగా ఆందోళనలు చేపట్టాలని సుప్రీంకోర్టు కోరింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, హింసాత్మక చర్యలకు దిగరాదని సూచించింది. వారి డిమాండ్లు పరిశీలనలో ఉన్నాయని తెలిపింది. డిమాండ్లపై అధ్యయనానికి ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ త్వరలోనే రైతు సంఘాల నేతలతో చర్చలు జరుపుతుందని ధర్మాసనం తెలిపింది. సమస్యల పరిష్కారానికి కమిటీ ఇచ్చే సిఫారసులను సంబంధిత యంత్రాంగానికి పంపుతామని వెల్లడించింది.

క్షమాభిక్ష జాబితాలో భారతీయ అమెరికన్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం క్షమాభిక్ష ప్రసాదించిన సుమారు 1,500 మందిలో నలుగురు భారత సంతతి అమెరికన్లు కూడా ఉన్నారు. వీరు..మీరా సచ్‌దేవ, బాబూభాయ్ పటేల్, కృష్ణ మోటె, విక్రమ్ దత్తా. వివిధ నేరాలకు గాను 17 ఏళ్ల నుంచి యావజ్జీవ శిక్షలను వీరు వివిధ జైళ్లలో అనుభవిస్తున్నారు. మిస్సిసిపిలో క్యాన్సర్ సెంటర్‌ను నడుపుతూ 8.2 లక్షల డాలర్ల అవినీతికి పాల్పడినందుకు 2012లో డాక్టర్ మీరా సచ్‌దేవకు కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే, ఆరోగ్య విభాగంలో డ్రగ్స్ సంబంధిత 26 నేరాలకుగాను 2013లో బాబూభాయ్ పటేల్‌కు 17 ఏళ్ల జైలు శిక్ష పడింది. 2013లోనే డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడిన కృష్ణ మోటెకు జీవిత కారాగార శిక్ష పడింది. చివరగా, సుగంధ ద్రవ్యాల వ్యాపారి విక్రమ్ దత్తా మెక్సికో డ్రగ్స్ ముఠాతో కుమ్మక్కై మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారనే నేరం కింద కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బైడెన్ క్షమాభిక్షతో వీరందరికీ జైలు జీవితం నుంచి విముక్తి లభించినట్లయింది.

ఫ్రాన్స్ ప్రధానిగా ఫ్రాంకోయిస్



ప్యారిస్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ శుక్రవారం అధికార కూటమికి చెందిన నేత ఫ్రాంకోయిస్ బైరూ పేరు(73)ను ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించారు. గత వారం నేషనల్ అసెంబ్లీ పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో ఓడిపోవడంతో మైకేల్ బెర్నియర్ ప్రభుత్వం గద్దె దిగడం తెలిసిందే. ఫ్రాన్సు రాజకీయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న బైరూ అందరికీ తెలిసిన వ్యక్తి. పార్లమెంట్‌లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో తలెత్తిన అస్థిర పరిస్థితులను చక్కదిద్దే సత్తా బైరూకు ఉందని భావిస్తున్నారు.

గోవా ఎమ్మెల్యేల గోడ దూకుడు.. సుప్రీంలో కాంగ్రెస్‌కు నిరాశ

న్యూఢిల్లీ: 2022లో బీజేపీ పక్షాన చేరిన తమ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలన్న విజ్ఞప్తిని గోవా అసెంబ్లీ స్పీకర్ తోసిపుచ్చడాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసిన కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. నేరుగా తమ వద్దకు కాకుండా ముందుగా బాంబే హైకోర్టులో పిటిషన్ వేయాలని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. కాంగ్రెస్ నేత గిరీశ్ చొడంకర్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. అత్యున్నత న్యాయస్థానం ఫస్ట్ అప్పీల్ కోర్టు కాదని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలన్న వినతిపై నిర్ణయానికి స్పీకర్ రమేశ్ తావడ్కర్ 720 రోజుల సమయం తీసుకున్నారని, అప్పటికే అసెంబ్లీ గడువు ముగియవచ్చిందని పిటిషనర్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వి తెలిపారు. అయితే, స్పీకర్ నిర్ణయంపై ఆర్టికల్ 136 కింద పిటిషన్ వేసినందున దీనిపై విచారణ చేపట్టలేమని, హైకోర్టుకు వెళ్లాలని ధర్మాసనం సూచించింది.

ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్‌కు బెయిల్

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ఆరోపణలెదుర్కొంటున్న మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, ఆ ప్రాంత పోలీస్ స్టేషన్ మాజీ అధికారి అభిజిత్ మండల్‌కు సియాల్దాలోని కోర్టు శుక్రవారం బెయిలిచ్చింది. నిర్దేశించిన 90 రోజుల్లోగా వీరిద్దరిపై పోలీసులు చార్జిషీట్ వేయనందున బెయిలిస్తున్నట్లు అదనపు చీఫ్ మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. వీరిద్దరూ రూ.2 వేల చొప్పున పూచీకత్తు సమర్పించాలని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని ఆదేశించారు.

ఐక్యతా మహాయజ్ఞమిది

మహా కుంభమేళా సంబంధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో మోదీ వ్యాఖ్య



హారతి ఇస్తున్న ప్రధాని మోదీ

ప్రయాగ్‌రాజ్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరగబోయే మహా కుంభమేళాను ఐక్యతా మహాయజ్ఞంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. వచ్చే ఏడాది జరగబోయే కుంభమేళాకు అనువుగా నగరంలో మౌలిక సదుపాయాల ఆధునీకరణ, భక్తుల రాకపోకలు, విడిదికి వీలుగా అదనపు ఏర్పాట్ల కోసం చేపట్టిన రూ.5,500 కోట్ల విలువైన 167 అభివృద్ధి ప్రాజెక్టులను శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించి ప్రసంగించారు. ''సాంస్కృతిక, ఆధ్యాత్మిక పథంలో మహా కుంభమేళా భారత్‌ను సమున్నత శిఖరాలకు చేరుస్తుంది. సామాజిక సామరస్యంతోపాటు కోట్లాది మంది భక్తుల రాకతో వ్యాపార, వాణిజ్యాభివృద్ధితో భిన్న వర్గాల ఆర్థిక సాధికారతలో కుంభమేళ కీలక పాత్ర పోషిస్తోంది''అని అన్నారు. 2025 జనవరి 13 మొదలయ్యే కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీదాకా 45 రోజులపాటు నిరాటంకంగా కొనసాగనుంది. ఈ మహా మేళాలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది భక్తులు ఇక్కడికి విచ్చేస్తారని, గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచనావేస్తోంది. ''శతాబ్దాలుగా ఇక్కడి త్రివేణి సంగమం వద్ద రుషులు, సాధువులు ఎన్నో జాతీయస్థాయి అంశాలపై సమాలోచనలు చేశారు. ఆనాడే సామాజిక మార్పుకు మహానుభావులు అంకురార్పణ చేశారు. అయితే గత ప్రభుత్వాలు కుంభమేళా ప్రాశస్త్యం తెలీక, భారతీయ సంస్కృతితో అనుసంధానంకాక ఈ మహా కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేశారు. గత ప్రభుత్వాల నిర్వహణా లోపాలతో కోట్లాది మంది భక్తులు అవస్థలు పడ్డారు. ఇప్పుడు భారత సంప్రదాయానికి పట్టంకట్టే రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు రామాయణ, కృష్ణ, బుద్ధిస్ట్ సర్క్యూట్ల నిర్మాణం ద్వారా అభివృద్ధిని ఉరకలెత్తిస్తున్నాయి. గతంలో, ఇప్పుడు ఇంతటి భారీ క్రతువులో నిర్మాణ, శుభ్రతా కార్యక్రమాల్లో నిమగ్నమైన అధికారులు, కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులకు అభినందనలు. ఈసారి ఏకంగా 15,000కు పైగా పారిశుద్ధ్య కార్మికులు ఈ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచనున్నారు. 2019లో నేను శానిటేషన్ వర్కర్ల పాదాలు కడగడం నిజంగా నాకు ఒక మధుర జ్ఞాపకం''అని మోదీ అన్నారు.

సహాయక్ చాట్‌బాట్

తొలుత శుక్రవారం మధ్యాహ్నం త్రివేణి సంగమంలోని కిలా ఘాట్ వద్దకు చేరుకున్న మోదీ అక్కడ కొద్దిసేపు మరపడవలో కలియతిరిగారు. తర్వాత గంగామాతకు ప్రత్యేక పూజ చేశారు. తర్వాత హారతి ఇచ్చి క్షీరాభిషేకం, జలాభిషేకం చేశారు. తర్వాత అక్కడి సాధువులతో మాట్లాడారు. తర్వాత అక్షయవాటికనూ సందర్శించారు. ఆ తర్వాత ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ''ఈసారి కుంభమేళాలో భక్తులకు సాయపడేందుకు సహాయక్ (Sah'AI' yak) పేరిట కృత్రిమ మేధ చాట్‌బాట్‌ను సైతం అందుబాటులోకి తెస్తున్నాం. ఇది భక్తులకు ఎప్పటికప్పుడు వారు అడిగిన సమాచారాన్ని అందిస్తుంది'' అని మోదీ అన్నారు.

ప్రియాంక ప్రసంగంపై రాహుల్ ప్రశంస

న్యూఢిల్లీ: లోక్‌సభలో తన సోదరి, ఎంపీ ప్రియాంకగాంధీ వాద్రా అద్భుతంగా ప్రసంగించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశంసల వర్షం కురిపించారు. లోక్‌సభలో తన మొదటి ప్రసంగం కంటే ఆమె ప్రసంగమే గొప్పగా ఉందన్నారు. ప్రియాంక ప్రసంగాన్ని పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశంసించారు. చాలా చక్కగా మాట్లాడారని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్నో నిజాలను పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చారని, తమకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ప్రియాంక ప్రసంగం ఎంతో అనుభవం, పరిణతి కలిగిన నాయకురాలిగా ప్రసంగంలా ఉందని కాంగ్రెస్ సీనియర్ శశి థరూర్ చెప్పారు. తొలి ప్రసంగంలోనే అదరగొట్టారని కొనియాడారు. బీజేపీ నేత అమిత్ మాలవీయ సైతం స్పందించారు. రాహుల్ రాజకీయ జీవితానికి ముప్పు సోదరి నుంచే ఉందన్నారు.

జస్టిస్ ఎస్‌కే యాదవ్‌ను అభిశంసించాలి

రాజ్యసభలో నోటీసు ఇచ్చిన విపక్షం

న్యూఢిల్లీ: విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను అభిశంసించాలని ప్రతిపక్ష సభ్యులు శుక్రవారం రాజ్యసభలో నోటీసు అందజేశారు. ఈ నోటీసుపై 55 మంది ఎంపీలు సంతకాలు చేశారు. వీరంతా రాజ్యసభ సెక్రెటరీ జనరల్‌ను కలిసి నోటీసు సమర్పించారు. న్యాయమూర్తులు(విచారణ) చట్టం–1968తోపాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 కింద నోటీసు ఇచ్చారు. మెజార్టీ ప్రజల మనోగతం మేరకే పరిపాలన సాగుతుందని జస్టిస్ యాదవ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



గగన్‌యాన్ దిశగా తొలి మెట్టు

సూళ్లూరుపేట: గగన్‌యాన్ ప్రాజెక్టులో మరో కీలక మైలురాయిని చేరుకున్నట్లు ఇస్రో శుక్రవారం ప్రకటించింది. రాకెట్‌లోని మొదటి దశ అయిన సాలిడ్ మోటార్ సెగ్మెంట్‌ను ప్రొడక్షన్ ప్లాంట్ నుంచి లాంఛ్ కాంప్లెక్స్‌కు తరలించినట్లు తెలిపింది. 'హ్యూమన్ రేటెడ్ లాంఛింగ్ వెహికల్ మార్క్–జీ1 (హెచ్ఎల్‌వీఎం–జీ1)రాకెట్ ప్రయోగంలో ఇది కీలక మెట్టుగా ఇస్రో పేర్కొంది. ముందుగా మూడు మానవ రహిత ప్రయోగాలు, ఆ తర్వాత రోబోలను పంపించి వాటిని సురక్షితంగా తీసుకురావడం, చివరగా 2030లో మానవ సహిత ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ముందుగా హెచ్ఎల్‌వీఎం–జీ1 రాకెట్ పేరును ఎంచుకుంది. అంటే ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ... ఇలా ఏడు రకాల రాకెట్లను తయారు చేసుకున్న ఇస్రో ఇప్పుడు ఎనిమిదో రకం రాకెట్‌గా హెచ్ఎల్‌వీఎం–జీ1 పేరుతో గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీకారం చుట్టనుంది.

ఆ ధర్మాసనం ముందుకే వెళ్లండి

'ఈవీఎంల పరిశీలన'పిటిషనర్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: ఈవీఎంల పరిశీలనకు ఓ విధానాన్ని రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను..బ్యాలెట్ విధానాన్ని తిరిగి తేవాలన్న పిటిషన్లను తోసిపుచ్చుతూ ఏప్రిల్‌లో తీర్పు వెలువరించిన ధర్మాసనం ముందుంచాలని సుప్రీంకోర్టు కోరింది. ఈవీఎంల పరిశీలనకు సంబంధించి హరియాణా మాజీ మంత్రి కరణ్ సింగ్ దలాల్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీబీ వరాలెల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏప్రిల్‌లో తీర్పు వెలువరించిన బెంచ్ ముందుకు ఈ పిటిషన్‌ను తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు లాయర్ గోపాల్ శంకరనారాయణన్‌కు సూచించింది. అదే సమయంలో, ఈ పిటిషన్‌ను అదే బెంచ్‌కు పంపాచ్చా లేదా మరో బెంచ్‌కా అనే విషయమై స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరుతూ సంబంధిత పత్రాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు పంపాలని రిజిస్ట్రీని కోరింది.

కన్నడ నటుడు దర్శన్‌కు బెయిల్



బొమ్మనహళ్లి: హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్‌కు భారీ ఊరట లభించింది. ఆయనతోపాటు ఏడుగురికి హైకోర్టు బెయిలిచ్చింది. వెన్నునొప్పితో బాధపడుతున్న దర్శన్ మధ్యంతర బెయిల్‌పై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టులో వేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. అనంతరం దర్శన్, అతడి సన్నిహితురాలు పవిత్రా గౌడ, ప్రదోశ్, అనుకుమార్, నాగరాజు, లక్ష్మణ్, జగదీష్‌కు బెయిల్ మంజూరు చేస్తు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురికి బెయిల్ లభించింది. పవిత్రా గౌడను దుర్భాషలాడాడనే కోపంతో రేణుక స్వామి అనే వ్యక్తిని చంపారనే ఆరోపణలపై దర్శన్‌ను జూలైలో పోలీసులు అరెస్ట్ చేశారు.

ఛత్తీస్‌లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి నేంద్ర– పున్నూర్ గ్రామాల మధ్యన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో కోబ్రా, సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున తారసపడిన బలగాలు, మావోయిస్టుల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వీరిని గంగులూరు ఏరియా కమిటీ ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ పాండు మడివి, ఏరియా కమిటీ సభ్యుడు మంగుగా గుర్తించారు. అలాగే, ఘటనాస్థలి నుంచి 9 ఎంఎం పిస్టల్, టిఫిన్ బాంబు, కుక్కర్ బాంబు, ఇతర పేలుడు పదార్థాలే కాక నిత్యావసర సామగ్రి, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం తెలిసిందే.

ఎరక్కపోయి ఇరుక్కున్నాడు

- తప్పించుకునేందుకు చిమ్నీలో దూరాడు
- ఇటుకలు తొలగించి రక్షించి, అరెస్టుచేసిన పోలీసులు

నిషేధిత డ్రగ్స్ కలిగి ఉన్నాడన్న కారణంతో అతని ఇంటిని సోదాచేయడానికి పోలీసుల బృందరంగంలోకి దిగగా పారిపోయేందుకు సిద్ధపడ్డ ప్రబుద్ధుడు ఎవరికీ అనుమానం రావొద్దని చిమ్నీలో దాక్కోబోయాడు. అందులో ఇరుక్కుపోయి చివరకు సాయం కోసం బిగ్గరగా అరచి తన జాడ తానే పోలీసులకు చెప్పేశాడు. అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రంలోని రివర్ ఫాల్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం 33 ఏళ్ల రాబర్ట్ లాంగ్లేస్ వద్ద నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని తెల్సి మంగళవారం పోలీసులు సెర్చ్ వారెంట్‌తో రాబర్ట్ ఇంటికొచ్చారు. అరెస్ట్ చేద్దామని ఇళ్లంతా వెతికినా రాబర్ట్ దొరకలేదు. అయితే ఇదే సమయంలో ఇంటి వెనుక ఎవరో సాయం కోసం అరుస్తున్న శబ్దం వస్తోందని అటుగా దారిన పోయే వ్యక్తులు చెప్పారు. దీంతో పోలీసులు ఇంటిపైకప్పు మీదకొచ్చి చూస్తే ఎవరూ లేరు. ఒకాయన చిమ్నీ గొట్టం ఎక్కడం చూశా అని అటుగా పోతున్న ఇంకొక వ్యక్తి చెప్పడంతో చిమ్నీ గొట్టంలోకి పోలీసులు తొంగిచూశారు. అందులో ఇరుక్కుని ఎటూపోలేక అవస్థలు పడుతున్న రాబర్ట్‌ను చూసి పోలీసులకు విపరీతంగా కోపమొచ్చింది. ''నువ్వెంత మూర్ఖుడివిరా బాబు. అందులో దూరి ఎలా దాక్కున్నావనుకున్నాం. దాంట్లోంచి అవతలికి పారిపోదామనుకున్నావా?'అంటూ అతడిని ప్రశ్నించారు. ముందుగా అతడిని బయటపడేసే మార్గం కోసం వెతికారు. చివరకు చిమ్నీ అడుగుభాగాన్ని మాత్రం బద్దలుకొట్టి బయటకు తీద్దామని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి కొన్ని ఇటుకలు తీయించారు. బయటకు వచ్చేయ్ అని హెచ్చరించారు. భయపడుతూ ఎలాగోలా అందులోంచి బయటపడిన రాబర్ట్‌ను పోలీసులు పోలీసుల బండిలో పడేశారు. నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్లి ఇరుక్కునప్పుడు అయిన గాయాలకు ప్రథమ చికిత్స చేయించారు. ప్రస్తుతం కేసు విచారణ నడుస్తోంది. – ఫాల్ రివర్ సిటీ



చిమ్నీలో ఇరుక్కుపోయి కనిపిస్తున్న దృశ్యం

సాక్షి ప్లస్
శనివారం। 14-12-2024

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

1857 సిపాయిల తిరుగుబాటు

దేశానికి స్వాతంత్ర్యం రావడానికి 90 ఏళ్ల ముందే సిపాయిల తిరుగుబాటు మీరట్‌లో ప్రారంభమైంది. ఆ సమయంలో లార్డ్ కానింగ్ గవర్నర్ జనరల్‌గా వ్యవహరించారు. సిపాయిల తిరుగుబాటు కాలంలో ఢిల్లీ సైనికులు మొగల్ చక్రవర్తి రెండో బహదూర్‌షాను పాదుషాగా ప్రకటించారు. సిపాయిల తిరుగుబాటు సమయంలో ఢిల్లీ ముట్టడిలో ఆంగ్లేయులు సాగించిన దారుణ హింసాకాండను గాలిబ్ అనే ఉర్దూ కవి వర్ణించాడు.

సిపాయిల తిరుగుబాటుకు అయోధ్యలో హజ్రత్ బేగం నేతృత్వం వహించగా, ఝాన్సీలో లక్ష్మీబాయి, మధ్య భారతదేశంలో తాంతియా తోపే నాయకత్వం వహించారు.

ఈ తిరుగుబాటును అణచి వేయడంలో ప్రముఖపాత్ర వహించిన బ్రిటిష్ సేనానులు సర్‌జేమ్స్, అవుట్రామ్, హూవ్‌లాక్, నికల్‌సన్, నెయిల్ లారెన్స్, కాంప్‌బెల్, సర్ రోజ్‌వుడ్.

తిరుగుబాటుకు కారణాలు

డల్హౌసీ అనుసరించిన దురాక్రమణ విధానం రాజకీయ కారణం కాగా, బ్రిటిషర్ల నూతన ఆర్థిక విధానం ఆర్థిక కారణమైంది. హైందవ సాంఘిక వ్యవస్థను ఖండించటం సాంఘిక కారణమైతే భారత్, ఐరోపా సైనికుల మధ్య ఉన్న తారతమ్యం సైనిక కారణమైంది.

రాజకీయ కారణాలు

తిరుగుబాటుకు ప్రధాన కారకుడు గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ. ఈయన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, జైపూర్, సంబాల్‌పూర్, ఝాన్సీ తదితర రాజ్యాలు ఆక్రమించుకున్నాడు. అస్తవ్యస్త పాలన సాకుతో అవధ్ (యూపీ)ను కూడా ఆక్రమించాడు.

పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడు నానా సాహెబ్ (దొండు పంత్). డల్హౌసీ ఇతడి పెన్షన్‌ను నిలిపివేశాడు. నానాసాహెబ్‌కు మద్దతుగా అతడి సోదరుడు రావు సాహెబ్ పోరాడాడు.

బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తి బిరుదును రద్దు చేశారు. చక్రవర్తి కుటుంబీకులు ఎర్రకోటను వదలి వెళ్లాలన్న బ్రిటిష్ కంపెనీ ఆజ్ఞలు భారతీయ ముస్లింలకు బాధ కలిగించాయి. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించడంతో అనేక మంది ప్రభువులు, అధికారులు, సైనికులు, నిరుద్యోగులయ్యారు. బ్రిటిషర్లు వారికి ఉపాధి కల్పించలేదు. జమీందార్లు, తాలుక్‌దార్ల భూములను బ్రిటిషర్లు ఆక్రమించారు. ఇది అయోధ్యలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అసంతృప్తి కలిగించింది. సంస్థానాధీశుల కొలువు నుంచి బ్రిటిషర్లు సైనికులను తొలగించారు. దీంతో వారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే అవకాశం కోసం ఎదురు చూశారు.

ఆర్థిక కారణాలు

ప్రజల్లో బ్రిటిష్ పరిపాలన పట్ల వ్యతిరేకతకు వారు అనుసరించిన ఆర్థిక దోపిడీ విధానమే ప్రధాన కారణం. బ్రిటిషర్లు తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి భారతదేశ సంపదలను కొల్లగొట్టారు. మనదేశం నుంచి ముడి సరకులను ఇంగ్లండ్‌కు చేరవేశారు. ఇక్కడ తయారైన పట్టు, నూలు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి చేయకుండా అడ్డుకున్నారు. వాటిపై సుంకాలు విధించారు. దీంతో స్వదేశీ పరిశ్రమలు మూతపడ్డాయి. పేదరికం ప్రబలి, దేశం కరవు కాటకాలకు నిలయమైంది. సాధారణ ప్రజలు తమ పరిస్థితులను మెరుగుపర్చుకొనే ఉద్దేశంతో తిరుగుబాటుదారులతో చేతులు కలిపారు. సంస్థానాలను బ్రిటిషర్లు ఆక్రమించడం అనేక అనర్థాలకు దారితీసింది. రాజుల అధికారం చేజారింది. వారి సైన్యాలు రద్దయ్యాయి. దీంతో సైనికులు జీవనాధారం కోల్పోయారు. బ్రిటిషర్లు మాత్రం ఉన్నత పదవుల్లో నియమితులయ్యారు. విద్యావంతులైన భారతీయులను కూడా ఉన్నతోద్యోగాలకు అర్హులుగా భావించలేదు. ఉన్నత పదవులకు భారతీయులు అనర్హులని బహిరంగంగా బ్రిటిషర్లు చాటి చెప్పారు. వారి ఆర్థిక విధానం భారతీయ రైతాంగాన్ని, చేతిపని వారిని, స్థానిక ప్రభువులను.. అందరినీ కుంగదీసింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

సాంఘిక కారణాలు

బ్రిటిషర్లు భారతీయులను తక్కువ జాతివారిగా పరిగణించేవారు. సాంఘికంగా భారతీయులంటే వారికి చిన్నచూపు. భారతీయ స్త్రీలను అగౌరవ పర్చడం, భౌతిక హింసలకు గురి చేయడం, అవి కొన్నిసార్లు మరణాలకు దారి తీయడం లాంటి సంఘటనలు సర్వసాధారణం. మొదటి తరగతి రైల్వే బోగీల్లో భారతీయులు ప్రయాణించడానికి అనుమతించేవారు కాదు. సాంఘిక సమావేశాల్లో ఆంగ్లేయులతో కలవకుండా భారతీయులను దూరంగా ఉంచేవారు. యూరోపియన్లు నడిపే హోటళ్లు, క్లబ్బుల్లో భారతీయులకు ప్రవేశం లేదు. ఆగ్రాలో మెజిస్ట్రేట్ ప్రకటించిన రెగ్యులేషన్ భారతీయుల పట్ల బ్రిటిషర్ల వైఖరికి అద్దం పట్టింది. ఈ రెగ్యులేషన్ పాటించనందుకు గొప్ప సంస్కర్త అయిన రాజా రామ్మోహన్‌రాయ్ కూడా అవమానానికి గురయ్యాడు. ఈ రకమైన వేధింపులకు గురైన భారతీయులకు చాలా సందర్భాల్లో బ్రిటిష్ న్యాయమూర్తులు న్యాయం చేయలేదు.



మత కారణాలు

బ్రిటిషర్లకు హిందూమతం పట్ల ఉన్న అభిప్రాయం భారతీయుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. భారతీయులను క్రైస్తవంలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారని భయాందోళనలకు గురయ్యారు. 1813 చార్టర్ చట్టానికి ముందు క్రైస్తవ మిషనరీలను దేశంలోకి అనుమతించేవారు కాదు. 1813 చార్టర్ చట్టంతో ఈ నిబంధన ఎత్తివేశారు. దీంతో అనేక మిషనరీలు భారతదేశానికి రావడం ప్రారంభమైంది. మిషనరీలు దేశంలో, ముఖ్యంగా అనేక వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలను స్థాపించి, విద్యాబోధన చేసేవి. విద్యార్థులను క్రైస్తవ మతంలోకి మార్చడమే వీటి ధ్యేయం. మిషనరీలు స్థాపించిన పాఠశాలల్లో బైబిల్ పఠనం తప్పనిసరి. జైళ్లలో ఉన్న ఖైదీలు క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా అనేక విధాలుగా ప్రలోభాలకు గురిచేసేవారు.వారికి క్రైస్తవ గ్రంథాలను బోధించేవారు. క్రైస్తవులుగా మారిన వారిని జైలు నుంచి విడుదల చేసేవారు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రకారం..

1837 కరవు కాటకాల సమయంలో మిషనరీలు అనేక మంది అనాథలను క్రైస్తవ మతంలోకి మార్చాయి. మిషనరీలు క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి ధనాన్ని ఆశగా చూపేవి. ఆ మతంలోకి మారిన వారికి ఉద్యోగాలు ఇచ్చి, గౌరవ మర్యాదలు కల్పించారు. ప్రజల్లో అనుమానాలు సృష్టించేలా బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. ఉపయోగపడే సాంఘిక చట్టాలనూ ప్రజలు అపార్థం చేసుకున్నారు. విలియం బెంటింగ్ 1829లో సతీ సహగమనాన్ని నిషేధించాడు. దీన్ని హిందూ ఉదారవాదులు సమర్థించారు. కానీ సాధారణ ప్రజలు ప్రభుత్వ ఉద్దేశాలను అనుమానించారు. 1832–50 మధ్య కాలంలో ఆస్తి వారసత్వానికి సంబంధించిన చట్టాలను కంపెనీ ప్రవేశపెట్టింది. 1856లో రిలిజియస్ డిజేబిలిటీస్ యాక్ట్, వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాలతో ప్రభుత్వం తమ సాంఘిక, మత విషయాల్లో జోక్యం చేసుకుంటుందని ప్రజలు భావించారు.

సైనిక కారణాలు

భారతీయ సైనికుల్లో అసంతృప్తికి హిదాయత్ అలీ కింది కారణాలను పేర్కొన్నారు.

బెంగాల్ సైన్యంలో ఎక్కువ మంది సైనికులు అయోధ్య ప్రాంతానికి చెందినవారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో అయోధ్యను కలపడంతో వీరు కోపోద్రిక్తులయ్యారు.

పంజాబ్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపాక, సైన్యంలో చేరే సిక్కు, ముస్లిం సైనికులకు గడ్డం లేదా జుట్టు తీసివేసే షరతు పెట్టబోమన్నారు. కానీ తర్వాతి కాలంలో జుట్టు తొలగించాలని ఆజ్ఞాపించారు. ధిక్కరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. బ్రిటిషర్లు 1856 సెప్టెంబర్‌లో ఒక ఆజ్ఞ జారీ చేశారు. దీని ప్రకారం కొత్తగా నియమితులయ్యే సైనికులు ఏ ప్రాంతానికైనా వెళ్లి యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. సముద్ర యానం చేస్తే కులభ్రష్టులవుతారనే నమ్మకం హిందువుల్లో ఉండేది. ఇది బ్రిటిషర్ల పట్ల సైనికుల అనుమానాలు బలపడేలా చేసింది.

తక్షణ కారణం

కొవ్వు పూసిన తూటాల వదంతి వ్యాపించింది. ఇది హిందూ, ముస్లిం సైనికుల మనోభావాలను దెబ్బతీసింది. దాంతో సైనిక కవాతులో పాల్గొనరాదని 1857 ఫిబ్రవరి 20న బరంపూర్‌లోని పదాతిదళం నిర్ణయించింది. 1857 మార్చి 29న 34వ దేశీయ పటాలానికి చెందిన మంగళ్‌పాండే ఆంగ్లేయాధికారిపై కాల్పులు జరిపి తిరుగుబాటుకు అంకురార్పణ చేశాడు. తర్వాత అతడిపై విచారణ జరిపి ఏప్రిల్ 8న బహిరంగంగా ఉరితీశారు. దాన్ని తిరుగుబాటుగా భావించని కంపెనీ పాలకులు అదొక చిన్న సంఘటనగా, కేవలం హైందవ మేధావి వర్గ ఉద్యమమని భావించారు. త్వరలోనే సమసిపోతుందనుకున్నారు.

తిరుగుబాటు విఫలం కావడానికి కారణాలు

సిపాయిలు తిరుగుబాటు చేసే సమయానికి కంపెనీ సైన్యంలో ఏడుగురు సిపాయిలకు ఒక ఆంగ్ల సైనికుడు మాత్రమే ఉన్నాడు. ప్రజలు కూడా సిపాయిలకు మద్దతు ఇచ్చారు. తిరుగుబాటుదారులు విప్లవ ప్రారంభ దశలో ఢిల్లీని వశపర్చుకున్నారు. తర్వాత ఆగ్రా, కలకత్తాల మధ్య ఉన్న ప్రసార సాధనాలను ధ్వంసం చేశారు. తొలి దశలో వారు బ్రిటిషర్లను ఇబ్బందులకు గురి చేసినా, తర్వాత ఆంగ్లేయులు తిరుగుబాటుదార్లను ప్రతిఘటించారు.

విప్లవం విఫలం కావడానికి అనేక కారణాలున్నాయి. తిరుగుబాటు కొద్ది ప్రాంతానికే పరిమితం కావడం, యావత్తు దక్షిణ భారతదేశం, పంజాబ్ ఉత్తర ప్రాంతం, పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, మధ్యభారతం, బెంగాల్‌లో తిరుగుబాటు ప్రభావం లేదు. ఢిల్లీ, అయోధ్య, బిహార్, రోహిల్‌ఖండ్, దాని పరిసర ప్రాంతాలకే తిరుగుబాటు పరిమితమైంది. అందువల్ల విప్లవాన్ని అణచివేయడం ఆంగ్లేయులకు తేలికైంది.

తిరుగుబాటుదారుల కంటే బ్రిటిషర్లకు మెరుగైన వనరులున్నాయి. క్రమేణా బ్రిటిషర్ల సైన్యం పెరిగింది. సుమారు 1.12 లక్షల బ్రిటిష్ సైన్యాన్ని ఇండియాకు తరలించారు. సుమారు 3.10 లక్షల మంది భారతీయులను కొత్తగా సైన్యంలో చేర్చుకున్నారు. తిరుగుబాటుదారులు సంప్రదాయ ఆయుధాలతో యుద్ధం చేస్తే, బ్రిటిష్ సైన్యం కొత్తగా ప్రవేశపెట్టిన రైఫిల్స్‌ను ఉపయోగించింది. టెలిగ్రాఫ్ సదుపాయం ఆంగ్లేయులకు చాలా ఉపయోగకరంగా మారింది. దీని వల్ల సిపాయిల వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలైంది.

అనేక మంది స్వదేశీ రాజులు బ్రిటిషర్లకు సహాయపడ్డారు. పాటియాల, సింధ్, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన సంస్థానాధీశులు ఆంగ్లేయులకు సహాయం చేశారు. నేపాల్ రాజు తన సైన్యాన్ని బ్రిటిషర్ల ఆధీనంలో ఉంచాడు.

తిరుగుబాటుదారుల్లో సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. బహదూర్‌షా వృద్ధుడు, అతడి కుమారులు నిష్ప్రయోజకులు. లక్ష్మీబాయి వీరవనిత అయినప్పటికీ, ఆంగ్లేయులతో పోరాడే శక్తియుక్తులు ఆమెకు లేవు. లారెన్స్, హ్యూరోస్, హల్‌రాక్, నికల్సన్ వంటి సుప్రసిద్ధ సేనానుల సేవలు లభించడంతో ఆంగ్లేయుల విజయం సులభమైంది. తిరుగుబాటుకు ఒక నిర్ణీత పథకం గానీ, నిర్దిష్ట కార్యక్రమం గానీ లేవు. తిరుగుబాటుదారుల ఆశయాలు వేరు, వారిలో ఐకమత్యం లేదు. పీష్వా పదవి కోసం నానాసాహెబ్, దత్తత అంగీకరించకపోవడం వల్ల లక్ష్మీబాయి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల్లో జాతీయాభిమానం, దేశాభిమానం ఉన్నా వారికి సరైన మార్గదర్శకత్వం లేదు. తిరుగుబాటుదారులంతా ఒకేసారి తిరుగుబాటు చేయలేదు. ఎవరికి వారు ఒంటరిగా పోరాడి ఓడిపోయారు. తిరుగుబాటు ఎక్కువ భాగం కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తిరుగుబాటులో పాల్గొనలేదు. కాబట్టే ఇది ప్రజల ఉద్యమంగా రూపాంతరం చెందలేదు.

బెంగాల్ సైనికులు పౌరుల పట్ల దూకుడు ప్రదర్శించేవారు. వారి ప్రవర్తన సరిగా ఉండేది కాదు. ప్రజలు వారిని ద్వేషించారు. అనేక ప్రాంతాల్లో ప్రజలే వారిని అణచివేశారు.

1857లో ఇంగ్లండ్‌కు అంతర్జాతీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. క్రిమియా యుద్ధంలో గెలుపొందడంతో బ్రిటిషర్లకు రష్యా బెడద తొలగిపోయింది. పర్షియాతో యుద్ధం కూడా ముగిసింది. దీంతో బ్రిటన్ తన సైన్యాన్ని భారతదేశానికి మళ్లించగలిగింది. తిరుగుబాటుదారుల్లో వ్యక్తిగత అసూయలు చోటు చేసుకున్నాయి. ఈ అసూయలే తిరుగుబాటు విఫలమయ్యేందుకు దోహదం చేశాయి.

1857 తిరుగుబాటు స్వభావం

సిపాయిల తిరుగుబాటు స్వభావం మీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొంతమంది దీన్ని సిపాయిల పితూరీ అని, మరికొందరు క్రైస్తవుల మీద జరిగిన మత యుద్ధమని లేదా తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన యుద్ధమని, హిందూ, ముస్లింలు కలిసి బ్రిటిషర్ల మీద పన్నిన కుట్ర అని పేర్కొన్నారు. చాలా మంది ఆధునిక భారత చరిత్రకారులు దీన్ని 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించారు.

సిపాయిల పితూరీ

సిపాయిలు తరచూ సొంత కారణాలతో తిరుగుబాటు చేయడం వల్ల సర్‌జాన్ లారెన్స్, సరసీలే, స్మిత్, మార్ష్‌మన్ మొదలైన చరిత్రకారులు ఇది కేవలం సైనికుల తిరుగుబాటుగా భావించారు. అందుకే దీన్ని సిపాయిల పితూరీ లేదా సిపాయిల తిరుగుబాటుగా పిలిచారు. కానీ ఇది వాస్తవదూరం. అనేక మంది పౌరశాఖ ఉద్యోగులు, ప్రజలు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. తిరుగుబాటుకు కేవలం సైనిక కారణాలే కాకుండా అనేక మత, సాంఘిక, ఆర్థిక కారణాలు కూడా దోహదం చేశాయి.

జాతి సంఘర్షణ

కొందరు చరిత్రకారులు ఈ తిరుగుబాటును తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన సంఘర్షణ అని అభిప్రాయపడ్డారు. ఈ దృక్పథం సరైంది కాదు. జె.బి.మోడ్లీ ప్రకారం ప్రతి తెల్ల జాతీయుడికి 20 మంది నల్ల జాతి సైనికులు ఉన్నారు. అనేక మంది భారతీయులు ఆంగ్లేయుల తరఫున పోరాడారు. భారతీయులంతా తిరుగుబాటులో పాల్గొనలేదు.

టి.ఆర్.హోల్‌మస్ అనే చరిత్రకారుడు సిపాయిల తిరుగుబాటును 'నాగరికతకు, అనాగరికతకు మధ్య జరిగిన సంఘర్షణ' అని పేర్కొన్నాడు. కానీ ఈ ధోరణి సరికాదని, భారత సంస్కృతి మహోన్నతమైందని విమర్శకులు దీటుగా సమాధానమిచ్చారు.

తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు విఫలం కావడంతో భారతదేశ దాస్య శృంఖలాలు మరింత బిగిసిపోయాయి. తిరుగుబాటు ఒక శకాన్ని ముగించి, మరొక శకారంభానికి పునాది వేసిందని చెప్పొచ్చు. సామ్రాజ్య విస్తరణ స్థానంలో ఆర్థిక దోపిడీకి నాంది పలికింది. జాతీయ తత్వాన్ని అలవర్చుకున్న ప్రగతిశీల శక్తుల స్వభావాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సవాల్‌గా ఎదుర్కోవాల్సి వచ్చింది. తిరుగుబాటు ఫలితంగా కంపెనీ పాలన రద్దయింది. దాని స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రత్యక్ష పాలన ఆరంభమైంది. బ్రిటన్ రాణి విక్టోరియాను భారత సామ్రాజ్ఞిగా ప్రకటించారు. 1858 నవంబర్ 1న వెలువడిన ఈ ప్రకటనను లార్డ్ కానింగ్ అలహాబాద్‌లో చదివారు.

విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?

ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసే అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర వహించే అంశం విద్యాదృక్పథాలు. ఈ విభాగంలో విద్య చరిత్రాత్మక అంశాలు, సమకాలిన అంశాలు, విద్యా విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. విద్యా దృక్పథాలు అనే అంశాన్ని సరళంగా ఎడ్యుకేషనల్ జి.కె.గా పేర్కొంటారు. ఈ విభాగంలో అధిక భారత్వం కలిగి, లోతైన అధ్యయనానికి అవకాశం ఉన్న అంశం విద్యా చరిత్ర. విద్యా చరిత్రలో ఒక కీలక అంశం బ్రిటిష్ విద్యావిధానంలో ముఖ్య అంశాలు, మాదిరి ప్రశ్నలు గురించి తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) విద్య అనేది భారతీయులను మేధావులుగా తీర్చిదిద్దేలా ఉండాలి – మెకాలే ప్రతిపాదన
బి) విద్య అనేది భారతీయులను గుమాస్తాలుగా తయారు చేసేదిగా ఉండాలి – వుడ్స్ ప్రతిపాదన.
1) ఎ, బి రెండూ సరైనవే
2) ఎ సరైంది, బి సరికాదు
3) ఎ సరికాదు, బి సరైంది
4) ఎ, బి రెండూ సరికావు

2. జతపరచండి.
జాబితా – I
i) అబ్జర్వేషన్స్
ii) స్కూల్ అండ్ స్కూల్ బుక్ సొసైటీ
iii) పుణె సంస్కృత కళాశాల
iv) సెయింట్ ఆన్స్ పాఠశాల
జాబితా – II
a) కెప్టెన్ కెండీ
b) ఫ్రాన్సిస్ జేవియర్
c) ఎల్ఫిన్‌స్టన్
d) చార్లెస్ గ్రాంట్
1) i-b, ii-c, iii-d, iv-a
2) i-d, ii-c, iii-b, iv-a
3) i-d, ii-c, iii-a, iv-b
4) i-d, ii-a, iii-c, iv-b

3. కింది వాటిలో సరికానిది ఏది?
1) మనదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టడానికి కారణం – మెకాలే మినట్స్
2) యుద్ధానంతర విద్యా పథకం – శార్జ్లర్ కమిషన్
3) భారతీయ విద్యకు మాగ్నాకార్టా – వుడ్స్ నివేదిక
4) తొలి భారతీయ కమిషన్ – హంటర్ కమిషన్

4. కింది వాటిలో వుడ్స్ నివేదికలోని అంశం కానిది ఏది?
1) ప్రతి రాష్ట్రానికి ప్రజా విద్యా నిర్దేశక శాఖ ఏర్పాటు చేయాలి
2) కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించాలి
3) అధోముఖ వడపోత సిద్ధాంతం ద్వారా ఆంగ్ల విద్యను అందించాలి
4) గ్రాంట్ – ఇన్- ఎయిడ్ విధానాన్ని రూపొందించాలి

5. జతపరచండి.
జాబితా – I
i) హలక్ బంధీ పాఠశాలలు
ii) గాంధీజీ ప్రాతిపదిక విద్య
iii) తొలి ఉపాధ్యాయ కళాశాల
జాబితా – II
a) వార్ధా b) ఆగ్రా
c) ట్రిప్లికేన్ బార్
1) i-a, ii-b, iii-c
2) i-b, ii-a, iii-c
3) i-b, ii-c, iii-a
4) i-c, ii-b, iii-a

6. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్రాథమిక విద్యావ్యాప్తిని స్థానిక సంస్థలకు అప్పగించాలి – హంటర్ కమిషన్ సూచన
బి) ప్రజ్ఞ, నైతికత అభివృద్ధి చెందేదిగా విద్య ఉండాలి – వుడ్స్ ప్రతిపాదన
సి) భారతీయ భాషల మాధ్యమంలోనే విద్యను అందించాలి – మెకాలే మినట్స్‌లో అంశం
1) ఎ, బి మాత్రమే
2) ఎ, బి, సి మూడూ సరైనవే
3) ఎ, బి, సి మూడూ సరికావు
4) ఎ, సి మాత్రమే

7. జతపరచండి.
జాబితా – I
i) వుడ్స్ నివేదిక
ii) మెకాలే మినట్స్
iii) హంటర్ కమిషన్
iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
జాబితా – II
a) 1902 b) 1854
c) 1835 d) 1882
1) i-b, ii-c, iii-a, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-b, ii-a, iii-c, iv-d
4) i-b, ii-d, iii-c, iv-a

8. నియామక సంవత్సరాలకు అనుగుణంగా కింది వాటిని ఆవరోహణ క్రమంలో అమర్చండి.
ఎ) శార్జ్లర్ కమిషన్ బి) సార్జంట్ కమిటీ
సి) ఎబాట్‌వుడ్ కమిటీ
డి) హర్టాగ్ కమిటీ
1) బి, డి, సి, ఎ 2) బి, డి, ఎ, సి
3) డి, బి, సి, ఎ 4) బి, సి, డి, ఎ

9. కింది వాటిలో మెకాలే మినట్స్‌తో ఏకీభవించని భావన ఏది?
1) భారతీయులు రక్తంలో, వర్ణంలో భారతీయులైనా, ఆలోచనలు, అభిరుచులు, అభిప్రాయాల్లో బ్రిటిషర్లుగా ఉండే విద్యను వారికి అందించాలి
2) ఇండియా, అరేబియా, ఆసియా దేశాల సాహిత్యం మొత్తం ఇంగ్లిష్ గ్రంథాలయంలో ఒక సొరుగు పుస్తకాలతో కూడా సరితూగదు
3) చౌక వేతనంతో గుమస్తాలను తయారు చేసేదిగా విద్య ఉండాలి
4) ఏదీకాదు

10. జతపరచండి.
జాబితా – I
i) మెకాలే మినట్స్ ii) వుడ్స్ నివేదిక
iii) హంటర్ కమిషన్
iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
జాబితా – II
a) డల్హౌసి b) లార్డ్ రిప్పన్
c) లార్డ్ కర్జన్ d) విలియం బెంటింక్
1) i-d, ii-a, iii-b, iv-c
2) i-d, ii-a, iii-c, iv-b
3) i-d, ii-b, iii-a, iv-c
4) i-d, ii-c, iii-b, iv-a

11. కింది అంశాలకు సంబంధించిన సంవత్సరాలకు అనుగుణంగా ఆరోహణ క్రమంలో అమర్చండి.
ఎ) బేసిక్ విద్యావిధానం
బి) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
సి) ప్రాథమిక విద్యకు గోఖలే తీర్మానం
డి) స్వదేశీ విద్యా ఉద్యమం ప్రారంభం
1) ఎ, బి, సి, డి 2) డి, సి, బి, ఎ
3) సి, డి, బి, ఎ 4) బి, డి, సి, ఎ

12. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
1) 1921 2) 1917
3) 1927 4) 1937

13. జతపరచండి.
జాబితా – I
i) శార్జ్లర్ కమిషన్ ii) సార్జెంట్ కమిటీ
iii) హర్టాగ్ కమిటీ
iv) ఎబాట్‌వుడ్ కమిటీ
జాబితా – II
a) 1929 b) 1937
c) 1917 d) 1944
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-c, ii-d, iii-a, iv-b
3) i-c, ii-b, iii-d, iv-a
4) i-c, ii-a, iii-d, iv-b

14. జాకిర్ హుస్సేన్ కమిటీ దేనికి సంబంధించింది?
1) వృథా, స్తబ్దతల నివారణ
2) ప్రాతిపదిక విద్య 3) బాలికా విద్య
4) వయోజన విద్య



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్

15. కింది వాటిలో సరైన జత ఏది?
i) భారతీయ విద్యా విధానానికి వుడ్స్ నివేదికను 'మాగ్నాకార్టా'గా అభిప్రాయ పడిన విద్యావేత్త – హెచ్.ఆర్. జేమ్స్
ii) 6–10 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్న వారు – గోఖలే
iii) భారతదేశ ఆధునిక విద్యా పితామహుడు – చార్లెస్ గ్రాంట్
iv) ఆంగ్ల విద్య మాత్రమే నవీన విజ్ఞానానికి తాళంచెవి లాంటిది అని భావించిన వారు – మెకాలే
1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు

16. కింది వాటిలో సరైన అంశం ఏది?
ఎ) కలకత్తా విశ్వవిద్యాలయ సమస్యల పరిష్కారానికి నియమించింది – హర్టాగ్ కమిటీ
బి) స్వయం పోషకంగా పాఠశాలల అభివృద్ధి చెందాలన్నదే ప్రాతిపదిక విద్య ప్రధాన ఉద్దేశం
సి) వృథా, స్తబ్దతల నివారణకు నియమించింది – శార్జ్లర్ కమిషన్
డి) వయోజన విద్యా వ్యాప్తికి బ్రిటిషర్లు నియమించింది – ఎబాట్‌వుడ్ కమిటీ
1) ఎ, బి మాత్రమే
2) ఎ, బి, సి మాత్రమే
3) సి మాత్రమే 4) బి మాత్రమే

17. జతపరచండి.
జాబితా – I
i) బేసిక్ విద్యావిధానం
ii) గోఖలే విద్యాతీర్మానం
iii) విశ్వవిద్యాలయాల చట్టం
iv) జాతీయ విద్యావిధానం
జాబితా – II
a) 1913 b) 1904
c) 1911 d) 1937
1) i-d, ii-c, iii-b, iv-a
2) i-d, ii-c, iii-a, iv-b
3) i-d, ii-b, iii-c, iv-a
4) i-d, ii-a, iii-b, iv-c

18. '6–14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి. దానిని 40 ఏళ్లలో అంటే 1984లోగా సాధించాలి' అని సూచించింది?
1) హర్టాగ్ కమిటీ 2) శార్జ్లర్ కమిషన్
3) సార్జెంట్ ప్లాన్ 4) ఎబాట్‌వుడ్ కమిటీ

19. జతపరచండి.
జాబితా – I
i) సార్జెంట్ కమిటీ ii) ఎబాట్‌వుడ్ కమిటీ
iii) హర్టాగ్ కమిటీ iv) శార్జ్లర్ కమిషన్
జాబితా – II
a) ఉప కమిటీ
b) వృత్తి విద్యా కమిటీ
c) యుద్ధానంతర విద్యా పథకం
d) విశ్వవిద్యాలయాల సంస్కరణలను సూచించింది
1) i-c, ii-b, iii-d, iv-a
2) i-c, ii-d, iii-b, iv-a
3) i-c, ii-a, iii-d, iv-b
4) i-c, ii-b, iii-a, iv-d

20. 'ప్రాక్-పశ్చిమ వివాదం' అంటే?
1) పాశ్చాత్య విజ్ఞానానికి, భారతీయ విజ్ఞానానికి మధ్య వివాదం
2) భారతీయ భాషలకు, ఇంగ్లిష్‌కు మధ్య వివాదం
3) భారతీయ సంప్రదాయాలకు, యురోపియన్ సంప్రదాయానికి మధ్య వివాదం
4) యురోపియన్ సంస్కృతికి, భారతీయ సంస్కృతికి మధ్య వివాదం

21. వివిధ అంశాలు, వాటి సంవత్సరాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) రాష్ట్ర విద్యా నిర్దేశక శాఖలు ఏర్పాటు – 1871
బి) విశ్వవిద్యాలయాల్లో స్త్రీలకు ప్రవేశం – 1877
సి) మద్రాస్, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాల స్థాపన – 1857
1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే

22. కింది వాటిలో సార్జెంట్ కమిటీ సూచన కానిది ఏది?
1) ఎంప్లాయిమెంట్ బ్యూరోను స్థాపించాలి
2) విశ్వవిద్యాలయాల విరాళాల కమిటీని ఏర్పాటు చేయాలి
3) 6–14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి
4) ఇంటర్మీడియట్‌ను రెండు సంవత్సరాలుగా నిర్వహించాలి

23. కింది వాటిలో సరైన జత ఏది?
ఎ) రాజా రామ్మోహన్‌రాయ్ హిందూ కాలేజీని స్థాపించారు – 1817
బి) భారతీయుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఈస్టిండియా కంపెనీ ఏటా రూ. ఒక లక్ష కేటాయించాలని తీర్మానం – 1813
సి) లార్డ్ హార్డింగ్.. ఉద్యోగావకాశాలను కేవలం ఆంగ్ల భాషను అభ్యసించిన భారతీయులకు మాత్రమే ఇవ్వాలని ఆదేశించాడు – 1844
1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే

24. కింది వారిలో విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?
ఎ) మెకాలే బి) చార్లెస్ వుడ్స్,
సి) హంటర్
1) బి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) ఎ మాత్రమే 4) ఎ, బి, సి

25. కింది వాటిలో హంటర్ కమిషన్ సూచన ఏది?
1) నిత్యజీవితానికి పనికి వచ్చే భౌతికశాస్త్రం, వ్యవసాయం, క్షేత్ర గణితం లాంటి అంశాలను ప్రాథమిక విద్యాప్రణాళికలో చేర్చాలి
2) విద్యాలయాల్లో ప్రవేశానికి అన్ని వర్గాల నుంచి ఫీజు వసూలు చేయాలి
3) ప్రాథమిక పాఠశాలల స్థాపన బాధ్యతను ప్రజలే చేపట్టాలి
4) ప్రాథమిక విద్యావ్యాప్తిని విశ్వవిద్యాలయాలు చేపట్టాలి

26. 'నిరక్షరాస్యులు, అమాయకులు ఉన్న జాతి సంపూర్ణమైన అభివృద్ధి సాధించ లేదు, పోటీ పడలేదు' అని వ్యాఖ్యానించిన వారు?
1) హెచ్.ఆర్. జేమ్స్ 2) గోఖలే
3) హాలెండ్ 4) సార్జెంట్

27. 10 + 2 + 3 విద్యా నమూనాను మొదటిసారిగా సూచించింది?
1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
3) ఎబాట్‌వుడ్ కమిటీ
4) శార్జ్లర్ కమిషన్

28. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్ పునరుద్ధరణను సూచించిన కమిటీ ఏది?
1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
3) ఎబాట్‌వుడ్ కమిటీ
4) జాకీర్ హుస్సేన్ కమిటీ

29. నిర్బంధ ప్రాథమిక విద్య సిద్ధాంతాన్ని ఆమోదించిన తొలి చట్టం ఏది?
1) పటేల్ చట్టం – 1918
2) భారత ప్రభుత్వ చట్టం – 1919
3) భారత ప్రభుత్వ చట్టం – 1921
4) భారత ప్రభుత్వ చట్టం – 1935

30. స్వదేశీ విద్యా ఉద్యమ కాలంలో మన దేశంలో ఏ విద్యా విధానాన్ని అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది?
1) చైనీస్ విద్యావిధానం
2) అమెరికన్ విద్యావిధానం
3) జర్మన్ విద్యావిధానం
4) జపనీస్ విద్యావిధానం

సమాధానాలు

1) 4 2) 3 3) 2 4) 3 5) 2
6) 1 7) 2 8) 4 9) 4 10) 1
11) 4 12) 1 13) 2 14) 2 15) 3
16) 4 17) 1 18) 3 19) 4 20) 1
21) 3 22) 4 23) 3 24) 4 25) 1
26) 2 27) 4 28) 1 29) 1 30) 4

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

లాలాజలంలో ఉండే ఎంజైములు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
బయాలజీ

జీర్ణవ్యవస్థ

జీవుల పెరుగుదల, వివిధ కణాల విధుల నిర్వహణ, శక్తి కోసం ఆహారం అవసరం. ఎంజైముల చర్యలతో సంక్లిష్ట ఆహార పదార్థాలు సరళ పదార్థాలుగా మారతాయి. దీన్ని జీర్ణక్రియ అంటారు. జీర్ణక్రియలో పాల్గొనే అవయవాలన్నింటిని కలిపి జీర్ణ వ్యవస్థగా పేర్కొంటారు. మానవుడి జీర్ణ వ్యవస్థను మూడు భాగాలుగా విభజించొచ్చు. అవి..

1) ఆహారనాళం లేదా జీర్ణనాళం
2) జీర్ణగ్రంథులు
3) జీర్ణక్రియా విధానం

ఆహారనాళం

ఆహారనాళం పొడవు 9 మీటర్లు. ఇది నోటితో ప్రారంభమై, పాయువుతో అంతమవుతుంది. ఆహారనాళంలోని భాగాలు వరుసగా..

1) నోరు 2) ఆస్యకుహరం
3) గ్రసని 4) ఆహార వాహిక
5) జీర్ణాశయం
6) చిన్న పేగు, 7) పెద్ద పేగు
8) పురీషనాళం 9) పాయువు

నోరు

ఇది ఆహారనాళం మొదటి భాగం. నోటిద్వారా ఆహారం తీసుకునే ప్రక్రియను అంతఃగ్రహణం అంటారు. నోటిలో ఆహారం 15 నుంచి 30 సెకన్ల వరకు ఉంటుంది.

ఆస్యకుహరం

రెండు దవడల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఆస్యకుహరం అంటారు. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి..

1) దంతాలు 2) లాలాజల గ్రంథులు
3) నాలుక

దంతాలు

దంతాల అధ్యయనాన్ని ఒడెంటాలజీ అంటారు. ఎక్కువ సంఖ్యలో దంతాలున్న జీవులు..

అపోజం - 50
గుర్రం, పంది - 44

దంతాలు డెంటిన్‌తో ఏర్పడతాయి. దంతాల్లోని సజీవ కణాలు ఒడంటోబ్లాస్టులు. ఈ కణాలు డెంటిన్‌ను స్రవిస్తాయి. దంతం కిరీట భాగాన్ని కప్పుతూ ఉండే మెరిసే పొరను ఎనామిల్ లేదా పింగాణి పొర అంటారు. ఈ ఎనామిల్ దంతాలకు దృఢత్వాన్నిస్తుంది. పింగాణి పొర ఏర్పడటానికి ఫ్లోరిన్ (తక్కువ మోతాదులో) అవసరం. మానవ శరీరంలో అతి దృఢమైన పదార్థం ఎనామిల్ (పింగాణి).

దంత నిర్మాణం

దంత నిర్మాణంలో 3 భాగాలుంటాయి.

1) కిరీటం 2) మెడ 3) మూలం

కిరీటం (క్రౌన్): పైకి కనిపించే దంతభాగం.
మెడ: చిగురు వద్ద ఉండే దంత భాగం.
మూలం (రూట్): దవడ గుంతల్లో ఉండే దంత భాగం.

మానవ దంతాలు దవడ ఎముక గుంతల్లో అమరి ఉంటాయి. ఇలాంటి అమరికను థీకోడాంట్ దంత విన్యాసం అంటారు. మానవుడి జీవిత కాలంలో రెండుసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని ద్వివార దంత విన్యాసం అంటారు. చేపల జీవితకాలంలో అనేకసార్లు దంతాలు ఏర్పడతాయి. దీన్ని బహువార దంత విన్యాసం అంటారు. పక్షుల్లో దంతాలు ఉండవు.

దంతాలు - రకాలు

మానవుడిలో రెండు రకాల దంతాలు ఏర్పడతాయి.

1) పాలదంతాలు
2) శాశ్వత దంతాలు

పాల దంతాలు

ఇవి 6 నుంచి 7 నెలల వయసులో ఏర్పడి, 8 నుంచి 9 సంవత్సరాల వయసులో ఊడిపోతాయి. పాల దంతాల సంఖ్య - 20

పాలదంతాల ఫార్ములా:

$$I.C.P.M. = \frac{2102}{2102} \text{ or } (2102 \times 4 = 20)$$

చిన్న పిల్లల పాలదంతాల్లో లోపించిన దంతాల సంఖ్య - 12

అవి.. అగ్ర చర్వణకాలు- 8, జ్ఞానదంతాలు- 4

శాశ్వత దంతాలు

పాలదంతాలు ఊడిపోయి వాటి స్థానంలో శాశ్వత దంతాలు వస్తాయి.

శాశ్వత దంతాల అర్ధ దవడ ఫార్ములా:

$$I.C.P.M. - \frac{2123}{2123} \text{ or } (2123 \times 4) - 32$$

శాశ్వత దంతాలు వివిధ ఆకార, పరిమాణాల్లో ఉంటాయి. కాబట్టి వీటిని విషమ దంతాలు అంటారు.

- ఏనుగు పైదవడలోని కుంతకాలు, ఏనుగు దంతాలు(టస్క్)గా మార్పు చెందుతాయి.
- రదనికలు మాంసాహార జీవుల్లో బాగా అభివృద్ధి చెంది ఉంటాయి. రదనికల అగ్రభాగం మొనదేలి ఎముకల నుంచి మాంసాన్ని చీల్చడానికి ఉపయోగపడుతుంది.
- కుందేలులాంటి శాకాహార జీవుల్లో రదనికలు లోపించి దవడలో ఏర్పడే ఖాళీ ప్రదేశాన్ని 'డయాస్టీమా' అంటారు. డయాస్టీమా లోపించిన జీవులు.. పులి, సింహం, కుక్క.
- సముద్ర క్షీరదాలైన సీల్, వాల్‌రస్‌లో ఏర్పడే రెండు పొడవైన దంతాలు.. రదనికల రూపాంతరాలు.
- పాములోని రెండు కోరలు కూడా రదనికల రూపాంతరాలే.
- చర్వణకాల్లోని చివరి దంతాన్ని జ్ఞానదంతం (విస్డమ్ టీత్) అంటారు. ఇది యుక్త వయసులో (21 ఏళ్ల తర్వాత) ఏర్పడుతుంది.

రూట్ కెనాల్ థెరపీ: శాశ్వత దంతాలు ఊడిపోయినప్పుడు దంతవైద్యులు కృత్రిమ దంతాలను దవడ గుంతల్లో అమర్చే ప్రక్రియ.

దంత వ్యాధులు

ఫ్లోరోసిస్: ఫ్లోరిన్ (2 పీపీఎం కంటే ఎక్కువ) నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారుతాయి. ఎముకలు వికృత రూపం దాల్చుతాయి.
పయేరియా: దంతాలు, చిగుళ్ల నుంచి చీము వస్తుంది.
జింజివైటిస్: రెండు దంతాల మధ్యలోనిచిగురులో వాపు.
దంతక్షయం: బ్యాక్టీరియా చర్యలతో దంతాలపై ఎనామిల్ క్షీణించడం.

లాలాజల గ్రంథులు

మానవుడిలో మూడు జతల లాలాజల గ్రంథులు ఉంటాయి. కుందేలులో నాలుగు జతలుంటాయి. పాములో లాలాజల గ్రంథులు విష గ్రంథులుగా రూపాంతరం చెందుతాయి. లాలా జల గ్రంథులు రోజుకు ఒక లీటరు లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తాయి. లాలాజలం ఆమ్లం స్వభావం (pH–6.8) లో ఉంటుంది. దీనిలో టయలిన్ (లాలాజల అమైలేజ్), లైసోజోమ్ అనే ఎంజైములు ఉంటాయి. టయలిన్ పిండి పదార్థాలను డెక్ట్రిన్, మాల్టోజ్ చక్కెరలుగా మారుస్తుంది. లైసోజైమ్ సూక్ష్మజీవ నాశినిగా పనిచేసి నోటి దుర్వాసనను దూరం చేస్తుంది.

నాలుక

నాలుక రుచులను గుర్తించే జ్ఞానేంద్రియం. దీనిపై రుచులను గుర్తించే నాలుగు రకాల రుచి మొగ్గలు ఉంటాయి. అవి..

- నాలుక కొన - తీపి రుచి మొగ్గలు
- నాలుక కొన వెనక భాగం - ఉప్పు
- నాలుక పక్క భాగాలు - పులుపు
- నాలుక లోపలి భాగం (గొంతులో)- చేదురుచి మొగ్గలు ఉంటాయి.

గ్రసని

ఆహార, వాయు నాళ మార్గాల కూడలిని గ్రసని అంటారు. గ్రసనిలో ఎలాంటి జీర్ణక్రియ జరగదు.

ఆహార వాహిక

ఇది గ్రసనితో ప్రారంభమై జీర్ణాశయంలోకి తెరుచుకుంటుంది. ఆహార వాహికలోనూ ఎలాంటి జీర్ణక్రియ జరగదు. ఆహారం మింగినప్పుడు అది ఆహార వాహికలోకి చేరుతుంది.

- ఆహారాన్ని మింగడం నియంత్రిత చర్య.
- ఆహార వాహికలో ఆహారం 10 నుంచి 15 సెకన్లు ఉంటుంది.
- ఆహార వాహికలోని పెరిస్టాలిటిక్ చలనాలతో ఆహారం జీర్ణాశయంలోకి చేరుతుంది.

జీర్ణాశయం

జీర్ణాశయం సంచి లాంటి కండర నిర్మిత భాగం. ఇది ఉదరంలో ఎడమ వైపు ఉంటుంది. జీర్ణాశయం గోడల్లోని జఠర గ్రంథులు జఠర రసాన్ని స్రవిస్తాయి. జఠర రసంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం (HC*l*), పెప్సిన్, రెనిన్ అనే ఎంజైములు, మ్యూసిన్ ఉంటాయి.

- జీర్ణాశయంలోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఆహారంలోని సూక్ష్మజీవులను చంపుతుంది. ఆహారానికి ఆమ్ల స్వభావాన్ని కలిగిస్తుంది.
- జీర్ణాశయంలో ఆమ్లం అధికంగా ఉత్పత్తి అయితే పెప్టిక్ అల్సర్ వస్తుంది.
- పెప్టిక్ అల్సర్ నివారణకు మిల్క్ ఆఫ్ మెగ్నిషియాన్ని ఔషధంగా వాడుతారు. దీనిలో మెగ్నిషియం హైడ్రాక్సైడ్ ఉంటుంది.
- హెలికో బ్యాక్టర్ పైలోరి అనే బ్యాక్టీరియా వల్ల జీర్ణాశయ అల్సర్ వస్తుందని రోబిన్ వారెన్, బెరి మార్షల్ కనుగొన్నారు. వీరి పరిశోధనకు 2005లో నోబెల్ బహుమతి లభించింది.

విధులు

- ఆహారాన్ని తాత్కాలికంగా నిల్వ చేయడం (2 నుంచి 4 గంటలు)
- ఆహారంలోని పదార్థాలను కలపడం.
- ఆహారంలో భౌతిక రసాయన మార్పులను కలిగించడం.
- జీర్ణాశయ గోడల్లోని వర్తుల కండరాలు ఆహారాన్ని మెత్తగా చేస్తాయి.
- జీర్ణాశయంలో పాక్షికంగా జీర్ణమై ద్రవరూపంలోకి మారిన ఆహారాన్ని కైమ్ అంటారు. (కైమ్ ఆమ్ల స్థితిలో ఉంటుంది).

మానవుడి జీర్ణాశయంలో మూడు గదులుంటాయి. కానీ, నెమరువేసే జంతువుల్లో నాలుగు గదులుంటాయి. అవి.. 1) ప్రథమ ఆమాశయం 2) జాలకం 3) తృతీయ ఆమాశయం 4) చతుర్థ ఆమాశయం.

వీటిలో ప్రథమ ఆమాశయం పెద్దది. ఈ గదిలో సెల్యులోజ్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులుంటాయి. ఈ గది మానవుడిలో లోపించి ఉంటుంది.

గ్యాస్ట్రో ఎంటరాలజీ: జీర్ణాశయం, ఉదరం లోని భాగాల అధ్యయనాన్ని గ్యాస్ట్రో ఎంటరాలజీ అంటారు.అన్నవాహికను ఎక్స్‌రే తీసే ముందు రోగికి బేరియం ద్రావణాన్ని తాగిస్తారు. బేరియం ఎక్స్ కిరణాలను బాగా గ్రహిస్తుంది.

దంతాలు- రకాలు		
దంతాలు	విధి	సంఖ్య
కుంతకాలు	కొరకడం	8
రదనికలు	చీల్చడం	4
అగ్రచర్వణకాలు	నమలడం	8
చర్వణకాలు	విసరడం	12

బేరియాట్రిక్ సర్జరీ

ఊబకాయుల్లో బరువును తగ్గించడానికి బేరియాట్రిక్ సర్జరీ చేస్తారు. ఉదరంలోని అన్నకోశం (జీర్ణాశయం) సైజు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. లైపోసక్షన్ ఇందుకు పూర్తి భిన్నం. దీనిలో వివిధ శరీర భాగాల్లో అదనంగా పేరుకున్న కొవ్వును తొలగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. గ్యాస్ట్రో ఎంటరాలజీ దేని అధ్యయనం?
   1) మెదడు అధ్యయనం
   2) కిడ్నీ అధ్యయనం
   3) ఉదరం లోపలి భాగాల అధ్యయనం
   4) పైవన్నీ
2. మానవుడిలో దంతాల సంఖ్య?
   1) 23 2) 43 3) 28 4) 32
3. ఎనామిల్ దేన్ని కప్పి ఉంచుతుంది?
   1) దంతం
   2) దంత కిరీటంపైనా, లోపల
   3) డెంటిన్ ఉన్న భాగం 4) పైవన్నీ
4. పిల్లల పాల దంతాల్లో లోపించినవి?
   1) ఇన్‌సిజర్స్ 2) కైనైన్స్
   3) ప్రిమోలార్స్ 4) మోలార్స్
5. లాలాజలం స్వభావం?
   1) తటస్థ 2) ఆమ్ల
   3) క్షార 4) పైవన్నీ
6. రూట్ కెనాల్ థెరపీ అనేది?
   1) పాడైన పళ్లు 2) పాడైన కిడ్నీ
   3) పాడైన గుండె 4) పాడైన గోళ్లు
7. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి?
   1) గుండె బైపాస్ సర్జరీ
   2) ఉదరం బైపాస్ సర్జరీ
   3) మెదడు సర్జరీ
   4) గుండె ఓపెన్ హార్ట్ సర్జరీ
8. కింది వాటిలో ఎంజైమ్?
   1) గ్లూకగాన్ 2) ఇన్సులిన్
   3) ట్రిప్సిన్ 4) సొమాటోట్రోపిన్
9. మానవుడి జీర్ణాశయంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం?
   1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
   3) పార్మిక్ ఆమ్లం 4) నైట్రికామ్లం
10. పయేరియా వ్యాధి దేనికి సంబంధించింది?
    1) చిగుళ్లు 2) ముక్కు
    3) గుండె 4) ఊపిరితిత్తులు
11. మానవ శరీరంలో ఆహారనాళం సగటు పొడవెంత?
    1) 2 మీటర్లు 2) 4 మీటర్లు
    3) 6 మీటర్లు 4) 9 మీటర్లు
12. నీటిలో ఏ పదార్థం ఎక్కువగా ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
    1) ఫ్లోరైడ్ 2) క్లోరైడ్
    3) లెడ్ 4) ఏదీకాదు
13. నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో వచ్చే వ్యాధి?
    1) క్షయ 2) కాలేయ జబ్బు
    3) ఎముకల్లో బలహీనమైన కీళ్లు
    4) ఏదీకాదు

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2;
6) 1; 7) 2; 8) 3; 9) 2; 10) 1;
11) 4; 12)1; 13) 3.

Farmers used the constellations in the night..

Model Questions

Directions (Q.No. 1- 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. I enjoy (1)/ playing (2)/ musical instruments like (3)/ piano and violin. (4)/ No error (5)
2. Having read the book, (1)/ there is no question (2)/ the book is better (3)/ than the film. (4)/ No error (5)
3. I don't know if I am ready (1)/ to take the test now and whether (2)/ I will ever be ready (3)/ in the future. (4)/ No error (5)
4. A flock of birds, (1)/ flying south (2)/ for the winter, (3)/ was above us. (4)/ No error (5)
5. He cooked the salmon (1)/ well because (2)/ he attended (3)/ culinary school. (4)/ No error (5)

Directions: (Q.No.6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Once almost covered under centuries of debris, skilled artisans have now restored some original famous paintings during the Italian Renaissance.
   1) Some original famous paintings during the Italian Renaissance now have been by skillful artisans restored.
   2) The restoration of some original famous paintings during the Italian Renaissance has been done by skilled artisans.
   3) Skilled artisans during the Italian Renaissance have now restored some original famous paintings.
   4) Some original famous paintings during the Italian Renaissance have now been restored by skilled artisans.
   5) No correction required
7. I asked him to quickly clean the table.
   1) I asked him to clean the table quickly.
   2) I asked quickly him to clean the table.
   3) I quickly asked him to clean the table.
   4) I asked him to clean the quickly table.
   5) No correction required
8. I thought my plan would sure succeed
   1) I thought my plan would sure succeeding.
   2) I thought my plan would surely succeeds.
   3) I thought my plan would certain succeed
   4) I thought my plan would certainly succeed
   5) No correction required
9. As soon as I hear the dog bark, I knew you were at the door.
   1) As soon as I hear the dog bark, I know you are at the door.
   2) As soon as I hear the dog bark, I had known you are at the door.
   3) As soon as I hear the dog bark, I will know you are at the door.
   4) As soon as I hear the dog bark, I will be knowing you will be at the door.
   5) No correction required
10. It seemed like he liked me.
    1) It seemed like he liked me.
    2) It seemed like he liking me.
    3) It seemed as if he liked me.
    4) It seemed like he like me.
    5) No correction required

Directions (Q. No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The good news is that both Smartphone operating systems are excellent.

B) Microsoft has thrown in the towel with Windows Phone, BlackBerry makes Android devices now, and there are very few other options worth considering.

C) Ultimately, the best platform for you depends on you. Pick the things that matter most to you, count the wins in those categories, and you have a recommendation.

D) If you're buying a new smartphone today, chances are very good that it will run Google's Android or Apple's iOS mobile operating systems.

E) These two platforms accounted for more than 99 percent of all new smartphones shipped in 2016, and that rose to 99.7 percent last year, according to IDC.

F) They have far more in common than what divides them, but there are some important differences that you'll want to consider.



BANK EXAMS
General English

11. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) F 5) E
13. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C
    4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Security is freedom from, or ____ against, potential harm ____ external forces.
    1) rigidity, for
    2) resilience, from
    3) firmness, to
    4) stiffness, towards
    5) spirit, with
17. A firewall typically establishes a barrier ____ a trusted internal network and ____ external network, such as the Internet.
    1) below, trusted
    2) amid , believed
    3) among, untrusted
    4) between, untrusted
    5) linking, conviction
18. The restaurant has a ____ buffet with authentic Indian dishes, if you do not like it, you can go for an equally ____ a-la-carte menu of exquisite continental dishes.
    1) lavish, exciting
    2) generous, boring
    3) unstinted, dreary
    4) copious, uninspiring
    5) fulsome, electrify
19. Farmers used the constellations in the night sky for ____ the seasons.
    1) seeing 2) observing
    3) practicing 4) predicting
    5) monitoring
20. It is a story of two men and a batch of ____ armoured cars.
    1) deceased 2) diseased
    3) decrepit 4) defeated
    5) vigorous

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

According to a new study by the School of Medicine of the University of Pittsburgh, spending hours every day on social media sites lead to body image issues and a higher risk of eating disorders. For someone with an eating disorder, comparisons with others are common, with a tendency to compare with those perceived to be thinner or fit. Eating disorder sufferers may **berate** themselves for not being as thin or sick as others they know with eating disorders, those they have met in treatment or online communities, or even friends or acquaintances. Social media can **warp reality** if you surround yourself with individuals struggling with the same condition as you sense of what is normal can be swallowed up. Sufferers of eating disorders may also measure their own achievements and accomplishments against their peers and as a result may feel they are lagging behind. A constant stream of acquaintances that constantly share news of their work advances, family and relationship statuses can lead to an **influx** of self-hate and the thought that any personal successes are lacking. This may be especially relevant if someone has missed out on chances to pursue milestones due to illness and/or treatment. Focusing on your own endeavors, however small they may seem is crucial.

21. What is the suitable tile for the passage?
    1) reality check
    2) what should you be eating?
    3) Research on eating disorders.
    4) Social Media and eating disorders.
    5) trends in eating
22. What is the reason for self hate?
    1) Comparisons with others
    2) Measuring their own achievements and accomplishments against their peers
    3) Associates constantly sharing news of their work advances, family and relationship statuses
    4) Focusing on your own endeavors
    5) Spending hours every day on social media sites
23. What does warp reality mean?
    1) a rare and powerful phenomenon
    2) power to change the properties
    3) a popular culture
    4) reality distortion
    5) ability to manipulate reality
24. The synonym of berate is
    1) rebuke 2) praise
    3) extol 4) eulogize
    5) tribute
25. The antonym of influx is
    1) invasion 2) flood
    3) deluge 4) torrent
    5) dearth

Directions (Q.No. 26-28): Identify the word which is closest in meaning to the word provided and mark it as your answer.

26. Nabob
    1) bigwig 2) doubter
    3) frolic 4) converse
    5) adverse
27. Pall
    1) light 2) satiate
    3) carry 4) horror
    5) disgust
28. Sacrosanct
    1) prayer 2) sanctuary
    3) pious 4) sacred
    5) worship

Directions (Q.No. 29-30): Identify the word which is opposite in meaning to the word provided and mark it as your answer.

29. Placid
    1) gauche 2) fine
    3) brilliant 4) indecent
    5) roaring
30. Stentorian
    1) violent 2) muffled
    3) loud 4) stealthy
    5) tranquil

KEY

1) 3 2) 2 3) 1 4) 5 5) 3
6) 4 7) 1 8) 4 9) 3 10) 4
11) 1 12) 2 13) 4 14) 4 15) 3
16) 2 17) 4 18) 1 19) 4 20) 3
21) 4 22) 1 23) 2 24) 1 25) 5
26) 1 27) 2 28) 4 29) 1 30) 2